


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 251

శనివారం 25-5-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**సెమీస్‌లో సింధు**

మలేసియా వరల్డ్ టూర్ బ్యాడ్మింటన్ టోర్నీలో టాప్ సీడ్ హాన్‌పై విజయం -13లో



**సూపర్ సన్‌రైజర్స్**

రాజస్తాన్‌పై విజయంతో ఐపీఎల్ ఫైనల్లోకి దూసుకెళ్లిన హైదరాబాద్ - 13లో



**నేడే ఆరో దశ పోలింగ్**

ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలోని 58 లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది.


వివరాలు 6లో ▸



**ఆదేశాలివ్వలేం**

పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ శాతాన్ని బహిర్గతం చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలన్న విజ్ఞప్తిని సుప్రీం తిరస్కరించింది.

వివరాలు 6లో ▸



**రేపు జేఈఈ అడ్వాన్స్‌డ్**

ఐఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆదివారం జరగనుంది. దేశవ్యాప్తంగా 1.91 లక్షల మంది హాజరుకానున్నారు.

వివరాలు 5లో ▸



**బంగాళాఖాతంలో నేడు తుపాను**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివారం ఉదయానికి తుపానుగా మార నుందని వాతావరణ విభాగం తెలిపింది.

వివరాలు 5లో ▸



## పెన్నాలో అన్ని నీళ్లా?

- 75 శాతం ఆధారంగా పెన్నాలో 210.12 టీఎంసీల నీటిలభ్యత
- వరద జలాలతో కలిపి 389.16 టీఎంసీల ప్రవాహం
- కేంద్ర జలసంఘం తాజా అధ్యయనంలో వెల్లడి
- 1993 అధ్యయనం ప్రకారం వరద జలాలతో కలిపి 223.18 టీఎంసీల ప్రవాహం
- 30 ఏళ్ల లెక్కలతో నీటిలభ్యతపై అధ్యయనం శాస్త్రీయం కాదంటున్న నిపుణులు
- 50ఏళ్ల ప్రవాహాలపై అధ్యయనం చేయాలని స్పష్టీకరణ

3లో

# వెబ్ కాస్టింగ్ హైజాక్!

## చంద్రబాబు చేతిలో ఆన్, ఆఫ్ బటన్లు

## కమాండ్ కంట్రోల్ సెంటర్లలో టీడీపీ కార్యకర్తలు

- ప్రైవేట్ ఏజెన్సీ ముసుగులో దారుణ అక్రమాలు
- ఈసీ చేతిలో భద్రంగా ఉండాల్సిన సమాచారం చినబాబు చేతికి
- విదేశాల నుంచి వీడియోలు పోస్ట్ చేసిన లోకేష్.. దర్యాప్తు దశలో బయటకు వెళ్ల ఉండవచ్చంటూ ఈసీ బాధ్యతారాహిత్యం
- అధికార యంత్రాంగంపై ఇప్పుడు అజమాయిషీ ఈసీదే కదా?.. కారకులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఈసీకి లేదా?
- ప్రజాస్వామ్య ప్రక్రియకు తూట్లు పొడుస్తున్నా నిర్లిప్తత.. ఆకస్మికంగా అధికారుల బదిలీ.. టీడీపీ బ్యాచ్‌కు పోస్టింగులు
- చంద్రబాబు సేవలో తరిస్తున్న పల్నాడు పోలీసు అధికారులు
- ఎమ్మెల్యే పిన్నెల్లిపై తాజాగా మరో అక్రమ కేసు
- కౌంటింగ్ దాకా అలజడులు కొనసాగిస్తూ మళ్లీ విధ్వంసానికి పచ్చమూకల యత్నాలు

2లో




### ఆ పచ్చ 'సీఐ' పై చర్యలేవి?

పోలింగ్‌కు 2 రోజుల ముందు కారంపూడి సీఐగా నారాయణస్వామి.. ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా పనిచేసేందుకు పంపిన ఉన్నతాధికారి

స్వామి అండతో చెలరేగిన టీడీపీ గూండాలు.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వారి ఇళ్లపై దాడి చేస్తున్నా పట్టించుకోని సీఐ

2లో



హింస పన్నాగంతోనే

## అధికారుల బదిలీ



- ఓటమి భయంతోనే టీడీపీ నాయకుల బురదజల్లుడు
- పేదల సంక్షేమానికి వ్యతిరేకి చంద్రబాబు
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స

2లో

## విస్తృతంగా పోలీసుల తనిఖీలు

వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అప్రమత్తం

3లో

# నిఘా నీడన నేడే ఢిల్లీలో ఎన్నికలు

**7 స్థానాల్లో 162 మంది పోటీ.. 1.52 కోట్ల మంది ఓటర్లు**

2,627 ప్రాంతాల్లో 13,641 పోలింగ్ కేంద్రాలు

వీటిలో 429 సున్నిత ప్రాంతాల్లో.. 62 వేలమందితో భారీ భద్రత

150 డ్రోన్లు, సీసీటీవీలు, కెమెరాలతో పర్యవేక్షణ

ఉదయం 4 గంటల నుంచే మెట్రో సేవలు

ఎండల నేపథ్యంలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

**సాక్షి, న్యూఢిల్లీ:** అత్యంత కట్టుదిట్టమైన భద్రత, నిఘా నీడన దేశ రాజధాని ఢిల్లీలో శనివారం ఏడు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆరోవిడత జరుగుతున్న ఈ ఎన్నికల్లో మొత్తం 162 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 1.52 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్నారు. 13,641 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో సున్నితమైన, అతి సున్నితమైన ప్రాంతాల్లో 429 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా 62 వేలమందికి పైగా పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. 150 డ్రోన్లు, సీసీటీవీలు, కెమెరాలలతో పోలింగ్‌ను పర్యవేక్షించేలా ఢిల్లీ ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది.

**ఢిల్లీలో ఓటర్ల వివరాలు..**

ఏడు లోక్‌సభ స్థానాల్లో మొత్తం 1,52,01,936 మంది ఓటర్లున్నారు. వీరిలో 82,12,794 మంది పురుషులు, 69,87,914 మంది మహి ళలు, 1,228 మంది థర్డ్ జెండర్ వారు ఉన్నారు. 85ఏళ్ల పైబడినవారు 97,623 మంది, దివ్యాంగులు 77,480 మంది ఉన్నారు. 2,52,038 మంది తొలిసారి ఓటర్లు.

**పోలింగ్ కేంద్రాలు**

ఢిల్లీలోని 2,627 ప్రాంతాల్లో 13,641 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో సున్నిత మైన, అతి సున్నితమై ప్రాంతాల్లో 429 పోలింగ్ కేంద్రాలున్నాయి. వెబ్‌కాస్టింగ్ పోలింగ్ కేంద్రాలు 6,833 ఉన్నాయి. వీటిలో కేవలం మహిళలే నిర్వహించే పింక్ పోలింగ్ బూత్‌లు 70 ఉన్నాయి. మొత్తం 1,03,705 మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వర్తిస్తారు.

**భారీ భద్రత**

మొత్తం 62 వేలమందికి పైగా పోలీసులు భద్రత విధుల్లో ఉంటారు. వీరిలో 6,500 మంది సాయుధ బలగాలైన సీఆర్పీఎఫ్, ఎస్ఎస్‌బీ, మేఘాలయ, మధ్యప్రదేశ్, మిజోరం, బెంగాల్, నాగాలాండ్ ఆర్మ్‌డ్ ఫోర్స్‌లకు చెందిన జవాన్లు ఉన్నారు. పోలింగ్ ముగిసే వరకు 51 కంపెనీల బలగాలు విధుల్లో ఉంటాయి. ఆ తర్వాత రోజు నుంచి ఫలితాలు వెలువడే వరకు మిగిలిన 14 కంపెనీల బలగాలు విధులు నిర్వర్తిస్తాయి. ఫలితాలు వెలువడిన తర్వాత వాటిపై అభ్యంతరాలు ఉంటే తెలిపేందుకు



అభ్యర్థులకు సమయం ఇస్తారు. కాబట్టి ఈవీఎంలను 45 రోజుల పాటు సురక్షితంగా కాపాడేందుకు మరో నాలుగు కంపెనీల బలగాలు విధుల్లో ఉంటాయి. 150 డ్రోన్లు, సీసీటీవీలు, కెమెరాలతో పోలింగ్‌ను పర్యవేక్షిస్తారు. 6,833 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వెబ్ కెమెరాల ద్వారా లైవ్ వెబ్‌కాస్టింగ్ జరుగుతుంది. దీనిద్వారా ఎన్నికల అధికారులు నేరుగా అక్కడి సమాచారాన్ని పర్యవేక్షిస్తారు.

**ఉదయం 4 గంటల నుంచే మెట్రో రైళ్లు**

సాధారణంగా ఢిల్లీలో మెట్రో రైళ్లు ఉదయం 6 గంటల నుంచి నడుస్తాయి. అయితే.. శనివారం పోలింగ్ రోజు ఎన్నికల సిబ్బంది సౌలభ్యం కోసం ఉదయం 4 గంటల నుంచే మెట్రో రైళ్లు నడుస్తాయి.

**ఎండలకు చల్లని ఏర్పాట్లు**

తీవ్రమైన ఎండల దృష్ట్యా వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఈ నేపథ్యంలో పోలింగ్ శాతం తగ్గకుండా ఉండేందుకు చల్లని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వాటర్ కూలర్లు, మట్టికుండలు, మంచినీరు అందుబాటులో ఉంచారు.

**ఓటు వేస్తే ఫ్రీ రైడ్**

ఓటు వేసిన తర్వాత ఓటరుకు పోలింగ్ సిబ్బంది ఒక కూపన్ ఇస్తారు. దీంతో పోలింగ్ కేంద్రం నుంచి ర్యాపిడో బైక్ ద్వారా ఇంటికి ఉచితంగా చేరుకోవచ్చు. అలాగే వేలిమీద సిరాచుక్క చూపించి పలు రెస్టారెంట్లలో ఫుడ్ ఆర్డర్లపై డిస్కౌంట్ కూడా పొందేలా ఢిల్లీ ఎన్నికల సంఘం ఒప్పందం కుదుర్చుకుంది.

**పాపికొండలు విహారయాత్ర.. ఈ పేరు వినగానే మనసుకు ఒకరకమైన హాయి కలుగుతుంది. గోదావరి అలలపై సాగే పడవ ప్రయాణం జీవితంలో మరపురాని మధురానుభూతి. తక్కువ వెడల్పులో రెండు కొండల మధ్య ప్రవహించే గోదారమ్మ ఒడిలో విహరిస్తూ ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోంది.**



# పాపికొండలు పర్యాటకం

# రయ్‌రయ్..

### ఏటా గణనీయంగా పెరుగుతున్న సందర్శకుల సంఖ్య

### మూడేళ్లలో 16,300 నుంచి 48,715కు పెరుగుదల

### ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న పర్యాటకులు

### ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి

**రంపచోడవరం:** పాపికొండలు విహారయాత్రకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. గత మూడేళ్లలో వీరి సంఖ్య గణనీయంగా పెరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పాపికొండల అందాలను తిలకించేందుకు భారీగా తరలివస్తున్నారు. ఐదు గంటల పాటు గోదావరి అలలపై సాగే ప్రయాణం పర్యాటకులకు తీపి జ్ఞాపకాన్ని మిగుల్చుతుంది.

**ప్రతి నిమిషం ఆనందం పంచుతూ..**

పర్యాటక బోటు ఎక్కిన దగ్గర నుంచి తిరిగి వచ్చే వరకు ప్రతీ నిమిషం పర్యాటకులకు ఆనందాన్ని పంచుతుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ నేపథ్యంలో సందర్శకులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా పర్యాటకశాఖ పోశమ్మగండి వద్ద బోట్ పాయింట్ ఏర్పాటుచేసింది. గతంలో రాజమహేంద్రవరం, పట్టిసీమ నుంచి బోట్లు బయలుదేరేవి. రాజమహేంద్రవరం నుంచి వాహనాల్లో పోశమ్మగండి వద్దకు పర్యాటకులు చేరుకోవాలి. పోశమ్మ అమ్మవారి దర్శనం అనంతరం బోటుపై పాపికొండలు విహార యాత్రకు బయలుదేరతారు. పాపికొండలు చేరేందుకు,అక్కడి నుంచి తిరిగి వచ్చేందుకు సుమారు ఐదు గంటల సమయం పడుతుంది. పోశమ్మ గండి నుంచి బయలుదేరిన వెంటనే నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ కనిపిస్తాయి. తరువాత పోలవరం ముంపులో ఖాళీ చేసిన దేవీపట్నం గ్రామం.. అల్లూరి సీతారామరాజు దాడి చేసిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని చూస్తూ ముందుకు సాగుతుంది ప్రయాణం. ముందుకు వెళ్లేకొద్దీ పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురై ఖాళీ చేసిన గ్రామాలు వరుసగా కనిపిస్తాయి. గోదావరి అందాలను ఆస్వాదిస్తూ సాగుతున్న ప్రయాణానికి మంచి జోష్‌ను నింపేలా ఆట,పాటలతో పర్యాటకులను బోటు నిర్వాహకులు కట్టిపడేస్తున్నారు. కొండమొదలు గ్రామం సమీపించిన తరువాత బోటు నిర్వాహకులు పర్యాటకులకు భోజనం అందిస్తున్నారు. పోశమ్మగండి నుంచి బయలుదేరిన బోటు మూడు గంటల అలలపై విహరిస్తూ పేరంటపల్లి చేరుకుంటుంది. అక్కడ ఉన్న శివాలయాన్ని దర్శించుకునేందుకు బోట్ నిర్వాహకులు సుమారు గంట సమయం కల్పిస్తున్నారు. శివాలయంలోకి ప్రవేశించిన తరువాత ఎవరు మాట్లాడకూడదు. అక్కడ నిబంధన. గుడిలో శివనామస్మరణతో గడిపిన క్షణాలు ఎంతో అద్భుతంగా ఉంటాయి. గ్రామస్తులు ఉపాధి కోసం వెదురుతో చేసిన వస్తువులు అమ్ముతారు. వీటిని సందర్శకులు పోటీపడి కొనుగోలు చేస్తుంటారు.

**గత మూడేళ్లలో..**

పాపికొండల విహారయాత్రకు ఏమాత్రం ఆదరణ తగ్గలేదు. పర్యాటకుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోంది. 2021-2022లో కేవలం 16,300 మంది మాత్రమే సందర్శించారు. 2022-2023లో వీరి సంఖ్య బాగా పెరిగింది. అదనంగా మరో 10,350 మంది అంటే 26,650 మంది సందర్శించారు. 2023-2024లో రికార్డు స్థాయిలో పెరిగింది. సుమారు 48,715 మంది పాపికొండలు అందాలను తిలకించేందుకు వెళ్లారు. తెలంగాణ వైపు నుంచి వచ్చే పర్యాటకుల కోసం వీఆర్ పురం మండలం పోచవరం వద్ద ఒక బోట్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు.

**ఎంతోమందికి ఉపాధి**

బోటు ప్రయాణంలో పర్యాటకులకు జోష్ నింపుతూ ఎంతో మంది యువకులు ఉపాధి పొందుతున్నారు. ప్రతీ బోటుకు ఈవెంట్ ఆర్గనైజర్లు ఉంటారు. వీరి ఆధ్వర్యంలో యువత షిఫ్టుల వారీగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తూ ఆకట్టుకుంటారు. బోటు నిర్వాహకులు ఇచ్చే మొత్తంతోపాటు పర్యాటకులు కూడా తోచిన సాయం అందిస్తున్నారు.

**ఒక్కసారైనా చూడాల్సిందే**

పాపికొండల విహార యాత్ర అద్భుతంగా ఉంది. మొదటిసారి వచ్చాం. ప్రతీ ఒక్కరు ఒక్కసారైన చూడాల్సిన ప్రాంతం. బోట్‌పై గోదావరిపై ప్రయాణం మంచి ఆనందాన్ని ఇచ్చింది. బోట్‌లో యాజమాన్యం ఏర్పాటు చేసిన కల్చరల్ కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

–శ్రీనాథ్, మదనపల్లి, అన్నమయ్య జిల్లా.

**ఎక్కువగా ఎంజాయ్ చేశాం**

పాపికొండలు విహారయాత్రలో ఊహించిన దానికంటే ఎక్కువగా ఎంజాయ్ చేశాం. ప్రకృతితో మమేకమైయ్యాం. కల్చరల్ టీమ్ పర్యాటకులను ఎంతో ఆనంద పరిచారు, మాకు మళ్లీ పెళ్లి చేసి ఎప్పటి మరిచిపోని అనుభూతిని మిగల్చడం ఎంతో సంతోషాన్నిచ్చింది.

– నాగేశ్వరరావు, పర్యాటకుడు, విశాఖపట్నం

**కుటుంబసభ్యులతో వచ్చాం**

గోదావరిపై ప్రయాణం ఎంతో హాయిగా సాగింది. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాం. గోదావరిలో బోటుపై ప్రయాణిస్తూ పాపికొండల అందాలను చూస్తూ సాగిన యాత్ర జీవితాంతం గుర్తుండిపోతుంది. గోదావరి అందాలను చూస్తూ సాగే ప్రయాణం ఎప్పటికి మరిచిపోలేం.

– భద్రరావు, గవరవరం, కొయ్యలగూడెం మండలం

**ప్రతిఒక్కరూ చూడాల్సిందే**

పోశమ్మ గండి బోట్ పాయింట్ నుంచి పాపికొండలు వెళ్లి.. తిరుగు ప్రయాణంలో అటవీశాఖ నిర్వహిస్తున్న అతిథి గృహంలో బస చేశాం. సిరివాక ఫారెస్టు గెస్టు హౌస్ చాలా బాగుంది. గోదావరి వ్యూ చూస్తూ గడపడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ప్రతిఒక్కరూ చూడాల్సిందే.

– సంజయ్, పర్యాటకుడు హైదరాబాద్

## క్లుప్తంగా...

### ఏసీఏ అంబుడ్స్‌మెన్, ఎథిక్స్ ఆఫీసర్‌గా జస్టిస్ ప్రవీణ్ కుమార్



సాక్షి, అమరావతి: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంబుడ్స్‌మెన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. ఈయన ఏసీఏ ఎథిక్స్ ఆఫీసర్‌గా కూడా వ్యవహరించనున్నారు. ఏడాది పాటు ఈ రెండు పదవుల్లో కొనసాగుతారు. ఏసీఏలో తలెత్తే అంతర్గత వివాదాల పరిష్కారం, విరుద్ధ ప్రయోజనాల విషయంలో మార్గదర్శకత్వం వంటి వాటిలో స్వతంత్రంగా వ్యవహరిస్తారు. అంబుడ్స్‌మెన్, ఎథిక్స్ ఆఫీసర్‌గా జస్టిస్ ప్రవీణ్ కుమార్ సేవలను ఉపయోగించుకోవాలని ఏసీఏ కార్యవర్గం ఇటీవల తీర్మానించింది. ఈ తీర్మానాన్ని ఆమోదించాలని ఏసీఏ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను కోరింది. అంబుడ్స్‌మెన్, ఎథిక్స్ ఆఫీసర్‌గా సేవలు అందించేందుకు జస్టిస్ ప్రవీణ్ కుమార్ తన సుముఖతను తెలియజేశారు.

### ఏపీ సెట్ ఫలితాలు విడుదల

ఏయూక్యాంపస్ (విశాఖజిల్లా): రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష ఏపీ సెట్–2024 ఫలితాలను విడుదల చేసి వెబ్‌సైట్‌లో పొందుపరచినట్టు ఏపీ సెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య జీఎంజే రాజు తెలిపారు. పరీక్షకు మొత్తం 30,448 మంది హాజరవ్వగా, 2,444 మంది అర్హత సాధించారు. స్కోర్ కార్డ్ తదితర వివరాలను ఏపీ సెట్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని రాజు తెలిపారు. దరఖాస్తులో అభ్యర్థులు అందించిన వివరాల ఆధారంగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసి అర్హత సాధించినట్లుగా ధ్రువీకరణ పత్రాలను పంపుతామని చెప్పారు.

### ఎన్నికల కమిషన్‌కు రిగ్గింగ్ కనిపించలేదా

**మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవా**



నెహ్రూనగర్: పల్నాడు జిల్లాలో టీడీపీ శ్రేణులు మాదిగలను ఓట్లు వేయనివ్వకుండా అడ్డుకుని రిగ్గింగ్‌కు పాల్పడటం ఈసీకి కనిపించలేదా అని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవా ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాల్వాయిగేటు, తుమ్మకోటలో మాదిగల ఓట్లు వైఎస్సార్‌సీపీ వేస్తారన్న భయంతో టీడీపీ నాయకులు మాదిగలను పోలింగ్ బూత్‌లలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఇప్పటికీ తుమ్మకోటలో మాదిగలపై వివక్ష కొనసాగుతునే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీకి అమ్ముడుపోయిన కృష్ణమాదిగ పల్నాడులో మాదిగలపై ఇంత వివక్ష జరుగుతున్నా ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. బాధిత కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన డొక్కా మాణిక్యవరప్రసాద్ కూడా యరపతినేనితో కలిసి మాదిగలపై ఇలాంటి దౌర్జన్యాలకు ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ స్పందించి పల్నాడు జిల్లాలో తిరిగి మాదిగలకు ఓటు వేసే అవకాశం కల్పించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

### పర్యాటకం.. పురోగమనం

సాక్షి, అమరావతి: భారతీయ ట్రావెల్–టూరిజం పరిశ్రమ గణనీయమైన పురోగతి దిశగా పయనిస్తోంది. కోవిడ్ తర్వాత ప్రయాణాలు మెరుగుపడటంతో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) ట్రావెల్–టూరిజం డెవలప్‌మెంట్ ఇండెక్స్ 2024లో భారతదేశం 39వ స్థానంలో నిలిచింది. ఇది దక్షిణాసియా దేశాలు, ఇతర దిగువ–మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థల కంటే అగ్రగామిగా ఉండటం విశేషం. 2021లో భారత్ 54వ ర్యాంకులో ఉండేది. ప్రపంచంలోనే అమెరికా మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత టాప్–10 స్థానాల్లో స్పెయిన్, జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జర్మనీ, యూకే, చైనా, ఇటలీ, స్విట్జర్లాండ్ ఉన్నాయి.

### ఇదండీ జాగ్రత్త




దేవుడిచ్చినా! ఈ జనం అప్పటి వరకు మిమ్మల్ని కష్టపడనీయరేమో సార్!

# ఆ పచ్చ 'సీఐ'పై చర్యలేవి?

**పోలింగ్‌కు రెండు రోజుల ముందు కారంపూడి సీఐగా నారాయణస్వామి**

- ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా పనిచేసేందుకు పంపిన ఉన్నతాధికారి
- స్వామి అండతో కారంపూడి పరిధిలో చెలరేగిన టీడీపీ గూండాలు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వారి ఇళ్లపై దాడి చేస్తున్న పట్టించుకోని సీఐ
- అయినా చర్యలు తీసుకోని ఉన్నతాధికారులు



సాక్షి, నరసరావుపేట: ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ గూండాలు స్వైరవిహారం చేసిన సంగతి తెలిసిందే. వైఎస్సార్‌సీపీ నేతలు, వారి ఇళ్లపైన పచ్చ మూక దాడి చేస్తున్నా సీఐగా ఉన్న నారాయణస్వామి అడ్డుకుంటే ఒట్టు. పల్నాడు జిల్లాలో టీడీపీ రౌడీల దాడికి కొమ్ముకాసినందుకు పలువురు పోలీసు అధికారులను ఇప్పటికే ఎన్నికల సంఘం సస్పెండ్ చేసినా నారాయణస్వామిపై వేటు వేయకపోవడం గమనార్హం. పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఆయనను కారంపూడి సీఐగా ఒక ఉన్నతాధికారి పంపారు. నాటి నుంచి టీడీపీ సేవలోనే నారాయణస్వామి తరించారు. పోలింగ్ నాడు టీడీపీ గూండాల దాడికి ఆయన అణువణువునా సహకరించారని బాధితులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పోలింగ్ కేంద్రాల వైపు వెళ్లనీయకుండా తన అధికారాన్ని సీఐ ఉపయోగించారు. 'టీడీపీ నేతలు యథేచ్ఛగా రిగ్గింగ్ చేస్తున్నారు.. వచ్చి అడ్డుకోండి' అని వైఎస్సార్‌సీపీ వాళ్లు సమాచారం ఇచ్చినా సీఐ నారాయణస్వామి పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న అక్కసుతో బుడగ జంగాలపై టీడీపీ రౌడీలు దాడులు చేస్తుంటే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారు. పైగా గొడవలో గాయపడిన, ఘటన ప్రదేశంలో లేని వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేశారు. ఆ సీఐపై ఇలా ఎన్ని ఫిర్యాదులు వచ్చినా పోలీసు ఉన్నతాధికారులు, ఎన్నికల సంఘం చర్యలు తీసుకోకపోవడం పట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న కొందరు పోలీసు ఉన్నతాధికారులు పథకం ప్రకారం ఎన్నికలకు ముందు కారంపూడి సీఐ చిన్నమల్లయ్యను బదిలీ చేయించారు. ఆ స్థానంలో టీడీపీ నేతలు లావు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని శ్రీనివాసరావుకు అనుకూలంగా ఉన్న, వారి సామాజికవర్గానికే చెందిన నారాయణస్వామిని సీఐగా పంపారు.

#### నారాయణస్వామి అరాచకాలు అన్నీఇన్నీ కావు..

సీఐగా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజు నుంచే నారాయణస్వామి చెలరేగిపోయారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలను వేధించారు. వైఎస్సార్‌సీపీ నేత వెంకటేశ్వరరెడ్డిని ఎన్నికల్లో క్రియాశీలకంగా ఉండొద్దని బెదిరించారు. రెంటచింతల మండలంలో టీడీపీ అనుకూల గ్రామాల్లో పర్యటించి ఎన్నికల్లో దౌర్జన్యాలకు పాల్పడాలని.. తాను ఉన్నానని వారికి భరోసా ఇచ్చారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో రెంటచింతలలో వైఎస్సార్‌సీపీ నేత ఉమామహేశ్వరరెడ్డిని ఎన్నికలకు దూరంగా ఉండాలని బెదిరించినట్టు సమాచారం. ఇక ఎన్నికల రోజు రెంటచింతల, కారంపూడి మండలాల్లోని పాల్వాయి గేట్, తుమ్మకోట, ఒప్పిచర్ల, చింతలపల్లిలో టీడీపీ రౌడీ మూకలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలను పోలింగ్ కేంద్రాల నుంచి తరిమికొడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. తన వద్ద కేంద్ర బలగాలు ఉన్నా వాటిని ఉపయోగించి హింసను ఆపే ప్రయత్నం నారాయణస్వామి చేయలేదు. టీడీపీ గూండాలు పోలింగ్ బూత్‌ల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడి చేసి తరిమేశారు. ఆ ఏజెంట్లు సీఐ నారాయణస్వామికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆయన మాత్రం ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం. ఇక పోలింగ్ అనంతరం టీడీపీ మూక అర్ధరాత్రి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఇళ్లపై దాడికి దిగినా సీఐ స్పందించలేదు.

#### నారాయణస్వామి అతీతుడా?

పల్నాడు జిల్లాలో టీడీపీ గూండాల హింసపై ఎన్నికల సంఘం స్పందించింది. కారంపూడి ఎస్సై రామాంజనేయులు, గురజాల డీఎస్పీ, పల్నాడు ఎస్పీలపై వేటు వేసింది. కానీ హింస ప్రజ్వరిల్లడానికి అసలు కారకుడైన నారాయణస్వామిపై చర్యలు తీసుకోలేదు. ఈయనపై వేటు పడకుండా ఓ పోలీసు ఉన్నతాధికారి కాపాడారని అంటున్నారు. దీంతో సీఐ నారాయణస్వామి మరింత రెచ్చిపోతున్నారు. టీడీపీ దాడుల్లో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు ఆ పార్టీలో చురుగ్గా ఉంటున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు.

#### ఎస్ఐగా పనిచేసినప్పుడూ అంతే..

మొదటి నుంచి సీఐ నారాయణస్వామి తీరు వివాదాస్పదమే. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కారంపూడి ఎస్ఐగా పని చేసిన సమయంలో కూడా ఆయన టీడీపీకి అనుకూలంగా పనిచేశారు. నరగామాలపాడు గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకుడు అయిన రామ్మడుగు బ్రహ్మంను టీడీపీ నాయకులు అత్యంత దారుణంగా హత్య చేశారు. చివరకు ఆ హత్య కేసులో సాక్షిగా ఉన్న ఆయన తమ్ముడ్ని తన ప్రోద్బలంతోనే టీడీపీ నాయకులు కిడ్నాప్ చేశారనే ఆరోపణలను నారాయణస్వామి ఎదుర్కొన్నారు. అలాగే చినగార్లపాడులో టీడీపీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిపై మారణాయుధాలతో దాడి చేసి వెంటాడి చంపారు. అయినా వారిపై నారాయణస్వామి చర్యలు తీసుకుంటే ఒట్టు. చివరకు ఎస్ఐగా ఉన్న ఆయన టోపీని టీడీపీ కార్యకర్తలు నెత్తిన పెట్టుకుని లాఠీతో ఫోజులిచ్చే స్థాయిలో వారితో అంటకాగారు. టీడీపీ నాయకులు పోలీస్ స్టేషన్‌ను అడ్డాగా మార్చుకుని వైఎస్సార్‌సీపీ నాయకులపై వేధింపులకు పాల్పడిన ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. దీంతో ఎట్టకేలకు ఎస్ఐగా పనిచేస్తున్న నారాయణస్వామిని అప్పట్లో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

#### పిన్నెల్లిపై అక్రమంగా కేసు...

కారంపూడిలో ఈ నెల 14న జరిగిన గొడవల్లో స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పది మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కేసు నమోదు చేశారు. ఇందులో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తమ్ముడు వెంకటరామిరెడ్డిపై ఫిర్యాదు లేదు. అయితే ఈవీఎం పగలగొట్టారని నమోదు చేసిన కేసులో పిన్నెల్లికి బెయిల్ వస్తే కౌంటింగ్‌కు హాజరవుతారని, ఆయనను ఎలాగైనా నిలువరించాలన్న టీడీపీ నేతల కుట్రకు సీఐ నారాయణస్వామి సహకరించారు. ఇందులో భాగంగా ఈ నెల 22న ఆయన తన స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇందులో తనను పిన్నెల్లి సోదరులు, ఆయన అనుచరులు గాయపరిచారని ఆరోపించారు. దీని ఆధారంగా కారంపూడి పోలీసులు పిన్నెల్లి సోదరులను ఏ24, ఏ25 నిందితులుగా చేర్చారు. మరోవైపు మే 14న సీఐ నారాయణస్వామికి చిన్న గాయమైతే ఐదారురోజులు యథావిధిగా విధులు నిర్వహించారు. అయితే కేసులో పిన్నెల్లిని ఇరికించాలన్న కుట్రతోనే మే 20న నరసరావుపేటలో టీడీపీ అనుకూల ఆస్పత్రిలో నారాయణస్వామి చికిత్స పొందారు.

#### మా నాన్నను అక్రమంగా ఇరికించారు..



కారంపూడిలో జరిగిన గొడవలకు మా నాన్న కొత్త కాశిరెడ్డికి ఎటువంటి సంబంధం లేదు. పోలీసులు మా నాన్నను అన్యాయంగా ఈ కేసులో ఇరికించి జైలుకు పంపారు. ఆ సమయంలో మా నాన్న కారంపూడి చుట్టుపక్కల లేరు. సీఐ నారాయణస్వామి రమ్మంటున్నారని ఇద్దరు కానిస్టేబుళ్లు తీసుకెళ్లి జైలుకు పంపారు.

– కొత్త నర్సిరెడ్డి, దేవారిపల్లి, కారంపూడి మండలం

#### దళితులపై అక్రమ కేసులు పెట్టారు..



కారంపూడిలో హింసాత్మక ఘటనలకు ఏమాత్రం సంబంధం లేని మా మామ బంకా ప్రతాప్‌పై పోలీసులు అక్రమ కేసు బనాయించి జైలుకు పంపారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మా మామ వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా ఉన్నందుకు కేసు పెట్టారు. బైండోవర్ సంతకం కోసం సీఐ నారాయణస్వామి పోలీస్‌స్టేషన్‌కు రమ్మన్నారు అని చెప్పి తీసుకెళ్లిన పోలీసులు అక్కడి నుంచి జైలుకు పంపారు.

– ఎల్. ప్రభుకుమార్, చింతపల్లి

# ట్రెండ్ తెలియాలంటే నిరీక్షించాల్సిందే

- పోస్టల్ బ్యాలెట్ల తరువాతే ఈవీఎం ఓట్ల లెక్కింపు
- ఈసారి రికార్డు స్థాయిలో పోస్టల్ బ్యాలెట్లు
- గతంతో పోలిస్తే 2.35 లక్షలు అదనం
- శ్రీకాకుళం టాప్.. నరసాపురంలో అత్యల్పం

సాక్షి, అమరావతి: భారీ స్థాయిలో పోస్టల్ బ్యాలెట్లు నమోదైన నేపథ్యంలో రాష్ట్రంలో ఈదఫా ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొంత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జూన్ 4న ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుండగా తొలి అంచనాల సరళి తెలుసుకునేందుకు నిరీక్షించక తప్పదని అధికారులు అంచనా వేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తైన తరువాతే ఈవీఎం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నందున చాలా చోట్ల తొలి రౌండ్ ఫలితాల ప్రకటన ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి. 2019 ఎన్నికల్లో 2.62 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోగా ఈసారి 4.97 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లేశారు. 1.30 లక్షల మంది సచివాలయ సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతోపాటు అత్యవసర సేవల సిబ్బంది, వీడియోగ్రాఫర్లు, కెమెరా అసిస్టెంట్లు, ప్రైవేట్ డ్రైవర్లకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించారు. దీంతో ఎన్నికల విధుల్లో పాల్గొన్న 4.44 లక్షల మంది ప్రభుత్వ, ప్రైవేట్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. వీరే కాకుండా తొలిసారిగా రాష్ట్రంలో హోమ్ ఓటింగ్ విధానం ద్వారా 85 ఏళ్లు దాటిన 13,700 మంది వృద్ధులు, 12,700 మంది దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటేయగా అత్యవసర సేవలందించే మరో 27,100 మంది కూడా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 38,865, నంద్యాల జిల్లాలో 25,283, వైఎస్సార్ కడప జిల్లాలో 24,918 పోస్టల్ బ్యాలెట్లు నమోదయ్యాయి. అత్యల్పంగా నరసాపురంలో 15,320 పోస్టల్ బ్యాలెట్లు నమోదయ్యాయి. ప్రతి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్లు అధికంగా నమోదు కావడంతో లెక్కించేందుకు అదనపు టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

**అన్నీ క్షుణ్నంగా పరిశీలించాకే..**

ఈవీఎంలతో పోలిస్తే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు సుదీర్ఘ సమయం తీసుకుంటుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ కవర్ తెరిచి ఏజెంట్లకు చూపించి ఆ ఓటు అర్హమైనదో కాదో గుర్తించాలి. కవర్ 'ఏ'తో పాటు ఓటరు డిక్లరేషన్ ఫారం విడిగా లేకుంటే పరిగణలోకి తీసుకోరు. గెజిటెడ్ అధికారి సంతకం లేకపోయినా ఆ ఓటును పరిగణించరు. ప్రతి ఫెసిలిటేషన్ కేంద్రంలో గెజిటెడ్ అధికారిని అందుబాటులో ఉంచినా చాలా మంది ఈ అవకాశాన్ని వినియోగించుకోలేదని సమాచారం. పోస్టల్ బ్యాలెట్ వెనుక రిటర్నింగ్ అధికారి సీల్, సంతకం లేకుంటే ఆ ఓటును లెక్కలోకి తీసుకోరు. ఇలా పలు అంశాలను పరిశీలించాకే అర్హత పొందిన పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. 2019 ఎన్నికల్లో 56 వేల పోస్టల్ బ్యాలెట్లు (21.37 శాతం) చెల్లకుండా పోయాయి. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాకే ఈవీఎం ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. అందువల్ల ఉదయం తొమ్మిదిన్నర పది గంటల తర్వాతే తొలి అంచనాలు వెల్లడవుతాయని అధికారులు చెబుతున్నారు.

# హింస పన్నాగంతోనే అధికారుల బదిలీ

- ఓటమి భయంతోనే టీడీపీ నాయకుల బురదజల్లుడు పనులు
- పేదల సంక్షేమానికి వ్యతిరేకి చంద్రబాబు
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: హింసాత్మక ఘటనలకు పాల్పడాలనే పన్నాగంతోనే టీడీపీ నాయకులు అధికారులను బదిలీ చేయించారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఆయన శుక్రవారం శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి విజయనగరంలో మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి భారీగా ఓట్లు వేసే బడుగు, బలహీన వర్గాలున్న ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు ప్రేరేపించడం ద్వారా పోలింగ్‌ను అడ్డుకునేందుకు టీడీపీ నాయకులు కుట్రపన్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలన్నీ ఎస్పీలు బదిలీ అయిన ప్రాంతాల్లోనే జరగడం నిజం కాదా? అని ప్రశ్నించారు. తొమ్మిదిచోట్ల ఈవీఎంల ధ్వంసం జరిగితే.. వాటి విషయం టీడీపీ నాయకులు మాట్లాడటం లేదని చెప్పారు. అవి ఓటమి భయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లే పనులు తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. పేదలంటే చంద్రబాబుకు ఎప్పుడూ పడదన్నారు. పేదల సంక్షేమానికి ఆయన వ్యతిరేకి అని విమర్శించారు. ధనవంతులు, బలిసినవారే చంద్రబాబుకు కావాలన్నారు. అందుకే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి సంక్షేమ పథకాలను అందనీయకుండా ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాశారని గుర్తుచేశారు. పింఛన్ల పంపిణీని అడ్డుకుని 32 మంది వృద్ధుల మరణానికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. చేయూత, ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యాదీవెన ఇవ్వొద్దని కూడా లేఖ రాశారని గుర్తుచేశారు. వ్యవసాయం శుద్ధదండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు ఒక్కరేనన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ చెప్పే విదేశాలకు వెళ్లారని తెలిపారు. మరి కూటమి నాయకులు ఎక్కడికెళ్లారో ఎందుకు తెలియజేయలేదని ప్రశ్నించారు. తమ పాలన చూసి ఓటు వెయ్యమని చెప్పిన దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. రాష్ట్రంలో 175కి 175 స్థానాల్లోను విజయం తమదేనని పూర్తి విశ్వాసంతో చెబుతున్నట్లు ఆయన తెలిపారు.

# వెబ్ కాస్టింగ్ హైజాక్!

**చంద్రబాబు చేతిలో ఆన్, ఆఫ్ బటన్లు**

**కమాండ్ కంట్రోల్ సెంటర్లలో టీడీపీ కార్యకర్తలు**

**ప్రైవేట్ ఏజెన్సీ ముసుగులో దారుణ అక్రమాలు**




మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ వీడియో రికార్డింగ్ అంటూ నారా లోకేశ్ తన ఎక్స్(ట్విట్టర్) ఖాతాలో పోస్టు చేసిన వీడియో (ఫైల్)

సాక్షి, అమరావతి: ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన వెబ్ కాస్టింగ్ ప్రక్రియ మొత్తాన్ని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ముఠా హైజాక్ చేసినట్లు తేటతెల్లం కావడం నివ్వెరపరుస్తోంది. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన ఎన్నికల కమిషన్ (ఈసీ) పూర్తి 'పచ్చ'పాతంతో పావుగా మారినట్లు వెల్లడవుతోంది. ఈసీ చేతిలో అత్యంత భద్రంగా ఉండాల్సిన వెబ్ కాస్టింగ్ సమాచారం, వీడియోలు టీడీపీ నేతలకు చేరిపోవడం దీన్ని నిర్ధారిస్తోంది. విదేశాల్లో గడుపుతున్న నారా లోకేష్ పోలింగ్ బూత్ వీడియోలను ఎడిట్ చేసి విడుదల చేయడం ఏమిటి? ఏ అధికారి ద్వారా అవి లోకేష్‌కు చేరిపోయాయి? అనే ప్రశ్నలకు ఈసీ సూటిగా జవాబు చెప్పకుండా దాటవేత వైఖరి అనుసరించడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. వాటిని తాము విడుదల చేయలేదని, దర్యాప్తు సమయంలో అవి బయటకు వెళ్లిపోయి ఉండవచ్చంటూ అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్య వాదులను నిర్ఘాంతపరుస్తోంది. నిష్పాక్షికంగా వ్యవహరించడం అంటే ఇలాగేనా? అని విస్తుపోతున్నారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠితోపాటు పోలింగ్ రోజు పల్నాడు కలెక్టర్‌గా ఉన్న ఎల్.శివశంకర్, ఎస్పీ గరికపాటి బిందు మాధవ్ నుంచి క్షేత్రస్థాయిలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైల వరకూ అందరూ టీడీపీ అక్రమాలకు అండగా నిలిచినా ఈసీ ప్రేక్షక పాత్ర వహించింది. ఇదే అదునుగా పచ్చముఠాలు ఎన్నికల వేళ భయానక వాతావరణాన్ని సృష్టించాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, మహిళలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవటాన్ని చూసి సహించలేక ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్దకు రాకుండా భయభ్రాంతులకు గురి చేశాయి. ఇంత చేసినా గెలవలేమనే నిస్పృహతో అలజడులు సృష్టిస్తూ ఓట్ల లెక్కింపు రోజు మరోసారి విధ్వంసాలకు తెగబడేలా పథకాన్ని రూపొందించాయి. పోలింగ్ రోజు, అనంతరం చోటు చేసుకున్న పరిణామాలన్నీ వ్యవస్థలు చంద్రబాబు సేవలో తరిస్తున్నాయనే వాదనకు బలం చేకూరుస్తున్నాయి. ఎన్నికల నిర్వహణను అపహాస్యం చేస్తూ ప్రజాస్వామిక వ్యవస్థకు అప్రతిష్ట వాటిల్లేలా వ్యవహరిస్తున్న ఈసీ వివాదాస్పద వైఖరిపై సర్వత్రా విభ్రాంతి వ్యక్తమవుతోంది.

#### వెబ్ కాస్టింగ్‌పై 'పచ్చ ముఠా' పెత్తనం

ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అత్యంత కీలకమైన వెబ్ కాస్టింగ్ ప్రక్రియను చంద్రబాబు ముఠా హైజాక్ చేయడం విస్మయం కలిగిస్తోంది. వెబ్ కాస్టింగ్‌పై ఈసీకి నియంత్రణ లేదా? ఉద్దేశపూర్వకంగానే టీడీపీ వర్గీయులైన ప్రైవేట్ వ్యక్తులకు అందుబాటులోకి తెచ్చిందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్రంలోని 46,389 ఎన్నికల కేంద్రాలకుగానూ 31,380 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను రికార్డ్ చేశారు. అత్యంత సమస్యాత్మక 14 నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో లోపల, బయట వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డ్ జరిగింది. ఇందులో పల్నాడు జిల్లాకు చెందిన మాచర్ల, గురజాల, పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాలతో పాటు ఆళ్లగడ్డ, ఒంగోలు, తిరుపతి, చంద్రగిరి, పీలేరు, పుంగనూరు, పలమనేరు, తంబళ్లపల్లి, రాయచోటి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాలున్నాయి. ఇలాంటి వెబ్‌కాస్టింగ్ వ్యవస్థను చంద్రబాబు ముఠా తమ గుప్పిట్లోకి తీసుకుంది. మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ వీడియో రికార్డింగ్ అంటూ నారా లోకేశ్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్టు చేయడం అందుకు నిదర్శనం. తాము ఆ వీడియోను విడుదల చేయలేదని ఈసీ చెబుతోంది. అలాంటప్పుడు ఎలా లీక్ అయింది? వెబ్ కాస్టింగ్ సమాచారం బయటకు పొక్కడం ఈసీ నిబద్ధతను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. నిబంధనల ప్రకారం వెబ్ కాస్టింగ్ పూర్తిగా ఈసీ నియంత్రణలో ఉంటుంది. వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డ్ అయ్యే వీడియోలపై జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్‌కు సంపూర్ణ నియంత్రణ ఉంటుంది. వెబ్‌కాస్టింగ్ లింక్ ను జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్లలో అందుబాటులో ఉంచారు. వాటిని కలెక్టర్‌తోపాటు ఐజీ, ఎస్పీ పరిశీలిస్తారు. వెబ్‌కాస్టింగ్ రికార్డింగ్ కోసం ప్రైవేట్ ఏజెన్సీలను వినియోగించారు. పోలింగ్ తరువాత వెబ్ కాస్టింగ్ హార్డ్ కాపీని ప్రైవేట్ ఏజెన్సీ కలెక్టర్‌కు అందచేస్తుంది. ప్రైవేట్ ఏజెన్సీ ఉద్యోగుల ముసుగులో టీడీపీ వర్గీయులు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోకి చొరబడ్డారు.

#### పవన్, బాలయ్య ప్రత్యేకమా?

పోలింగ్‌కు ఉన్నతాధికారులను బదిలీ చేసిన ఈసీ.. టీడీపీ, జనసేన అగ్రనేతలు యథేచ్ఛగా వ్యవహరించినా చోద్యం చూసింది. నిబంధనల ప్రకారం ఓటర్లు, పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లను మాత్రమే పోలింగ్ బూత్‌లోకి అనుమతిస్తారు. ఓటు హక్కులేని వారు పోలింగ్ బూత్‌లోకి వెళ్లకూడదు. ఈ నిబంధన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణికి వర్తించదని ఈసీ భావించినట్టుంది. మంగళగిరి నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ నంబరు 197లో పవన్ కళ్యాణ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే ఓటు హక్కులేని తన భార్య అన్నా లెజినోవాతో సహా ఆయన పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. దర్జాగా ఫొటోలు, వీడియోలకు ఫోజులు ఇచ్చారు. దీనిపై ఈసీ కనీసం స్పందించలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీ జెండాలు, కండువాలు, కరపత్రాలు ప్రదర్శించకూడదు. హిందూపురంలో టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ మాత్రం మెడలో పార్టీ కండువా ధరించి వెళ్లి మరీ ఓటు వేశారు. ఆ ఫొటోలు, వీడియోలు మీడియాలో వచ్చినా ఈసీ నోరు మెదపలేదు.

#### 'స్వామి' భక్తి... 7 ఈవీఎంలు ధ్వంసం

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన ఈసీ పల్నాడులో క్షేత్రస్థాయిలో పట్టు, అవగాహన ఉన్న పోలీసు అధికారులను ఎన్నికల ముందు ఆకస్మికంగా బదిలీ చేసింది. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని పోలింగ్‌కు ముందు చంద్రబాబు, పురందేశ్వరి ఒత్తిడితో బదిలీ చేయడం గమనార్హం. అంతేకాకుండా చంద్రబాబు సూచనల మేరకు పురందేశ్వరి సమర్పించిన జాబితా ప్రకారం గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్‌ను నియమించారు. రాజకీయ ఒత్తిడికి ఈసీ తలొగ్గిందనే సంకేతాలతో పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్ కూడా టీడీపీ గుప్పిట్లోకి వెళ్లిపోయినట్లు తదనంతర పరిణామాలు నిర్ధారించాయి. గురజాల డీఎస్పీ పల్లపురాజు, మాచర్ల సీఐ శరత్‌బాబు, కారంపూడి సీఐ చిన్నమల్లయ్య, ఎస్సై ఎం.రామాంజనేయులను బదిలీ చేసి వారి స్థానంలో తమకు అనుకూలమైన వారిని నియమించేలా ఐజీ త్రిపాఠి, ఎస్పీ బిందు మాధవ్ ద్వారా టీడీపీ కథ నడిపించింది. అత్యంత వివాదాస్పదుడైన నారాయణస్వామిని కారంపూడి సీఐగా నియమించడమే అందుకు నిదర్శనం. టీడీపీ రౌడీ మూకలు వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేస్తున్నా, పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడుతున్నా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోకుండా నారాయణ స్వామి ప్రేక్షక పాత్ర పోషించారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై మాత్రం దాడులతో విరుచుకుపడ్డారు. సీఐ నారాయణ స్వామి పరిధిలోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను టీడీపీ గూండాలు ధ్వంసం చేయడం గమనార్హం. ఆయన పరిధిలోనే పాల్వాయి గేటు కూడా ఉంది. పోలింగ్ సందర్భంగా హింసాత్మక సంఘటనలకు బాధ్యులుగా పేర్కొంటూ కొందరు పోలీసు అధికారులను ఈసీ బదిలీ చేయగా సీఐ నారాయణస్వామి పరిధిలో ఏడు ఈవీఎంలు ధ్వంసమైనా ఆయనపై చర్యలు తీసుకోకుండా ఐజీ త్రిపాఠి అండగా నిలిచారు. కౌంటింగ్ రోజు టీడీపీ దౌర్జన్యాలకు కొమ్ము కాసేందుకే ఆయన్ను కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

#### పల్నాడులో పచ్చ ముఠాలు

పల్నాడు జిల్లా పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో మొత్తం 23 గంటల రికార్డింగ్‌లో ఎడిట్ చేసిన రెండు నిమిషాల వీడియో క్లిప్ మాత్రమే విడుదల కావడం వెనుక పచ్చ కుట్ర ఉన్నట్లు స్పష్టమవుతోంది. పోలింగ్‌కు ముందు చంద్రబాబు ఒత్తిడితో ఈసీ నియమించిన గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ గరికపాటి బిందు మాధవ్‌తోపాటు పల్నాడు కలెక్టర్‌గా ఉన్న ఎల్.శివశంకర్ ఈ పన్నాగంలో పాత్రధారులుగా మారారని వెల్లడవుతోంది. పల్నాడు జిల్లా కమాండ్ కంట్రోల్ నుంచే వెబ్ కాస్టింగ్ రికార్డింగ్‌ను పెన్ డ్రైవ్‌లో కాపీ చేసి లీక్ చేసినట్లు నిపుణులు చెబుతున్నారు. ఏడు పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ రౌడీమూకలు ఈవీఎంలను ధ్వంసం చేస్తే అవి ఒక్కటి కూడా బయటకు రాలేదు. ఎమ్మెల్యే పిన్నెల్లి ఉన్నట్లు చెబుతున్న వీడియో మాత్రమే లీక్ కావడం వెనుక చంద్రబాబు కనుసన్నల్లో వ్యవహరించే అధికారులు కీలక పాత్ర పోషించినట్లు తేలుతోంది. మరి దీనికి ఈసీ ఏం సమాధానం చెబుతుంది?

#### పిన్నెల్లిపై కుట్రపూరిత కేసు..

ఐజీ త్రిపాఠి ఆదేశాలతో సీఐ నారాయణ స్వామి పూర్తిగా చంద్రబాబు సేవలో తరిస్తున్నారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై కుట్రపూరితంగా గురువారం రాత్రి కేసు నమోదు చేయడమే అందుకు తార్కాణం. పిన్నెల్లిపై జూన్ 6 వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించగా అప్పటికప్పుడు మరో తప్పుడు కేసు నమోదు చేయడం నారాయణ స్వామి బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది. పది రోజుల క్రితం ఘర్షణకు సంబంధించి నమోదైన కేసులో పిన్నెల్లి సోదరులను తాజాగా నిందితులుగా చేర్చడం గమనార్హం.

## విస్తృతంగా పోలీసుల తనిఖీలు

**వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అప్రమత్తం**

**సాక్షి, అమరావతి :** రాష్ట్రంలో పోలీసులు తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా అల్లర్లు, దాడులు సంభవించే అవకాశాలున్నాయన్న సమాచారంతో పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా కార్డెన్- సెర్చ్ ఆపరేషన్లు ముమ్మరంగా నిర్వహిస్తోంది. పట్టణాలు, గ్రామాలు, అనుమానిత ప్రదేశాల్లో పోలీసు బలగాలు సోదాలు చేస్తున్నాయి. అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మద్యం మొదలైనవాటికి గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నారు. సరైన పత్రాల్లేని వాహనాలను జప్తు చేస్తున్నారు. ఇప్పటివరకు 276 ప్రదేశాల్లో తనిఖీలు చేసి 24 కేసులు నమోదు చేశారు. 10మందిని అరెస్ట్ చేయడంతో పాటు 8 మందికి సీఆర్‌పీసీ 41ఏ నోటీసులిచ్చారు. 2 వేల లీటర్ల నాటుసారా, 27.50 లీటర్ల అక్రమ మద్యం, 6,910 లీటర్ల అక్రమ బీరుతో పాటు అక్రమంగా నిల్వ చేసిన 4 వేల లీటర్ల డీజిల్, 25 లీటర్ల పెట్రోల్‌ను జప్తు చేశారు.

# పెన్నాలో అన్ని నీళ్లా?

## 75 శాతం ఆధారంగా పెన్నాలో 210.12 టీఎంసీల నీటిలభ్యత



**సాక్షి, అమరావతి:** వర్షఛాయ (రెయిన్ షాడో) ప్రాంతంలో పురుడుపోసుకుని ప్రవహించే పెన్నానదిలో 75 శాతం లభ్యత ఆధారంగా ఏటా 210.12 టీఎంసీల నీటి ప్రవాహం ఉందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తాజాగా తేల్చింది. 1985 నుంచి 2015 వరకు పెన్నానది పరీవాహక ప్రాంతం (బేసిన్)లో వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా నీటిలభ్యతపై సీడబ్ల్యూసీ అధ్యయనం చేసింది. ఏటా పెన్నా బేసిన్‌లో కురిసే వర్షపాతం పరిమాణం 1,412.58 టీఎంసీలని లెక్కగట్టింది. వరద జలాలతో కలుపుకొంటే ఏటా 389.16 టీఎంసీల ప్రవాహం ఉంటుందని తేల్చింది. కానీ.. పెన్నాలో ఆ స్థాయిలో నీటిలభ్యత లేదని సాగునీటి రంగ నిపుణులు తేల్చి చెబుతున్నారు. బేసిన్‌లో 30 ఏళ్ల వర్షపాతం , ప్రవాహాల ఆధారంగా నీటిలభ్యతను లెక్కగట్టడం శాస్త్రీయం కాదంటున్నారు. వందేళ్లు లేదా కనీసం 50 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా చేసే అధ్యయనానికే శాస్త్రీయత ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

**అప్పటికీ ఇప్పటికీ ఇదీ తేడా..**

పెన్నాలో నీటిలభ్యతపై 1993లో సీడబ్ల్యూసీ తొలిసారి అధ్యయనం చేసింది. 1944–45 సంవత్సరం నుంచి 1983–84 వరకు బేసిన్‌లో 40 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా అప్పట్లో నీటిలభ్యత లెక్కగట్టింది. వరద జలాలతో కలుపుకొంటే పెన్నాలో 223.18 టీఎంసీల లభ్యత ఉంటుందని తేల్చింది. పెన్నా బేసిన్ 55,213 చదరపు కిలోమీటర్లుగా పేర్కొంది. తాజాగా సీడబ్ల్యూసీ పెన్నా బేసిన్‌లో 1985–2015 మధ్య అంటే 30 ఏళ్లలో కురిసిన వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా నీటి లభ్యత లెక్కగట్టింది. వరద జలాలతో కలిపితే 389.16 టీఎంసీల ప్రవాహం ఉంటుందని తేల్చింది. 75 శాతం లభ్యత ఆధారంగా చూస్తే నదిలో 210.12 టీఎంసీలు ఉంటుందని పేర్కొంది. కానీ బేసిన్ మాత్రం 54,905 చదరపు కిలోమీటర్లకు తగ్గినట్లు గుర్తించింది. 1993తో పోలిస్తే బేసిన్ విస్తీర్ణం 308 చదరపు కిలోమీటర్లు తగ్గింది. పెన్నా బేసిన్‌లో 1944–84తో పోల్చితే 1985–2015 మధ్య వర్షపాతం అధికంగా ఉండటంవల్లే నీటిలభ్యత పెరిగిందని సీడబ్ల్యూసీ పేర్కొంది. దీన్ని సాగునీటిరంగ నిపుణులు కొట్టిపారేస్తున్నారు. కేవలం 30 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాలను ఆధారంగా తీసుకోవడాన్ని తప్పు పడుతున్నారు. అధ్యయనం పరిధిని తగ్గించుకోవడం వల్లే నీటిలభ్యత పెరిగిందని, ఇది అశాస్త్రీయమని స్పష్టం చేస్తున్నారు.

**పెన్నా బేసిన్ ఇదీ..**

కర్ణాటకలో వర్షఛాయ ప్రాంతమైన చిక్‌బళ్లాపూర్ జిల్లా నందికొండల్లోని చెన్నకేశవ పర్వతశ్రేణుల్లో పుట్టిన పెన్నానది.. రాష్ట్రంలో వర్షాభావ ప్రాంతాలైన శ్రీసత్యసాయి, అనంతపురం, వైఎస్సార్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల మీదుగా 597 కిలోమీటర్లు ప్రవహించి ఊటుకూరు వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. ఎడమవైపు నుంచి జయమంగళ, కుందేరు, కుడివైపు నుంచి సగిలేరు, చిత్రావతి, పాపాఘ్ని, చెయ్యేరు ఉపనదులు పెన్నాలో కలుస్తాయి. పెన్నా బేసిన్‌లో 400 నుంచి 800 మిల్లీమీటర్ల వర్షపాతం కురుస్తుంది. ఈ బేసిన్ విస్తీర్ణం 54,905 చదరపు కిలోమీటర్లని సీడబ్ల్యూసీ తాజాగా తేల్చింది. ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో 1.67 శాతానికి సమానం.

## ఇస్రోలో సేవలకు మిస్సైల్‌లా మారాలి!

- విద్యార్థులకు ఇస్రో చైర్మన్ పిలుపు
- యువికా–2024లో విద్యార్థులతో సోమనాథ్ ముఖాముఖి



**సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా):** శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం ప్రపంచంలోనే సముచితమైన స్థానంలో ఉందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చైర్మన్ ఎస్.సోమనాథ్ కీర్తించారు. శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు మిస్సైల్స్‌లా తయారై శాస్త్రవేత్తలుగా ఇస్రోలో చేరి దేశానికి గుర్తింపు తేవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇస్రో పరిధిలోని 7 కేంద్రాల్లో వర్చువల్ పద్ధతిలో యువికా–2024 కార్యక్రమాన్ని ఈనెల 13న ప్రారంభించి శుక్రవారం ముగించారు. ఈ ప్రోగ్రామ్‌కు ఇస్రోలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌తో పాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (డెహ్రాడూన్), నార్త్ ఈస్టరన్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (షిల్లాంగ్), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, స్పేస్ అప్లికేషన్ సెంటర్ (అహ్మదాబాద్), యూఆర్‌రావు స్పేస్ సెంటర్ (బెంగళూరు), విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (తిరువనంతపురం), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (హైదరాబాద్)ల నుంచి దేశ వ్యాప్తంగా 353 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఎంపిక చేయగా, షార్ కేంద్రానికి 51 మందిని ఎంపిక చేసి పంపించారు. దేశంలోని 28 రాష్ట్రాల నుంచి ప్రస్తుతం పదో తరగతిలో వెళ్లబోతున్న విద్యార్థుల ప్రతిభ ఆధారంగా 51 మందిని యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు షార్ ఆహ్వానించింది. వీరికి యువికా–2024 పేరిట కార్యక్రమాన్ని షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో నిర్వహించింది. వీరందరికీ షార్ కేంద్రం సందర్శన, అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన, స్పేస్ యాక్టివిటీస్‌పై శిక్షణ, యోగా, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అంశాలపై అవగాహన కల్పించారు. శుక్రవారం ఇస్రో చైర్మన్ సోమనాథ్ బెంగళూరులోని ప్రొఫెసర్ యూఆర్ రావు స్పేస్ సెంటర్ నుంచి వర్చువల్ పద్ధతిలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటర్ ప్లానెట్‌లపై పరిశోధనల వల్ల ఉపయోగం, భవిష్యత్తులో ఎలక్ట్రికల్ ప్రపోల్షన్ వినియోగం, రీయూజబుల్ రాకెట్, ఉపగ్రహాలతో ఉపయోగాలు, నావిగేషన్, వాతావరణ పరిస్థితులపై అధ్యయనం, చంద్రయాన్, మంగళయాన్, హ్యూమన్ స్పేస్ ప్రోగ్రాం గురించి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సోమనాథ్ విపులంగా వివరించి, పూర్తి అవగాహన కలిగేలా జవాబులిచ్చారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ ఇస్రోలో శాస్త్రవేత్తగా రాణించాలంటే దేశానికి సేవ చేయడానికి పనిచేస్తున్నాననే భావన ఉండాలని హితవు పలికారు. షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ఆర్ వెంకట్రామన్, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణలో ఈసీ విఫలం

**వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్**



**వెల్దుర్తి:** పల్నాడు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) విఫలమైందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి కనుసన్నల్లో ఈసీ పనిచేయడం దారుణమన్నారు. పల్నాడులో టీడీపీ నేతలు కుట్ర రాజకీయాలు చేసి, బలహీన వర్గాలను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. మాచర్ల నియోజకవర్గం, కారంపూడి మండలంలో చింతపల్లి, ఒప్పిచర్ల, రెంటచింతల మండలంలోని తుమృకోట, పాల్వాయి గేటు తదితర గ్రామాల్లో టీడీపీ రిగ్గింగ్ చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలీసులకు చెప్పినా స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులు ఓటమి భయంతో బలహీనవర్గాలకు చెందిన వారిని పలు చోట్ల ఓటింగ్‌లో పాల్గొననీయకుండా అడ్డుకున్నారన్నారు. పోలీసులు, అధికారులు ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై అల్లర్లు సృష్టించారని ఆరోపించారు. రాష్ట్రంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో మాచర్ల నియోజక వర్గం పేరు ముందు వరుసలో ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగానే పోలీసులు స్థానిక టీడీపీ నేతలకు సహకరించారనే విషయం అందరికీ అర్థమయిందన్నారు. ఈవీఎంలు పగలగొట్టిన వారిపై ఎటువంటి కేసులు పెట్టకపోవడంతో ఈసీ తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు. టీడీపీ కూటమి ఎన్ని కుట్రలు చేసినా మాచర్లలో పిన్నెల్లి విజయాన్ని ఆపడం ఎవరి తరం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలందరూ సంయమనం పాటించాలని హనుమంతు నాయక్ కోరారు.

## వైఎస్సార్‌సీపీ నేతల కుటుంబాలకు
# పోలీస్ వేధింపులు

- వైస్ ఎంపీపీ యోగయ్య కుటుంబానికి బెదిరింపులు
- ఇంట్లోని వృద్ధులు, మహిళలపై లాఠీలతో దాడి
- పోలీసుల తీరుపై స్థానిక స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



ఊరుబిండి అంజయ్య గ్రామ సర్పంచ్

**దుర్గి:** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులనే లక్ష్యంగా చేసుకొని పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విచారణ పేరుతో నేతల కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... పల్నాడు జిల్లా దుర్గికి చెందిన వైస్ ఎంపీపీ ఊరుబిండి యోగయ్య, అతని సోదరుడు ఊరుబిండి మన్నెయ్య ఇళ్లలోకి మాచర్ల పట్టణానికి చెందిన పోలీసులు తనిఖీల పేరుతో చొరబడి శుక్రవారం హంగామా సృష్టించారు. యోగయ్య, మన్నెయ్యలు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నిస్తూ.. వారి కుటుంబ సభ్యులను నానా దుర్భాషలాడారు. వృద్ధులు, మహిళలు అని కూడా చూడకుండా లాఠీలతో కొట్టి హింసించారు. అడ్డువచ్చిన చిన్న పిల్లలను కనికరం చూపకుండా పక్కకు నెట్టేశారు. స్థానిక పోలీసులకు సమాచారం లేకుండా మాచర్ల పట్టణం నుంచి వచ్చిన పోలీసులు తనిఖీలు చేయటం ఏంటని మన్నెయ్య కుటుంబ సభ్యులు నిలదీశారు. ప్రత్యర్థుల కుట్రల్లో భాగంగానే కొత్త వ్యక్తులు వచ్చి తమను ఇలా వేధిస్తున్నారని మన్నెయ్య తండ్రి, గ్రామ సర్పంచ్ అంజయ్య భయాందోళన వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులను అకారణంగా కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఇదంతా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని అంజయ్య కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తి విచారణ నిర్వహించి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ దాడి

**తండ్రీకొడుకులకు గాయాలు**



గాయపడ్డ వెంకటరమణ

**కలకడ:** అన్నమయ్య జిల్లా కలకడ మండలంలో శుక్రవారం రాత్రి తెలుగుదేశం కార్యకర్తలు దాడిచేసి వైఎస్సార్‌సీపీకి చెందిన తండ్రీకొడుకుల్ని గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన తండ్రీకొడుకులు కలకడ గోపాల్, వెంకటరమణలను పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కె.బాటవారిపల్లె పంచాయతీ కలకడ మాదిగపల్లెకు చెందిన బాధితులు గోపాల్, వెంకటరమణ కథనం మేరకు.. శుక్రవారం రాత్రి గోపాల్ కలకడ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా అంకాలమ్మ చెరువుకట్ట సమీపంలో వారి గ్రామానికే చెందిన టీడీపీ కార్యకర్తలు రమేష్, ఆనంద, గోవిందు, అభిషేక్, ఆంజినేయులు, నిమ్మనపల్లె గ్రామానికి చెందిన రామచంద్ర అడ్డగించి కొడవలి, కర్రలు, రాళ్లతో దాడిచేసి గాయపరిచారు. ఈ విషయం తెలుసుకుని తండ్రిని కాపాడటానికి వచ్చిన వెంకటరమణ మీద కూడా దాడిచేసి కొట్టారు. గోపాల్‌కు ముఖం మీద, శరీరంపైన, వెంకటరమణ తల మీద, శరీరంపైన గాయాలయ్యాయి. వీరిని గ్రామస్తులు 108లో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులు కలకడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పోతోంది : కేఏ పాల్

**తాటిచెట్లపాలెం (విశాఖ జిల్లా):** దేశంలో, రాష్ట్రంలో ఎన్నికల వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోతోందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. ప్రస్తుత పరిస్థితులపై రైల్వేన్యూకాలనీలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యంగా విశాఖలో ఎన్నికలు సజావుగా సాగలేదని, గతంలో ఎన్నడూ కూడా ఇంత దారుణ పరిస్థితి లేదని చెప్పారు. ఈ విషయమై హైకోర్టులో పిటిషన్ వేశానని, ఈ పిటిషన్‌పై హైకోర్టు సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ఈవీఎంలను పగులగొడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్‌రూంల వద్ద కూడా భద్రత సరిగా లేదని, దీనిపై తనకు అనుమానాలున్నాయన్నారు. స్ట్రాంగ్ రూంల చుట్టూ ఎందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని, ఒక స్ట్రాంగ్ రూంను ఎస్కోటలో ఎందుకు పెట్టారని, వెబ్‌లింక్స్ ఎందుకు అభ్యర్థులకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

## పవిత్రం.. పునీతం

- వైభవంగా ముగిసిన గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు
- శాస్త్రోక్తంగా చక్రస్నానం.. ధ్వజావరోహణం



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

**తిరుపతి కల్చరల్ :** శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం చక్రస్నానంతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా దేవదేవేరులు పల్లకిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూరహారతులు సమర్పించారు. ఈ క్రమంలోనే ఉభయదేవేరీ సమేతంగా శ్రీవారు ఊరేగుతూ కపిలతీర్థంలోని ఆళ్వార్‌తీర్థానికి చేరుకున్నారు. అర్చకులు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం.. చక్రస్నానం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లు టీటీడీ పరిపాలనా భవనం ఎదురుగానున్న పీఆర్ తోటకు వేంచేపు చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారు పీఆర్ తోట నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. రాత్రి 8.40 గంటలకు అర్చకులు ధ్వజావరోహణం చేపట్టి ఉత్సవాలను పరిసమాప్తం చేశారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి సూపరింటెండెంట్ మోహన్‌రావు పాల్గొన్నారు.



బంధానికీ, విముక్తికీ కారణం మనస్సు. ఇంద్రియ-వస్తువులతో అనుబంధించబడిన మనస్సు బంధానికి దారి తీస్తుంది. ఇంద్రియ-వస్తువుల నుండి విడిపోయినప్పుడు అది ముక్తికి మార్గం వెతుక్కుంటుంది.

– ముండకోపనిషత్తు



సాక్షి

శనివారం, 25 మే 2024

# కిర్గిజిస్తాన్ భద్రమేనా!

ఉపాధి కోసమో, విద్యార్జన కోసమో మనదికాని చోటుకు పిల్లలను పంపినప్పుడు కన్నవాళ్ల హృదయం వారి కోసం నిత్యం ఆరాటపడుతుంది. సక్రమంగా ఉన్నారా, తిన్నారా అన్న ఆలోచనలే అనుక్షణమూ వారిని వేధిస్తుంటాయి. ప్రపంచం మునపట్లా లేదు గనుక ఇటువంటి భయాందోళనలు ఇప్పుడు మరింత పెరిగాయి. దేశంలో ఉన్నత విద్యారంగం, మరీ ముఖ్యంగా వైద్య విద్య బాగా విస్తరిస్తే అందరికీ అందుబాటులోకొస్తే మన విద్యార్థులు దూరతీరాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు. అలా లేకపోబట్టే విద్యార్థులు అనుకోకుండా జరిగే పరిణామాల్లో చిక్కుకుని అవస్థలు పడాల్సివస్తోంది. రెండున్నరేళ్లక్రితం ఉన్నట్టుండి ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధానికి తెగబడినప్పుడు అక్కడి మన వైద్య విద్యార్థులు ప్రాణాపాయంలో చిక్కుకోవటం, ఇబ్బందులు పడటం చూశాం. మన దేశంతోపాటు అన్ని దేశాలూ తమ తమ విద్యార్థులను సురక్షితంగా వెనక్కు తీసుకెళ్లగలిగాయి. సరిగ్గా వారం క్రితం కిర్గిజిస్తాన్‌లోనూ విద్యార్థులకు సమస్య ఎదురైంది. ఈనెల 13న పాకిస్తాన్, ఈజిప్టు విద్యార్థులతో ఏర్పడిన తగవు ఆసరా చేసుకుని వందలాదిమంది స్థానికులు విద్యార్థుల హాస్టళ్లపై విరుచుకుపడి ధ్వంసం చేశారు. అనేకమంది విద్యార్థులను గాయపరిచారు. విద్యార్థినులను సైతం వేధించటం, దౌర్జన్యం చేయటంతో ఎప్పుడేమవుతుందో తెలియక విద్యార్థులంతా ఏడెనిమిది గంటలపాటు చీకటి గదుల్లో ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. పోలీసులు రంగంలోకి దిగినా దుండగులను అదుపు చేయలేకపోయారు. ఆ తర్వాత అరెస్టులు జరిగాయి. అది వేరే సంగతి. హాస్టళ్లకూ, విదేశీ విద్యార్థులుండే అపార్ట్‌మెంట్లకూ రక్షణ కల్పిస్తున్నారు. కానీ ఘటన జరిగి వారం కావస్తున్నా ఎక్కడా భయాందోళనలు చల్లారలేదు. దాంతో స్వస్థలాలకు పోవటమే ఉత్తమమని శుక్రవారం కూడా వందలాదిమంది పాకిస్తానీ విద్యార్థులు ఇంటి బాట పట్టారు. వారి ప్రభుత్వం ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసినట్టు ప్రకటించింది. మన విదేశాంగశాఖ మాత్రం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే బిష్కెక్‌లోని మన రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కోరింది.

వేరే దేశాలకు పోయినప్పుడు అక్కడి భాష, సంస్కృతీ సంప్రదాయాలు, పద్ధతులపై అవగాహన పెంచుకుని వాటిని గౌరవించటం అలవాటు చేసుకోవాలి. తమ దేశానికి చెందినవారితోనే సన్నిహితంగా మెలగటం, స్థానికులను చిన్నచూపు చూసే స్వభావం అనవసరమైన అపార్థాలకు దారితీస్తుంది. తమ సంస్కృతే ఘనమైనదని, ఇతరులు అల్పులన్న భావన స్వదేశంలో ఎంతోకొంత చెల్లుబాటవుతుంది. వేరేచోట మాత్రం సమస్యలు తెస్తుంది. దీన్ని గుర్తించబట్టే విశ్వవిద్యాలయాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. స్థానికులతో కలిసిమెలిసివుండేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయి. కిర్గిజిస్తాన్‌లో మూడేళ్లక్రితం కూడా గొడవలు జరిగాయి. అప్పుడూ ఇప్పుడూ కూడా పాకిస్తాన్ విద్యార్థులే గొడవలకు కారకులయ్యారు. రౌడీయిజం, స్థానిక సంప్రదాయాలను కించపరచటం, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనటం వంటివి సమస్యలు తెచ్చిపెడుతున్నాయన్నది స్థానికుల ఆరోపణ. సాధారణంగా ఒకరిద్దరి ప్రవర్తన వల్ల గొడవ జరిగితే అది వారికే పరిమితమవుతుంది. ఎవరో ఒకరి జోక్యంతో అంతా సద్దుమణుగుతుంది. కానీ సామాజిక మాధ్యమాల హవా పెరగటం, ఆ గొడవ తాలూకు వీడియో క్షణాల్లో అందరికీ చేరటం భావోద్వేగాలను రెచ్చగొడుతోంది. ఉద్రిక్తతలు రేపుతోంది. దీనికితోడు విదేశీ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తమకు లేకపోవటం, వారి జీవన ప్రమాణాలు మెరుగ్గా కనబడటం ఆర్థికంగా అంతంతమాత్రంగా బతుకీడ్చే స్థానికులకు సహజంగానే ఆగ్రహం కలిగిస్తుంది. తమను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణిస్తూ విదేశీ విద్యార్థులను అందలం ఎక్కించటం అసంతృప్తికి దారితీస్తుంది. పుండు మీద కారం జల్లినట్టు వారిని కించపరచటం లాంటి చేష్టలకు పాల్పడితే ఇక చెప్పేదేముంది? ఇలాంటి సమయాల్లో కారకులెవరన్న విచక్షణ ఉండదు. విదేశీయులందరినీ ఒకే గాటనకడతారు. కనుక ఎవరికి వారు పద్ధతిగా ఉంటే సరిపోదు. తోటి విద్యార్థులపై ఓ కన్నేసివుంచాలి. సమస్య తలెత్తవచ్చన్న సందేహం కలిగితే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. నిజానికి మధ్య ఆసియా దేశమైన కిర్గిజిస్తాన్ వేరే దేశాలతో పోలిస్తే ఎంతో ప్రశాంతమైనది. అద్భుతమైన ప్రకృతి దృశ్యాలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. స్థానికులు ప్రధానంగా సంచార జీవనానికి అలవాటుపడినవారు. విదేశీ అతిథులను ఆదరించటం, గౌరవించటంలో వారు ఎవరికీ తీసిపోరు.

కిర్గిజిస్తాన్ విద్యాలయాల్లో మన విద్యార్థులు 15,000 మంది ఉంటారని అంచనా. పాకిస్తాన్ నుంచి వచ్చినవారి సంఖ్య 11,000. వీరుగాక ఇంకా బంగ్లాదేశ్, కొన్ని అరబ్, ఆఫ్రికన్ దేశాల నుంచి కూడా చదువుకోవటానికి వస్తారు. తమ దేశాల్లో వైద్య విద్య ఖరీదైన వ్యవహారంగా మారడమే ఇందుకు కారణం. పూర్వపు సోవియెట్ యూనియన్‌లో భాగం కావటం వల్ల పాశ్చాత్య దేశాలతో పోలిస్తే కిర్గిజిస్తాన్ వైద్య విద్య ఎంతో ప్రామాణికమైనది. అంతర్జాతీయంగా అనేక దేశాలతో పాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు కూడా దానికివుంది. వేరే దేశాల్లో చదవాలని, ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలని తహతహలాడే పిల్లలు దూరాభారాలు లెక్కచేయక విదేశాలకు వెళ్తారు. కానీ ఇక్కడ చదువుకోవాలనుకునేవారికి మన వైద్యవిద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవటం ప్రభుత్వాల బాధ్యత. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఈ విషయంలో ప్రత్యేకశ్రద్ధ పెట్టాయి. వేరే రాష్ట్రాలు కూడా ఆ పని చేయాలి. కేంద్ర ప్రభుత్వం అందుకు సహాయసహకారాలు అందించాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, **తిథి:** బ.విదియ సా.6.39 వరకు, తదుపరి తదియ **నక్షత్రం:** జ్యేష్ఠ ఉ.10.35 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** సా.6.39 నుండి 8.09 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.30 నుండి 7.07 వరకు **అమృతఘడియలు:** తె.4.33 నుండి 5.24 వరకు (తెల్లవారితే ఆదివారం).

**సూర్యోదయం :** 5.30
**సూర్యాస్తమయం:** 6.23
**రాహుకాలం :** ఉ.9.00 నుండి 10.30 వరకు
**యమగండం :** ప.1.30 నుండి 3.00 వరకు

# ఆ మూలసూత్రాలను అందుకుంటేనే...

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

**భారతదేశం పునర్నిర్మాణంలో ప్రతి సందర్భంలోను డా॥ బి.ఆర్.అంబేడ్కర్ సూత్రాలే నిజమైన ప్రత్యామ్నాయాన్ని అందించగలుగుతున్నాయి. అంబేడ్కర్ నిర్మించిన రాజ్యాంగ సౌధాన్ని ఆయన సూత్రాలతోనే పునర్నిర్మించాలి అనే నూతన భావన మన నాయకులకు ఉంటే అంబేడ్కర్ కుల నిర్మూలన భావాన్ని, సామ్యవాద భావాల్ని తప్పక ఆచరించవలసిన చారిత్రక సందర్భం ఇది. నిజానికి దేశాన్ని రక్షించాల్సిన వారు దేశంలో నేడు మత వైరుధ్యాలు పెంచడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అశోకుడు, అక్బరు వంటి మహా చక్రవర్తులే మత సామరస్యం కోసం ప్రయత్నం చేస్తే, ఇప్పటి నాయకులు మతాధిపత్యం కోసం ప్రచారం చేసి మత సామరస్యాన్ని దెబ్బతీస్తున్నారని సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

ఈ నెల 13న జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల ఎన్నికల్లో మహిళలు పోటెత్తి ఓటెయ్యడం ఒక సామాజిక, సాంస్కృతిక పరిణామం. మహిళకు రాజకీయ అస్తిత్వం పెరిగింది అనడానికి ఇది ఒక నిదర్శనం. మహిళలు ఎక్కడ చైతన్యవంతం అవుతారో అక్కడ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పరిణామాలు త్వరితం అవుతాయని అంబేడ్కర్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 81.86 శాతం ఓట్లు పోయ్యాయి. నడి ఎండలో కూడ ప్రజలు నిలబడి తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. మరోప్రక్క కుల, మతం, మద్యం, డబ్బు ప్రభావం కూడా బలంగానే ఎన్నికల మీద ఉంది. ఎన్నికల సంగ్రామంలో ఈసారి సోషల్ మీడియా కీలకపాత్ర పోషించింది. ఒక రకంగా సామాజిక వేదికలపై పెద్ద యుద్ధమే నడిచింది. పార్టీలు, అభ్యర్థుల వారీగా ఏర్పడ్డ గ్రూపుల్లో ఓటింగ్ సందర్భంగా రాతలతో కత్తులు దూశారు. ఫేక్ ఫోటోలు, ఫేక్ ఆడియోలతో పాటు ఫేక్ వార్తలను క్షేత్రస్థాయిలో వైరల్ చేశారు. సోషల్ మీడియాను ఫాలో అయ్యేవారు అయోమయానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.

తెలుగు రాష్ట్రాల పరిస్థితులు ఇలా వుంటే మొత్తం భారతదేశం వ్యాప్తంగా పెను వృక్షాలు కూలుతున్న చప్పుళ్లు వినబడుతున్నాయి. కొన్ని అధికార పీఠాలు బీటలు వారుతున్నాయి. మే 15న భువనేశ్వర్‌లోని భువనంగిరిలో ఇండియా కూటమి నాయకుడు రాహుల్‌గాంధీ ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో భాజపా నెగ్గితే ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం అవుతాయని, దేశాన్ని 22 మంది బిలియనీర్లు పాలిస్తారని, రాజ్యాంగ పుస్తకాన్ని భాజపా చించి అవతల పారేస్తుందని అన్నారు. బడుగు వర్గాలకు ప్రయోజనాలు లభించటానికి కారణమే రాజ్యాంగం అని తమ చేతిలోని రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ చెప్పారు. 22 మంది బిలియనీర్లు తీసుకున్న రూ. 16 లక్షల కోట్ల రుణాలను కేంద్ర సర్కారు మాఫీ చేసిందని, ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 24 ఏళ్ల పాటు వేతనాలు చెల్లించేందుకు అయ్యే మొత్తంతో ఇది సమానమని వివరించారు.

''రైతుల, విద్యార్థుల రుణాలను మాఫీ చేయలేదు. చిరు వ్యాపారులకు రుణాలే ఇవ్వలేదు. జీయస్టీ మొత్తమంతా ఇద్దరు ముగ్గురు వ్యక్తులకు వెళ్లిపోతోంది. మేం వచ్చాక కులగణనతో విప్లవాత్మక ప్రజాస్వామ్యాన్ని, ప్రజాపాలనను తీసుకువస్తాం. దేశంలో దేశంలో 50 శాతం మంది ఓబీసీలు, 15 శాతం దళితులు, 8 శాతం గిరిజనులు, 15 శాతం మైనార్టీలు, 5 శాతం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారున్నారు. ఈ 90 శాతం మందికిపైగా ప్రజలు మోదీ పాలనలో వంచితులయ్యారు. ఎన్ని రకాల అబద్ధాలను భాజపా చెప్పినా జూన్ 4 తర్వాత ప్రధాని పదవిలో మోదీ ఉండరు'' అని రాహుల్ ఉద్ఘాటించారు.

మోడీ ప్రభుత్వంలో రాజ్యం కంటే కూడా కార్పొరేట్ శక్తులు బలపడ్డాయి. విశ్వవిద్యాలయాలు అన్నింటిలో మతోన్మాద భావాలను ప్రచారం చేస్తూ శాస్త్ర జ్ఞానాన్ని వక్రీకరిస్తున్నాయి. అందుకే శ్రీనగర్‌లో మే 15న మాట్లాడుతూ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ)అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఇలా విమర్శించారు. భవిష్యత్తులో తాను పదవిలో లేకపోయినా దేశం మనుగడ సాగిస్తుందన్న విషయాన్ని ప్రధాని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. దక్షిణ కాశ్మీర్ అనంత్‌నాగ్‌లోని షాంగుస్ ప్రాంతంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ''మనం కలిసి జీవించాలి. దేశాన్ని రక్షించాలి. పదవి ఎల్లకాలం ఉండదు. కానీ దేశం శాశ్వతం. ఆయన (మోదీ) ఏ దేశాన్ని తయారు చేయాలని ప్రయత్నిస్తున్నారో అది వినాశకరమైనది'' అన్నారు.





నిజానికి దేశాన్ని రక్షించాల్సిన ప్రధానమంత్రి దేశంలో మత వైరుధ్యాలు పెంచడం ఆశ్చర్యకరం. అశోకుడు, అక్బరు వంటి మహా చక్రవర్తులే మతసామరస్యం కోసం ప్రయత్నం చేస్తే, మోడీ ప్రభుత్వం మతాధిపత్యం కోసం ప్రచారం చేసి మత సామరస్యాన్ని దెబ్బతీసిందని సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ విశ్లేషకులందరూ భావిస్తున్నారు. మోడీ ఆవేశపూరితమైన ప్రసంగాల్లో 400 సీట్లు వస్తున్నాయని చెప్పుకుంటున్నా 150 నుంచి 200కే పరిమితం అవుతారని కమ్యూనిస్టు నాయకులు చెబుతున్నారు. బీజేపీకి బలమైన ఉత్తరాది రాష్ట్రాల్లోనే ఈ ఎన్నికల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమౌతోంది. ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, బిహార్, మధ్యప్రదేశ్, హర్యానా, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లోనే బీజేపీకి ఎదురు గాలి వీస్తున్నది. పైకి డాంబికంగా 370–400 సీట్లు వస్తాయని గొప్పలు చెప్పుకుంటున్నా ఏ సర్వేలోనూ ఆఖరికి బీజేపీని బలపరిచే విశ్లేషకులు సైతం 250కి మించి రావని చెప్పాల్సిన పరిస్థితి. బీజేపీ ప్రభుత్వం ఈ దశాబ్దంలో ఏ సోషల్ మీడియాలోనైతే దళిత బహుజన మైనార్టీ స్త్రీల మీద, రాజ్యాంగం మీద, మానవ హక్కుల మీద, విద్యార్థుల ప్రతిభ మీద, దళితుల జీవన సంస్కృతి మీద, ముస్లింలు జీవించే హక్కు మీద దాడి చేసిందో అదే సామాజిక మాధ్యమాన్ని ఉపయుక్తం చేసుకొని ఈ సామాజిక శ్రేణుల అన్నింటిలో వున్న మేధావర్గం ఎదురుదాడి ప్రారంభించింది.

నిజానికి మోడీ ద్వంద్వ భావజాల ఘర్షణలో ఇరుక్కుపోయారా అనిపిస్తుంది. ఏ ప్రజలైతే ఏ బడుగువర్గాలైతే అధిక ఓట్ల శక్తిగా ఉన్నాయో, ఆ వర్గాల జీవన వ్యవస్థలను ధ్వంసం చేస్తూ చేస్తూ, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ఈ వర్గాలను మతం పేరుతో ఓట్లు అడుగుతున్న సందర్భంగా, తమ కాళ్ల కింద పునాదులు తొలగిపోతున్న స్థితిలో కేవలం మతోన్మాద నినాదం ఫలిస్తుందా? అనేది ఇప్పుడు మోడీ ముందు నిలబడిన పెద్ద ప్రశ్నలా కనిపిస్తోంది.

ఉత్తర ప్రదేశ్ కేంద్రంగా మొత్తం భారతదేశం గురించి మనం ఆలోచించినప్పుడు అన్ని మతాల్లో బానిసలుగా బతుకుతున్న వారికి సమాన గౌరవ జీవన వ్యవస్థ లేకపోవటం కనిపిస్తోంది. మతోన్మాద నినాదం గౌరవం ఇవ్వదు. ఆచరణ గౌరవం ఇస్తుంది. భారతదేశంలో కుల గణన చేయిస్తామని కాంగ్రెస్ పేర్కొన్నాక ఓబీసీలు ఆలోచనలో పడినట్లే ఉంది. తమకు రిజర్వేషన్ హక్కు వస్తుందని, రిజర్వేషన్ వల్ల విద్య, ఉద్యోగ హక్కులు విస్తృతం అవుతాయని ఓబీసీలు భావించడం ద్వారా భారతదేశంలో అతి పెద్ద సామాజిక తరగతి 'ఇండియా' కూటమి వైపు మొగ్గుతుందనక తప్పదు.

'ఇండియా' కూటమికి నూతన దశ వస్తున్న ఈ తరుణంలో అంబేడ్కర్ నిర్మించిన రాజ్యాంగ సౌధాన్ని ఆయన సూత్రాలతోనే పునర్నిర్మించాలి అనే నూతన భావన ఆ కూటమికి ఉంటే అంబేడ్కర్ కుల నిర్మూలన భావాన్ని, సామ్యవాద భావాల్ని తప్పక ఆచరించవలసిన చారిత్రక సందర్భం ఇది. ఆ పరిణతి మాత్రం 'ఇండియా' కూటమికి వచ్చినట్టు లేదు. అంబేడ్కర్ పరిశ్రమలను జాతీయం చేయండి, భూములను జాతీయం చేయండి అనే ప్రధాన సూత్రాన్ని ముందుకు తెచ్చారు. ఆ యా రాష్ట్రాల ఆధిపత్య కులాల పార్టీ నుంచి వస్తున్న 'ఇండియా' కూటమి ఇంకా సామాజిక, సామ్యవాద భావాలను పరిపుష్టం చేయవలసిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయాల్లో చారిత్రక, సాంస్కృతిక శాస్త్ర జ్ఞాన పునరుజ్జీవనానికి కూడా వీరు హామీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మండల కమిషన్ రిపోర్ట్‌ను, సచార్ కమిటీ రిపోర్ట్‌ను, రిపబ్లికన్ పార్టీలోని మూల సూత్రాలను 'ఇండియా' కూటమి తీసుకోగలిగితే నిజమైన ప్రత్యామ్నాయంగా నిలబడుతుంది.

భారతదేశం పునర్నిర్మాణంలో ప్రతి సందర్భంలోను డా॥ బి.ఆర్.అంబేడ్కర్ సూత్రాలే నిజమైన ప్రత్యామ్నాయాన్ని అందించగలుగుతున్నాయి. ఈసారైనా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని కూటమి ఒక దళిత ప్రధానమంత్రిని ప్రకటించగలిగిన విశాలతను సంతరించుకోవలసిన అవసరం ఉంది. అంతేకాకుండా భారతదేశంలోని రాజకీయ నాయకుల వ్యక్తిత్వ నిర్మాణంలో నైతికత, అవినీతి రహిత, రుజువర్తన జీవన విధానం, మానవతా స్పృహ, సామాజిక విప్లవ భావన, ఆర్థిక స్వావలంబనా దృష్టి అనుసరణీయం అవ్వవలసి ఉంది. రాజకీయ నీతిశాస్త్ర అధ్యయనం ఈనాటి చారిత్రక కర్తవ్యం. అంబేడ్కర్ రాజకీయ జీవన మార్గమే దేశానికి దిక్సూచి.

*వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు*

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

### సాంత్వన



బుద్ధ భగవానుని సత్యం, అహింస, శాంతి సందేశం... మొత్తం దేశ సంక్షేమానికి అమూల్యమైన వారసత్వం. బుద్ధ పూర్ణిమ సందర్భంగా బుద్ధ విహార్‌లో ఉన్న బుద్ధ భగవానుని ఆలయాన్ని దర్శించుకున్నాను.

– కన్హయ్య కుమార్, ఈశాన్య ఢిల్లీ కాంగ్రెస్ అభ్యర్థి

### నాన్‌స్టాప్ వివాదాలు



కేజ్రీవాల్ విడుదల అవటం 'ఆప్'కి కలిసొచ్చింది కానీ, ఒకదాని వెంట ఒకటిగా ఆ పార్టీ వివాదాలలో చిక్కుకుంటోంది. బీజేపీ కారణంగా కొన్ని, దర్యాప్తు సంస్థల వల్ల మరికొన్ని అయితే.. స్వాతీ మలీవాల్ ఉదంతం 'ఆప్' స్వయంకృతాపరాధమే!

– నిధీ రజ్దాన్, కాలమిస్ట్

### జడ్జిమెంట్ డే



మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారీ మిత్రుల రూ.16 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేసింది. కానీ రైతుల వ్యవసాయ రుణంలో ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు! అదే 2008లో డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం రూ. 72,000 కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేసింది. జూన్ 4 ఎప్పుడా అని ఇప్పుడు ఇండియా ఎదురు చూస్తోంది.

– నరేంద్ర రాజ్‌గోపాలక్, సోషలిస్ట్

### నేను చూపిస్తాగా!



కరణ్ థాపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ, "ఏదీ... హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోతుందని నేను ఎప్పుడన్నానో చూపించండి. అదే నిజమైతే నేను ఈ సర్వేలన్నీ మానేసుకుంటా..." అని అన్నారు. అందుకు సాక్ష్యం ఇదిగో... (కాంగ్రెస్ ఓడిపోతుందని ప్రశాంత్ కిశోర్ పెట్టిన ఒక ట్వీట్‌ను రుజువుగా జత చేస్తూ)

– మొహమ్మద్ జుబైర్, ఫ్యాక్ట్ చెకర్

### మితిమీరిన భాషాజ్ఞానం



దక్షిణాసియా సదస్సులలో... ముఖ్యంగా, పశ్చిమాన ఇంగ్లీష్ మాట్లాడే విశ్వవిద్యాలయాలలో చదువుకున్న సంపన్న గోధుమ రంగు చర్మం కలిగిన స్త్రీ, పురుషులు పాల్గొన్న సదస్సులలో నేను చాలా అసౌకర్యంగా కదులుతుంటాను. భాషా సమానత్వ పోరాటానికి తరుణమిది. (యూనివర్సిటీ ఆఫ్ కొలంబియా ప్రొఫెసర్ గాయత్రీ స్పివాక్ జేఎన్‌యూ సదస్సులో పాల్గొన్న ఒకరి ఇంగ్లీష్ ఉచ్చారణను సరిచేయడంపై స్పందిస్తూ...)

– అన్వేషితా దత్తా, సీనియర్ రిసెర్చర్, నార్వే

### రాత భారం



భారత్‌కు 'పేపర్ వర్క్ తగ్గింపు చట్టం' అవసరం. అనవసరంగా ఫారాలను పూర్తి చేయించిన అధికారులను బాధ్యులను చేయాలి. అప్పుడు గానీ కొత్తగా కంపెనీలు పెట్టాలనుకొనే వారి భయాలు పోవు.

– సంక్రాంత్ సాను, ఆంత్రప్రెన్యూర్

### ఈ పెద్దాళ్ళున్నారే..!



కొన్నిసార్లు పెద్దవాళ్లు కూడా ఇంట్లోని దురుసైన పిల్లవాడిని తిట్టేందుకు సంశయిస్తారు. తిట్టవలసి వస్తే అతడితో పాటు, అల్లరి చేయకుండా బుద్ధిగా ఉండే పిల్లవాడిని కూడా వంతగా తిడతారు. దాంతో దురుసుగా ఉండే పిల్లవాడికి కోపం తెప్పించినట్లవదు. కానీ అది న్యాయమేనా? బీజేపీ విషయంలో ఎన్నికల సంఘం పెద్దరికం కూడా సరిగ్గా ఇలానే ఉంది.

– సుప్రియా శ్రీనతే, కాంగ్రెస్ సోషల్ మీడియా హెడ్

ఇన్ బాక్స్

## చరిత్రాత్మకం!

మే 25వ తేదీకి భారత దేశ చరిత్రలో ఒక చారిత్రక ప్రాముఖ్యం ఉన్నది. ఈ రోజే నక్సల్బరీ ఉద్యమం ప్రారంభమైంది. 1920లో ప్రారంభమైన భారత కమ్యూనిస్టు ఉద్యమానికి 1967 మే 25న జరిగిన నక్సల్బరీ తిరుగుబాటు ఒక చరిత్రాత్మక మలుపు. అంతర్జాతీయ, జాతీయ సమస్యలకు సంబంధించి 1964 లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) నుండి భారత కమ్యూనిస్ట్ పార్టీ–మార్క్సిస్ట్ (సీపీఐఎం) ఏర్పడింది. సీపీఐ(ఎం) నాయకత్వం కొనసాగించిన 'రివిజనిస్ట్ పంథా'కు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్లో కామ్రేడ్ చారు మజుందార్, కాను సన్యాల్, కోఖన్ మజుందార్ వంటివారి నేతృత్వంలో కమ్యూనిస్ట్ విప్లవకారులూ, ఇతర నాయకులూ సాగించిన సైద్ధాంతిక పోరాటాన్ని 'నక్సలిజం' అన్నారు.

1967లో పశ్చిమ బెంగాల్ యునైటెడ్ ఫ్రంట్ సంకీర్ణ ప్రభుత్వానికి బెంగాల్ కాంగ్రెస్‌తో పాటు, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూసీఐ) వంటి ఇతర పార్టీలతో పాటు సీపీఐ (ఎం) ప్రధాన భాగస్వామిగా ఉంది. ఆ మిశ్రమ ప్రభుత్వంలో జ్యోతిబసు ఉప ముఖ్యమంత్రిగా ఉండి ల్యాండ్ రెవెన్యూ వంటి ముఖ్యమైన శాఖలు నిర్వహించారు. 'దున్నే వానిదే భూమి' అనే సూత్రం ఆధారంగా భూసంస్కరణలు అమలు చేయడంలో సీపీఐ (ఎం) తన నిబద్ధతను పూర్తిగా విడనాడడం వలన నక్సల్బరీ పోరాటం జరిగింది. నక్సల్బరీ రైతాంగం ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రతిఘటిస్తూ 1967 మే 23న జోతేదార్ల (భూస్వాముల) నుండి భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకోవడం ప్రారంభించారు. మే 25న డార్జిలింగ్ జిల్లాలోని సిలిగురి సబ్ డివిజన్ లోని 'నక్సల్బరీ' బ్లాక్‌లో పోలీసు కాల్పులు జరిగాయి. కొందరు మరణించారు.

భారతదేశ మంతటా ఈ తరహా మిలిటెంట్ రైతాంగ పోరాటాల ఆవిర్భావానికి ఈ సంఘటన ప్రేరణగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన శ్రీకాకుళ పోరాటం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటం, కొండమొదలు గిరిజన రైతాంగ పోరాటం, ఇంద్రవెల్లి పోరాటం వంటివన్నీ నక్సల్బరీ సంఘటన స్ఫూర్తితో జరిగినవే.

ఈ నేపథ్యంలోనే విప్లవ కమ్యూనిస్టుల సంస్థాగత కార్యక్రమాలతో, ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్ట్ రివల్యూషనరీస్ 1969 ఏప్రిల్ 22న కలకత్తాలో జరిగిన సమావేశంలో సీపీఐ (ఎమ్ఎల్) ఏర్పాటయింది. అయితే అనేక కారణాల వల్ల సీపీఐ (ఎమ్ఎల్) 1970 నుండి అనేక సమూహాలుగా, వివిధ గ్రూపులుగా విడిపోవడం ప్రారంభమైంది. నేడు నక్సల్బరీ తిరుగుబాటు 57వ వార్షికోత్సవం జరుపుకొంటున్న తరుణంలో, కమ్యూనిస్టులు అందరూ సూత్రబద్ధమైన ఐక్యత గురించి ఆలోచించాలి.

– మన్నవ హరిప్రసాద్, పొలిట్ బ్యూరో సభ్యుడు సీపీఐ (ఎమ్ఎల్) రెడ్ స్టార్

# విభజన హామీలు ఎప్పుడు నెరవేరేను?

అభిప్రాయం



కొవ్వూరి త్రినాథరెడ్డి

ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలు దెబ్బతీస్తూ 2014లో రాష్ట్ర విభజన అడ్డగోలుగా జరిగింది. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోకుండా, హడావిడిగా, తెలంగాణ రాష్ట్రానికి అనుకూల ఫలితాలను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రతికూల ఫలితాలను ఇచ్చే విధంగా ఇది జరిగింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రధాన లక్ష్యం రెండు రాష్ట్రాలు విడివిడిగా సర్వతోముఖాభివృద్ధి సాధించడం. మరి అది జరుగుతోందా?

పునర్విభజన అనంతరం ఏర్పడిన అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థికపరమైన, సంస్థాగతమైన మద్దతు ఇవ్వవలసి ఉండగా, కేంద్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సరైన శ్రద్ధచూపకపోవడం వల్ల అనేక వివాదాలు, న్యాయపరమైన చిక్కులు తలెత్తాయి.

చట్టంలోని సెక్షన్ 93 లోని షెడ్యూల్ 13 ప్రకారం... 8 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేయడం జరిగింది. వాటిలో 4 ప్రాజెక్టులు ఏర్పాటు చేయలేదు. 1. దుగరాజపట్నం ఓడరేవు ఏర్పాటు 2. సమగ్రమైన ఉక్కు కర్మాగారం ఏర్పాటు, 3. గ్రీన్ ఫీల్డ్ క్రూడ్ ఆయిల్, పెట్రోకెమికల్ కాంప్లెక్సు ఏర్పాటు, 4. విశాఖపట్టణంలోనూ, విజయవాడ–గుంటూరు–తెనాలి నగరాలలోనూ మెట్రోరైలు ఏర్పాటు చేయడం. ఇంకా మిగిలిన 4 ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి.

విశాఖపట్టణం–చెన్నై పారిశ్రామిక కారిడార్, ప్రస్తుతం ఉన్న విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి విమానాశ్రమాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, ఆంధ్రప్రదేశ్‌లో ఒక కొత్త రైల్వేజోన్ ఏర్పాటు, కొత్తగా ఏర్పాటు చేయబడే రాజధానికి మంచి రోడ్డు, రైలు రవాణా సదుపాయాలను కల్పించడం వంటివి నెరవేర్చవలసి ఉంది. విశాఖపట్టణంలో క్రొత్త రైల్వేజోన్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని వారి ప్రకటనలను బట్టి అర్థమవుతోంది.



ఇది వరలో పునర్విభజన చట్టాలలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పన్నుల విషయంలో కొన్ని అసాధారణతలు చోటు చేసుకొన్నాయి. వాటిని సరిదిద్దడానికి చట్టంలో అవసరమైన సవరణలు చేయమని లేదా వాటివల్ల కలుగుతున్న నష్టం రూ. 3,820 కోట్లను మంజూరుచేయమని ఏపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ విషయం ఇంకా కేంద్ర ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగానే ఉంది. ఏపీలో పారిశ్రామికీకరణ, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడానికి అవసరమైన రాయితీలతో కూడిన ప్రత్యేక ప్యాకేజీ ప్రతిపాదనలను ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 94(1) సెక్షన్ క్రింద కేంద్రప్రభుత్వానికి సమర్పించడం జరిగింది. ఆ ప్రతిపాదనలు ఇంకా కేంద్ర ప్రభుత్వ పరిశీలనలోనే ఉన్నాయి. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావస్తున్నా, రెండు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పుల పంపకం పూర్తవకపోవడం మరో ఇబ్బంది. పై విషయాలన్నింటినీ సూక్ష్మంగా పరిశీలిస్తే, కేంద్ర ప్రభుత్వానికి పునర్విభజన చట్టం అమలుకు సంబంధించి, తన బాధ్యతలను నెరవేర్చే విషయంలో పూర్తి చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమౌతోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దానిలోని అనేక కార్పొరేషన్లు వాటి హక్కుల సాధన నిమిత్తం తెలంగాణ ప్రభుత్వంపై కోర్టులో అనేక వ్యాజ్యాలు (కేసులు) వేశాయి. ఆ కేసులన్నింటిలోనూ, ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా తీర్పులు వచ్చినప్పటికీ, తెలంగాణ రాష్ట్రం ఒక్క తీర్పును కూడా అమలు పరచలేదు. తెలంగాణ రాష్ట్రం, శ్రీశైలం ప్రాజెక్టు నీటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యొక్క తాగునీరు, సాగునీటి అవసరాలకు నిర్లక్ష్యం చేస్తూ జలవిద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తోంది. ఈ పరిస్థితులలో గౌరవ సుప్రీంకోర్టు భారత రాజ్యాంగంలోని 3, 4 ఆర్టికల్స్ ప్రకారం సమగ్రమైన సూచనలను ఇవ్వాలనీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇటువంటి సమస్యలను భవిష్యత్తులో కూడా ఎదుర్కొనే పరిస్థితిని నివారించాలని ఆశిద్దాం.

*వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ రిసోర్స్ పర్సన్*

# అపకారికి ఉపకారం

అపకారికి ఉపకారం చేసేవాళ్లు నిజంగా గొప్పవాళ్ళు. దీనికి మనిషిలో ఎంతో సహనం, శాంతం ఉండాలి. పాండవులు జూదంలో ఓడి అరణ్య వాసం చేస్తున్నప్పుడు దుర్యోధనాదులు తమ సంపదనూ, ఆనందాన్నీ చూపి వారిని బాధించాలనీ, అసూయాగ్రస్తులను చేయాలనీ అనుకుంటారు. తమ పరివారం, రాణులతో సహా ద్వైతవనంలో వాసం చేస్తున్న పాండవుల సమీప ప్రాంతాలకు వెళతారు. అక్కడొక దివ్య భవనం కట్టించటానికి దుర్యోధనుడు పని వారిని నియోగించి పని ప్రారంభిస్తాడు. అతడు, భవనం కట్టిస్తున్న ఆ స్థలం చిత్రసేనుడనే గంధర్వ రాజుది. తమ అనుమతి లేకుండా భవనం నిర్మిస్తున్నారని తెలిసి చిత్రసేనుడు సైన్యంతో వచ్చి దుర్యోధనుని బంధించి గంధర్వలోకానికి తీసుకు వెళుతుంటాడు.





చిత్రసేనుడు అర్జునుని మిత్రుడు. ధర్మరాజు తమ తమ్ముడైన దుర్యోధనుడు బందీ కావటం చూసి బాధపడి, అర్జునునితో దుర్యోధనుని విడిపించి తీసుకురమ్మంటాడు. చిత్రసేనునితో మాట్లాడమంటాడు. అర్జునుడు, భీముడు 'మనల్ని పరాభవించాలని వచ్చి అతడే అవమానాల పాలయ్యాడు. మంచి పనైంది. అతనికి సాయం చేయకూడదు' అంటారు. అప్పుడు ధర్మరాజు, 'దుర్యోధనుడు మన సోదరుడు. అతనికి అవమానం జరిగితే చూస్తూ ఊరుకోకూడదు. అర్జునా! నీవు వెళ్లకపోతే నేనే వెళ్లి చిత్రసేనునితో మాట్లాడతా'నని బయలుదేరుతాడు. దీంతో ధర్మరాజు మాటకు అర్జునుడు విలు విస్తూ... వెళ్లి దుర్యోధనుని విడిపిస్తాడు. చిన్నతనం నుండి తమతో వైరం పూని, ఎన్నో అపకారాలు చేసినా, కపట జూదంతో వనాలకు పంపినా, ధర్మరాజు అవేం మనసులో పెట్టుకోకుండా దుర్యోధనునికి మేలే చేశాడు. ఈ గుణాన్ని అలవరచుకుంటే మనిషి నిజంగా మనీషి అవుతాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

## పోర్టు చరిత్రలో మరో మైలురాయి

**ఒకేరోజు 5,02,025 మిలియన్ టన్నుల సరకు హ్యాండ్లింగ్**




**సాక్షి, విశాఖపట్నం:** మేజర్ పోర్టులతో పోటీపడుతూ ఎప్పటికప్పుడు సరకు రవాణాలో రికార్డులు నమోదు చేస్తున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) మరోసారి సత్తా చాటింది. ఇటీవల తక్కువ రోజుల్లోనే 10 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ రికార్డును సొంతం చేసుకున్న వీపీఏ తాజాగా ఒక్కరోజులో అత్యధికంగా సరకు ఎగుమతులు, దిగుమతులు చేపట్టి తన రికార్డును సవరించుకుంది. గురువారం ఒక్కరోజు 24 గంటల వ్యవధిలో 5,02,025 మిలియన్ టన్నుల సరకు హ్యాండ్లింగ్ చేసినట్లు పోర్టు చైర్మన్ డా.అంగముత్తు వెల్లడించారు. గతేడాది జనవరిలో 4,03,978 మిలియన్ టన్నులతో నమోదైన రికార్డును అధిగమించినట్లు తెలిపారు. 90 ఏళ్ల పోర్టు చరిత్రలో అత్యధిక సరకు ఎగుమతి, దిగుమతి ఇదేనని చెప్పారు. ఈ రికార్డుకు శ్రమించిన పోర్టు సిబ్బంది, అధికారులను ఆయన అభినందించారు.

# రేపు జేఈఈ అడ్వాన్స్‌డ్

## హాజరుకానున్న 1.91 లక్షల మంది అభ్యర్థులు

- ఏపీ, తెలంగాణల నుంచి అత్యధిక శాతం మంది దరఖాస్తు
- ఏపీలో 26, తెలంగాణలో 13 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- ఉదయం మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష
- ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతిలేదు
- బంగారు ఆభరణాలు, బూట్లు, డిజిటల్ పరికరాలకు అనుమతి నిరాకరణ
- జూన్ 9న ఫలితాలు.. 10 నుంచి జోసా కౌన్సెలింగ్

**సాక్షి, అమరావతి:** ఐఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్-2024 ఈనెల 26న (ఆదివారం) జరగనుంది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 1.91 లక్షల మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఐఐటీ మద్రాస్ నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించి అభ్యర్థులకు ఇప్పటికే అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్ల కింద పేపర్-1, పేపర్-2 పరీక్షలు జరగనున్నాయి. కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే ఈ పరీక్షలో అభ్యర్థులు రెండు పేపర్లను తప్పనిసరిగా రాయాల్సి ఉంటుంది. మొదటి సెషన్ ఉ.9 నుంచి 12 వరకు.. రెండో సెషన్ పరీక్ష మ.2.30 గంటల నుంచి 5.30 వరకు జరగనుంది. గతంలో నిర్వహించిన అడ్వాన్స్‌డ్ పరీక్షలకు భిన్నంగా ఈసారి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు రిజిస్టర్ కావడం విశేషం. 2022లో 1.60 లక్షల మంది, 2023లో 1.89 లక్షల మంది రిజిస్టర్ కాగా ఈసారి దీనికి మించి హాజరుకానున్నారు.

**తెలుగు రాష్ట్రాల నుంచే అధికంగా..**

ఈ పరీక్షలకు అత్యధికంగా ఏపీ, తెలంగాణల నుంచి హాజరుకానున్నారు. ఈ రెండు రాష్ట్రాల నుంచే దాదాపుగా 46వేల మంది వరకు అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ కేంద్రాలుగా అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఇక ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక నుంచి కూడా ఎక్కువమంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 26 కేంద్రాలు, తెలంగాణలో 13 కేంద్రాల్లో ఈ పరీక్ష జరగనుంది. అన్ని రాష్ట్రాల్లో బోర్డుల పరీక్షలు, సీబీఎస్ఈ పరీక్షలు ముగియడం, జేఈఈ మెయిన్స్‌కు గతంలో కన్నా ఈసారి అభ్యర్థుల సంఖ్య పెరగడంతో అదే స్థాయిలో అడ్వాన్స్‌డ్‌కు కూడా అభ్యర్థుల సంఖ్య పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. అంతకుముందు.. జేఈఈ మెయిన్‌ను రెండు సెషన్లలోనూ కలిపి 14.10 లక్షల మంది పరీక్ష రాశారు. వీరిలో క్వాలిఫై కటాఫ్ మార్కులు సాధించిన వారిలో 2.5 లక్షల మందికి అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తున్నారు. ఇలా ఈసారి 2,50,284 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించగా 1.91 లక్షల మంది పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు.

**అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు ఇలా..**

| | |
|---|---|
| అన్‌రిజర్వ్‌డ్ (ఆల్) | : 97,351 |
| అన్‌రిజర్వ్‌డ్ (పీడబ్ల్యూడీ) | : 3,973 |
| ఈడబ్ల్యూఎస్ | : 25,029 |
| ఓబీసీ | : 67,570 |
| ఎస్సీ | : 37,581 |
| ఎస్టీ | : 18,780 |



**జూన్ 9న ఫలితాలు.. 10 నుంచి జోసా కౌన్సెలింగ్..**

మే 31న వెబ్‌సైట్‌లో అభ్యర్థుల ప్రతిస్పందనల కాపీలు అందుబాటులో ఉంచనుంది. జూన్ 2న తాత్కాలిక జవాబుల కీ, జూన్ 3 వరకు అభిప్రాయాల స్వీకరణ, జూన్ 9న తుది జవాబుల కీ, అడ్వాన్స్‌డ్ ఫలితాలను ప్రకటించనుంది. జూన్ 10 నుంచి జోసా తాత్కాలిక సీట్ల కేటాయింపు చేపడుతుంది. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ద్వారా ఎన్ఐటీల్లో దాదాపు 24వేల సీట్లు, ఐఐటీల్లో 17,385, ట్రిపుల్ ఐటీల్లో మరో 16వేల అండర్ గ్రాడ్యుయేట్ సీట్లను భర్తీచేస్తోంది.

**బోర్డు పరీక్షల్లో 75 శాతం మార్కులు సాధించాలి..**

ఇక ఐఐటీల్లో ప్రవేశం పొందాలంటే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకుతో పాటు అభ్యర్థులు బోర్డు పరీక్షల్లో 75 శాతం మార్కులు తప్పనిసరిగా సాధించాలన్న నిబంధన ఉంది. అలాగే.. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలను ఐఐటీ మద్రాస్ సంస్థ అడ్మిట్ కార్డుల్లో వివరంగా పొందుపరిచింది. అవి..

- అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకోవాలి. పరీక్ష కేంద్రంలోనికి ప్రవేశానికి నిర్దేశించిన సమయం కన్నా ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అభ్యర్థులను లోపలకు అనుమతించరు. పరీక్షకు రెండు గంటల ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.
- అభ్యర్థులు తమతో పాటు అడ్మిట్ కార్డులను తీసుకురావాలి. దానితో పాటు అధికారిక ఫొటో ఐడీ కార్డునూ తెచ్చుకోవాలి. అడ్మిట్ కార్డు జిరాక్స్ కాపీని ఇన్విజిలేటర్లకు అందించి ఒరిజినల్ కాపీని తమ వద్దే ఉంచుకోవాలి.
- అభ్యర్థులు అడ్మిట్‌కార్డులో, అటెండెన్స్ షీటులో తమ వేలిముద్రను వేసేముందు వేలిని శుభ్రం చేసుకోవాలి.
- అభ్యర్థులకు తప్పనిసరిగా డ్రెస్‌కోడ్‌ను కూడా అమలుచేయనున్నారు. షూలు ధరించి రాకూడదు. అలాగే, పెద్ద బటన్‌లతోని వస్త్రాలను, ఫుల్‌స్లీవ్ వస్త్రాలను, బంగారపు ఆభరణాలను ధరించరాదు.
- బాల్‌పాయింట్ పెన్నును మాత్రమే వినియోగించాలి.
- పెన్సిల్, ఎరేజర్లను తెచ్చుకోవచ్చు. అలాగే, సాధారణమైన వాచీని ధరించవచ్చు. ఎలాంటి డిజిటల్ పరికరాలను అనుమతించరు.
- అభ్యర్థులు ట్రాన్స్‌పరెంట్ బాటిళ్లలో మాత్రమే తాగునీటిని తెచ్చుకోవాలి.
- అడ్మిట్‌కార్డులో నమోదు చేసిన పేరు, పేపర్, పుట్టిన తేదీ, జెండర్ వంటివి సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి.

## 'మధ్యవర్తిత్వం'తో కేసులు పరిష్కరించుకోవాలి

**ముగిసిన ఐదు జిల్లాల జడ్జిలకు శిక్షణ తరగతులు**



మాట్లాడుతున్న నీర్జా భాటియా, చిత్రంలో నిషా సక్సేనా, ఆర్.శరత్‌బాబు

**నగరంపాలెం:** కక్షిదారులు మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని గుంటూరు 4వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు సూచించారు. ఐదు రోజులుగా గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా జడ్జి హాలులో 'మధ్యవర్తిత్వం'పై జడ్జిలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. సుప్రీంకోర్టు మీడియేషన్/కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ-న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ(అమరావతి) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతులకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లోని న్యాయాధికాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి ఆర్.శరత్ బాబు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బులు వృథా కాకుండా చూసుకోవాలని సూచించారు. ఐదు రోజులపాటు శిక్షణ ఇచ్చిన ఎంసీపీసీ (న్యూఢిల్లీ) నిషా సక్సేనా (జిల్లా జడ్జి), నీర్జా భాటియా (జిల్లా జడ్జి)లను న్యాయమూర్తులు ఘనంగా సత్కరించారు. మధ్యవర్తిత్వంపై శిక్షణ పూర్తయిన జడ్జిలకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. అనంతరం గుంటూరు బార్ అసోసియేషన్ హాలులో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు కూడా అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్, గుంటూరు) ఎ.అనిత, పలువురు జడ్జిలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## పీతల మూర్తి అరాచకాలకు పోలీసుల వత్తాసు

**విశాఖ ఎంపీ అభ్యర్థి శంకర్ దేవర యాదవ్ ఆరోపణ**

**డాబాగార్డెన్స్ (విశాఖ జిల్లా):** విశాఖ ఎంపీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనపై కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అనుచరులు దాడికి పాల్పడితే పోలీసులు వత్తాసు పలకడంలో ఆంతర్యమేంటని శంకర దేవర యాదవ్ ప్రశ్నించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పేరొందిన మూర్తి యాదవ్‌కి విశాఖ నగర పోలీసులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. మూర్తిపై పలు పత్రికల్లో వస్తున్న బ్లాక్‌మెయిల్ రాజకీయాల గురించి తాను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ప్రశ్నించడాన్ని సహించలేక అతను తనపై ముగ్గురు వ్యక్తులతో హత్యాయత్నం చేయించాడన్నారు. ఈ ఉదంతంపై పోలీసులు స్పందించకపోవడంలో లాలూచీ ఏమిటో తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మరో స్వతంత్ర అభ్యర్థి వాసుపల్లి సురేష్‌తో కలిసి శంకర దేవర యాదవ్ మాట్లాడారు. పీతల మూర్తి యాదవ్ చేస్తున్న అరాచకాలను ప్రశ్నించినందుకే అతని అనుచరులు బోగ రవి, గొలగాని స్వామి, కొయ్య రామకృష్ణ తనను చంపడానికి ఈ నెల 22న తమ ఇంటికి వచ్చి, తనను దుర్భాషలాడి, విచక్షణారహితంగా పిడి గుద్దులతో దాడి చేశారని తెలిపారు. సమీపంలో ఉన్న మటన్ షాప్ వద్దకు వెళ్లి బోగ రవి కత్తి తీయబోగా, ఆ దుకాణ యజమాని కత్తి అందకుండా చేయడంతో అక్కడే ఉన్న బకెట్‌తో తనపై దాడి చేశాడని చెప్పారు. ఆ సమయంలో స్థానికంగా ఉన్న మహిళలు తనను రక్షించారన్నారు. ఈ సంఘటన అంతా అక్కడ ఉన్న సీసీటీవీలో రికార్డయిందని, ఆ ఫుటేజ్‌ను పోలీసులూ చూశారని చెప్పారు. తనపై దాడికి కారకులపై ఎంవీపీ సీఐ సంజీవ్, ఎస్ఐ శ్రీనివాస్ చర్యలు తీసుకోలేదన్నారు. తనకు న్యాయం జరగకపోతే డీజీపీతో పాటు చీఫ్ ఎలక్షన్ అధికారి దృష్టికి తీసుకెళ్తానని శంకర దేవర యాదవ్ చెప్పారు.

## హూస్టన్‌లో జోయాలుక్కాస్ పున:ప్రారంభం

**విజయవాడ:** యూఎస్ఏలోని హూస్టన్ సిటీలో జోయాలుక్కాస్ జ్యూయలరీ షోరూమ్ పున:ప్రారంభమైంది. జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ సమక్షంలో ఫోర్ట్ బెండ్ కౌంటీ జడ్జి కేపీ జార్జ్, కౌంటీ కోర్ట్ లా-3 ప్రిసైడింగ్ జడ్జి జూలీ మ్యాథ్యూ ఈ నెల 18వ తేదీన హూస్టన్ సిటీలో జోయాలుక్కాస్ షోరూమ్‌ను పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయ్ అలుక్కాస్ మాట్లాడుతూ హూస్టన్ సిటీలో తమ షోరూమ్‌ను పున:ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తమకు అండగా నిలిచిన విలువైన వినియోగదారులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు. హూస్టన్ సిటీలో షోరూమ్ పున:ప్రారంభం సందర్భంగా ఇక్కడ వెయ్యి డాలర్ల విలువైన బంగారు ఆభరణాలు కొనుగోలు చేసినవారికి 0.2 గోల్డ్ కాయిన్, 2వేల డాలర్ల విలువైన డైమండ్, పోల్కి, ముత్యాల ఆభరణాలు కొనుగోలు చేసినవారికి ఒక గ్రాము గోల్డ్ కాయిన్ ఉచితంగా అందజేస్తామని వివరించారు.

## అడవి దున్న మాంసం రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్



**చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా):** అడవి దున్న మాంసం అక్రమ రవాణా చేస్తున్న 13 మందితో కూడిన ముఠాను గురువారం అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్ ఫోన్లు, నాలుగు కత్తులు, 400 కిలోల అడవి దున్న మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చింతపల్లి డివిజన్ అటవీశాఖ ఆర్వీ నగర్ సబ్ డీఎఫ్‌వో బెర్నారాజు శుక్రవారం తెలిపారు. కొయ్యూరు, వై.రామవరం మండలాల సరిహద్దు ప్రాంతాల్లో ఒడిశాకు చెందిన కొంత మంది అడవి దున్నలను వేటాడి ఆ మాంసాన్ని ఎండబెట్టి వారి రాష్ట్రానికి తరలించి ఈ విధంగా విక్రయిస్తున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని ఆయన వెల్లడించారు.

## ప్రజాస్వామ్యానికి మోదీ ప్రమాదకరం

- ఎన్నికల కమిషన్ వైఫల్యంపై సుప్రీంకోర్టుకు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



**తిరుపతి కల్చరల్ (తిరుపతి జిల్లా):** ప్రజాస్వామ్యానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రమాదకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఆయన శుక్రవారం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రధాని పదవి కోసం మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ధోరణి వంటి మోదీ విధానాలతో భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని చెప్పారు. ఈ నేపథ్యంలో లౌకికవాదం కాపాడుకోవడానికి ఇండియా కూటమి ఏర్పడిందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే ఇండియా కూటమి లక్ష్యమని తెలిపారు. ఏపీలో ఎన్నికల కమిషన్ వైఫల్యంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, అది విచారణకు వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. భారతదేశ చరిత్రలో ఎన్నికల సందర్భంగా మోదీలా దిగజారుడు మాటలు మాట్లాడిన ప్రధాని ఎవరూ లేరని, ఓట్లకోసం మతాన్ని రెచ్చగొట్టే పద్ధతిలో ఎవరూ మాట్లాడలేదని పేర్కొన్నారు. 2047 వరకు తానే ప్రధానిగా ఉంటానని మోదీ పరోక్షంగా బీజేపీ నేతలను హెచ్చరిస్తున్నారన్నారు. మోదీ పదేళ్ల కాలంలో ఒక్క మంచిపనైనా చేశారా అని ప్రశ్నించారు. మోదీ విధానాల కారణంగా నేడు మనం డాలరుకు రూ.84 చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. 2014 నాటికి భారతదేశం అప్పు రూ.55 లక్షల కోట్లు అయితే మోదీ ప్రధాని అయ్యాక పదేళ్లలో ఈ అప్పు రూ.205 లక్షల కోట్లకు చేరిందని ఆయన విమర్శించారు.

## అంకితభావంతో ఉన్నత శిఖరాలకు..

**సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.టి.రవికుమార్ • వీఐటీ ఏపీలో ఘనంగా వర్సిటీ వేడుకలు**



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జస్టిస్ సి.టి.రవికుమార్, వర్సిటీ చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ తదితరులు

**ఐనవోలు(తాడికొండ):** అంకితభావంతో పనిచేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.టి.రవికుమార్ అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఐనవోలులోని వీఐటీ-ఏపీలో శుక్రవారం 7వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జస్టిస్ సి.టి.రవికుమార్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి అంకిత భావంతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. ఈ క్రమంలో న్యాయ సూత్రాలను విస్మరించకూడదన్నారు. మైక్రోసాఫ్ట్ డేటా ప్లాట్‌ఫామ్ డైరెక్టర్(బెంగళూరు) అమిత్ చౌదరి మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. మైక్రోసాఫ్ట్ ద్వారా వర్సిటీకి అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. వర్సిటీ వ్యవస్థాపకుడు, చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ.. వీఐటీ నాలుగు క్యాంపస్‌లలో 80 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అత్యుత్తమ విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులు సాధిస్తున్న విజయాలే ఇందుకు నిదర్శనమన్నారు. యూనివర్సిటీ హయ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్టు ద్వారా ఎంతోమంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించి వారి ఉన్నత విద్యకు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి.. వర్సిటీ ప్రగతిని వివరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖాదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**తిరుమల:** తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహదేవన్, కేంద్ర సమాచార, ప్రసారశాఖ కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో తమిళనాడు మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ తదితరులు ఉన్నారు.

**శ్రీవారి దర్శనానికి 20 గంటలు**

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలా తోరణం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 65,416 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.51 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.

**జూన్ 30 వరకు బ్రేక్ దర్శనాలు రద్దు**

వేసవి సెలవులు, సార్వత్రిక ఎన్నికలు పూర్తి కావడం, పరీక్ష ఫలితాలు విడుదల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా కొనసాగుతుండడంతో శుక్ర, శని, ఆదివారాల్లో బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు టీటీడీ పీఆర్వో విభాగం తెలిపింది. సామాన్య భక్తులకు త్వరగా శ్రీవారి దర్శనం కల్పించేందుకు జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది.





జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్, జస్టిస్ మహదేవన్, కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు

## అవసరానికి మించి సిజేరియన్లు.. 'గుంటూరు'లో ఐదు ఆస్పత్రులకు నోటీసులు

**గర్భిణులకు అవసరంలేకపోయినా ఆపరేషన్లు చేయడంపై ప్రభుత్వం కన్నెర్ర / మరో 20 ఆసుపత్రులకు మెమోలు ఇచ్చేందుకు రంగం సిద్ధం**



**గుంటూరు మెడికల్:** రాష్ట్రవ్యాప్తంగా అవసరానికి మించి గర్భిణులకు సిజేరియన్లు చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో.. గుంటూరు జిల్లాలోని ఐదు ఆసుపత్రులకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు నోటీసులు జారీచేశారు. దీంతో.. కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, నందనా హాస్పిటల్, డీవీసీ హాస్పిటల్, వీ కార్డియాలజీ కేర్ హాస్పిటల్, శ్రీవెంకటేశ్వర హాస్పిటళ్లకు చెందిన వైద్యులు వివరణ ఇవ్వాలంటూ జిల్లా వైద్య అధికారులు ఆదేశాలు జారీచేశారు. మరో 20 ఆస్పత్రులకు సైతం నోటీసులు సిద్ధంచేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు.

**కాన్పుకు రూ.70 వేల నుంచి రూ.1.50 లక్షలు వసూలు**

సాధారణ కాన్పు అయ్యేవారికి సైతం సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీస్తున్నారనే ఫిర్యాదులు ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులపై తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఇక్కడ సాధారణ కాన్పుకు రూ.50 వేల వరకు వసూలుచేస్తున్నారు. సిజేరియన్‌కు రూ.70 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలుచేస్తున్నారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు 10,320 జరుగగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో 15,555 కాన్పులు జరిగాయి. ప్రభుత్వాసుపత్రుల్లో సిజేరియన్ డెలివరీలు 4,128 జరగ్గా, ప్రైవేటు ఆసుపత్రుల్లో 9,333 జరిగాయి. ఇక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్న వారిని సిజేరియన్ల పేరుతో అధిక సంఖ్యలో ఫీజులు వసూలుచేస్తూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా వారిని ఇబ్బందిపడేలా చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే.. అది కూడా శిశువు లేదా తల్లి ప్రాణాలకు అపాయం వాటిల్లుతుందనుకున్న సమయాల్లో మాత్రమే చేయాల్సిన సిజేరియన్లు ఎడాపెడా చేసేస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కొరఢా ఝుళిపించింది.

**అనవసరంగా ఆపరేషన్లు చేస్తే చర్యలు తప్పవు**



నిబంధనల ప్రకారం చేయాల్సిన దానికంటే ఎక్కువ సిజేరియన్లు చేసిన ఆస్పత్రులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం. నూరు శాతం సిజేరియన్లు చేసిన ఐదు ఆస్పత్రులకు నోటీసులు జారీచేశాం. మరో 20 ఆస్పత్రులకు సైతం నోటీసులిచ్చేందుకు రంగం సిద్ధంచేశాం. సాధ్యమైనంత మేరకు సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రతి ఒక్కరూ చూడాలి. సాధారణ ప్రసవాలతో బాలింతలు త్వరితగతిన కోలుకుంటారు. – డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, గుంటూరు

## బ్లడ్ శాంపిలా?.. ప్రమాణమా?

- సోమిరెడ్డికి మంత్రి కాకాణి సవాల్
- కారు స్టిక్కర్ వ్యవహారంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు
- బెంగళూరు రేవ్ పార్టీతో సంబంధమే లేదు



**నెల్లూరు (దర్గామిట్ట):** జూదం, మద్యంతో పాటు అన్ని అవ లక్షణాలు కలిగిన టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనను అప్రతిష్ట పాల్జేసేందుకే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. 'బెంగళూరు రేవ్ పార్టీతో నాకు సంబంధముందని నిరూపిస్తావా? బ్లడ్ శాంపిల్ ఇస్తావా? లేక ప్రమాణం చేస్తావా?' అంటూ ఆయన సోమిరెడ్డికి సవాల్ విసిరారు. శుక్రవారం మంత్రి కాకాణి విలేకరులతో మాట్లాడారు. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో ఒక కారుకు తన స్టిక్కర్ ఉందనే ప్రచారంతో సోమిరెడ్డి పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తమ ఆధ్వర్యంలోనే రేవ్ పార్టీ జరిగిందని, తన పాస్ పోర్ట్ దొరికిందని, గోపాల్ రెడ్డి తనకు సన్నిహితుడని చెత్త ఆరోపణలు చేశారని చెప్పారు. ఈ విషయంపై తాను సోమిరెడ్డికి మరోసారి సవాల్ విసురుతున్నానన్నారు. కారులో నా పాస్‌పోర్టు దొరికిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పాస్‌పోర్ట్ తన దగ్గరే ఉందని చెబుతూ... కాకాణి దాన్ని మీడియాకు చూపించారు. ఆ కారు తుమ్మల వెంకటేశ్వర రావు పేరుతో ఉందని, ఆ కారుకు తన స్టిక్కర్ ఉందని జరుగుతున్న ప్రచారంపై ఇప్పటికే తాను జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. నెల్లూరు నగరంలోని వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. గోపాల్‌రెడ్డితో తనకు పరిచయమున్నట్టు ఏ ఆధారమున్నా సోమిరెడ్డి బయట పెట్టాలని డిమాండ్ చేశారు. గోపాల్‌రెడ్డికి – రేవ్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని కర్ణాటక పోలీసులే స్పష్టం చేశారని, సోమిరెడ్డి మాత్రం రేవ్ పార్టీని తనకు అంటకడుతున్నారన్నారు. క్లబ్‌కు వెళ్లడం, పేకాటాడటం, డ్రగ్స్ అలవాట్లు ఎవరికి ఉన్నాయో తేల్చుకుందామని ఆయన సవాల్ విసిరారు. సోమిరెడ్డి వ్యక్తిత్వంపై గతంలో స్థానిక పత్రికల్లో వార్తలు వచ్చాయని, వాటిని ఎప్పుడూ ఆయన ఖండించలేదన్నారు. పురాతన పంచలోహ విగ్రహాలను విదేశాలకు అమ్మేందుకు సోమిరెడ్డి ప్రయత్నం చేశారని ఆరోపించారు. సోమిరెడ్డిపై తాను చేస్తున్న ఆరోపణలన్నీ నిజమేనన్నారు. గతంలో కోర్టులో చోరీ ఉదంతంపై తనకు సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందని చెప్పారు. తన సచ్ఛీలతను నిరూపించుకునేందుకు ఎలాంటి విచారణకైనా తాను సిద్ధంగా ఉన్నానని, మరి సోమిరెడ్డిపై వచ్చిన ఆరోపణలు నిరూపించుకునేందుకు ఆయన సిద్ధమా? అని సవాల్ విసిరారు.

## బంగాళాఖాతంలో నేడు తుపాను

- రేపు తీవ్ర తుపానుగా బలపడే అవకాశం
- బంగ్లాదేశ్-పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటే అవకాశం
- నేడు, రేపు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు
- అపై మళ్లీ పెరగనున్న ఉష్ణోగ్రతలు
- కర్నూలు జిల్లాలో భారీ వర్షం



**సాక్షి, విశాఖపట్నం:** నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం శుక్రవారం ఉదయం మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడింది. ఇది ఈశాన్య దిశగా పయనిస్తూ తూర్పు మధ్య బంగాళాఖాతంలో బంగ్లాదేశ్‌లోని ఖేపుపరాకు దక్షిణ నైరుతి దిశలో 700 కిలోమీటర్లు, పశ్చిమ బెంగాల్‌లోని సాగర్ ఐలండ్‌కు దక్షిణ ఆగ్నేయ దిశలో 660 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ అదే ప్రాంతంలో శనివారం ఉదయానికి తుపానుగా మారనుంది. అనంతరం ఉత్తర దిశగా పయనిస్తూ శనివారం రాత్రికి తీవ్ర తుపానుగా బలపడనుంది. తరువాత అదే దిశలో కదులుతూ ఆదివారం అర్ధరాత్రి పశ్చిమ బెంగాల్‌లోని సాగర్ ఐలండ్, బంగ్లాదేశ్‌లోని ఖేపుపరాల మధ్య తీవ్ర తుపానుగా తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో శనివారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, చిత్తూరు, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, అన్నమయ్య, తిరుపతి, శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లాల్లోను, ఆదివారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోను అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదే సమయంలో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.

**కర్నూలు జిల్లాలో 14.7 సెంటీమీటర్ల వర్షపాతం**

శుక్రవారం కర్నూలు, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. కర్నూలు జిల్లా తళ్లగోకులపాడులో అత్యధికంగా 14.7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కాకినాడలో 10.3, యలమంచిలి (అనకాపల్లి జిల్లా) 4.5, నెల్లిమర్ల (విజయనగరం) 4.3, చింతపల్లి (అల్లూరి సీతారామరాజు)లో 3.5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

**మళ్లీ వడగాడ్పుల ఉధృతి**

తుపాను ప్రభావం రాష్ట్రంపై లేకపోవడంతో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. దీంతో రాష్ట్రంలో వడగాడ్పులు క్రమంగా ఉధృతమవుతున్నాయి. శుక్రవారం రాష్ట్రంలో తొమ్మిది మండలాల్లో వడగాడ్పులు వీచాయి. శనివారం 35 (విజయనగరం జిల్లాలో 15, శ్రీకాకుళంలో 10, పార్వతీపురం మన్యంలో 5, అనకాపల్లిలో 5) మండలాల్లో వడగాడ్పులు, ఆదివారం 14 (పార్వతీపురం మన్యం జిల్లాలో 6 శ్రీకాకుళంలో 4, విజయనగరంలో 4) మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 64 (విజయనగరం జిల్లాలో 20, శ్రీకాకుళంలో 17, పార్వతీపురం మన్యంలో 8, కృష్ణాలో 7, అనకాపల్లిలో 6, విశాఖపట్నంలో 2, ఏలూరులో 2, తూర్పు గోదావరిలో 1, బాపట్లలో 1) మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

## లోకేశ్‌ను టీడీపీ అధ్యక్షుడిని చేయాలి: బుద్దా వెంకన్న

**వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ):** లోకేశ్‌కు టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించాలని ఆ పార్టీ నేత బుద్దా వెంకన్న పార్టీ అధ్యక్షుడు చంద్రబాబును డిమాండ్ చేశారు. ఇది రిక్వెస్ట్ కాదు.. డిమాండ్ అని చెప్పారు. అప్పుడే పార్టీకి మరో 30 ఏళ్ల వరకు ఇబ్బంది ఉండదన్నారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెంకన్న మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనకు సీటు ఇవ్వకపోయినా చంద్రబాబు కోసమే పనిచేసినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమి 130 స్థానాలతో విజయం సాధించటం ఖాయమన్నారు. 2019 వరకు టీడీపీని చంద్రబాబు ఒక్కరై నడిపించారని తెలిపారు. నేడు చంద్రబాబుతో పాటు లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మణి నాలుగు దిక్కులుగా పార్టీకోసం పనిచేశారని చెప్పారు. గత ఎన్నికల్లో టీడీపీకి 23 సీట్లు వస్తే పార్టీ పని అయిపోయిందని పదవులు అనుభవించిన వారే వెటకారం చేశారని విమర్శించారు.

# ప్రాంతీయ సవాల్!

**హరియాణాలో ఆసక్తికర పోరు ● 10 లోక్‌సభ స్థానాలకూ నేడే పోలింగ్**

ఫైనాన్షియల్, కార్పొరేట్ హబ్‌గా దేశ ఆర్థిక ముఖచిత్రంలో కీలకమైన హరియాణాలో సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి రంగం సిద్ధమైంది. ఇక్కడి మొత్తం 10 లోక్‌సభ స్థానాలకూ ఆరో విడతలో భాగంగా శనివారం పోలింగ్ జరగనుంది. గత ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీకి వాటిని నిలబెట్టుకోవడం సవాలుగా మారింది. కాంగ్రెస్, ఆప్‌లతో కూడిన ఇండియా కూటమి నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ 9 చోట్ల, ఆప్ ఒక్క స్థానంలో బరిలో ఉన్నాయి. ప్రాంతీయ పార్టీలు కూడా గట్టిగా సవాలు విసురుతున్నాయి. హరియాణాలోని కీలక స్థానాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్



### కురుక్షేత్ర.. నువ్వా నేనా!

మోదీ వేవ్‌లో 2014లో ఇక్కడ తొలిసారి కాషాయ జెండా ఎగిరింది. 2019లో రాష్ట్ర బీజేపీ చీఫ్ నాయబ్ సింగ్ సైనీ భారీ మెజారిటీతో నెగ్గారు. ఆయన సీఎం కావడంతో ఈసారి పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్‌కు బీజేపీ టికెటిచ్చింది. ఆప్ అభ్యర్థి సుశీల్ కుమార్ గుప్తాకు విద్యా, వ్యాపారవేత్తగా మంచి పేరుంది. ఐఎన్ఎల్డీ ప్రధాన కార్యదర్శి అభయ్ సింగ్ చౌతాలా తొలిసారి లోక్‌సభ బరిలో దిగారు. రైతు ఆందోళనల సెగ బీజేపీకి గట్టిగా తగులుతోంది. జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఎన్డీఏ కూటమి వీడి సొంతంగా పోటీ చేస్తుండటం కూడా కమలనాథులకు ప్రతికూలాంశమే. ఆ పార్టీ నుంచి పలరామ్ సైనీ బరిలో ఉన్నారు. బీజేపీకి ఎదురుగాలి వీస్తోందని పరిశీలకులు చెబుతున్నారు.

### హిసార్... ప్రాంతీయ పార్టీల అడ్డా

రాష్ట్రంలో చక్రం తిప్పుతున్న ప్రాంతీయ పార్టీల మధ్య చేతులు మారుతూ వస్తున్న కీలక నియోజకవర్గమిది. అయితే మాజీ సీఎం, కాంగ్రెస్ దిగ్గజం భజన్‌లాల్ పెట్టిన హరియాణా జనహిత్ కాంగ్రెస్‌ను ఆయన కుమారుడు కుల్‌దీప్ తిరిగి కాంగ్రెస్‌లోనే విలీనం చేశారు. దేవీలాల్ ముని మనవడు దుష్యంత్ చౌతాలా ఐఎన్ఎల్డీ తరఫున తొలిసారి 26 ఏళ్లకే ఎంపీ అయ్యారు! ఆ పార్టీతో విభేదాలతో జేజేపీ ఏర్పాటు చేసి గత ఎన్నికల్లో పోటీ చేసి బీజేపీ చేతిలో ఓటమి చవిచూశారు. ఈసారి జేజేపీ నుంచి దుష్యంత్ తల్లి నైనా సింగ్ చౌతాలా పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి దుష్యంత్ కుంటుంబానికే చెందిన దేవీలాల్ తనయుడు రంజిత్ సింగ్ చౌతాలా బరిలో దిగడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ నుంచి జై ప్రకాశ్, ఐఎన్ఎల్డీ నుంచి సునైనా చౌతాలా పోటీ చేస్తున్నారు.

### ఫరీదాబాద్.. బీజేపీ హ్యాట్రిక్ గురి

ఈ పారిశ్రామిక హబ్‌లో గత రెండు ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. సిట్టింగ్ ఎంపీ కృష్ణ పాల్ గుజ్జర్ హ్యాట్రిక్‌పై గురిపెట్టారు. కాంగ్రెస్ నుంచి మహేంద్ర ప్రతాప్ సింగ్, జేజేపీ నుంచి నళిన్ హుడా పోటీ పడుతున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 9 అసెంబ్లీ సెగ్మెంట్లలో 7 బీజేపీ గుప్పిట్లోనే ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.

### రోహ్‌తక్... కాంగ్రెస్ జైత్రయాత్రకు బ్రేక్

మాజీ ఉప ప్రధాని చౌదరి దేవీలాల్, హర్యానా మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా వంటి దిగ్గజాలు ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానం పూర్తిగా కాంగ్రెస్ అడ్డా. ఆ పార్టీ జైత్రయాత్రకు 2019లో బీజేపీ బ్రేక్ వేసింది. ఆ పార్టీ నుంచి సిట్టింగ్ ఎంపీ అరవింద్ కుమార్ శర్మ, కాంగ్రెస్ నుంచి దీపీందర్ సింగ్ హుడా మళ్లీ తలపడుతున్నారు. ఈ జాట్ ప్రాబల్య స్థానంలో 70 శాతం ఓటర్లు గ్రామీణులే. 20 శాతం మేర ఎస్సీలుంటారు. దీని పరిధిలోని 9 అసెంబ్లీ స్థానాల్లో ఏకంగా 8 కాంగ్రెస్ చేతిలో ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.

### అంబాలా... దళితులే కీలకం

ఒకప్పటి ఈ కాంగ్రెస్ కంచుకోటలోనూ కమలనాథులు పాగా వేశారు. 2014, 2019ల్లో బీజేపీ నుంచి గెలిచిన రతన్ లాల్ కటారియా మరణించడంతో ఈసారి ఆయన భార్య బాంటో బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ములానా సిట్టింగ్ ఎమ్మెల్యే వరుణ్ చౌదరి బరిలో ఉన్నారు. ఇక్కడ 25 శాతం దళితులు, 20 శాతం వెనుకబడిన వర్గాలున్నాయి. పంజాబీ, సిక్కు, రాజ్‌పుత్, జాట్, బ్రాహ్మణ ఓటర్లూ కీలకమే. దళితుల్లో రవిదాసీయులు 5 లక్షల మేర ఉంటారు.

### సిర్సా... కాంగ్రెస్ వర్సెస్ మాజీ

బీజేపీ సిట్టింగ్ ఎంపీ సునితా దుగ్గల్‌ను కాదని అశోక్ తన్వర్‌కు టికెటిచ్చింది. 2019లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిన ఆయన ఇటీవలే బీజేపీలోకి జంప్ చేయడం విశేషం! కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ కుమారి సెల్జా బరిలో ఉన్నారు. ఆమె 1991లో తొలిసారి ఇక్కడి నుంచే ఎంపీగా గెలిచారు. జేజేపీ, ఐఎన్ఎల్డీలకు కూడా ఇక్కడ గట్టి ఓటు బ్యాంకు ఉండటంతో పోటీ ఉత్కంఠ రేపుతోంది.

## మేధా పాట్కర్ దోషే: ఢిల్లీ కోర్టు

**న్యూఢిల్లీ:** నర్మదా బచావో ఆందోళన్ నేత, పర్యావరణ నాయకురాలు మేధా పాట్కర్‌పై నమోదైన 23 ఏళ్లనాటి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా లక్ష్యంగా గతంలో చేసిన వ్యాఖ్యలు పరువు నష్టం కలుగజేసేవిగా ఉన్నాయంటూ ఆమెను దోషిగా తేల్చింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ అనే సంస్థకు అధ్యక్షుడిగా ఉన్న సక్సేనాకు ఆ సమయంలో చోటుచేసుకున్న కొన్ని హవాలా లావాదేవీలతో సంబంధాలున్నాయంటూ తీవ్ర ఆరోపణలతో కూడిన ప్రకటనను పాట్కర్ విడుదల చేశారు. ఇవి తన ప్రతిష్ఠకు భంగకరంగా ఉన్నాయంటూ సక్సేనా 2000వ సంవత్సరంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ సమయంలో మేధా పాట్కర్ ఆరోపణలకు రుజువులను చూపించలేకపోయారని తాజాగా కోర్టు పేర్కొంది. 'వ్యక్తిగత ఆస్తుల్లో ప్రతిష్ఠ ఒకటి. ఇది సమాజంలో వ్యక్తిగత, వృత్తిపరమైన సంబంధాలను ప్రభావితం చేస్తుంది' అని మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ రాఘవ్ శర్మ పేర్కొన్నారు. మేధా పాట్కర్ దోషేనని స్పష్టం చేశారు. శిక్ష ఖరారుపై ఈ నెల 30వ తేదీన వాదనలు జరగనున్నాయి.

# నేడే ఆరో దశ పోలింగ్

**6 రాష్ట్రాలు, 2 యూటీల పరిధిలో ఎన్నికలు ● అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ప్రముఖులు**

**సాక్షి, న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో ఆరో విడతకు రంగం సిద్ధమైంది. 6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలో 58 లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. హరియాణాలో మొత్తం 10, ఢిల్లీలోని 7 లోక్‌సభ స్థానాలతో పాటు పశ్చిమబెంగాల్‌లోని గిరిజన ప్రాబల్య జంగల్‌మహల్ ప్రాంతంలోని పలు లోక్‌సభ స్థానాలు వీటిలో ఉన్నాయి. ఒడిశాలో 6 లోక్‌సభ స్థానాలతో పాటు వాటి పరిధిలోని 42 అసెంబ్లీ సీట్లలో కూడా పోలింగ్ జరగనుంది. దీంతో 486 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ పూర్తవనుంది. మిగతా 57 స్థానాలకు జూన్ 1న చివరి విడతతో పోలింగ్ ప్రక్రియ ముగుస్తుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి. మండే ఎండల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యంత్రాంగాన్ని ఈసీ ఆదేశించింది.

**బరిలో కీలక నేతలు**

కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, రావు ఇందర్‌జీత్ సింగ్, కృష్ణపాల్ గుర్జర్‌తో పాటు మేనకా గాంధీ, సంబిత పాత్ర, మనోహర్‌లాల్ ఖట్టర్ (బీజేపీ), రాజ్‌బబ్బర్, కన్హయ్య కుమార్, దీపీందర్‌సింగ్ హుడా (కాంగ్రెస్), మెహబూబా ముఫ్తీ (పీడీపీ) తదితర ప్రముఖులు ఆరో విడతలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. హరియాణాలోని కర్నాల్ అసెంబ్లీ స్థానం నుంచి సీఎం నాయబ్‌సింగ్ సైనీ పోటీ చేస్తున్నారు. కురుక్షేత్ర సిట్టింగ్ ఎంపీ అయిన ఆయన ఇటీవలే సీఎంగా పగ్గాలు చేపట్టడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్నెల్ల లోపు అసెంబ్లీకి ఎన్నికవ్వాల్సి ఉంది. మరోవైపు హరియాణా, ఢిల్లీల్లో 2019లో క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీకి ఈసారి మాత్రం కాంగ్రెస్–ఆప్ నుంచి గట్టి సవాలు ఎదురవుతోంది.



శుక్రవారం భువనేశ్వర్ పంపిణీ కేంద్రం వద్ద ఎన్నికల సామగ్రితో పోలింగ్ అధికారులు

**పోలింగ్ జరిగే స్థానాలు 58**

| | |
|---|---|
| జనరల్ | 49 |
| ఎస్టీ | 07 |
| ఎస్సీ | 02 |
| పోలింగ్ కేంద్రాలు | 1.14 లక్షలు |
| పోలింగ్ అధికారులు | 11.4 లక్షలు |
| మొత్తం ఓటర్లు | 11.13 కోట్లు |
| పురుషులు | 5.84 కోట్లు |
| మహిళలు | 5.29 కోట్లు |

| రాష్ట్రం | సీట్లు | రాష్ట్రం | సీట్లు |
|---|---|---|---|
| ఉత్తరప్రదేశ్ | 14 | బిహార్ | 8 |
| హరియాణా | 10 | ఢిల్లీ | 7 |
| పశ్చిమబెంగాల్ | 08 | ఒడిశా | 6 |
| | | జార్ఖండ్ | 4 |
| | | కశ్మీర్ | 1 |

**అసెంబ్లీ ఎన్నికలు — ఒడిశా 42 స్థానాలు**

## ఎలక్షన్ బీట్

### అబద్ధాల వ్యాప్తికి దేవుడు దూతను పంపుతాడా?

**ప్రధాని మోదీ వ్యాఖ్యలపై మమత ఎద్దేవా**

**కోల్‌కతా:** దేవుడు తనను పంపాడని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ధ్వజమెత్తారు. మథురాపూర్‌లో శుక్రవారం ఎన్నికల సభలో మాట్లాడుతూ 'ఓటమి తప్పదనే భయంతో.. ఆ ఫోబియాలో బీజేపీ నాయకులు అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. 'ఇప్పుడాయన తనను తాను దేవుడి బిడ్డగా, మనలాగా ఆయనకు తల్లిదండ్రులు లేరని, భగవంతుడు ఆయన్ను పంపాడని చెప్పుకుంటున్నారు. అల్లర్లను ప్రేరేపించడానికి, ప్రకటనల ద్వారా అబద్ధాలు వ్యాప్తి చేయడానికి, జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ) ద్వారా జనాన్ని జైళ్లో వేయడానికి దేవుడు ఎవరినైనా పంపుతాడా అని నేనడుగుతున్నాను. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ద్వారా హింసను ప్రోత్సహించడానికి, ఉపాధి హామీ పథకానికి నిధులు ఆపడానికి, పేదలకు ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడానికి దేవుడు తన దూతను పంపుతాడా?' అని మమత వ్యంగ్యంగా అన్నారు. పేదల ఖాతాల్లో రూ. 15 లక్షల చొప్పున జమచేస్తాననే హామీపై భగవంతుడు వెనక్కు తగ్గుతాడా అని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ఒక జాతీయ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ.. మా అమ్మ బతికున్నంతవరకు నేను సాధారణంగా అందరిలాగే జన్మించానని అనుకునేవాడిని. ఆమె మరణించాక నా అనుభవాలను పరికించి చూసుకుంటే.. నన్ను దేవుడు పంపాడని నేను నిశ్చితాభిప్రాయానికి వచ్చాను' అని పేర్కొన్నారు. ప్రధాని పేరెత్తకుండానే మమత ఆయన వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు.

### నేత లేదు, నీతి లేదు..!

**ఇండియా కూటమి నేతలపై అమిత్ షా ధ్వజం**

**ఆరా(బిహార్)/జాంతాడా/దియోగఢ్(జార్ఖండ్):** ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రంగా మండిపడ్డారు. ఆ కూటమికి నేత లేదు, నీతి లేదు, విధానం లేదని వ్యాఖ్యానించారు. రాహుల్‌ను ప్రధానిగా చేయడం కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ లక్ష్యం కాగా, స్టాలిన్, లాలు, ఉద్ధవ్ ఠాక్రేలకు తమ కుమారులను సీఎం పదవుల్లో కూర్చోబెట్టడమే లక్ష్యమని ఆరోపించారు. దేశ ప్రధానిగా అర్హత ఉన్న ఏకైక నేత మోదీ మాత్రమేనని అన్నారు. శుక్రవారం అమిత్ షా జార్ఖండ్‌లోని జాంతాడా, దియోగఢ్‌తోపాటు బిహార్‌లోని ఆరా పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు లాగేసుకుని వాటి ప్రయోజనాలను ముస్లింలకు కల్పించాలని కాంగ్రెస్, ఆర్జేడీలు ప్రయత్నిస్తున్నాయని అమిత్ షా ఆరోపించారు. వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్లను లాలు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ, మమతా బెనర్జీ వ్యతిరేకిస్తున్నారన్నారు. కానీ, వీరి ప్రయత్నాలను ప్రధాని మోదీ సారథ్యంలో ఎన్డీఏ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్‌లో 2010 నుంచి జారీ చేస్తున్న ఓబీసీ సర్టిఫికెట్లు చెల్లవంటూ బుధవారం కలకత్తా హైకోర్టు వెలువరించిన తీర్పును మంత్రి అమిత్ షా ప్రస్తావిస్తూ.. ప్రతిపక్ష పార్టీల బండారం బయటపడిందని ఎద్దేవా చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి వరకు పూర్తయిన ఐదు విడతల్లో బీజేపీ 310 సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే బీజేపీని 400పైగా సీట్లలో గెలిపించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

### బ్రిటిష్ తరహాలోనే మోదీ ప్రభుత్వం: ఖర్గే

**దేవ్‌గఢ్:** బ్రిటిష్‌వారి తరహాలోనే మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో దేశంలోని అడవులు, నీరు, భూమిని దోచుకుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వాలు నీరు, భూమి, అటవీ పరిరక్షణకు చట్టాలు చేశాయని, మోదీ ప్రభుత్వం నిబంధనలను మార్చి ఆ చట్టాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. బ్రిటీష్ వారిని ఎదుర్కొన్న కాంగ్రెస్.. మోదీ పరివారానికి భయపడదని స్పష్టం చేశారు. జార్ఖండ్‌లోని గొడ్డా నియోజకవర్గ అభ్యర్థి ప్రదీప్ యాదవ్ ప్రచారంలో భాగంగా శుక్రవారం దేవ్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. బీజేపీ దేశాన్ని మతప్రాతిపదికన విడదీయాలని చూస్తే.. కాంగ్రెస్ మాత్రం హిందూముస్లింలను ఏకం చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గిరిజనులకు ప్రత్యేక మతపరమైన కోడ్ సర్నాను అమలు చేస్తామని, ఖాళీగా ఉన్న 30 లక్షల ప్రభుత్వ పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

### ఈవీఎం లాగ్‌లు రెండు మూడేళ్లు భద్రపర్చాలి

**ఈసీని ఆదేశించండి ● సుప్రీంకోర్టుకు కపిల్ సిబల్ వినతి**

**న్యూఢిల్లీ:** ఎన్నికల్లో ఉపయోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) లాగ్‌లను కనీసం రెండు మూడేళ్లపాటు భద్రపర్చేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ శుక్రవారం కోరారు. ప్రతి ఎలక్ట్రానిక్ యంత్రానికి ఆపరేటింగ్ సిస్టమ్ ఉన్నట్లునే ఈవీఎంలకు లాగ్‌లు ఉంటాయని, ఓటింగ్‌కు సంబంధించిన డేటా అందులో ఉంటుందని తెలిపారు. సాధారణంగా ఎన్నికల సంఘం ఇలాంటి డేటాను కేవలం 30 రోజులపాటే భద్రపరుస్తుందని అన్నారు. కనీసం రెండు మూడేళ్లు భద్రపర్చాల్సిన అవసరం ఉందని సూచించారు.

### 4 తర్వాత 3 రోజుల్లో 'ప్రధాని' ఖరారు

**ఎన్నికల్లో మా కూటమిదే విజయం: జైరామ్ రమేశ్**

**చండీగఢ్:** ఈ ఎన్నికల్లో విపక్ష 'ఇండియా' కూటమి గెలిస్తే ఐదు సంవత్సరాల్లో ఐదుగురు ప్రధానమంత్రులు వస్తారంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తిప్పికొట్టారు. ఆయన శుక్రవారం చండీగఢ్‌లో మీడియాతో మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కేవలం మూడు రోజుల్లోగా తమ కూటమి ప్రధానమంత్రి అభ్యర్థిని ఖరారు చేస్తామని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి స్పష్టమైన, నిర్ణయాత్మక విజయం సాధించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఐదేళ్లపాటు ఒకే ఒక్క ప్రధానమంత్రి ఉంటారని తేల్చిచెప్పారు.

## 'బూత్‌లవారీగా ఓటింగ్ శాతం'పై ఆదేశాలివ్వలేం: సుప్రీం

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లా వారీగా ఓటింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఐదు దశల పోలింగ్ పూర్తయ్యిందని, మరో రెండు దశల పోలింగ్ జరగాల్సి ఉందని, ఇలాంటి సమయంలో పోలింగ్ బూత్‌లవారీగా ఓటింగ్ శాతాన్ని బహిర్గతం చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించలేమని తేల్చిచెప్పింది. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ శాతం వివరాలను ఈసీ వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) దాఖలు చేసిన ఇంటర్‌లాక్యుటరీ అప్లికేషన్(ఐఏ)పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఇలాంటి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలంటే ఎన్నికల సంఘం వనరులు సమకూర్చుకోవాల్సి ఉంటుందని, ఇప్పుడు ఎన్నికల మధ్యలో అది సాధ్యం కాదని పేర్కొంది. క్షేత్రస్థాయి పరిస్థితులను కూడా అర్థం చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న ఈ సమయంలో ఎన్నికల సంఘంపై అదనపు భారం మోపడం సరైంది కాదని ఉద్ఘాటించింది. ఏడీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సార్వత్రికలు ఎన్నికలు పూర్తయిన తర్వాత రెగ్యులర్ బెంచ్ విచారిస్తుందని వెల్లడించింది. ఇదే అంశంపై 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రధాన రిట్ పిటిషన్‌తో కలిపి తాజా పిటిషన్‌ను విచారించనున్నట్లు స్పష్టం చేసింది.

## 'అగ్నిపథ్'ను బలవంతంగా రుద్దుతున్నారు

**బీజేపీపై రాహుల్ ఫైర్**

**న్యూఢిల్లీ:** దేశానికి సేవ చేయాలని కలలు కంటున్న యువతను ప్రధాని మోదీ అగ్నిపథ్ పథకాన్ని బలవంతంగా అమలు చేసి మోసం చేశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇండియా కూటమి ప్రభుత్వం వారికి న్యాయం చేస్తుందని ప్రకటించారు. యువత కలలను భగ్నం కానీయమన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్'లో ఒక వీడియో విడుదల చేశారు. దేశాన్ని సేవ చేయాలని భావిస్తున్న ఎందరో యువత అగ్నిపథ్ కారణంగా ఆర్మీలో చేరడంపై విముఖతతో ఉన్నారన్నారు. ఇందుకు సంబంధించి, ఇటీవల ఓ టెంపో వాహనంపై పలువురు యువకులతో మాట్లాడిన వీడియోను రాహుల్ జత చేశారు. సాయుధ బలగాల్లో చేరేందుకు సిద్ధమవుతున్న తమ స్నేహితుల్లో కొందరు అగ్నిపథ్ అమలు కారణంగా ఆత్మహత్యలకు కూడా పాల్పడినట్లు ఆ యువకులు తెలిపారన్నారు. తాము అధికారంలోకి వస్తే అగ్నిపథ్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు.

## దేశాభివృద్ధి కోసమే మూడోసారి

**గెలుపు నా కోసం, నా కుటుంబం కోసం కాదు: ప్రధాని మోదీ**

**సిమ్లా:** బీజేపీని వరుసగా మూడోసారి గెలిపించాలని, దేశ అభివృద్ధి కోసమే తప్ప ఈ గెలుపు తన కోసం, తన కుటుంబం కోసం కాదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం అన్ని గ్రామాల్లో దేవాలయాలకు వెళ్లి, దేవుళ్లను ప్రార్థించి ఆశీస్సులు పొందాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు బలవంతంగా లాక్కొని ఓటు బ్యాంక్‌కు కట్టబెడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అయోధ్య రామమందిరానికి తాళం పడుతుందని అన్నారు. శుక్రవారం హిమాచల్ ప్రదేశ్‌లోని నాహన్, మండీ, పంజాబ్‌లోని గురుదాస్‌పూర్, జలంధర్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించిందని ఆరోపించారు. మందిర నిర్మాణానికి తాము పూనుకుంటే తేదీ చెప్పండి అంటూ ఎగతాళి చేశారని అన్నారు. తేదీ ప్రకటించడమే కాకుండా ఆలయ నిర్మాణం పూర్తిచేసి ప్రాణప్రతిష్ఠ సైతం జరిపించామని గుర్తుచేశారు. ఓటు బ్యాంక్‌ను బుజ్జగించడానికి కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని బహిష్కరించిందని మండిపడ్డారు. హిమాచల్ ప్రదేశ్‌లో 2.50 లక్షల జనాభా ఉన్న హట్టీ సామాజికవర్గానికి ఎస్టీ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఓడిపోయే కాంగ్రెస్‌కు ఓటు వేసి ఓటు వృథా చేసుకోవద్దని ప్రజలకు సూచించారు.



## కబళించిన కొండచరియలు.. 100 మందికి పైగా సజీవ సమాధి

**పపువా న్యూగినియాలో విషాదం**

**మెల్‌బోర్న్:** దక్షిణ పసిఫిక్ ద్వీప దేశం పపువా న్యూగినియాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మారుమూల పర్వత ప్రాంతంలో కొండచరియలు ఏకంగా ఒక గ్రామాన్నే కబళించాయి. ఈ ఘటనలో 100 మందికిపైగా చనిపోయి ఉంటారని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ఉదయం 3 గంటల సమయంలో ఎంగా ప్రావిన్స్‌లోని సుదూర గ్రామం కవోకల మ్‌ను ఆనుకుని ఉన్న కొండలోని ఒక భాగం విరిగిపడి గ్రామాన్ని, పోర్గెరా పట్టణంతో కలిపే ఏకైక రహదారిని పూర్తిగా కప్పేసింది. దీంతో, ఆ గ్రామానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పర్వతమయమైన ఆ ప్రాంతానికి చేరుకోవాలంటే హెలికాప్టర్ ద్వారానే సాధ్యమని అధికారులు అంటున్నారు. పెద్దపెద్ద చెట్లు, భారీ బండరాళ్లు పడటంతో గ్రామంలోని నివాసాలు, ఇతర భవనాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఆ ప్రాంతాన్ని మట్టి, రాళ్లు పూర్తిగా కప్పేసినట్లున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. సహాయ చర్యలు ప్రారంభించినట్లు ప్రధాని జేమ్స్ మరాపె తెలిపారు. కవోకలమ్ గ్రామంలో సహాయ పునరావాస చర్యలకు అన్ని విధాలుగా సాయం అందజేస్తామని పొరుగు మిత్ర దేశం ఆస్ట్రేలియా తెలిపింది.

# వలపు వల విసిరి.. చర్మం వలిచి.. ముక్కలుగా నరికి

**బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్‌ను దారుణంగా చంపిన నిందితులు**

**కోల్‌కతా:** బంగ్లాదేశ్ అవామీ లీగ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ హత్య వ్యవహారంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆయనపై వలపు వల(హనీ ట్రాప్) విసిరి కోల్‌కతాకు రప్పించి, దారుణంగా హత్య చేసి, చర్మం వలిచి ముక్కలు ముక్కలుగా నరికినట్లు తేలింది. వలపు వల విసిరిన యువతిని బంగ్లాదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెను శిలాంతి రెహమాన్‌గా గుర్తించారు. బంగ్లాదేశ్ జాతీయురాలైన శిలాంతి ప్రధాన నిందితుడు, అమెరికా పౌరుడైన అఖ్తరుజమాన్ షహీన్‌కు ప్రియురాలు అని బంగ్లాదేశ్ పోలీసులు తెలిపారు. కోల్‌కతాలోని న్యూటౌన్ ప్రాంతంలో అక్తరుజమాన్ అద్దె ఇంట్లో ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో శిలాంతి రెహమాన్ కోల్‌తాలోనే ఉన్నట్లు వెల్లడయ్యింది. మరో నిందితుడు అమానుల్లా అమన్‌తో కలిసి ఈ నెల 15న బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిపోయింది. తన మిత్రుడు అన్వరుల్ అజీమ్ అనర్‌ను బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతాకు రప్పించడానికి ప్రధాన నిందితుడు అఖ్తరుజమాన్ తన ప్రియురాలు శిలాంతిని ప్రయోగించినట్లు పోలీసులు తేల్చారు. అన్వరుల్ అజీమ్ అనర్, అఖ్తరుజమాన్ మధ్య ఆర్థికపరమైన వివాదాలు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ హత్య జరిగినట్లు భావిస్తున్నారు.



శిలాంతి ఎంపీ అన్వరుల్(ఫైల్)

**అక్రమంగా దేశంలోకి చొరబడి హత్యాకాండ**

ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్‌ను చంపడానికి నిందితులు పక్కా పథకం వేశారు. జంతువులను వధించడంలో అనుభవం ఉన్న మాంసం వ్యాపారి జిహాద్ హవల్దార్‌ను బంగ్లాదేశ్ నుంచి ఇండియాకు రప్పించారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ఇండియాలోకి చొరబడ్డాడు. కొంతకాలం ముంబైలో తలదాచుకున్నాడు. పథకం ప్రకారం హత్యకు రెండు నెలల ముందు కోల్‌కతాకు చేరుకున్నాడు. అఖ్తరుజమాన్ అద్దె ఇంట్లో అన్వరుల్ అజీమ్‌ను ఇతర నిందితులతో కలిసి హత్య చేశాడు.

## గిరికీలు కొట్టిన హెలికాప్టర్

**కేదార్‌నాథ్:** ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో శుక్రవారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. హెలికాప్టర్ హైడ్రాలిక్ వ్యవస్థ విఫలం కావడంతో అత్యవసర ల్యాండయ్యింది. క్రెస్టెల్ ఏవియేషన్‌కు చెందిన ఈ హెలికాప్టర్ సిర్సి నుంచి ఆరుగురు భక్తులతో కేదార్‌నాథ్‌కు చేరుకుంది. ల్యాండింగ్ సమయంలో సాంకేతిక లోపంతో హెలికాప్టర్ వేగంగా గిరికీలు కొట్టింది. హెలిప్యాడ్ వద్ద ఉన్న వాళ్లంతా భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. పైలట్ కల్పేశ్ చాకచక్యంగా వ్యవహరించి, హెలిప్యాడ్ పక్కనే 100 మీటర్ల దూరంలోని ప్రాంతంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. అందరూ సురక్షితంగా కిందికి దిగారు.

# రఫాలో సైనిక చర్య ఆపండి

**● ఇజ్రాయెల్‌కు ఐరాస కోర్టు ఆదేశం**
**● బేఖాతరు చేసే అవకాశం**

**ది హేగ్:** దక్షిణ గాజాలోని రఫా నగరంలో సైనిక చర్యను తక్షణం ఆపాలని ఇజ్రాయెల్‌ను ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ శుక్రవారం ఆదేశించింది. అయితే ఇజ్రాయెల్ ఈ ఆదేశాలకు కట్టుబడి ఉండకపోవచ్చు. పాలస్తీనియన్లపై దాడుల విషయంలో అంతర్జాతీయంగా మద్దతు కోల్పోతున్న ఇజ్రాయెల్‌పై కోర్టు ఆదేశాలు మరింత ఒత్తిడిని పెంచుతాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో 10 లక్షల పైచిలుకు పాలస్తీనియన్లు రఫాకు వలస వచ్చారు. వీరిలో చాలామంది టెంట్లలో నివసిస్తున్నారు. రఫాపై ఇజ్రాయెల్ దృష్టి సారించడంతో మిత్రదేశం అమెరికాతో సహా పలుదేశాలు వారించాయి. ఈ వారమే మూడు యూరోప్ దేశాలు తాము పాలస్తీనాను స్వతంత్రదేశంగా గుర్తిస్తున్నట్లు ప్రకటించాయి. హమాస్‌కు మిగిలిన చివరి సురక్షిత స్థావరంగా రఫా ఉందని, దానిపై దాడి చేస్తేనే వారిని తుడిచిపెట్టగలమని ఇజ్రాయెల్ అంటోంది. ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ (ఐసీజే) అధ్యక్షుడు నవాఫ్ సలామ్ తీర్పు వెలువరిస్తూ 'రఫాలో సైనిక చర్యపై తాము వెలిబుచ్చిన భయాలు నిజమయ్యాయని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ తక్షణం రఫాలో సైనిక చర్య నిలిపివేయకుంటే భారీగా ప్రాణనష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు వారాల కిందట రఫాను ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీచేసింది. సైన్యాన్ని రఫా దిశగా నడిపించి కీలకమైన సరిహద్దు మార్గాన్ని తమ ఆధీనంలోకి తీసుకొంది. మానవతాసాయం అందడానికి రఫా క్రాసింగ్ అత్యంత కీలకం. అందుకే రఫా క్రాసింగ్‌ను తెరిచి ఉంచాలని ఐసీజే శుక్రవారం ఇజ్రాయెల్‌ను ఆదేశించింది. ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఆదేశాలు అంతర్జాతీయంగా ఇజ్రాయెల్‌కు ఎదురుదెబ్బే అయినా .. రఫాపై దాడులు చేయకుండా ఇజ్రాయెల్‌ను నిలువరించలేవు. ఎందుకంటే ఐసీజే వద్ద తమ ఆదేశాలను అమలుచేయడానికి అవసరమైన పోలీసు, సైనిక బలగాలేమీ లేవు.

# సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శనివారం : 25 : మే : 2024




లింగాయత్ మహామఠ్ స్థాపకురాలు అక్క అన్నపూర్ణ తాయి గురువారం హైదరాబాద్‌లో పరమపదించారు. శుక్రవారం ఆమె పార్థివ దేహాన్ని బీదర్‌కు తీసుకువచ్చి అంత్యక్రియలకు తరలిస్తున్న దృశ్యం

## న్యూస్‌రీల్

### తాగిన మైకంలో బ్యారేజీలోకి దూకి..



బ్యారేజీలోకి దూకుతున్న యువకుడు

**దొడ్డబళ్లాపురం:** మద్యం మత్తులో బ్యారేజీలోకి దూకిన యువకుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన కలబుర్గి జిల్లా కమలాపుర తాలూకా పటవాల్‌లో చోటుచేసుకుంది. మహమ్మద్ సాజిద్ దస్తగిర్ (25) మృతి చెందిన యువకుడు. మృతుడు స్నేహితులతో కలిసి మస్తాన్ ఖాద్రి దర్గాకు వెళ్లిన సమయంలో సమీపంలోని బ్యారేజీ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో స్నేహితులు అందరూ మద్యం తాగి ఉన్నారు. స్నేహితులతో పందెం వేసుకుని బ్యారేజీలో దూకిన దస్తగిర్ మద్యం మత్తులో ఈత కొట్టలేక నీటమునిగి మృతి చెందాడు. దస్తగిర్ నీటిలో దూకుతున్న దృశ్యాలను స్నేహితులు మొబైల్‌తో వీడియో తీశారు. కమలాపుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### కబినికి వరద నీరు

**మైసూరు :** కేరళ రాష్ట్రంలోని వైనాడులో కురుస్తున్న భారీ వర్షాలతో మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా బీచనహళ్లి వద్దగల కబిని జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. గురువారం 6473 క్యూసెక్కుల వరద నీరు చేరగా శుక్రవారం సైతం 6373 క్యూసెక్కుల నీరు చేరినట్లు అధికారులు తెలిపారు. గరిష్ట నీటి మట్టం 2284 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 2259.74 అడుగులకు చేరింది. 7.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గేట్లు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### రేవ్ పార్టీ కేసు, ఏఎస్ఐ సహా ముగ్గురు పోలీసులపై వేటు

**బనశంకరి:** ఐదు రోజుల క్రితం ఎలక్ట్రానిక్ సిటీ ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన రేవ్‌పార్టీకి సంబంధించి హెబ్బగోడి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐతో పాటు ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రేవ్‌పార్టీ పట్ల సమాచారం సేకరించడంలో విఫలమయ్యారనే ఆరోపణలతో హెబ్బగోడి ఏఎస్ఐ నారాయణస్వామి, కానిస్టేబుళ్లు గిరీశ్, దేవరాజులను శుక్రవారం గ్రామాంతర ఎస్పీ మల్లికార్జున బాలదండి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇదే సందర్భంగా డీఎస్పీ, సీఐలకు ఎస్పీ చార్జ్ మెమో ఇచ్చారు.

### ప్రజ్వల్‌కు విదేశాంగ శాఖ నోటీస్

**బనశంకరి:** పెన్‌డ్రైవ్ కేసు అనంతరం విదేశాల్లో తలదాచుకున్న ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు శుక్రవారం విదేశాంగశాఖ షోకాజ్ నోటీస్ జారీ చేసింది. మీ పాస్‌పోర్టును ఎందుకు రద్దు చేయరాదని ప్రశ్నిస్తూ త్వరలో సమాధానం ఇవ్వాలని సూచించింది. సిట్ లేఖ రాసిన నేపథ్యంలో పాస్‌పోర్టు రద్దు ప్రక్రియ ప్రారంభించిన విదేశాంగశాఖ మీపై కేసు నమోదైంది. కోర్టు కూడా అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. కేసు నమోదైన వెంటనే పాస్‌పోర్టుతో విదేశాలకు వెళ్లారు. విచారణ నుంచి తప్పించుకోవడానికి మీరు పాస్‌పోర్టు దుర్వినియోగానికి పాల్పడి విదేశాలకు పారిపోయారు. మీ పాస్‌పోర్టు ఎందుకు రద్దు చేయరాదని అడిగింది. దీనిపై వివరాలతో నిర్దిష్ట అవధిలో ఇవ్వాలని ఒకవేళ సమాచారం సంతృప్తికరంగా లేకపోతే పాస్‌పోర్టు రద్దు చేస్తామని విదేశాంగశాఖ నోటీస్‌లో హెచ్చరించింది.

# భక్తబృందాలపై మృత్యుపంజా

- తిరుమలకు వెళ్తుండగా వంతెన పైనుంచి బోల్తాపడిన కారు
- హావేరి జిల్లాలో ఘటన
- నలుగురు మృతి
- ధర్మస్థల వెళ్లి వస్తుండగా కారును ఢీకొన్న లారీ
- నలుగురు మృతి
- చిక్కమగళూరు జిల్లాలో ఘటన



బోల్తాపడిన కారు



రాణిబెన్నూరు బైపాస్ వద్ద వంతెన పైనుంచి పడి నుజ్జయిన కారు



కొట్టిగెహార వద్ద నుజ్జయిన ఓమినీ వాహనం

**సాక్షి, బళ్లారి/ యశవంతపుర:** దేవుడి కరుణాకటాక్షాల కోసం వెళ్తుంటే మృత్యువు ఎదురైంది. దేవుడిని దర్శించుకొని ప్రసాదాలు తీసుకొని తిరుగు ప్రయాణమైన భక్త బృందంపై మృత్యువు కసిగా కాటేసింది. రెండు రోడ్డు ప్రమాదాల్లో 8 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. హావేరి జిల్లా కేంద్రానికి చెందిన 10 మంది భక్తులు కారులో శుక్రవారం వేకువజామున తిరుమల తిరుపతికి బయల్దేరారు. రాణిబెన్నూరు హలగేరి బైపాస్ వద్దకు రాగానే అతి వేగం కారణంగా కారు అదుపు తప్పి వంతెనపైనుంచి రోడ్డుపైకి పడిపోయింది. వాహనం నుజ్జునుజ్జు కావడంతో సురేశ్ వీరప్ప జాడి(45), ఐశ్వర్య ఈరప్ప బార్కి(22), చేతన ప్రభురాజ సమగండి(7), పవిత్ర ప్రభురాజ సమగండి(28) అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నవీరప్ప జాడి, సావిత్రి జాడి, విశాళ హొన్నప్ప బార్కి, హొన్నొప్ప నీలప్ప బార్కి, ప్రభురాజ ఈరప్ప సమగండి, గీతా హొన్నప్ప బార్కిలు గాయపడ్డారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతులను, క్షతగాత్రులను బయటకు తీశారు. క్షతగాత్రులను దావణగెరె ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**మూడిగెరె వద్ద...**

చిక్కమగళూరు జిల్లా మూడిగెరెకి సమీపంలోని చార్మడి ఘాట్ సమీపంలోని బణకల్, కొట్టిగేహర రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. చిత్రదుర్గ జిల్లా హొళల్కెరె తాలూకా చిక్కజాజూరు సమీపంలోని చెన్నపట్టణ గ్రామానికి చెందిన 9 మంది ఓమ్ని కారులో ధర్మస్థలం వెళ్లారు. స్వామివారిని దర్శించుకొని శుక్రవారం మధ్యాహ్నం తిరిగి వెళ్తుండగా మూడిగెరె సమీపంలో మూడిగెరె నుంచి కొట్టిగెహారకు వెళ్తున్న మెస్కాం లారీ ఎదురైంది. ఈక్రమంలో లారీ, కారు ఢీకొన్నాయి. అదే సమయంలో ఏడుమందితో ప్రయాణిస్తున్న ఆల్టో కారు వచ్చి ముందున్న కారును ఢీకొంది. ప్రమాదంలో ఓమ్ని కారులోని హంపయ్య(65), ప్రేమ(58), మంజయ్య(60), ప్రభాకర్(45) మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మూడిగెరె పోలీసులు వచ్చి క్షతగాత్రులను మంగళూరుకు తరలించారు. ఆల్టో కారులోని వారికి ఎలాంటి గాయాలు కాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.



మరణించిన చేతన్





రాణిబెన్నూరు వద్ద ప్రమాద స్థలంలో మృతదేహాలు

### కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి జల సమాధి



మృతులు మాలతేష్, అభయ్(ఫైల్)

**శివమొగ్గ :** కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి ఇద్దరు ఫారంపాండ్‌లో పడి మృతి చెందారు. ఈ ఘటన శివమొగ్గ తాలూకా కుంసి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెన్నళ్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాలతేష్ (28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను అశోక్ అనే రైతుకు చెందిన పొలంలో దుక్కి దున్నేందుకు వెళ్లాడు. అతనితోపాటు గ్రామానికి చెందిన మహేష్‌కుమారుడు అభయ్ (16) కూడా మాలతేష్‌తో కలిసి వెళ్లాడు. దుక్కి పనులు పూర్తయిన తర్వాత సమీపంలోని ఫారంపాండ్‌లో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లారు. అభయ్ కాలుజారి నీటిలో పడిపోయాడు. రక్షించేందుకు మాలతేష్ కూడా నీటిలోకి దిగాడు. బయటకు రాలేక ఇద్దరూ నీటిలో మునిగి మృతి చెందారు. కుంసి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### ప్యాలెస్ పాలక మండలి కార్యాలయంపై లోకాయుక్త దాడి

- రూ.4.10 లక్షలు స్వాధీనం

**మైసూరు :** మైసూరు నగరంలో ఉన్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన అంబా విలాస్ ప్యాలెస్‌లో ఉన్న మైసూరు ప్యాలెస్ పరిపాలక మండలి కార్యాలయంపై లోకాయుక్త అధికారులు గురువారం రాత్రి దాడి చేశారు. ఎలాంటి దాఖలాలు లేని రూ.4.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రవేశం టికెట్, పార్కింగ్ ఫీజు వసూలులో అనేక అక్రమాలు జరిగినట్లు వాహనదారులు, పర్యాటకుల నుంచి ఫిర్యాదులు అందడంతో లోకాయుక్త ఎస్పీ సజిత్ ఆధ్వర్యంలో మైసూరు, చామరాజనగర, మండ్య, మడికేరి లోకాయుక్త డీఎస్పీలు, సిబ్బంది దాడులు నిర్వహించి సోదాలు చేశారు.

### జనావాసంలోకి అపురూప అతిథి



దొడ్డ పట్టణంలో కనిపించిన పెంగోలియన్

**దొడ్డబళ్లాపురం:** దొడ్డ పట్టణ శివారులోని ఫైర్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఉదయం అపురూప అతిథి దర్శనమిచ్చింది. సాధారణంగా ఎక్కడా అంతగా కనిపించని పెంగోలియన్ కనిపించడంతో అది ఏ జాతికి చెందినదో తెలీక స్థానికులు తికమకపడ్డారు. ఇది ఆఫ్రికాలో ఎక్కువగా నివసిస్తుంది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడకు తరలి వచ్చారు. అనంతరం పెంగోలియన్‌ను అధికారులు సురక్షితంగా అక్కడి నుంచి తరలించారు.

## పసందైన పనస.. మామిడి మాధుర్యం

**మైసూరు :** మైసూరులోని కుప్పణ్ణ పార్క్‌లో ఉద్యానవన శాఖ, మైసూరు జెడ్పీ ఆధ్వర్యంలో మామిడి, పనస మేళాకు స్పందన లభించింది. ఈమేళాను శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ కేవీ రాజేంద్ర, జెడ్పీ సీఈఓ కే.ఎం. గాయత్రి ప్రారంభించారు. రామనగర, మండ్య, మైసూరు, చామరాజనగర జిల్లాల మామిడి, పనస రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొచ్చి ప్రదర్శనలో ఉంచారు. నగరవాసులు పెద్ద సంఖ్యలో హాజరై మామిడి, పనస పండ్లను కొనుగోలు చేశారు. ఈప్రదర్శన మూడు రోజులపాటు ఉంటుంది.



ఏమి తీపిదనం: మామిడిని కొంటున్న దృశ్యం



పనస కాయలను కొంటున్న దృశ్యం

## రాజధాని సమస్యలు పట్టవా ?

- 28న భారీ ఎత్తున ఆందోళనలు : బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర

**శివాజీనగర:** రాజధాని బెంగళూరులో సమస్యలు పేరుకుపోయాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ధ్వజమెత్తారు. శుక్రవారం మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయం జగన్నాథ భవన్‌లో బెంగళూరు సమస్యలపై చర్చల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బెంగళూరు నగరంలో సమస్యలకు పరిష్కారం కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి వార్డులో బీజేపీ పోరాటాన్ని చేపడుతోందని, అందులో భాగంగా ఈనెల 28న భారీ ఎత్తున ఆందోళన చేపట్టనున్నామని చెప్పారు. శుక్రవారం నగర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించామని, ఐటీ నగరిలో జరుగుతున్న అవ్యవస్థలపై చర్చించామన్నారు. కేవలం రెండు రోజుల వర్షానికే బెంగళూరులోని రోడ్లు వాహనాలు తిరగకుండా బ్లాక్ అయ్యాయి. నగరంలో అధిక పన్ను చెల్లించే ప్రజలున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత బెంగళూరు నగరాభివృద్ధికి ఒక్క రూపాయిని కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రోడ్లు అన్ని గుంతలమయంగా మారాయి. చెత్త తొలగింపు అస్తవ్యస్తంగా మారింది. బెంగళూరు నగర అభివృద్ధి గురించి ఎవరూ కూడా యోచించకపోవటం దురదృష్టకరమని విజయేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## దగ్గి ప్రాణాలతో బయటపడిన పసికందు

- బాగల్‌కోటె జిల్లా ఇలకల్ పట్టణంలో ఘటన

**యశవంతపుర:** తీవ్ర అనారోగ్యానికి గురైన 13 నెలల పసికందు మృతి చెందినట్లు భావించి కుటుంబ సభ్యులు కన్నీటి మధ్య అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా ఒక్కసారిగా బాలికలో చలనం వచ్చింది. ఈ ఘటన బాగలకోట జిల్లా ఇలకల్ పట్టణంలో జరిగింది. ద్యామణ్ణ, నీలమ్మ దంపతులకు 13 నెలల కుమార్తె ఉంది. ఊపిరి ఆడక ఇబ్బంది పడుతుండటంతో ఐదు రోజుల క్రితం బాగలకోటెలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అవయవాలు దెబ్బతిన్నాయని, పరిస్థితి విషమంగా ఉందని, చిన్నారి బతకటం కష్టమని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు పసికందును తీసుకొని వాహనంలో స్వగ్రామానికి బయల్దేరారు. మార్గం మధ్యలో శ్వాస లేకపోవడంతో చిన్నారి చనిపోయిందని భావించారు. బంధువులకు సమాచారం ఇచ్చారు. ఇంటికి వెళ్లి అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా పసికందు ఒక్కసారిగా గట్టిగా దగ్గింది. బాలికలో చలనం రావడంతో కుటుంబ సభ్యులు బాలికను చేతుల్లోకి తీసుకొని ఆనందంలో మునిగిపోయారు. అప్పటివరకు విషాదం కమ్ముకున్న ఆ ఇంటిలో ఒక్కసారిగా ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి.

### పెట్టుబడి పేరుతో పారిశ్రామికవేత్తకు రూ.1.88 కోట్ల టోకరా

**బనశంకరి:** తాము చెప్పిన కంపెనీలలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారు. తాజాగా ఓ పారిశ్రామిక వేత్త రూ.1.88 కోట్లు వంచనకు గురయ్యాడు. ఇతని ఫిర్యాదు మేరకు కేంద్ర సీఈఎన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శాంతినగరకు చెందిన 45 ఏళ్ల పారిశ్రామికవేత్త ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫేస్‌బుక్‌లో షేరు, ఈక్విటీల్లో పెట్టుబడి ప్రకటన చూశాడు. అనంతరం అందులో మొబైల్‌కు కాల్ చేయగా ఓ మహిళ ఫోన్ తీసి వాట్సాప్ కాల్‌లో మాట్లాడాలని సలహా ఇచ్చింది. ఆ పారిశ్రామికోత్తకు షేర్, ఈక్విటీల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. ఈమె మాటలను నమ్మిన పారిశ్రామికవేత్త వారు ఇచ్చిన వివిధ బ్యాంకు ఖాతాలకు దశల వారీగా రూ.1.88 కోట్ల నగదు జమ చేశాడు. పారిశ్రామికవేత్త లాభాల గురించి అడగ్గా మరింత పెట్టుబడి పెట్టాలని సూచించారు. దీంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కలబుర్గిలో దర్గా షరీఫ్ ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. శుక్రవారం దర్గా వద్ద రద్దీ దృశ్యం.

# ఖాతాలపై నకిలీ యాప్స్‌తో కన్ను

- అలాంటి యాప్స్ డౌన్‌లోడ్ చేస్తే అంతే సంగతి
- బ్యాంకు అకౌంట్ నుంచి నగదు గల్లంతే
- సైబర్ క్రైం మోసాల్లో రాష్ట్రం రెండో స్థానం
- మహానగరాల్లో బెంగళూరు మొదటి స్థానం
- జాగ్రత్తగా ఉండాలంటున్న సైబర్ నిపుణులు



**బనశంకరి:** సాంకేతికత రోజురోజుకు పెరుగుతోంది. అనేక అవసరాలను ఒకే ఒక స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇంటి నుంచే తీర్చుకుంటున్నాం. ఎక్కువగా బ్యాంకు సేవలకు, లావాదేవీలకు స్మార్ట్‌ఫోన్‌ను వినియోగించుకుంటున్నాం. ఇందు కోసం అనేక యాప్స్ అందుబాటులో ఉన్నాయి. ఇక్కడే సైబర్ కేటుగాళ్లు బ్యాంకు వినియోగదారులపై పంజా విసురుతున్నారు. నకిలీ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చేసి నగదు కొల్లగొడుతున్నారు.

కెనరా, ఐసీఐసీఐ ఇలా దేశంలోని ప్రముఖ బ్యాంకుల పేరుతో సైబర్ కేటుగాళ్లు వంచనకు పాల్పడుతున్నారు.అనుమానాస్పద యాప్స్‌ను మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవద్దని బ్యాంకులు, సైబర్‌క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ మోసపోతే తక్షణం సైబర్‌పోర్టల్ లేదా సైబర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సలహా ఇస్తున్నారు.

**సైబర్‌నేరాల్లో రాష్ట్రం నెంబర్–2**

ఎన్‌సీఆర్‌బీ వివరాల ప్రకారం 2023లో దేశంలోనే సైబర్‌నేరాలు 24 శాతం పెరిగాయి. సైబర్‌క్రైంలో కర్ణాటక రెండో స్థానంలో ఉంది. దేశంలోని మహానగరాలతో పోలిస్తే బెంగళూరు నగరం నెంబర్‌వన్ స్థానంలో నిలిచింది. పోలీసులు ఎంతజాగృతం చేసినప్పటికీ ప్రజలు సైబర్ వంచకుల వలలో పడి డబ్బు పోగొట్టుకుంటున్నారు. భారతీయ సైబర్ నేరాల సమన్వయకేంద్రం (ఐసీసీసీసీ) ఇచ్చిన సమాచారం ఆధారంగా 2021 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు దేశంలో రూ.10,300 కోట్లను సైబర్ నేరగాళ్లు లూటీచేశారు. ఇందులో సైబర్‌క్రైంకు గురైన తక్షణం ఫిర్యాదు చేసినప్పటికీ 10 శాతం నగదు మాత్రమే బ్యాంకు అకౌంట్లలో ఫ్రీజ్‌చేసి న్యాయ ప్రక్రియ ద్వారా బాధితులకు డబ్బు వెనక్కి ఇస్తున్నారు.

**1930కు ఫోన్ చేయండి**

సైబర్ నేరాలబారినపడితే తక్షణం నేషనల్ సైబర్‌క్రైం రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ) సహాయవాణి 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. ఫోన్ కాల్ ఉచితం కాగా స్థానిక భాషలో సమాచారం అందించాలి. తదనంతరం ఏంచేయాలనేదాని గురించి సహాయవాణి సిబ్బంది తెలియజేస్తారు.

యాప్ లింక్ పంపి స్మార్ట్‌ఫోన్‌ను హ్యాక్ చేసే సైబర్ వంచకులు మొబైల్ నెంబరు ఫార్వర్డ్ చేసి ఓటీపీ తెలుసుకొని అకౌంట్ నుంచి నగదు కాజేస్తారు. ఈ నేపథ్యంలో బ్యాంకు ఖాతాకు లింక్ అయిన ఫోన్ నెంబరు దేనికైనా ఫార్వర్డ్ చేశామా అని తెలుసుకోవడానికి #67#కు డయల్‌చేయాలి. ఫార్వర్డ్ అయినట్లయితే మీకు వచ్చే ఓటీపీలు సైబర్ వంచకులకు కచ్చితంగా వెళతాయి. ఫార్వర్డ్ అయితే తక్షణం #002# నెంబర్‌కు డయల్ చేస్తే ఏయే సేవలకు ఫార్వర్డ్ అయింది ఆ సర్వీస్‌లు డిసేబల్ కానున్నాయని సైబర్ పోలీసులు తెలిపారు.

**పోలీసుల సలహాలు**

- అనుమానాస్పద మొబైల్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోరాదు
- ఇన్‌స్టాల్ చేస్తే తక్షణం మొబైల్ ఇంటర్నెట్ ఆఫ్ చేయాలి
- మొబైల్ సెట్టింగ్స్‌లో యాప్ మేనేజ్‌మెంట్, యాప్స్ డౌన్‌లోడ్ పరిశీలించాలి
- గుర్తుతెలియని ఫైల్స్ ఉంటే తక్షణం డిలిట్‌చేయాలి.

#67# కు డయల్ చేసి మొబైల్ నెంబరును సురక్షితంగా ఉంచుకోవాలి.

**పాస్‌వర్డ్ భద్రంగా ఉండాలి**

బ్యాంకు ఖాతా హ్యాక్‌కు గురవ్వకుండా బలమైన పాస్‌వర్డ్ సెట్ చేసుకోవాలి

అనేక బ్యాంకు ఖాతాలు ఉంటే అన్నింటికీ ఒకే పాస్‌వర్డ్ వినియోగించవద్దు

ప్రతి మూడు నెలలకు ఒకసారి పాస్‌వర్డ్ మార్చాలి

**ఎలా వంచనకు పాల్పడతారంటే...**

- పేరుపొందిన బ్యాంకుల లోగో సృష్టించి బ్యాంకింగ్ యాప్స్ సృష్టిస్తారు
- కస్టమర్ సర్వీస్ పాయింట్ అనే నకిలీ ఏపీకే సృష్టిస్తారు
- వాట్సాప్, టెలిగ్రాం ద్వారా నకిలీ ఏపీకే ఫైల్ పంపిస్తారు
- మీ మొబైల్‌లో యాప్ ఇన్‌స్టాల్ చేస్తారు
- ఆధార్ కేవైసీ, పాన్‌కార్డు వివరాలు, నెంబర్ అప్‌డేట్‌చేస్తారు.
- మొబైల్‌లో యాప్ ఇన్‌స్టాల్ కాగానే అకౌంటు వివరాలు తీసుకుంటారు
- నేరుగా అకౌంట్‌లోని నగదు వంచకులు తమ అకౌంట్‌కు జమ చేసుకుంటారు.

## క్లుప్తంగా



ముఖ్యమంత్రి సిద్దరామయ్య శుక్రవారం మైసూరులోని ప్రఖ్యాత మైలారి హోటల్లో దోసెను ఆరగించారు. ఆయనతో పాటు సహచరులు కూడా అల్పాహారం తీసుకున్నారు

### శ్రీలంక పర్యాటకుడు అరెస్ట్

బనశంకరి: 8 ఏళ్లుగా నకిలీ ఆధారాలతో బెంగళూరులో నివాసం ఉంటున్న శ్రీలంకకు చెందిన పర్యాటకుడిని శుక్రవారం సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరు రాచేనహళ్లి అపార్టుమెంటులో నివాసం ఉండే శరణ్‌కుమార్‌కాళీదాస్ అలియాస్ ఉమేశ్‌బాల రవీంద్రన్ పట్టుబడిన వ్యక్తి. ఇతడి వద్ద నుంచి కంట్రీమేడ్ పిస్టోల్, నకిలీ ఆధార్‌కార్డు, డ్రైవింగ్‌లైసెన్సు, డెబిట్, క్రెడిట్‌కార్డులు, బ్యాకింగ్ రికార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2016లో అక్రమమార్గం ద్వారా భారత్‌కు చేరుకున్న శరణ్‌కుమార్‌కాళీదాస్ బెంగళూరు కనకపురరోడ్డులో నివాసం ఉంటున్నాడు. 2021లో భార్య ముగ్గురు పిల్లలను భారత్‌కు పిలిపించుకుని రాచేనహళ్లి అపార్టుమెంటులో ఉంటున్నాడు. ఇతడి కార్యకలాపాలపై నిఘాపెట్టిన సీసీబీ పోలీసులు ఈనెల 20 తేదీన అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. భర్త అరెస్ట్ కావడంతో ముగ్గురు పిల్లలతో భారత్ నుంచి పారిపోయే ప్రయత్నంలో అతడి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### దత్త పీఠంలో పూజలు

మైసూరు: మైసూరు నగరంలోని ఊటీ రోడ్డులో ఉన్న శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలో శ్రీదత్త వెంకటేశ్వర క్షేత్రం వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా స్వామీజీ కుంభాభిషేకం నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. పంటలు బాగా పండి ప్రజలు సంతోషంగా ఉండాలని పూజలు చేసినట్లు గణపతి సచ్చిదానంద స్వామీజీ చెప్పారు.

### తప్పు చేసినవారికి శిక్ష పడాల్సిందే

మండ్య: ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అనేక మంది మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన పెన్‌డ్రైవ్ ఎలా బయటకు వచ్చిందంటూ జేడీఎస్ నాయకులు నానా యాగీ చేయడం తగదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి మండిపడ్డారు. ప్రజ్వల్ ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేశారన్నారు. ప్రజ్వల్‌ను కేసు నుంచి తప్పించేందుకు బీజేపీ,జేడీఎస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదన్నారు.

### పిడుగు పడి యువకుడి మృతి



రక్షిత్ (ఫైల్)

యశవంతపుర: పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి కాపు తాలూకా శిర్వా పంచాయతీలో చోటుచేసుకుంది. శిర్వ పంచాయతీ మాణిబెట్టుకు చెందిన రక్షిత్ పూజారి (20) గురువారం సాయంత్రం స్నానం చేయడానికి మరుగుదొడ్డి వద్ద వేచి ఉండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు వచ్చి పిడుగు పడింది. దీంతో అక్కడే ఉన్న రక్షిత్ గాయపడ్డాడు. హుటాహుటిన అతన్ని మణిపాల్ కేఎంసీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడు ఇక్కడి కళాశాలలో బీసీఏ చదువుతున్నారు.

### అతిథి ఉపాధ్యాయులను కొనసాగించరూ..

రాయచూరు రూరల్: జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న తమను వచ్చే 2024-25వ విద్యా సంవత్సరంలో కొనసాగించాలని అతిథి ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాలూకా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంఘం అధ్యక్షుడు నరసింహులు మాట్లాడారు. గత 2023-24వ విద్యా సంవత్సరంలో అతిథి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించామని, తిరిగి ఆ పోస్టులను తమకు కేటాయించాలని కోరుతూ తాలూకా విద్యాశాఖాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, ప్రశాంత్, లక్ష్మి, భీమన్న, తిమ్మప్ప, రవి, మల్లికార్జునలున్నారు.

### వైభవంగా వేంకటేశ్వర రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న బసనగౌడ తదితరులు

రాయచూరు రూరల్: తాలూకాలోని దిన్నిలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ రథోత్సవం వైభవంగా ముగిసింది. గురువారం శాసన సభ్యుడు బసనగౌడ దద్దల్ ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవ వేడుక జరిపారు.

# జిల్లాస్పత్రిలో ఇష్టారాజ్యంగా పార్కింగ్

- అంబులెన్స్‌ల రాకపోకలకూ తప్పని ఇబ్బందులు
- ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్న వాహనదారులు



ఆస్పత్రి ప్రాంగణంలో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

కోలారు: నగరంలోని ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రిలో ద్విచక్రవాహదారులు తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా నిలుపుతుండడం వల్ల పార్కింగ్ స్థలంలో తీవ్ర అవ్యవస్థ నెలకొంది. ద్విచక్రవాహనాలే కాకుండా ఆటోలు, కార్లను కూడా ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. పార్కింగ్ అవ్యవస్థపై నగర ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఆస్పత్రికి ప్రతి నిత్యం నగరంతో పాటు జిల్లాలోని అన్ని తాలూకాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు, వారి సంబంధీకులు వస్తుంటారు. ఆస్పత్రి ప్రాంగణంలో పార్కింగ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల రోడ్డుపైనే అడ్డగోలుగా వాహనాలు పార్క్ చేస్తున్నారు. ఆస్పత్రి వద్ద విధులు నిర్వహిస్తున్న గృహరక్షక దళ సిబ్బంది ఎంత చెప్పినా వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. పాత కట్టడం నుంచి కొత్త కట్టడం వరకు ద్విచక్రవాహనాలను అస్తవ్యస్తంగా నిలుపుతున్నారు. దీని వల్ల అత్యవర సమయాల్లో సంచరించే అంబులెన్స్‌లకు కూడా ఇబ్బంది కలుగుతోంది. వర్షం వచ్చిందంటే దుకాణాల ముందు బురద ఎక్కువై ఈ సమయంలో అక్కడ వాహనాలు నిలపలేక వాహనదారులు రోడ్డుపై వాహనాలు నిలిపి వెళుతున్నారు. దీని వల్ల పార్కింగ్ సమస్య మరింత తీవ్రం అవుతోంది. రోడ్డుపై నిలిపిన ద్విచక్రవాహన యజమానులను హోం గార్డులు పక్కకు తీయాలని చెబితే పైఅధికారులకు ఫోన్ చేయాలా? అంటూ బెదిరిస్తున్నారు. దీని వల్ల హోం గార్డులు అసహాయక స్థితిలో ఉంటూ ఏమీ చేయలేకపోతున్నారు. ఆస్పత్రి వద్ద హోం గార్డులను కాకుండా పోలీసులను నియమించాలని, అప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని నగర వాసులు అంటున్నారు.

**ఆస్పత్రి వెనుక పార్కింగ్‌కు స్థలావకాశం**

వాహనాలను నిలడానికి ఆస్పత్రి వెనుక భాగంలో స్థలం ఉన్నా అక్కడ ఎవరూ వాహనాలు నిలపడం లేదు. అక్కడ వాహనాలు నిలిపి వెనుక నుంచే ఆస్పత్రిలోకి రావడానికి అవకాశం ఉన్నా ఎవరూ అలా చేయడం లేదు. ఆస్పత్రి కాంపౌండు ముందు భాగంలో పార్కింగ్ చేయడానికి అవకాశం ఉన్నా అక్కడ నిలపకుండా నేరుగా ఆస్పత్రి ఆవరణ లోపలికి వచ్చి ఆస్పత్రి ముఖ ద్వారం వద్ద నిలుపుతున్నారు. ఎస్ఎన్ఆర్ ఆస్పత్రి వద్ద రోజురోజుకు తీవ్రం అవుతున్న పార్కింగ్ సమస్యపై సంబంధిత అధికారులు, పోలీసులు దృష్టి పెట్టి పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

## ప్రజ్వల్ కేసు విషయంలో సర్కార్ కుట్ర

- ఆర్.అశోక్ తీవ్ర ఆరోపణ

శివాజీనగర: ప్రజ్వల్ రేవణ్ణ విదేశాలకు వెళ్లేలా ప్రభుత్వం పథకం ప్రకారం వ్యవహరించిందని విపక్ష నేత ఆర్.అశోక్ ఆరోపించారు. ప్రజ్వల్‌తో అశోక్ మాట్లాడి ఉంటారని సీఎం సిద్దరామయ్య గురువారం చేసిన వ్యాఖ్యలపై ఆర్.అశోక్ పైవిధంగా మాట్లాడారు. ఓటు వేసి వచ్చిన తర్వాత ప్రజ్వల్‌ను అరెస్ట్ చేయకుండా ఎందుకు జాప్యం చేశారని మండిపడ్డారు. ప్రధాని మోదీపై ఆరోపణలు చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజ్వల్‌ను విదేశాలకు పంపించిందని ఆరోపించారు. ప్రజ్వల్ విదేశాలకు వెళ్లే ముందు తనతో మాట్లాడి ఉంటే తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. సిద్దరామయ్య ఫోన్ కూడా తనిఖీ చేస్తే ప్రజ్వల్ ఎవరెవరితో మాట్లాడారో తెలుస్తుందన్నారు. ఇందు కోసమే కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

### పాలికె కమిషనర్ పేరుతో నకిలీ వాట్సాప్

బనశంకరి: బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ పేరుతో నకిలీ వాట్సాప్ సృష్టించిన అల్లరిమూకలు అధికారులకు తప్పుడు సమాచారం అందిస్తున్నారు. నకిలీ నెంబరుతో మెసేజ్‌లు పంపించేవారు. ఈ నేపథ్యంలో కమిషనర్ తుషార్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పాలికె అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### జీటీటీసీలో కొత్త కోర్సులు

తుమకూరు: తుమకూరులోని గవర్నమెంట్ టూల్స్ అండ్ ట్రైనింగ్(జీటీటీసీ) సెంటర్‌లో కొత్తగా డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ మెకట్రానిక్స్ కోర్సులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ అశ్విన్‌కుమార్ ఎన్.సోమణ్ణ తెలిపారు. మూడు సంవత్సరాల తరగతులు, ఏడాది పరిశ్రమల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు.ఈ కోర్సులు చేసినవారికి ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు.

### కులాంతర వివాహాలకు సంపూర్ణ మద్దతు

మైసూరు: ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన కళాశాల రోజులను గుర్తు చేసుకున్నారు. ఆరోజుల్లో స్నేహితురాలిని ప్రేమించానని, అయితే ఆ యువతి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించలేదని అన్నారు. మైసూరులోని ప్రైవేటు కల్యాణమండపంలో శుక్రవారం జరిగిన వివాహ సంబంధాల వేదిక కార్యక్రమంలో పాల్గొని వెబ్‌సైట్‌ను ప్రారంభించి మాట్లాడారు. కులాంతర వివాహం చేసుకోవాలని తాను కూడా భావించినట్లు తెలిపారు. అయితే ఆ కల నెరవేరలేదన్నారు. కులాంతర వివాహాలకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు.

## యువతి హత్య కేసులో మైనర్ అరెస్ట్

బనశంకరి: సుబ్రమణ్యపుర పోలీస్‌స్టేషన్ పరిధిలోని బృందావన లేఔట్‌లో యువతి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. విద్యార్థిని ప్రబుద్దా (19)ను కేవలం రూ.2 వేల కోసం ఆమె సోదరుడి స్నేహితుడే దారుణంగా హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. ఈనెల 15న ప్రబుద్దా గొంతు, చేతులు కోసిన స్థితిలో ఇంటి బాత్‌రూమ్ శవమై కనిపించింది. మృతురాలి తల్లి సౌమ్యా ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన సుబ్రమణ్యపుర పోలీసులు హత్యకు పాల్పడిన మైనర్‌ను అరెస్ట్ చేశారు. హంతకుడు.. ప్రబుద్దా సోదరుడికి స్నేహితుడు. ఇంటికి తరచూ వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో మరో స్నేహితుడి కళ్ల అద్దాలు విరిగిపోవడంతో వాటిని మరమ్మతు చేయడానికి డబ్బు అవసరం ఏర్పడింది. ఓ రోజు ప్రబుద్ద ఇంటికి వచ్చిన సమయంలో ఆమె పర్సులోఉన్న రూ. 2 వేలు కాజేశాడు. విషయం తెలుసుకున్న ప్రబుద్దా డబ్బులు ఇవ్వాలని అడిగింది. ఈనెల 15న మధ్యాహ్నం ప్రబుద్దా ఒక్కటే ఇంట్లో ఉండగా మైనర్ ఇంటికి వచ్చాడు. క్షమించమని ఆమె కాళ్లపై పడ్డాడు. ఈ క్రమంలో ప్రబుద్ద స్పృహ కోల్పోయింది. ఇదే అదునుగా భావించి ఆమె గొంతు కోసి హత్య చేసి ఇంటి టెరస్‌పై నుంచి ఉడాయించాడు. కేసు నమోదు చేసుకున్న సుబ్రమణ్యపుర పోలీసులు సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు బాల మందిరానికి అప్పగించామని దక్షిణ డీసీపీ లోకేశ్ తెలిపారు.

## పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

- దివ్యాంగురాలి కృషిని అభినందించిన వీవీఎస్ లక్ష్మణ్

శివాజీనగర: హోటల్ ఏర్పాటు చేసుకొని స్వశక్తితో ఆర్థికంగా ఎదుగుతున్న దివ్యాంగురాలి కృషిని మాజీ క్రికెట్ క్రీడాకారుడు వీవీఎస్ లక్ష్మణ్ అభినందించారు. ఏదైనా సాధించాలనే పట్టుదల ఉంటే ఎంతటి కష్టాలు వచ్చినా ఎదుర్కొనవచ్చని, ఇందుకు బెంగళూరులోని కరి దోసె హోటల్ యజమాని వీణా అంబరీశ్ ఆదర్శమని అన్నారు. భరతనాట్యం కళాకారిణి వీణా 17వ సంవత్సరాల వయస్సులో బస్సు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయారు. ఓ దశలో కుంగుబాటుకు గురయ్యారు. అయితే స్వశక్తితో ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే సంకల్పంతో ఎంబీఏ చదివి ఐటీ కంపెనీలో ఉద్యోగం సాధించింది. అయితే అధిక సమయం ఒకేచోట కూర్చొని పని చేయటానికి సాధ్యపడని కారణంగా హోటల్ రంగాన్ని ఎంచుకున్నారు.కరి దోసె హోటల్ ప్రారంభించి విజయం సాధించారు. వీణా అంబరీశ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని వీవీఎస్ లక్ష్మణ్ తన ఎక్స్ ఖాతాలో సందేశాన్ని పోస్టు చేశారు. జీవితంలో ఎంత కష్టమొచ్చినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా బలంగా నిలవాలనే వీణా పట్టుదల ప్రతి ఒక్కరికి స్ఫూర్తి అని అన్నారు. ఈ పోస్టును లక్షమందికిపైగా వీక్షించారు.

## పార్లమెంట్ ఫలితాల తర్వాత స్థానిక ఎన్నికలు

మైసూరు : పార్లమెంట్ ఫలితాల అనంతరం జిల్లా పంచాయతీ, తాలుకా పంచాయతీ, బీబీఎంపీ ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మైసూరులోని శారదాదేవి నగరలో ఉన్న తన ఇంటిలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తొలుత జిల్లా పంచాయతీ నియోజకవర్గాల పునర్ విభజన, చేస్తామని ఆనంతరం రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. ప్రజ్వల్ పెన్‌డ్రైవ్ కేసు విషయంలో ఆయన మాట్లాడుతూ ప్రజ్వల్‌ను కాపాడటం కోసం మాజీ సీఎం కుమారస్వామి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ముందు ప్రజ్వల్‌ను పోలీసులకు అప్పగిస్తే విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. యతీంద్ర సిద్దరామయ్యకు పరిషత్ టికెట్ విషయంపైన సిద్దరామయ్య మాట్లాడుతూ వరుణ స్థానాన్ని తన కోసం త్యాగం చేసిన యతీంద్రకు ఎమ్మెల్సీ ఇస్తామని అధిష్టానం చెప్పిందని, అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తనకు సమ్మతమేనన్నారు.

## ఆస్పత్రి నుంచి ఖైదీ పరారీ

మైసూరు : ఆస్పత్రికి తీసుకొచ్చిన ఖైదీ పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఈఘటన మైసూరులోని కేఆర్ ఆస్పత్రిలో చోటు చేసకుంది. మైసూరు తాలూకా దాసనపుర గ్రామానికి చెందిన శివణ్ణ కుమారుడు కార్తీక్(9)ను ఇదే గ్రామానికి చెందిన జవరయ్య అనే వ్యక్తి కిడ్నాప్ చేసి అనంతరం హత్య చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడు జవరయ్యను 2021 నవంబర్ 4న అరెస్ట్ చేశారు. నిందితుడికి కోర్టు జైలు శిక్ష విధించడంతో నగరంలోని సెంట్రల్ జైలుకు తరలించారు. ఇతను అనారోగ్యానికి గురవ్వడంతో గురువారం సాయంత్రం పోలీసు బందోబస్తు మధ్య కేఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఖైదీ జవరయ్య పోలీసుల కళ్లగప్పి తప్పించుకొని ఉడాయించాడు. పోలీసుల ఖైదీ కోసం గాలింపు చేపట్టారు.

## కేఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిజాయతీ



ప్రయాణికురాలు వినూతకు నగదు బ్యాగ్ అందజేస్తున్న కేఎస్ ఆర్టీసీ డ్రైవర్ సంతోష్

మైసూరు : మహిళా ప్రయాణికురాలు పడేసుకున్న నగదు బ్యాగును కేఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ గుర్తించి సొంతదారుకి అప్పగించి నిజాయతీ చాటాడు. ఈఘటన మైసూరు జిల్లాలో జరిగింది. పిరియా పట్టణం కేఎస్ ఆర్టీసీ డిపో పరిధిలో సంతోష్ అనే వ్యక్తి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.గురువారం మైసూరు నుంచి పిరియా పట్టణం వెళ్తుండగా దట్టహళ్లికి చెందిన వినూత బస్సు ఎక్కి గమ్య స్థానంలో దిగి వెళ్లిపోయింది. అయితే హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయింది. అందరూ కిందకు దిగిన తర్వాత డ్రైవర్ బస్సును పరిశీలిస్తుండగా హ్యాండ్ బాగ్ కనిపించడంతో తెరిచి చూడగా రూ.5వేల నగదు, వివిధ బ్యాంకు కార్డులు కనిపించాయి. అందులో ఉన్న వివరాల మేరకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. డిపోమేనేజర్ సమక్షంలో డ్రైవర్ సంతోష్ బాధితురాలికి బ్యాగ్ అందజేశారు.

## కేఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు కత్తిపోట్లు

దొడ్డబళ్లాపురం: ఓవర్‌టేక్ విషయంలో ఇద్దరు డ్రైవర్ల మధ్య తలెత్తిన గొడవ కత్తిపోట్లకు దారితీసింది. ఈ ఘటన నెలమంగల తాలూకా దాబస్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగళూరు నుంచి కొప్పళకు బయలుదేరిన కేఎస్ఆర్టీసీ బస్సు శుక్రవారం తెల్లవారుజామున దాబస్‌పేట పైవంతెనపైకి చేరింది. ఆ సమయంలో క్యాంటర్ డ్రైవర్ ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించాడు. కేఎస్ ఆర్టీసీ డ్రైవర్ కూడా ఓవర్‌టేక్‌కు యత్నించాడు. దీంతో ఆగ్రహానికి గురైన క్యాంటర్ వాహనం డ్రైవర్ భాస్కర్ రెడ్డి బస్సును అడ్డగించి డ్రైవర్ శివప్ప మడివాళను కత్తితో పొడిచాడు. ప్రయాణికులు బాధితుడిని తుమకూరు జిల్లా ఆస్పత్రికి తరలించి క్యాంటర్ డ్రైవర్ భాస్కర్ రెడ్డిని పోలీసులకు అప్పగించారు. దాబస్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### రాయ్‌బరేలిలో ముమ్మర ప్రచారం

హుబ్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్‌గాంధీ తరపున ముమ్మర ప్రచారం చేసినట్లు డాక్టర్ శరణప్ప కొటగి స్వయంగా ఓ ప్రకటనలో తెలిపారు. రాహుల్‌గాంధీ భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. గత వారం రాయబరేలీకి వెళ్లిన డాక్టర్ శరణప్ప బృందం ఆయా గ్రామాలు, పట్టణాల్లో ముమ్మరంగా ప్రచారం చేపట్టామన్నారు. రాహుల్‌కు అన్ని చోట్ల ప్రజాదరణ లభిస్తోందన్నారు. గతంలో గెలిచిన సోనియాగాంధీ సేవలను అక్కడి ప్రజలు గుర్తుంచుకున్నారన్నారు. ప్రచారంలో కాంగ్రెస్ ప్రముఖులు కల్నల్ రోహిత్, మల్లికార్జున, దినేష్ రావ్, కల్నల్ సుధీర్ పాల్గొన్నారు.

### గిరీష్ సావంత్‌కు 8 రోజుల సీఐడీ కస్టడీ

హుబ్లీ: అంజలి అంబిగేర హత్య కేసు నిందితుడు విశ్వనాథ్ అలియాస్ గిరీష్ సావంత్‌ను 8 రోజుల పాటు సీఐడీ కస్టడీకి అప్పగించాలని హుబ్లీ 1వ అదనపు సెషన్స్ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కాగా విచారణ సందర్భంగా తాను తప్పు చేశానని నిందితుడు గిరీష్ కన్నీరు పెట్టుకున్నట్లు తెలిసింది. కస్టడీకి తీసుకున్న సీఐడీ బృందం నిందితుడిని నగరంలోని అతిథిగృహంలో విచారించి పలు విషయాలపై కూపీలాగారు. మైసూరుకు తీసుకెళ్లి అక్కడ అతడు పని చేస్తున్న హోటల్, బార్ అండ్ రెస్టారెంట్, అలాగే హత్య చేశాక మైసూరుకు వెళ్లిన సంబంధిత స్థలాలను పరిశీలించడానికి నేడో రేపో నిందితుడిని మైసూరుకు తీసుకెళ్లనున్నట్లు తెలిసింది.

## అన్ని జిల్లాలకు ప్రాధాన్యత కల్పిస్తా



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

బళ్లారిటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని ఏడు జిల్లాలకు ఎలాంటి తారతమ్యం లేకుండా అన్ని జిల్లాలకు ప్రాధాన్యత కల్పించడమే తన లక్ష్యం అని పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ తిరుగుబాటు నేత, స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంతవరకు గెలిచిన ఎమ్మెల్సీలందరూ కలబుర్గి, బీదర్ జిల్లాలకే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తూ తమ నిధులను ఆ జిల్లాలకే కేటాయిస్తూ మిగిలిన జిల్లాలకు తీరని అన్యాయం చేశారన్నారు. బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర, యాదగిరి జిల్లాల నుంచి కూడా ఓట్లను పొంది 5 జిల్లాలను వంచించారన్నారు. అయితే తాను పట్టభద్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గత పదేళ్లుగా గుర్తించానని, వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. తనను గెలిపిస్తే విద్యారంగం అభివృద్ధికి పెద్ద పీట వేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో ఒక్కొక్క పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ఇక అతిథి ఉపన్యాసకులు, ఉపాధ్యాయుల సమస్యలను కూడా తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి న్యాయ పోరాటానికి అండగా నిలుస్తానన్నారు. కసాప అధ్యక్షులు నిష్టిరుద్రప్ప, ఆప్ జిల్లాధ్యక్షుడు జేవీ మంజునాథ, ప్రైవేట్ పాఠశాలల సమాఖ్య అధ్యక్షుడు మరిస్వామి రెడ్డి, కొర్లగుంది కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోలారు వార్తలు...

### చెరువు పామును పట్టేసిన స్నేక్ రవి



పామును రక్షించిన స్నేక్ రవి

కోలారు: నగరంలోని జయనగర 4వ క్రాస్‌లోని ఓ ఇంట్లోకి ప్రవేశించి కలకలం సృష్టించిన చెరువు పామును స్నేక్ రవి పట్టేసి మళ్లీ చెరువులో వదిలేశాడు. అతి పొడవైన చెరువు పామును చూడగానే భయకంపితులైన ఇంట్లోని వారు వెంటనే మునేశ్వర నగర్‌కు చెందిన స్నేక్ రవికి సమాచారం అందించారు. ఇంటి వద్దకు చేరుకున్న స్నేక్ రవి చాకచక్యంగా పామును పట్టేసి సంచిలో వేసుకుని చెరువులో వదిలేశాడు. స్నేక్ రవి ఇప్పటికే దాదాపు 11 వేలకు పైగా పాములను పట్టి రక్షించాడు.

### వైభవంగా కరగ ఉత్సవం



కరగ నృత్యం చేస్తున్న పూజారి

కోలారు: నగరంలోని పీసీ కాలనీలో ఉన్న రేణుకా యల్లమ్మ దేవి పూల కరగ ఉత్సవాన్ని గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. కరగ పూజారి బీవీ మంజునాథ్ చేసిన నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గురువారం రాత్రి 8.30 గంటలకు ప్రారంభమైన కరగ ఉత్సవం భక్తుల గోవింద నామ స్మరణ మధ్యన సాగింది. దేవాలయం ముందు నిర్మించిన సుందరమైన వేదికపై కరగ పూజారి వివిధ భంగిమల్లో నిర్వహించిన నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కరగతో పాటు వివిధ దేవతల పల్లకీ ఉత్సవాన్ని కూడా నిర్వహించారు. కరగ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

### జానపద సిరి అవార్డుకు గోనాస్వామి ఎంపిక



గోనాస్వామి

కోలారు: ముంబై అంధేరి సంఘం జానపద సిరి అవార్డుకు జిల్లాకు చెందిన గాయకుడు గోనాస్వామి ఎంపికయ్యారు. తాలూకాలోని సుగటూరు గ్రామానికి చెందిన జానపద కళాకారుడు గోనాస్వామి మహారాష్ట్రలోని ముంబై నగరంలోని అంధేరి కర్ణాటక సంఘం , కన్నడ సంస్కృతి శాఖల ఆధ్వర్యంలో హొరనాడు కన్నడ సంస్కృతి సంభ్రమ-2024లో అందించే జానపద సిరి అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఈ అవార్డును వచ్చే నెల 9వ తేదీ ఆదివారం ముంబైలోని రాధాబాయి భండారి సభాగృహం బంటర భవనంలో నిర్వహించే కార్యక్రమంలో అందుకోనున్నారు.

## యువత మానవత్వాన్ని పెంచుకోవాలి

శ్రీనివాసపురం: యువ సముదాయం విద్యతో పాటుగా మానవతా విలువలను పెంచుకోవాలని, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను అలవర్చుకోవాలని ఆది చుంచనగిరి చిక్కబళ్లాపుర శాఖా మఠం మంగళానంద స్వామీజీ తెలిపారు. శుక్రవారం తాలూకాలోని భైరవేశ్వర విద్యా నికేతన ప్రాంగణంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కళాశాల నూతన గదుల నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో కూడా ప్రతిభావంతులైన ఎంతో మందిని గుర్తించి వారి ప్రతిభకు తగ్గట్టుగా ప్రోత్సహించాలన్నారు. బీజీఎస్ విద్యా సంస్థ గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహిస్తోందన్నారు. 10 నెలల్లోగా పనులను పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద కళాశాలలు లేవు. బీజీఎస్ విద్యా సంస్థ కోట్లు వెచ్చించి ఇక్కడ విద్యా సంస్థ నెలకొల్పడం ఎంతో సంతోషించదగిన విషయం, ఈ ప్రాంత విద్యార్థులకు ఇది ఎంతో అనుకూలమన్నారు. చిక్కబళ్లాపుర శాఖ భైరవేశ్వర విద్యానికేతన విద్యా మండలి పాలనాధికారి ఎస్.శివరాఘువరెడ్డి, ఒక్కలిగుల సంఘం తాలూకా అధ్యక్షుడు వేణుగోపాల రెడ్డి, భైరవేశ్వర విద్యా నికేతన విద్యా సంస్థ డైరెక్టర్ ఎ.వెంకట రెడ్డి పాల్గొన్నారు.

## ప్రేమ, విశ్వాసమే దివ్యౌషధం

కోలారు: మనోవ్యాకులత లేదా వికల్పత అనే స్కిజోఫ్రీనియాతో బాధపడే వారికి ప్రేమ, విశ్వాసమే ఉత్తమ చికిత్స అని జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్య కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్. హొసమని తెలిపారు. శుక్రవారం నిర్వహించిన న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థులు పొగాకు, గుట్కా, గంజాయి, మద్యం, ధూమపానం తదితర దురలవాట్లకు బానిస కాకుండా దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఒత్తిడి లేని జీవితాన్ని అనుభవించడం ద్వారా ఉత్తమ ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. ఎవరైనా మానసిక ఒత్తిడికి లోనైతే వెంటనే మానసిక వైద్యుడిని సంప్రదించి తగిన వైద్యం పొంది ఆరోగ్యవంతులు కావాలన్నారు. డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ ప్రతియేటా మే 24న నిర్వహిస్తున్న ప్రపంచ స్కిజోఫ్రీనియా దినోత్సవం ద్వారా ప్రజలకు మానసిక ఆరోగ్యంపై తగిన అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మానసిక అస్వస్థులకు సరైన సమయంలో చికిత్స అందిస్తే వారు అందరిలా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య అధికారి డాక్టర్ నారాయణస్వామి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మునేగౌడ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఎరువుల దుకాణాలపై చర్యలేవీ?

కోలారు: జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనగా రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయించి మోసగిస్తున్న ప్రైవేటు దుకాణాల యజమానులపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం పదాధికారులు డిమాండ్ చేశారు. వారు ఈమేరకు శుక్రవారం ముళబాగిలు వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు, మందులు తగినంత నిల్వ ఉన్నాయని చెబుతున్న ప్రభుత్వం రైతులకు విత్తనాలు వేసే సమయానికి కృత్రిమ కొరతను సృష్టించి రైతులు ప్రైవేటు ఎరువుల దుకాణాల వద్దకు వెళ్లేలా చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రైవేటు దుకాణాల వారు నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను నిలువునా ముంచుతున్నారని ఆరోపించారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా నాణ్యమైన విత్తనాలు విక్రయించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాలూకా అధ్యక్షుడు యలువళ్లి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతరలతో మానసిక ప్రశాంతత



కరగ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మాలూరు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతర మహోత్సవాల ద్వారా ప్రతి ఒక్కరిలో మానసిక శాంతి కలుగుతుందని సంజీవిని చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు హూడి విజయకుమార్ తెలిపారు. శుక్రవారం తాలూకాలోని టేకల్ గ్రామంలో ద్రౌపతమ్మ దేవి ఆలయ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మరాయస్వామి, ద్రౌపతమ్మ కరగ మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో జాతరలు, పల్లకీ, కరగ ఉత్సవాలు, ఆలయాలను నిర్మించడం ద్వారా ప్రతి ఒక్కరికీ నెమ్మది, శాంతి లభిస్తుందన్నారు. కరగ ఉత్సవాలకు వందల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. నేటికీ కరగ ఉత్సవాలను నిర్వహిస్తుండడం హర్షణీయమన్నారు. కాగా ఆలయ సమితి హూడి విజయకుమార్‌ను అభినందించింది.

## క్లుప్తంగా

### మండలిలో అవకాశం ఇవ్వండి


మాట్లాడుతున్న వాటాల్ నాగరాజు

మండ్య: దక్షిణ విభాగం ఉపాధ్యాయుల శాసన మండలిలో తనకు అవకాశం ఇవ్వాలని, వాటాల్ పార్టీ అధ్యక్షుడు, మండలికి పోటీ చేస్తున్న వాటాల్ నాగరాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నేడు రాజకీయాలు కలుషితమయ్యాయని, తనకు అవకాశం కల్పిస్తే మండలిలో ఉపాధ్యాయుల తరఫున తన గొంతుకు వినిపిస్తానని అన్నారు.

### గుడిసెల తొలగింపు


బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దారు మహేశ్

గౌరిబిదనూరు: నగర సమీపంలో వున్న హీరేబిదనూరు చెరువు ఆవరణంలో అక్రమంగా నిర్మించుకొన్న గుడిశెలను శుక్రవారం తహసీల్దారు మహేశ్ తన సిబ్బందితో తొలగించారు. ఆయన మాట్లాడుతూ...25 కుంట్ల స్థలంలో 20 మంది వరకు అక్రమంగా గడిసెలు వేసుకున్నారని, సొంత ఇళ్లు ఉన్నా, చెరువు స్థలం కబ్జా చేయాలనే ఉద్దేశ్యంతో అక్రమ నిర్మాణాలకు పాల్పడ్డారని అన్నారు.

### టాస్క్‌ఫోర్స్ సభ్యుల నియామకం


ఉపాధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

కృష్ణరాజపురం: బెంగళూరు నగరంలోని మహాదేవపుర ఎమ్మెల్యే మంజుల ఆధ్వర్యంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన టాస్క్‌ఫోర్స్ సభ్యులను నియమించారు. అనంతరం వారికి ధ్రువీకరణపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అరవింద లింబావలి పాల్గొన్నారు.

### డెత్‌నోట్ రాసి ఉపాధ్యాయుడు ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: డెత్‌నోట్ రాసి ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గదగ్ పట్టణంలోని బసవేశ్వర కాలనీలో చోటుచేసుకుంది. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈశ్వరప్ప కట్టిమని (40) ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి. ఇంట్లో చదువుకోవడానికి ఉంచుకున్న భగవద్గీత బుక్కులో డెత్‌నోట్ రాసిన ఈశ్వరప్ప తన చావుకి తన అల్లుళ్లే కారణమని, వారికి శిక్ష విధించాలని కోరుకున్నాడు. అంతేకాకుండా సెల్ఫీ వీడియో కూడా తీసాడు. అనంతరం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గదగ్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### ఘనంగా బ్రహ్మరథోత్సవం


పూజలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధిలోని హోసకోటె నగరంలో వెలసిన ప్రసిద్ధి చెందిన అవి ముక్తేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో హోసకోటె ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ, చిక్కబళ్లాపుర ఎంపీ బీ.ఎస్.బచ్చేగౌడ, పట్టణ అధ్యుడు బీ.వి. బైరేగౌడ, స్థానిక నాయకులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

### బెళగావిలో రెండు వర్గాల ఘర్షణ

యశవంతపుర: చిన్న పిల్లల క్రికెట్ సందర్భంగా ఏర్పడిన గొడవతో బెళగావి పట్టణంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. రెండు వర్గాలపై శహపుర పోలీసులు పోలీసులు కేసు నమోదు చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం అశ్వాన్ వీధిలో ఆదర్శ మరాఠ విద్యామందిరం మైదానంలో మైనర్ బాలురు క్రికెట్ పోటీ పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఓడిన వారు గెలిచిన వారిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న యువకులు ఘర్షణకు దిగారు. ఒక వర్గం మరో వర్గంపై రాళ్ల దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని హెచ్చరించి పంపివేశారు. అయితే ఓ వర్గంలోని యువకుడు తల్వార్ విసిరి పారిపోయాడు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఓ వర్గం స్థానిక కార్పొరేటర్‌ను తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు రావడంతో ఉద్రిక్తత ఏర్పడింది. నగర పోలీసు కమిషనర్ యడా మార్టిన్ శహపుర పోలీసుస్టేషన్‌కు వెళ్లి సమీక్షించారు. నగరంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

# రమణీయం...రథోత్సవం


రథోత్సవంలో భక్తజనం


ఆలయంలో భక్తుల రద్దీ

- వేడుకగా గడిదం శ్రీ లక్ష్మీ వెంకటరమణ స్వామి తేరు
- మార్మోగిన గోవింద నామస్మరణ
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

బాగేపల్లి: బాగేపల్లి తాలూకాలో చరిత్ర ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రం గడిదం శ్రీ లక్ష్మీ వెంకటరమణ స్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే హోమాలు, వివిధ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సుబ్బారెడ్డి వైకుంఠ కళయను తీసుకుని రాగా ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్థానిక తహసీల్దార్ ప్రశాంత్ తొలిపూజల అనంతరం రథం ముందుకు కదిలింది. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. ఉత్సవంలో స్థానికులతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

## విచిత్ర కోరికలతో అమ్మవారికి విన్నపాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవికి భక్తులు చిత్ర విచిత్ర కోరికలు కోరుతూ విన్నపాలు చేశారు. ఆలయ హుండీలో భక్తులు వేసి చీటీలు, లేఖలు చూసి సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒకరు అయితే ఏకంగా ఐఏఎస్ అధికారితో వివాహం జరిపించాలని బనశంకరీదేవికి పత్రం రాశారు. అమ్మా నేను తప్పు చేశాను క్షమించండి, గతంలో లేఖ రాసిన సమయంలో నేను గోపినాథ్ తప్పా ఎవరిని వివాహం చేసుకోనని అనుకున్నాను. ప్రస్తుతం అతను వద్దు సాధ్యమైనంత త్వరగా ఐఏఎస్ అధికారితో వివాహం జరిపించాలని కోరింది. మరో భక్తుడు లేఖలో తన తల్లి ఇంటి నుంచి తనకు రావలసిన ఆస్తి ఎలాంటి అడ్డంకులు లేకుండా తనకు అందాలని రాశారు. తల్లి బనశంకరీదేవి.. రమ్య, ఉమేశ్ ఇద్దరు దూరంగా ఉండేలా చూడాలని, వీరితో ఒక సంసారం దూరమైందని వారికి తగిన శిక్ష విధించాలని మరో భక్తుడు కోరారు. అమ్మ తల్లి తనది ఒక కోరిక తన కుమారుడు శశాంక్‌కు పెళ్లి నిశ్చయమైంది. వివాహం కాబోయే అమ్మాయి తన కుమారుడితో అన్యోన్యంగా ఉండేలా చూడాలని కుటుంబంతో సంతోషంగా ఉండాలని ఓ భక్తురాలు హుండీలో వేసిన లేఖ లభ్యమైంది.

## జగదీశ్ ఆత్మహత్య కేసులో భాగస్వాములపై ఎఫ్ఐఆర్

బనశంకరి: చలనచిత్ర నిర్మాత, వ్యాపారవేత్త సౌందర్య జగదీశ్ ఆత్మహత్య కేసులో ఆయన భార్య శశిరేఖ ఫిర్యాదు ఆధారంగా భాగస్వాములపై కేసు నమోదు చేశారు. తన భర్త ఆత్మహత్యకు వీఎస్ సురేశ్, హొంబణ్ణ సుదీంద్ర కారణమని, వీరి నుంచి తమ కుటుంబానికి బెదిరింపులు వచ్చాయని మహాలక్ష్మీ లేఔట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతనెల 4న సౌందర్య జగదీశ్ మహాలక్ష్మీ లేఔట్‌లోని తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. మే 18న జగదీశ్ రూమ్‌లో దుస్తులు పూజలో పెట్టడానికి తీసుకునే సమయంలో డెత్‌నోట్ లభించింది. అందులో సౌందర్య జగదీశ్ తన భాగస్వామ్యులైన వీఎస్.సురేశ్, హొంబణ్ణ ఎస్‌పీ, సుదీంద్ర అనే వ్యక్తులు జగదీశ్ నుంచి భారీగా డబ్బులు తీసుకుని పెట్టుబడి పెట్టించారు. నష్టాలు వచ్చాయని చూపించి తమ కుటుంబ ఆస్తులను బ్యాంకులో కుదవపెట్టి రూ.60 కోట్ల నగదు వ్యక్తిగతం వాడుకున్నారు. అనంతరం ఖాళీ చెక్, ఖాళీ పేపర్లపై జగదీశ్ నకిలీ సంతకంతో డబ్బు దుర్వినియోగానికి పాల్పడ్డారని దీనిపై ప్రశ్నించగా జగదీశ్‌ను హత్య చేస్తామని బెదిరించారు. ఇదే విషయంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు డెత్‌నోట్‌లో రాశారు. అనంతరం సురేశ్, హొంబణ్ణ వద్ద విషయం ప్రస్తావించగా డబ్బు ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఆత్మహత్యకు పాల్పడే కొన్ని వారాల క్రితం సురేశ్, హొంబణ్ణ ఇద్దరూ నిత్యం ఫోన్లు చేసేవారు. ఫోన్లు వచ్చిన సమయంలో జగదీశ్ భయభ్రాంతులకు గురయ్యేవాడని శశిరేఖా ఆరోపించారు.

### యువతికి వేధింపులు, ఆటో డ్రైవర్‌పై కొడవలితో దాడి

యశవంతపుర: ఉపాధి కోసం బెంగళూరు వచ్చిన యువతీ, యువకుడిని వేధించిన ఆటో డ్రైవర్‌పై సదరు యువకుడు దాడి చేసిన ఘటన కోణనకుంట వద్ద గురువారం అర్ధరాత్రి జరిగింది. కొడవలితో దాడి చేయడంతో ఆటో డ్రైవర్ ఆస్పత్రి పాలయ్యాడు. నిందితుడు మహ్మద్ పరారయ్యాడు. చిక్కమగళూరుకు చెందిన యువతి త్రిషా, కేరళకు చెందిన యువకుడు మహమ్మద్ అన్సర్ ఈనెల 4న బెంగళూరు వచ్చారు. అన్సర్, త్రిషాలు తన స్నేహితుడిని కలవటానికి రాత్రి జయనగర మెట్రో స్టేషన్ వద్ద ఎదురు చూస్తున్నారు. స్నేహితుడు చేతన్ రాలేదు. దీంతో వారు ఓ ఆటోను మాట్లాడుకున్నారు. రైల్వేస్టేషన్‌లో దించాలని చెప్పారు. అయితే ఆటో డ్రైవర్ తన గది ఖాళీగా ఉందని అందులో దిగొచ్చని చెప్పాడు. దారి మధ్యలో ఆటోను ఆపి మద్యం కొనుగోలు చేశాడు. అప్పటికే అర్ధరాత్రి దాటింది. తన ఇంటికి రావాలని ఒత్తిడి చేశాడు. మద్యం మత్తులో కొడవలి చూపించి యువతిని బెదిరించాడు. తనకు సహకరించకుంటే చంపేస్తానని కొడవలితో హెచ్చరించాడు. ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో అన్సర్ ఆటో డ్రైవర్ చేతిలో ఉన్న కొడవలి లాక్కొని అతనిపై ఎదురుదాడి చేశాడు. అనంతరం గూగుల్ మ్యాప్ సాయంతో మెయిన్ రోడ్డుకు చేరుకున్నారు. ఇందుకు సంబంధించి కోణనకుంట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### సొగడు శివణ్ణకు మండలిలో అవకాశం కల్పించాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తుమకూరు: మాజీ మంత్రి సొగడు శివణ్ణ తుమకూరు జిల్లాకు చేసిన సేవలకు గుర్తుగా బీజేపీ పెద్దలు ఆయనకు మండలిలో అవకాశం కల్పించాలని బీజేపీలోని వివిధ విభాగాలకు చెందిన నాయకులు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తుమకూరు నగరంలో మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ... సొగడు శివణ్ణ నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా తుమకూరు నగర అభివృద్ధికి కృషి చేశారని, అలాంటి నాయకుడికి మండలిలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వీరశైవ సముదాయం నేత చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

### వాహనదారులకు జరిమానా

బాగేపల్లి: ఎలాంటి పత్రాలు లేకుండా నడుపుతున్న పలు వాహనాలకు పోలీసులు జరిమానా విధించారు. బాగేపల్లి పట్టణంలోని పాతపాళ్య ఎస్ఐ అమర్ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేకుండా బైక్‌లు నడుపుతున్న పలువురిని పట్టుకుని హెచ్చరించి జరిమానా విధించారు. ఇదే విధంగా పలు వాహనాలకు కూడా జరిమానా విధించారు.

### కారు దూసుకొచ్చి బ్యాంకు ఉద్యోగిని దుర్మరణం


ప్రమాదానికి కారణమైన కారు

దొడ్డబళ్లాపురం: కారు దూసుకొచ్చి బ్యాంకు ఉద్యోగిని మృతి చెందగా ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన చెన్నపట్టణ తాలూకా కుదూరు వద్ద చోటుచేసుకుంది. తిప్పసంద్ర గ్రామానికి చెందిన మంగళ(45) నాగసంద్ర ఎస్‌బీఐ బ్యాంకులో పని చేస్తోంది. భర్త ఆరు నెలల క్రితమే మృతిచెందారు. 75వ జాతీయ రహదారి మార్గంలోని నాగసంద్ర బస్‌స్టాప్‌లో బస్సు కోసం వేచి చూస్తుండగా బెంగళూరు వైపు నుంచి కుణిగల్ దిశగా వేగంగా వచ్చిన కారు ఆటో, మరో గూడ్స్ ఆటోను ఢీకొంది. అదేవేగంతో మంగళను ఢీకొంది. ప్రమాదంలో మంగళ అక్కడికక్కడే మృతిచెందగా ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. కుదూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### ఎంపీ ప్రజ్వల్ కేసు.. సహాయవాణికి 30కి పైగా ఫోన్లు

బనశంకరి: హాసన ఎంపీ ప్రజ్వల్ కేసుకు సంబంధించి బాధితులు ఫిర్యాదు చేయడానికి ఏర్పాటు చేసిన సహాయవాణికి ఇప్పటి వరకు 30కి పైగా ఫోన్ కాల్స్ వచ్చాయి. సహాయవాణి 6360938947 మొబైల్ నెంబరు సంప్రదించి ఫిర్యాదు చేయాలని మనవి చేయగా ఫిర్యాదు చేస్తే సమాచారం సేకరించడానికి సిద్ధంగా ఉన్నామని, సమాచారం రహస్యంగా ఉంచుతామని సిట్ అధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రజ్వల్ రేవణ్ణపై మూడు కేసులు నమోదు కాగా హెల్ప్‌లైన్ ద్వారా నమోదైన వాంగ్మూలం సిట్ పరిగణిస్తుంది. భవానీ రేవణ్ణ కారు డ్రైవరు అజిత్‌కు మూడోసారి సిట్ నోటీస్ జారీ చేసింది. అజిత్‌ను విచారిస్తే కీలక సమాచారం లభించే అవకాశం ఉంది. బాధితురాలి వీడియో వైరల్ చేసింది అజిత్ అనే దానిపై దర్యాప్తు చేపడుతున్నారు. అజిత్ కోసం సిట్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

### మండ్యలో కాంగ్రెస్ పార్టీదే విజయం


మాట్లాడుతున్న మంత్రి చెలువరాయస్వామి

మండ్య: ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, అభ్యర్థి స్టార్ చంద్రు ఈ ఎన్నికల్లో గెలుస్తారని మంత్రి చెలువరాయస్వామి అన్నారు. మండ్య నగరంలో కర్ణాటక సంఘం కే.వి.శంకరేగౌడ శతమానోత్సవం భవనంలో దక్షిణ ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల కార్యకర్తల సమావేశంలో మంత్రి ఎన్. చెలువరాయ స్వామి మాట్లాడుతూ...మండ్యలో జేడీఎస్ విజయం సాధిస్తుందని, ఇక్కడి నాయకులు, కార్యకర్తలు పగటి కలలు కంటున్నారని, వారికి విజయం అందని దూరంలో ఉంటుందన్నారు.

### గ్రానైట్ రాళ్లు తరలిస్తున్న లారీ స్వాధీనం

హోసూరు: అనుమతి లేకుండా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్న లారీని ఖనిజ సంపద శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశుపురం మండల ఖనిజసంపద శాఖాధికారి రామజయం నేతృత్వంలో అధికారులు శుక్రవారం వేకువజాము హోసూరు–క్రిష్ణగిరి జాతీయ రహదారి బత్తలపల్లి ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న లారీని అడ్డగించగా అధికారులను గుర్తించిన డ్రైవర్ లారీని నిలిపి పరారయ్యాడు. లారీలోని గ్రానైట్ రాళ్లను స్వాధీనం చేసుకున్నారు. రామజయం ఫిర్యాదు మేరకు హడ్కో పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

### పాము పట్టివేత


కారులో దాగి ఉన్న పాము

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరి పట్టణంలోని సబ్‌రిజిస్టర్ కార్యాలయం ముందు నిలిపిన ఓ కారు నుంచి ఆకస్మాత్తుగా బయటకు వచ్చిన పామును చూసిన స్థానికులు కేకలు వేస్తూ పరుగులు తీశారు. విషయం గమనించిన న్యాయవాది సుందరమూర్తి, సామాజిక సేవాకర్త శ్రీనివాస్‌లు పామును వెంబడించారు. అంతలోపే ఆ పాము లాయర్ కార్యాలయం లోనికెళ్లిపోయింది. అనంతరం పామును సురక్షితంగా బంధించి అటవీ ప్రాంతంలో వదలి పెట్టారు.

### విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



కెలమంగలం: విద్యుదాఘాతానికి గురై పాడి ఆవు మృతి చెందిన ఘటన తళి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు.. డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని బళ్లూరు గ్రామానికి చెందిన రైతు సంజీవప్ప రత్నమ్మ దంపతులు పాడిఆవులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం పాడి ఆవులను సమీపంలోని పొలం వద్దకు మేతకు తీసుకెళ్లారు. సాయంత్రం మేతమేస్తూ వెళ్లిన ఆవు విద్యుత్ స్తంభం వద్దకెళ్లడంతో ఆకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. విషయం గమనించిన బాధిత రైతు కేకలు వేయడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పొలంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారని, కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ తీగ తెగిపోవడంతో స్తంభంలో కరెంట్ ప్రసరిస్తోందని, దీంతో ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని తళి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అధికార అహంతో రౌడీషీట్లు తెరుస్తున్నారు



మండ్య: అధికారం ఉందన్న అహకారంతో కాంగ్రెస్ పార్టీ కెరగోడులో హనుమాన్ భక్తులపై రౌడీషీట్లు తెరిచారని భజరంగ్‌దళ్ నేత గోవర్ధన్ మండిపడ్డారు. మండ్య నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గుండా చట్టం తెరచి మద్దతు తెలిపిన హిందూ యువకులపై రౌడీషీట్లు తెరచి జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు. మండ్య జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు ఇక్కడి నాయకులు కలిసి హిందువులపై ఇలాంటి కేసుల పెట్టి, ఇక్కడ లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్‌లో వారికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. మండ్య తాలూకా కెరగోడులో సుమారు 30 ఏళ్లగా అర్జున జెండా ఎగురవేస్తున్నారని, అయోధ్య రామ మందిర పురస్కరించుకుని అదే ప్రాంతంలో హనుమాన్ జెండా ఎగురవేయగా హిందూ యువకులపై రౌడీషీట్లు తెరిచారని అన్నారు.

## భారీ వర్ష సూచన

- 11 జిల్లాలకు ఎల్లో అలర్ట్

శివాజీనగర: అరేబియా సముద్రంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో ఈ జిలాల్లో ఎల్లో అలర్టు ప్రకటించారు. కరావళి జిల్లాలైన దక్షిణ కన్నడ, ఉడుపి, ఉత్తర ఒళనాడులోని చిక్కమగళూరు, హాసన, కొడుగు, మైసూరు, శివమొగ్గ, తుమకూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. దక్షిణ కన్నడ, ఉడుపి, ధారవాడ, హావేరి, శివమొగ్గ, చిక్కమగళూరు, చిత్రదుర్గ, మైసూరు, తుమకురు, కొడుగు జిల్లాల్లో భారీ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరిక చేసింది.

**ఏయే జిల్లాల్లో అధిక వర్షం కురిసే అవకాశం:**

బాగలకోట, బెళగావి, బీదర్, ధారవాడ, గదగ, హావేరి, కల్బుర్గి, కొప్పళ, రాయచురు, విజయపుర, యాదగిరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అంతేకాకుండగా ఉత్తర కన్నడ, హాసన, మండ్య, దావణగెర జిల్లాల అధిక స్థలాల్లో ఉరుములతో కూడిన వర్షం కురువనుంది. బళ్లారి, బెంగళూరు గ్రామీణ, బెంగళూరు నగర, చామరాజనగర, చిక్కబళ్లాపుర, కోలార, రామనగర, విజయనగర జిల్లాల్లో సాధారణ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ సమాచారం. బెంగళూరు నగర. చుట్టు పక్కల ప్రాంతాల్లో 24 గంటల పాటు సాధారణ మేఘాలు కమ్ముకునే వాతావరణం ఉంటుంది.

### శ్రవణ్ రిగ్రేట్ అయ్యర్‌కు డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న శ్రవణ్ రిగ్రేట్

బనశంకరి: వర్చువల్ రియాలిటీ అండ్ క్లైమేట్ చేంజ్ కమ్యూనికేషన్‌పై పరిశోధనకు సంబంధించి పర్యావరణ విశ్రాంత పాత్రికేయులు శ్రవణ్ రిగ్రేట్ అయ్యర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. అమెరికాలోని న్యూజెర్సీలో డాక్టర్ శ్రవణ్ రిగ్రేట్ అయ్యర్ పరిశోధనలు చేశారు. బెంగళూరు నగరంలోని త్యాగరాజనగర నివాసి శ్రవణ రిగ్రేట్ అయ్యర్ యూనివర్శిటీ ఆఫ్ న్యూజెర్సీలో వర్చువల్ రియాలిటీ అండ్ క్లైమేట్ చేంజ్ కమ్యూనికేషన్‌పై డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన మాస్టర్స్ కమ్యూనికేషన్స్‌లో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

### అవహేళన పోస్టు.. కేసు నమోదు

యశవంతపుర: బెంగళూరు విధానసౌధలో పాక్ నినాదాలు చేసిన విషయం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగింది. ఇలాంటి ఘటనే చిక్కమగళూరులో చోటు చేసుకొంది. ఘటనకు సంబంధించి కొప్ప పట్టణానికి చెందిన అస్కర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఫేస్‌బుక్‌లో పాకిస్తాన్ జిందాబాద్ అంటూ రాసి పోస్టు చేశారు. ఇదే కాకుండా ప్రధాని మోదీ, భజరంగదళ్‌పై అవహేళనంగా పోస్టు చేయటంతో కేసు నమోదు చేశారు.

**కిత్తూరులో సోదరులపై దాడి**

ఇద్దరు సోదరులపై గుంపు దాడి చేయటంతో వారు గాయపడిన ఘటన బెళగావి జిల్లా కిత్తూరు పట్టణంలో జరిగింది. గురువారపేట ప్రభుత్వ పాఠశాల వద్ద చికెన్ సెంటర్ నడుపుతున్న ముజమ్మిల్ ఇన్నా జమాదార్ (33), తౌసీఫ్ ఇన్నా జమాదార్ (36)లపై దాడి చేశారు. ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సేసగరి యల్లప్ప లక్కుండి, వినోద్ తో పాటు 12 మంది వచ్చి దాడి చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు

## హోసూరు వార్తలు..

### ప్రత్యంగిరా దేవి ఆలయంలో పౌర్ణమి పూజలు


మిరపకాయలతో యాగం నిర్వహిస్తున్న భక్తులు

హోసూరు: హోసూరు సమీపంలోని మోర్నపల్లిలో వెలసిన చారిత్రక ప్రసిద్ధి పొందిన అధర్వణ శ్రీ ప్రత్యంగిరా దేవి ఆలయంలో గురువారం రాత్రి పౌర్ణమి పూజలు చేశారు. ప్రతి నెలా అమావాస్య, పౌర్ణమి రోజున ఈ ఆలయంలో విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని మిరపకాయలతో యాగం చేపడుతుంటారు. అందులో భాగంగా గురువారం ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో అభిషేకం అలంకరణ, విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. రాత్రి ప్రదోష పూజలు, మిరపకాలతో యాగం చేపట్టారు. హోసూరు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఈ యాగంలో పాల్గొని దోషాలు తొలగిపోవాలని, కుటుంబంలో సుఖశాంతులు కలగాలని, పశుసంతతి పెంపొందాలని, వర్షాలు సమృద్ధిగా కురువాలని, పాడి పంటలు పండాలని కోరుకొంటూ పూజలు నిర్వహించారు.

### ఘనంగా శ్రీ వేంకటరమణస్వామి కళ్యాణోత్సవం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హోసూరు: హోసూరు సమీపంలోని గోపసంద్రం వద్ద వెలసిన దక్షిణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీ వేంకటరమణస్వామి తిరుకళ్యాణోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా గత నెలలో రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. హోసూరు, బాగలూరు, ఉద్దనపల్లి, డెంకణీకోట తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

### అభివృద్ధి పనుల పరిశీలన


పరిశీలిస్తున్న కలెక్టర్ శరయు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి యూనియన్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ శరయు శుక్రవారం పరిశీలించారు. రూ. 13.29 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వెంకటంబట్టి ప్రాంతంలోని క్రీడా మైదానంలో అదనపు భవనాల నిర్మాణం, అంగన్‌వాడి, ఓవర్‌ట్యాంక్ నిర్మాణ పనులు ప్రధాన మంత్రి అవాజ్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు గిరీష్, దురైస్వామి, బాలాజీ, సుబ్రమణి, అరుణ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

### సమస్యాత్మక దారికి పరిష్కారం


దారిలో ముళ్ల కంపలను తొలగిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు తాలూకా బాగలూరులోని కాజల్‌పేట ప్రాంతంలో సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు ఇరువర్గాల మధ్య ఘర్షణతో దారిలేక ముళ్లపొదలతో పేరుకుపోయింది. దీంతో దారిలేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నామని, సమస్యను పరిష్కరించి సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని జిల్లా కౌన్సిలర్ ఆర్.కే.రవికుమార్, యూనియన్ కౌన్సిలర్ ఉమా గుణశేఖర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. విషయంపై స్పందించిన స్థానిక ప్రజా ప్రతినిధులు ఇరువర్గాల మధ్య చర్చించి సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సీసీరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి మురికి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం పెరిగిపోయిన ముళ్లపొదలను తొలగించి నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు.

# పీకేవన్నీ తప్పుడు అంచనాలే

## గతేడాది జరిగిన ఐదు ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ చెప్పినదానికి వ్యతిరేకంగా ఫలితం

- ప్రఖ్యాత జర్నలిస్టు కరణ్‌థాపర్ ఇంటర్వ్యూలో అడ్డంగా దొరికిపోయిన పీకే
- ఈ ఎన్నికల్లో బీజేపీకి 300 లోక్‌సభ స్థానాలపైనా నిలదీసిన కరణ్
- ఏపీలో టీడీపీ గెలుస్తుందని బాబు ప్యాకేజీ తీసుకుని చిలక జోస్యం
- ఇక్కడా ఆయన అంచనాలు తప్పుతాయంటున్న విశ్లేషకులు




**సాక్షి, అమరావతి:** ఎన్నికల ఫలితాలపై ప్రశాంత్ కిశోర్(పీకే) అంచనా తప్పుతోంది. దానిని కప్పిపుచ్చుకునేందుకు 'ది వైర్' వెబ్‌సైట్, చానల్ కోసం ప్రఖ్యాత జర్నలిస్టు కరణ్‌థాపర్ చేసిన ఇంటర్వ్యూలో ఆయన చేసిన ప్రయత్నాలన్నీ బెడిసి కొట్టాయి. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీకి 2022 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని.. తెలంగాణ అసెంబ్లీకి 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని అప్పట్లో పీకే జోస్యం చెప్పారు. అయితే హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చింది. ఇదే అంశాన్ని కరణ్‌థాపర్ ఎత్తిచూపుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో 300కు పైగా లోక్‌సభ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఏ ప్రాతిపదికన చెబుతున్నారని నిలదీశారు. దీనిపై పీకే స్పందిస్తూ తాను హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్, తెలంగాణలో బీఆర్ఎస్ గెలుస్తుందని చెప్పలేదని బుకాయించారు. కానీ అప్పట్లో పీకే చెప్పిన జోస్యంపై జాతీయ మీడియా సంస్థలు ప్రచురించిన వార్తల క్లిప్పింగ్‌లను కరణ్‌థాపర్ చూపడంతో ఆయన తెల్లబోయారు. పత్రికల్లో వచ్చే వార్తలకు విశ్వసనీయత ఉండదంటూ తప్పించుకునేందుకు యత్నించగా... ఇదే అంశంపై అప్పట్లో పీకే స్వయంగా చేసిన ట్వీట్లను ఎత్తిచూపారు. దీంతో అడ్డంగా దొరికిపోయిన పీకే ఉక్రోషంతో ఊగిపోయారు. మీరు జర్నలిస్టే కాదంటూ కరణ్‌థాపర్‌పై విరుచుకుపడ్డారు.

### బిహార్‌లో రాజకీయాలు కలసి రాకే...

పశ్చిమ బంగా ఎన్నికల తర్వాత ఇక ఎన్నికల వ్యూహకర్తగా పని చేయబోనంటూ ప్రతిజ్ఞ చేసిన పీకే ఐప్యాక్ నుంచి తప్పుకున్నారు. బిహార్‌లో రాజకీయ అరంగేట్రం చేశారు. తొలుత బిహార్ సీఎం నితీష్‌కుమార్ పంచన చేరి జేడీ(యూ) కీలక నేతగా చలామణి అయ్యారు. కొన్నాళ్లకు ఆయనతో విభేదించి సొంత పార్టీ స్థాపించి బిహార్‌లో పాదయాత్ర చేశారు. దానివల్ల ఏమాత్రం ప్రయోజనం లేకపోవడంతో రాజకీయంగా ఇక మనుగడ సాగించలేమని తెలిసి డబ్బుల కోసం ఎవరు ప్యాకేజీ ఇస్తే వారికి అనుకూలంగా జోస్యం చెప్పడం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు పంచన చేరి ఆ పార్టీకి అనుకూలంగా జోస్యం చెబుతూ వస్తున్నారు.

### ఏపీలోనూ ఆయన అంచనాలు తారుమారే

గతేడాది చివర్లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరాం శాసనసభల ఎన్నికల్లోనూ పీకే జోస్యాలు చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ గెలుస్తుందని ఆయన చెబితే కాంగ్రెస్ గెలిచింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే ఆ మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికార పీఠం అధిష్టించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ పీకే జోస్యం తప్పడం ఖాయమని, గత ఎన్నికల్లో టీడీపీ తరఫున వకాల్తా పుచ్చుకున్న లగడపాటి మాదిరిగానే ప్రశాంత్ కిశోర్ కూడా ఫలితాలు వెలువడ్డాక మాయం కావడం తథ్యమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

### బాబు పలుకులే చెబుతూ..

ప్రశాంత్‌కిశోర్ ప్రస్తుతం ఏ పార్టీకీ ఎన్నికల వ్యూహకర్తగా పనిచేయడం లేదన్న మాటల్లో ఎంతమాత్రం నిజం లేదని పశ్చిమ బంగా సీఎం మమతా బెనర్జీ ఏప్రిల్ 12న ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కుండబద్దలు కొట్టారు. ఇప్పుడు ఆయన ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ–బీజేపీ కూటమికి ఎన్నికల వ్యూహకర్తగా పనిచేస్తున్నారనీ, అందుకే ఏపీలో చంద్రబాబుకు, పశ్చిమ బంగాలో బీజేపీకి అనుకూలంగా జోస్యం చెబుతున్నారని ఆమె స్పష్టం చేశారు. దీనిని బట్టి చంద్రబాబు విసిరిన ప్యాకేజీ తీసుకుని టీడీపీకి ఎన్నికల వ్యూహకర్తగా పీకే పనిచేస్తున్నట్లు స్పష్టమవుతోంది. అందుకే ఆయన బాబే గెలుస్తారంటూ అవకాశం వచ్చినప్పుడల్లా చెబుతున్నట్టు తేటతెల్లమైంది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టుతో భయపడిన నారా లోకేశ్ ఢిల్లీలో తలదాచుకున్న సమయంలో పీకేను కలిశారు. తమకు ఎన్నికల వ్యూహకర్తగా పనిచేయాలని వేడుకున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు బెయిల్‌పై విడుదలయ్యాక పీకేను ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు, అక్కడి నుంచి విజయవాడకు సీఎం రమేష్ స్పెషల్ ఫ్లైట్‌లో తీసుకొచ్చారు. ఉండవల్లిలో చంద్రబాబుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమయంలోనూ తాను ఏ పార్టీకీ వ్యూహకర్తగా పని చేయడం లేదని పీకే చెప్పిన విషయం అబద్ధమని తరువాత అందరికీ తెలిసిందే.

---

### క్లుప్తంగా...

## నగరి టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్‌పై కేసు

- బీఎస్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులపై కూడా... ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంపై నమోదు



**పుత్తూరు(చిత్తూరు జిల్లా):** నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, పుత్తూరు పట్టణానికి చెందిన బీఎస్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. నగరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు పుత్తూరు మున్సిపల్ కమిషనర్ వీఎల్ఎన్ మూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో నగరి నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన గాలి భానుప్రకాష్ ఈ నెల 23న పుత్తూరులో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) మార్గదర్శకాలను అతిక్రమించడమే కాకుండా, 144 సెక్షన్‌ను ఉల్లంఘిస్తూ పెద్ద సంఖ్యలో తన అనుచరులను సమీకరించి బీఎస్ స్పోర్ట్స్ క్లబ్‌ను ప్రారంభించారని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడకముందే తనను తాను ఎమ్మెల్యేగా ప్రకటించుకుంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారని వివరించారు. ఇందుకు సంబంధించిన సాక్ష్యాలను సైతం ఫిర్యాదుదారుడు తమకు అందజేసినట్లు చెప్పారు. దీనిపై టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, బీఎస్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులపై 4 ఏపీ డీవోపీ, ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బాబు కన్ను పడితే భ్రష్టు పట్టాల్సిందే

- వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ



**సాక్షి, అమరావతి:** ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టించిన చంద్రబాబు ఈసారి రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమిషన్‌ను అప్రతిష్టపాలు చేశారని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ ఆరోపించారు. ఆయన కన్ను పడితే ఏ సంస్థ అయినా ఇంతేనని, ఆయన నిర్వాకంతో ఎన్నికల కమిషన్ అప్రతిష్ట మూట కట్టుకొందని ఆయన దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించటంలో ఈసీ ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఈసీకి ఆనాడు టీఎన్ శేషన్ ఎనలేని కీర్తిని తెచ్చిపెడితే.. 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు ఈసీ అమ్ముడుపోయి ఘోరంగా వైఫల్యమైందన్నారు. ఎన్నికలపై ప్రజలకు ఉన్న విశ్వాసం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రెంటచింతలలో సిట్ బృందం దర్యాప్తు

**రెంటచింతల:** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనల పరిశీలన నిమిత్తం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి నేతృత్వంలో ఇద్దరు సభ్యులతో ఏర్పాటు చేసిన సిట్ బృందం శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు దర్యాప్తు జరిపింది. ముందు హింసాత్మక ఘటనలకు సంబంధించి పలు రికార్డులను అధికారులు పరిశీలించారు. మండలంలోని పాల్వాయిగేటు, తుమ్మకోట, జెట్టిపాలెం గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఈవీఎంలు ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి అందులో ఉన్న నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. అనంతరం ఆ మూడు గ్రామాలకు చెందిన వీఆర్వోలు, వీఆర్ఏలు, మరికొందరి సహకారంతో పోలింగ్ బూత్‌లలోకి దౌర్జన్యంగా వెళ్లి ఈవీఎంలను ధ్వంసం చేసిన వారిని గుర్తిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఇప్పటి వరకు 47 మంది నిందితులను గుర్తించామనీ, త్వరలోనే మిగిలిన వారిని గుర్తించి అదుపులోకి తీసుకునేలా దర్యాప్తు చేస్తున్నామని సిట్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

## బలహీన వర్గాలకు రక్షణ కల్పించండి

- ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్ మీరా విజ్ఞప్తి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో బలహీనవర్గాలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్, డీజీపీలకు ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ రోజైన జూన్ 4వ తేదీన, ఆ తర్వాత కూడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఓటర్లు వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని, వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకునేందుకు పేదలు ఓటు వేశారనే అక్కసుతో టీడీపీకి చెందిన పెత్తందార్లు దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాచర్ల, సత్తెనపల్లి, పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో హింసాత్మక ఘటనలు దీనికి అద్దం పడుతున్నాయన్నారు. బలహీన వర్గాలపై దాడులు జరుగుతున్నా వాటిని అడ్డుకోవడంలో ఈసీ, పోలీసు వ్యవస్థ విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కౌంటింగ్ రోజు అనంతరం పల్నాడు జిల్లాలోని ఫ్యాక్షన్ గ్రామాల్లో గొడవలు చేయాలని ప్రతిపక్ష పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, వాటిని నిలువరించడంలో జిల్లా ఎస్పీ కఠినంగా వ్యవహరించాలని కోరారు.

---

## అక్కడ టీడీపీ ఎందుకు రీపోలింగ్ కోరడం లేదు?

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- టీడీపీ స్క్రిప్ట్ చదవడం మానుకోవాలని ఇక్బాల్‌కు హెచ్చరిక



**సాక్షి, అమరావతి:** పల్నాడులోని మాచర్ల పాల్వాయి గేట్ ప్రాంతంతో సహా ఎక్కడైతే గొడవలు జరిగాయో ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ ఎందుకు రీపోలింగ్‌ను కోరడంలేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ప్రశ్నించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత కోడ్ ముగిసే వరకు ప్రభుత్వాల పాత్ర ఏమీ ఉండదన్న విషయం ఐపీఎస్ అధికారిగా పనిచేసిన ఇక్బాల్‌కు తెలియకపోవడం హాస్యాస్పదమన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాచర్లలో గాని తాడిపత్రిలోగాని హింస చేసింది టీడీపీ నాయకులేనన్నారు. అరాచకాలను ప్రోత్సహించింది చంద్రబాబేనని.. ఎక్కడైతే వైఎస్సార్‌సీపీ మెజారిటీ ఓట్లు సాధించేందుకు అవకాశముందో అక్కడే అల్లర్లు సృష్టించారని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల వారు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేస్తారని తెలిసే ఆ బూత్‌లలో దాడులకు తెగబడ్డారన్నారు. ఒక సామాజికవర్గం వారు టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ తమపై దాడిచేశారని బలహీనవర్గాల మహిళలు బహిరంగంగా చెబుతున్న విషయాన్ని ఇక్బాల్ తెలుసుకోవాలన్నారు. 'మైనారిటీ వర్గానికి చెందిన మిమ్మల్ని నమ్మి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన సీఎం జగన్‌పై విమర్శలు చేయడం సరికాదు' అని ఇక్బాల్‌ను హఫీజ్‌ఖాన్ హెచ్చరించారు. మొన్నటివరకు చంద్రబాబు అరాచకాలను చెప్పిన ఇక్బాల్.. నేడవన్నీ మరిచిపోయి ఆ పార్టీ ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతూ వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం మానుకోవాలని హితవుపలికారు. 'ఖబడ్దార్ ఇక్బాల్.. మీ వైఖరి మార్చుకోండి. లేదంటే వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదు' అని హెచ్చరించారు.

## సీసీటీవీ లింక్ ఇవ్వడంపై వివరాలు సమర్పించండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

**సాక్షి, అమరావతి:** ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను పర్యవేక్షించేందుకు అభ్యర్థులందరికీ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన విధంగా సీసీ టీవీ లింక్‌ను ఇచ్చే విషయంలో పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. అలాగే స్ట్రాంగ్ రూంలకు అన్నీ వైపులా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలంటూ వచ్చిన వినతులపై ఏం చేస్తున్నారో చెప్పాలని స్పష్టం చేసింది. స్ట్రాంగ్ రూంలపై ఓ కన్నేసి ఉంచేందుకు అభ్యర్థులందరికీ అవకాశం కల్పించాలన్న ఈసీ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఉత్తర్వులిచ్చారు. స్ట్రాంగ్ రూంల వద్ద పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాట్లు చేయలేదని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకునేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు, విశాఖ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కేఏ పాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ సుబ్బారెడ్డి విచారణ జరిపారు.

---

## చైనా ముఠా చెర నుంచి 25 మందికి విముక్తి

- విశాఖ పోలీసుల దర్యాప్తుతో వెలుగులోకి మానవ అక్రమ రవాణా రాకెట్
- కంబోడియా నుంచి భారత్‌కు తెచ్చిన అధికారులు



విశాఖ చేరినవారితో సీపీ రవిశంకర్

**గోపాలపట్నం (విశాఖ):** కంబోడియాలో చైనా ముఠా చెర నుంచి 25 మంది బాధితులకు విముక్తి లభించింది. విశాఖ పోలీసుల చొరవతో కేంద్ర విదేశీ వ్యవహార మంత్రిత్వ శాఖ అధికారుల చర్యలతో 25 మంది కంబోడియా నుంచి సురక్షితంగా శుక్రవారం సాయంత్రం రెండు వేర్వేరు విమానాల్లో విశాఖకు తిరిగొచ్చారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, ఇతర పోలీస్ అధికారులు విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం సీపీ రవిశంకర్ మీడియాతో మాట్లాడుతూ ఒక వ్యక్తి ఫిర్యాదుతో విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. మానవ అక్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. దీనిపై తమ దర్యాప్తు అంశాలను కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లగా.. వారు వెంటనే అక్కడి ఎంబసీ అధికారులను సంప్రదించారు. అక్కడి పోలీసుల సహకారంతో తొలి దశలో 25మందిని సురక్షితంగా విశాఖకు పంపారు. మరికొంత మంది కంబోడియాలో ఉన్నట్లు తమకు మెసేజ్‌లు చేశారని, వారి వివరాలనూ ఎంబసీకి పంపినట్టు తెలిపారు. ఏపీ నుంచి సుమారు 150మంది ఉండగా, ఒక్క విశాఖ నుంచే 50మంది కంబోడియాలో చైనా ముఠా చెరలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. వారినీ సురక్షితంగా తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగా, విశాఖకు చెందిన కొంత మంది ఏజెంట్లు విదేశాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలున్నాయని చెప్పి నిరుద్యోగులను నమ్మించి రూ.1.5 లక్షల చొప్పున వసూలు చేసి కంబోడియా ఏజెంట్లకు అప్పగించారని వివరించారు. వారు కంబోడియాకు తీసుకువెళ్లి సైబర్ నేరాల ద్వారా భారతీయులను ఎలా దోచుకోవాలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అందుకు అంగీకరించని వారిని చీకటి గదిలో బంధించి, తిండి పెట్టకుండా బేస్‌బాల్ బ్యాట్‌తో కొట్టి చిత్ర హింసలకు గురిచేశారని వెల్లడించారు.

### బలవంతంగా సైబర్ నేరాలు

ఇక్కడి నుంచి తీసుకెళ్లిన వారితో బలవంతంగా సైబర్ నేరాలు చేయించినట్లు సీపీ తెలిపారు. ఫెడెక్స్, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ జాబ్స్ ఇలా అనేక రకాలుగా భారతీయులకు ఎర వేసేలా చేశారని చెప్పారు. ఒక్క విశాఖ వాసుల నుంచే సుమారు రూ.120 కోట్లు వరకూ చైనా సైబర్ గ్యాంగ్ దోచుకుందని వెల్లడించారు. రెండు రోజుల క్రితమే విశాఖకు చెందిన ఒక వ్యక్తి ఫెడెక్స్ స్కామ్ ద్వారా రూ.3.2 కోట్లు నష్టపోయాడని, ప్రస్తుతం ఆ లావాదేవీలపై దృష్టి పెట్టామని వివరించారు. విచారణాధికారి జాయింట్ సీపీ ఫక్కీరప్ప, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ భవానీప్రసాద్‌ల ఆధ్వర్యంలో బృందాలు ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విశాఖలో 70 మంది వరకు ఏజెంట్లు, సబ్ ఏజెంట్లు ఉన్నట్లు తమ విచారణలో తేలిందని, వారి లైసెన్సులు, లావాదేవీలు, ఇతరత్రా అంశాలపై దృష్టి పెట్టామని, త్వరలో వారందరికీ నోటీసులు ఇస్తామని రవిశంకర్ వివరించారు.

## మాచర్లను రావణకాష్టంలా మార్చేందుకు టీడీపీ కుట్ర

- అందుకు ఈసీలోని కొంతమంది సహకారం
- చంద్రబాబు, పవన్‌లకు మరో 10 రోజులే కలలుగనే అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలన్నీ సీఎం జగన్‌కు బాసట
- వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి



**సాక్షి, అమరావతి:** పల్నాడు ప్రాంతంలో మాచర్లలో గొడవలకు తెరలేపి ఆ ప్రాంతాన్ని రావణకాష్టంలా మార్చేందుకు టీడీపీ కుట్రలు పన్ని విజయం సాధించిందని, దీనికి ఎన్నికల సంఘంలోని కొంత మంది సహకరిస్తూ ప్రజల్లో లేనిపోని అపోహలు, ఆందోళనలు కలిగేలా చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్మిక విభాగం(వైఎస్సార్ టీయూసీ) అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి చెప్పారు. అందుకే ఎన్నికల కమిషన్‌లో దొంగలు పడ్డారని అనాల్సి వస్తోందని దుయ్యబట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌లకు మరో పది రోజులే కలలు కనే అవకాశం ఉందన్నారు. పెత్తందారులకు అధికారం వస్తే ప్రమాదమని గ్రహించే ఓటింగ్ శాతం పెరిగిందని, మహిళలు ఏకంగా 89 శాతం మంది పాల్గొనడం సీఎం జగన్ విజయానికి తొలి సంకేతమని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకు చెక్కు చెదరలేదని, ఎక్కడా చీలిక లేదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలన్నీ సీఎం జగన్‌కి బాసటగా నిలిచాయని తెలిపారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై గతంలో చినకాని సమీపంలో టీడీపీ గూండాలు దాడిచేస్తే తృటిలో ఆయన ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా, ఆయన వాహనాలు ధ్వంసమైన విషయాన్ని గుర్తు చేశారు. విజయవాడకు చెందిన బొండా ఉమా మాచర్ల వెళ్లి పిన్నెల్లి మీద కర్రలు, రాళ్లతో దాడి చేసేందుకు ప్రయత్నించిన విషయాన్నీ ప్రస్తావించారు. తాజాగా పిన్నెల్లికి సంబంధించిన వీడియో అంటూ ఆయనను టార్గెట్ చేస్తూ టీడీపీ నేత లోకేశ్ తన ఎక్స్‌లో పోస్టు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ వరుస ఘటనలు చూస్తే నూటికి నూరు శాతం దుర్బుద్ధితో, కుట్ర పూరితంగా పిన్నెల్లిని టీడీపీ టార్గెట్ చేస్తోందని చెప్పారు. ఈవీఎంను ధ్వంసం చేశారని చెబుతున్న పాల్వాయిగేట్ వీడియో నిజమైనదేనని ఎన్నికల సంఘం ప్రకటించకుండా.. అదెలా బయటకొచ్చిందో విచారణ చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

### లోకేశ్‌పై చర్యలేవి?

సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న రెండు వీడియోలను పరిశీలిస్తే.. అమాయక ఓటర్లపై టీడీపీ గూండాలు దాడి చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని, అయితే వారి మీద ఎన్నికల సంఘం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించి ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశామని చెబుతున్న ఈసీ.. ఈ వీడియోను సంపాదించుకుని ఎక్స్‌లో పోస్టు చేసిన లోకేశ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

## బాజీబాబా దర్గాలో కోడ్ ఉల్లంఘన

- టీడీపీ నేతల ఫ్లెక్సీతో దర్గాలో దువా



పెదకాకాని దర్గాలో టీడీపీ నేతల ఫొటోలతో ఫ్లెక్సీ ప్రదర్శించి దువా చేస్తున్న నాయకులు

**పెదకాకాని:** గుంటూరు జిల్లా పెదకాకానిలోని ప్రసిద్ధ బాజీ షహీద్ అవులియా దర్గాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగింది. ఎలక్షన్ కోడ్ ప్రకారం దర్గా ప్రాంగణంలో ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించకూడదని వక్ఫ్ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వీటిని లెక్కచేయని టీడీపీ నేతలు ఏకంగా దర్గా ప్రాంగణంలోనే టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు వాల్ పోస్టర్లను శుక్రవారం ప్రదర్శిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడ్డుకోవాల్సిన దర్గా ఈవో షేక్ ముక్తార్ బాషా, స్థానిక వక్ఫ్ అధికారులు పట్టించుకోలేదు. దీనిపై ఎన్నికల కమిషన్ వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. టీడీపీ నాయకుల ఫ్లెక్సీతో ప్రత్యేక ప్రార్థనలు చేసిన వారిలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ జానీ, మైనార్టీ నాయకులు అహ్మద్ సన, జిల్లా తెలుగు యువత సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ షేక్ ఫరూక్, పట్టణ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు షేక్ ఖాజ, రఫీ, అహ్మద్ ఖాన్ ఉన్నారు.

---

# ఖరీఫ్‌కు కొత్త వరి వంగడాలు సిద్ధం

- సన్న, మధ్యస్థ సన్న రకాలైన ఎంటీయూ 1271, బీపీటీ 2846
- అధిక పోషక విలువలు కలిగిన బీపీటీ 2841, ఎన్ఎల్ఆర్ 3238 వెరైటీలు
- గత ఏడాది విడుదల చేసిన ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం
- అధిక శాతం విస్తీర్ణంలో కొత్త వెరైటీల సాగుకు కసరత్తు

**సాక్షి, భీమవరం:** ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో పంట తెగుళ్లు, వైపరీత్యాలను ఎదుర్కొని నిలిచే ఆధునిక వంగడాల సాగు ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 300 వరి రకాలు సాగుచేస్తున్నప్పటికీ బీపీటీ 5204, ఎన్‌డీఎల్ఆర్ 7, స్వర్ణ, పీఏపీఎల్ 1100, ఆర్‌జీఎల్ 2537 వంటి కొన్ని రకాలు మాత్రమే తినడానికి అనువుగా ఉంటున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు మరిన్ని రకాలను, అధిక పోషక విలువలు కలిగిన వాటిని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గత ఏడాది జూలై 19న విడుదల చేసింది. అందులో బీపీటీ 5204, ఎంటీయూ 1271, బీపీటీ 2846, బీపీటీ 2841, ఎన్ఎల్ఆర్ 3238 రకాలు ఉన్నాయి. వాటి వివరాలను మార్టేరు రీజినల్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ (వరి) డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఆయా రకాల వరి




వంగడాలు, వాటి ప్రత్యేకతలు ఆయన తెలిపారు.

### ఎంటీయూ 1271

అధిక గింజలతో ఎక్కువ దిగుబడి ఇచ్చే సన్న రకం. పంట కాలం 140 రోజులు. రెండు వారాల నిద్రావస్థ కలిగి ఉండి గింజ మొలకెత్తదు. కాండం దృఢంగా ఉండి చేను పడిపోదు. పచ్చి బియ్యానికి అనుకూలం. బియ్యం పారదర్శకంగా ఉండి 69.7 శాతం నిండు గింజలు కలిగి అధిక దిగుబడి ఇస్తుంది. రైతు, మిల్లర్, సన్నగింజ ధాన్యం మార్కెట్‌కి అనుకూలమైన వెరైటీ. కడప, కర్నూలు, చిత్తూరు, తిరుపతి, నంద్యాల, ఉత్తర కోస్తా జిల్లాలైన శ్రీకాకుళం, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో సార్వాకు అనువైన రకం. దోమ, ఎండాకు తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది. సగటున ఎకరాకు 2.8 టన్నుల నుంచి మూడు టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

### బీపీటీ 2846

కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ప్రాంతాల్లో బీపీటీ 5204కు దీటైన ప్రత్యామ్నాయంగా, భోజనానికి అనువుగా ఉంటూ అధిక దిగుబడినిచ్చే మధ్యస్థ సన్న గింజ రకం. మార్కెట్‌కు, వినియోగదారులకు అనువుగా ఉంటుంది. పంట కాలం 145 నుంచి 150 రోజులు. రెండు వారాల నిద్రావస్థ కలిగి ఉండి గింజ మొలకెత్తదు. సన్నగింజ రకం. కాండం దృఢంగా ఉండి చేను పడిపోదు. గింజ మధ్యస్థ సన్నంగా ఉంటుంది. భోజనానికి అనుకూలమైన రకం. 65.2 శాతం నిండు గింజలు కలిగి మిల్లర్, మార్కెట్‌కు అనుకూలమైన వెరైటీ. అగ్గి తెగులు, మెడ విరుపు, పొట్ట కుళ్లు తెగుళ్లను తట్టుకుంటుంది. సగటున ఎకరాకు మూడు టన్నుల దిగుబడి సామర్థ్యం కలిగి, రైతుకు మంచి ఆదాయం ఇస్తుంది. నేరుగా విత్తే విధానం, సేంద్రియ వ్యవసాయ విధానానికి అనువైన రకం.

### బీపీటీ 2841

అధిక ప్రొటీన్, జింక్, ఇతర పోషక విలువలు కలిగి, మధుమేహ రోగులకు భోజనానికి అనువైన నల్ల బియ్యపు రకం. బీపీటీ 5204 ప్రత్యామ్నాయంగా, భోజనానికి అనువుగా ఉంటూ అధిక దిగుబడినిచ్చే మధ్యస్థ సన్న గింజ రకం. పంట కాలం 130 నుంచి 135 రోజులు. రెండు వారాల నిద్రావస్థ కలిగి ఉండి గింజ మొలకెత్తదు. కాండం దృఢంగా ఉండి చేనుపై పడిపోదు. 65.2 శాతం నిండు గింజలు కలిగి పచ్చి బియ్యానికి అనువుగా ఉంటుంది. బియ్యం పారదర్శకంగా ఉండి భోజనానికి బాగుంటుంది. అగ్గి తెగులు, మెడవిరుపు, దోమ పోటును తట్టుకుంటుంది. సగటున ఎకరాకు 2.4 టన్నుల దిగుబడి సామర్థ్యం కలిగి, రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయం చేసే అన్ని ప్రాంతాలకూ అనువుగా ఉంటూ, డిజిటల్ మార్కెటింగ్‌లో కిలో సింగిల్ పాలిష్ బియ్యానికి రూ. 200 పైచిలుకు ధర పలికే అవకాశం ఉన్న రకం.

### ఎన్ఎల్ఆర్ 3238

అధిక జింక్ కలిగి ఉంటుంది. మధ్యస్థ సన్న గింజ రకం. 120 – 125 రోజుల కాల పరిమితి కలిగిన స్వల్పకాలిక వెరైటీ. రెండు వారాల నిద్రావస్థ కలిగి ఉండి గింజ చేనుపై మొలకెత్తదు. కాండం దృఢంగా ఉండి చేనుపై పడిపోదు. 62% నిండు గింజలు కలిగి, బియ్యం పారదర్శకంగా ఉండి భోజనానికి అనువుగా ఉంటుంది. అగ్గి తెగులు, మెడ విరుపు తెగుళ్లను తట్టుకుంటుంది. తక్కువ నత్రజనితో (సిఫారసు చేసిన నత్రజనిలో 75%) సగటున ఎకరాకు 2.6 టన్నుల దిగుబడి ఇస్తుంది. రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయం చేసే అన్ని ప్రాంతాలకు అనువుగా ఉంటూ, డిజిటల్ మార్కెటింగ్‌కి అనువైన రకం.

### 2023లో అఖిల భారత స్థాయిలో విడుదలైన వరి వంగడాలు

**ఎంటీయూ 1275**

పంట కాలం 135 నుంచి 140 రోజులు. రెండు వారాల నిద్రావస్థ కలిగి ఉండి గింజ మొలకెత్తదు. కాండం దృఢంగా ఉండి చేనుపై పడిపోదు. గింజ మధ్యస్థ సన్నంగా ఉండి పచ్చి బియ్యానికి అనుకూలం. బియ్యం పారదర్శకంగా ఉండి భోజనానికి అనువుగా ఉంటుంది. అగ్గి తెగులు, మెడ విరుపు, బ్యాక్టీరియా ఆకు ఎండు, గోధుమ రంగు మచ్చ తెగుళ్లను తట్టుకుంటుంది. సగటున ఎకరాకు మూడు టన్నుల దిగుబడి ఇస్తుంది.

**బీపీటీ 3050**

కేంద్ర రకాల విడుదల కమిటీ ద్వారా గుజరాత్, మహారాష్ట్రలలో సాగు కోసం విడుదల చేసిన రకం. పంట కాలం 130 నుంచి 135 రోజులు. రెండు వారాల నిద్రావస్థ కలిగి గింజ మొలకెత్తదు. కాండం దృఢంగా ఉండి చేనుపై పడిపోదు. గింజ పొడవుగా లావుగా ఉండి అధిక బియ్యం రికవరీ కలిగిన రకం. అగ్గి తెగులు, మెడ విరుపు, గోధుమ రంగు మచ్చ తెగుళ్లను తట్టుకుంటుంది. సగటున ఎకరాకు 2.4 నుంచి 2.6 టన్నుల దిగుబడి వస్తుంది.

### విత్తనాల కోసం వీరిని సంప్రదించవచ్చు



అధిక శాతం విస్తీర్ణంలో కొత్త వెరైటీల సాగుకు కసరత్తు చేస్తున్నట్లు డా. టి.శ్రీనివాస్ తెలిపారు. ఎంటీయూ వరి రకాల విత్తనాల కోసం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సీడ్ ఆఫీసర్ డాక్టర్ పీవీ రమణారావు (ఫోన్ 94404 41922), బీపీటీ రకాల కోసం డాక్టర్ కృష్ణవేణి (ఫోన్ 94417 21120), ఎన్ఎల్ఆర్ రకాలకు డాక్టర్ శ్రీలక్ష్మి (ఫోన్ 98855 27227), వరి రకాల వివరాలు, సాగులో సందేహాల నివృత్తి కోసం డాక్టర్ టి.శ్రీనివాస్ (ఫోన్ 93968 48380) సంప్రదించాలని డా. టి.శ్రీనివాస్ వివరించారు.

న్యూస్‌మేకర్




దక్షిణ భారత జానపద కథ కాన్స్ మొదటి బహుమతి గెలుచుకుంది. కోడి కూయకూడదని ఒక అవ్వ పుంజును దొంగిలిస్తే ఆ ఊళ్లో తెల్లారదు. తర్వాత ఏమవుతుందనేది 15 నిమిషాల షార్ట్‌ఫిల్మ్‌గా తీశాడు పూణె ఇన్‌స్టిట్యూట్ చిదానంద నాయక్. ప్రపంచవ్యాప్తంగా 2263 ఎంట్రీలు వస్తే చిదానంద తీసిన 'సన్‌ఫ్లవర్స్'కు మొదటి బహుమతి వచ్చింది. ఈ ఘనత సాధించిన చిదానంద పరిచయం.

'సన్‌ఫ్లవర్స్' చిత్ర బృందం

# కన్నడ జానపదానికి కాన్స్ బహుమతి

మారుమూల చిన్న పల్లెటూరు. ప్రతి ఉదయం కోడి కూయగానే తెల్లారుతుంది. ఆ రోజు కోడి కూయలేదు. తెల్లారలేదు. చీకటి. ఎక్కడ చూసినా చీకటి. సూర్యుడు ఎందుకు రావడం లేదు? కోడి కూయడం లేదు. కోడెందుకు కూయడం లేదు? ఊళ్లోని అవ్వ దానిని దొంగిలించి దాచేసింది. దేవుడా... పదండి కోడిని వెతకండి. ఊరంతా బయలుదేరింది. లాంతర్లు పట్టుకుని తలో దిక్కు. అంతేనా? దీనికంతటికీ కారణమైన అవ్వ కుటుంబాన్ని వెలేసింది. కోడి దొరక్కపోయినా అవ్వ కనపడకపోయినా ఆ ఊరిలో సూర్యుడు వచ్చేలా లేడు. తర్వాత ఏమైంది?

చిదానంద నాయక్ తీసిన 'సన్‌ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్స్ టు నో' (పొద్దు తిరుగుడు పూలకే మొదట తెలుస్తుంది) షార్ట్‌ఫిల్మ్ చూడాలి. 15 నిమిషాల ఈ షార్ట్ ఫిల్మ్‌కు కాన్స్ ఫెస్టివల్‌లో 'లే సినే' విభాగంలో ఈ ప్రతిష్టాత్మక బహుమతి దక్కింది.

**ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల కోసం...**

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లలో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు కాన్స్ ఫెస్టివల్‌లో 'లే సినే' విభాగం ఉంటుంది. దీనికి ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు గంట నిడివి లోపు ఉన్న షార్ట్‌ఫిల్మ్స్‌ను ఎంట్రీగా పంపవచ్చు. జ్యూరీ వీటిని పరిశీలించి ఫస్ట్, సెకండ్, థర్డ్ బహుమతులు ఇస్తుంది. ఈసారి మొత్తం 555 ఫిల్మ్ స్కూల్స్ నుంచి 2263 ఎంట్రీలు వస్తే మొదటి ప్రైజ్ చిదానంద తీసిన 'సన్‌ఫ్లవర్స్'కు దక్కింది. దాదాపు పదమూడున్నర లక్షల ప్రైజ్‌మనీ ఇస్తారు. ఇది సామాన్యవిషయం కాదు. మన దక్షిణాది జానపదానికి దక్కిన గౌరవం కింద లెక్క.

**దర్శకుడైన డాక్టర్**

చిదానంద నాయక్‌ది కర్ణాటక. చిన్నప్పటి నుంచి అకిరా కురసావా సినిమాలు చూస్తూ పెరిగాడు. సినిమా దర్శకుడు కావాలని ఉన్నా మెడిసిన్ చదవాల్సి వచ్చింది. 'ఒక డాక్టర్‌గా అతి దగ్గరి నుంచి జననాన్ని, మరణాన్ని చూడటం నాకు మానవ జీవనసారాన్ని తెలిపింది. ఒక వైద్యుడిగా జీవించడమంటే క్షణంలో ఆనందం క్షణంలో దుఃఖాన్ని చూడటమే. మనుషుల మకిలి లేని నిజాయితీని ఆ సమయంలోనే చూస్తాం' అంటాడు చిదానంద. డాక్టరయ్యాక కూడా మనసు సినిమా రంగంలోనే ఉన్నట్టు అర్థమయ్యి పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాడు.

**నాలుగు రోజుల్లో షూట్:**

'సన్‌ఫ్లవర్స్' షార్ట్‌ఫిల్మ్‌ను తన సంవత్సరాంత అభ్యాసంగా తీశాడు చిదానంద. 'మా ఇన్‌స్టిట్యూట్‌కు 50 కిలోమీటర్ల దూరం లోపల షార్ట్‌ఫిల్మ్ తీయాలని నియమం. ఆ దూరంలోనే ఒక లోపలి పల్లెలో షూట్ చేశాం. నాలుగు రోజుల్లోనే తీయమని చెప్పారు. కథంతా రాత్రే కాబట్టి నాలుగు రాత్రులు ఒళ్లు హూనం చేసుకుని పని చేశాం' అని తెలిపాడు. పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులే- సూరజ్ (సినిమాటోగ్రఫీ), మనోజ్ (ఎడిటింగ్) సాంకేతిక శాఖలు నిర్వర్తించారు.

**నీ కోడి కూయకపోతే...**

'నీ కోడి కూయకపోతే తెల్లారదా?' అనేది లోకోక్తి. అంటే ఎదుటి వారంటే లెక్కలేకపోవడం, ఏదైనా లెక్క చేయకుండా ఉండటం ఈ మాటలో ఉంది. కాని ఈ జానపద కథ ప్రతి వ్యక్తి, ప్రతి అనుభవం, ప్రతి మేల్కొలుపు కూడా ముఖ్యమే అని చెబుతుంది. దేనినీ మర్చిపోకూడదని, నిర్లక్ష్యం చేయకూడదని సూచిస్తుంది. 'మా కర్నాటకలో ప్రతి చిన్నపిల్లవాడికి ఈ కథ తెలుసు. దానిని షార్ట్‌ఫిల్మ్‌గా తీయడం, ఈ ప్రతిష్టాత్మక బహుమతి రావడం సంతోషంగా ఉంది' అంటున్నాడు చిదానంద.

---

ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్టాత్మకమైన కార్టియర్ ఫెలోషిప్‌ను ఈ యేడాది ముగ్గురు భారతీయ మహిళలు దక్కించుకున్నారు. ఆ ముగ్గురూ ఢిల్లీ వాసి అయిన అక్షితా సచిదేవా, బెంగళూరు వాసులైన మాన్సీ జైన్, ఇరా గుహ లు. మన దేశం నుంచి వీరు మాత్రమే ఎంపిక అవడంలోని ప్రత్యేకత సామాజికంగా ప్రభావవంతమైన పారిశ్రామికవేత్తలుగా వీరికున్న గుర్తింపు.

• పారిశ్రామికవేత్తలుగా

# యువ కెరటాలు




ప్రపంచంలోని అత్యంత కీలకమైన సవాళ్లను పరిష్కరిస్తున్న వేలాది మంది మహిళా పారిశ్రామికవేత్తలను గుర్తించి, వారిలో 33 మందిని ఎంపిక చేసిన కార్టియర్ ఉమెన్స్ ఇనిషియేటివ్ మీట్ ఇటీవల చైనాలో జరిగింది. ఇందులో ముగ్గురు యువ భారతీయ మహిళా వ్యాపారవేత్తలు తమ వ్యాపారాల ద్వారా ప్రభావ వంతమైన గుర్తింపు పొందారు.

**మాన్సీ జైన్**

'డిజిటల్ పానీ' అనే సాఫ్ట్‌వేర్ ప్లాట్ ఫారమ్ వ్యవస్థాపకురాలు మాన్సీ జైన్. ఇది మురుగునీటి శుద్ధి కార్యకలాపాలను నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది. ఫలితంగా కలుషితమైన నీటిని సమర్థవంతంగా శుద్ధి చేయవచ్చు. తిరిగి ఉపయోగించుకోవచ్చు. డిజిటల్ పానీ రోజుకు 90 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది. భారత దేశంలోని అగ్రశ్రేణి కంపెనీలలోని దాదాపు 50 యూనిట్లలోని నీటిలో అధిక నాణ్యత, అనుకూలమైన సౌకర్యాలుగా మార్చి తన శక్తిని నిరూపించింది.

**అక్షితా సచిదేవా**

ఏఐ ఆధారిత సాంకేతికత 'కిబో'ను ఉపయోగించి అంధత్వం ఉన్న వ్యక్తులకు సమగ్ర విద్య, ఉపాధిని ప్రోత్సహించడానికి ట్రస్టిల్ ల్యాబ్‌లను స్థాపించింది బెంగళూరుకు చెందిన అక్షితా సచిదేవా. 60 భాషల్లో ప్రింట్, హ్యాండ్ రైటింగ్, డిజిటల్ కంటెంట్‌ను డిజిటైజ్ చేస్తుంది, అనువదిస్తుంది, ఆడియోలోకి మారుస్తుంది. జూలై 2019 నుండి కిబో 650 సంస్థలను కలుపుకొని 25 దేశాలలో 1.5 లక్షల మందికి పైగా వ్యక్తులు సాధికారత సాధించేలా చేసింది. కంటెంట్‌ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి అక్షిత చేసిన కృషికి అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి.

**ఇరాగుహ**

స్త్రీల పీరియడ్ సమస్యలను పరిష్కరించడానికి, ప్లాస్టిక్ శానిటరీ ప్యాడ్‌ల నుండి వ్యర్థ కాలుష్యాన్ని తగ్గించడానికి మెనుస్ట్రువల్ కప్‌ను రూపొందించి, పేటెంట్ రైట్స్ పొందింది ఇరాగుహ. సామాజిక కార్యక్రమాల ద్వారా గ్రామీణ కుటుంబాలలోని మహిళలు మెనుస్ట్రువల్ కప్‌ని ఉపయోగించడం ద్వారా మిలియన్ల డాలర్లను ఆదా చేసింది. అలాగే, లక్షల టన్నుల కంటే ఎక్కువ వ్యర్థాలను నివారించింది. వినూత్నమైన పీరియడ్ ట్రాకర్ యాప్‌ను అభివృద్ధి చేయడం ద్వారా కెనడా ప్రభుత్వం నుండి అవార్డును అందుకుంది.

సామాజిక వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్న ఈ ముగ్గురు యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి తమ మద్దతును ప్రకటించింది కార్టియర్ ఫెలోషిప్. కోట్లాది మంది వీక్షకుల ముందు అవార్డులు అందుకున్న వారిలో ఈ ముగ్గురు ప్రత్యేకంగా నిలిచారు. తమ వ్యాపారాల ద్వారా సమాజంలో తీసుకు వస్తున్న మార్పులను పంచుకుని, అందరికీ ఆదర్శంగా నిలిచారు.

---

బ్యూటిప్స్

# ఎండ నుంచి... ఉపశమనం.. కాంతిమంతం



**■ పుచ్చకాయ.. ద్రాక్ష**

పుచ్చకాయ, ద్రాక్ష కలిపి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీంట్లో నిమ్మరసం, కోడిగుడ్డు లోని తెల్లసొన కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, ఆరిన తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. వేసవిలో ఈ ఫ్రూట్ ప్యాక్‌ని తరచూ వేసుకోవడం వల్ల చర్మంలో జిడ్డు తగ్గి, కాంతిమంతం అవుతుంది.

**■ ఆరెంజ్ జ్యూస్**



టీ స్పూన్ తేనె, కొద్దిగా ఆరెంజ్ జ్యూస్, టేబుల్ స్పూన్ ఓట్స్, రోజ్ వాటర్ కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో ఉంచి, చల్లబడ్డాక ముఖానికి అప్లై చేయాలి. 15 నిమిషాల తర్వాత చల్లని నీటితో శుభ్రపరుచుకుంటే ముఖ చర్మం సేదదీరుతుంది.

**■ కొబ్బరి పాలతో..**



ఎండలో నుంచి ఇంటికి వెళ్లినప్పుడు ఫ్రిజ్‌లో ఉంచిన కొబ్బరి పాలలో దూది ఉండను ముంచి, దాంతో ముఖం, చేతులపై అద్ది, పది నిమిషాలు సేదదీరాలి. తర్వాత స్నానం చేస్తే ఎండవల్ల కమిలిన చర్మానికి ఉపశమనం లభిస్తుంది. మృదువుగా, కాంతిమంతంగా తయారవుతుంది.

**■ సోంపుతో..**



రెండు టీ స్పూన్ల సోంపు గింజలను దంచి, అరకప్పు నీటిలో వేసి, మరిగించాలి. చల్లారాక ఈ నీటిని వడకట్టి, టీ స్పూన్ నిమ్మరసం వేసి కలపాలి. ఈ మిశ్రమం ఫ్రిజ్‌లో ఉంచాలి. ఎండ నుంచి ఇంటికి వచ్చినప్పుడు దూది ఉండను సోంపు నీటిలో ముంచి ముఖం, మెడ, చేతులు తుడుచుకోవాలి. తర్వాత చల్లని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఈ నీళ్లు స్వేద రంధ్రాలలోని మలినాలను తొలగిస్తాయి. దురద, దద్దుర్లు, ట్యాన్ వంటి సమస్యలనూ తగ్గిస్తాయి. చర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.



---

విజయపథం

# పేదింటి బంగారం

అరవై దేశాల విద్యార్థులు పాల్గొనే అంతర్జాతీయ పోటీ అది. గోవా దాటని ఉష తొలిసారిగా దుబాయ్‌కు వెళ్లడానికి రెడీ అవుతోంది. వెళ్లడానికి ముందు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా రకరకాల అడ్డంకులు ఎదురయ్యాయి. 'సాధించాలని బలంగా అనుకుంటే కచ్చితంగా సాధిస్తాం' అనే మాటను తారకమంత్రంలా జపించిన పదిహేను సంవత్సరాల ఉష దుబాయ్‌లో జరిగిన 'కోడేవర్ 5.వో ఏఐ రోబో సిటీ చాలెంజ్'లో కప్పు గెలుచుకుంది.




తల్లిదండ్రులతో ఉష

**కొన్ని రోజుల క్రితం...**

పనాజీ(గోవా)లోని ప్రోగ్రెస్ హైస్కూల్‌లో రోబో సందడి నెలకొంది. ఒక్క మాటలో చెప్పాలంటే స్కూలు పిల్లలు తమ ప్రపంచం వదిలి రోబో ప్రపంచంలోకి వెళ్లారు. రోబోటిక్స్ పోటీ అయిన 'కోడేవర్ 5.వో ఏఐ రోబో సిటీ చాలెంజ్' తాలూకు సందడి అది. ఆ స్కూల్ స్టూడెంట్ ఉషను ఇంటర్నేషనల్ రౌండ్‌కు చేర్చడానికి టీచర్ మాయా కామత్ బాగా శ్రమించింది.

దుబాయ్‌లో జరగబోయే అంతర్జాతీయ పోటీని సవాలుగా తీసుకుంది మాయా కామత్. 'ఎన్నో దేశాలు పాల్గొనే ఈ పోటీలో మనం ఎక్కడ! అక్కడి దాకా వెళితే అదే పదివేలు' ఇలాంటి మాటలను ఆమె పట్టించుకోలేదు. ఎలాగైనా బంగారు కప్పు గెలుచుకోవాలనే పట్టుదలతో పనిచేసింది.

గోవాలో జరిగిన రీజనల్ రౌండ్ కోసం ముగ్గురు స్టూడెంట్స్‌ను ఎంపిక చేసింది మాయ. అందులో ఉషతో పాటు ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. అయితే మొదట్లో కనిపించిన ఉత్సాహం ఉషలో ఆ తరువాత కనిపించలేదు. ఆత్మవిశ్వాసం తగ్గింది. ఇలాంటి సమయంలోనే మాయ ఉషలో ధైర్యం నింపి ముందుకు నడిపించింది. ఆ ధైర్యమంత్రం ఫలించి గురుగ్రామ్‌లో జరిగిన నేషనల్ రౌండ్‌లో ఉష అద్భుత పనితీరు ప్రదర్శించింది. రోబోను బాగా హ్యాండిల్ చేసింది. ఆ తరువాత దుబాయ్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ రౌండ్‌కు ఎంపికైంది.

నేషనల్ రౌండ్‌లో సాధించిన విజయం ఉషకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చింది. భయాలను ఎదుర్కొనేలా చేసింది. ఎట్టకేలకు మాయ కామత్ కలను ఉష సాకారం చేసింది. ప్రతిష్ఠాత్మకమైన ఈ అంతర్జాతీయ పోటీలో ఉష కప్పును గెలుచుకుంది. ఉష తల్లిదండ్రులు పెద్దగా చదువుకోలేదు. రోబో సిటీ చాలెంజ్ రూపంలో తన ప్రతిభను ప్రదర్శించే అరుదైన అవకాశం ఉషకు లభించింది. ఉష సాధించిన విజయం తల్లిదండ్రులను ఆనందంలో ముంచెత్తింది.

'సాధించాలని గట్టిగా అనుకున్నాను. సాధించాను' నవ్వుతూ అంటుంది ఉష.

## ఛాంపియన్స్ చేంజ్‌మేకర్

'క్వార్కీ' అనే రోబోట్‌ను స్టూడెంట్స్‌తో కలిసి తయారు చేసింది మాయా కామత్. నిర్ణీత సమయంలో రకరకాల పనులు చేసేలా ఈ 'క్వార్కీ'ని రూపొందించారు. పోటీలో 'క్వార్కీ' అయిదు నిమిషాల్లో 11 టాస్క్‌లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతిరోజూ రెండు గంటలు ప్రాక్టీస్ చేసేది ఉష. రంగులను సరిపోల్చడం, దిశలను అంచనా వేయడం, అడ్డంకులను అధిగమించడం, వస్తువులను వేరు చేయడం లాంటి 'క్వార్కీ' నైపుణ్యాలను ఉష అద్భుతంగా ఆపరేట్ చేసింది.



కోచ్ మాయా కామత్‌తో ఉష




'నేను చెప్పే సలహాలను శ్రద్ధగా విని అందుకు అనుగుణంగా ఉష ప్రాక్టీస్ చేసేది. నేర్చుకోవాలనే తపన ఆమె విజయానికి కారణం. విజయం సాధిస్తామనే గట్టి నమ్మకం ఉన్నప్పటికీ మాకు ఎదురైన అతి పెద్ద సవాలు దుబాయ్ పర్యటనకు నిధులు సమకూర్చుకోవడం. విజయం సంగతి ఎలా ఉన్నా అసలు దుబాయ్‌కు వెళ్లగలమా అనే సందేహం వచ్చింది. ఈ పరిస్థితులలో ప్రోగ్రామింగ్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చే సయేష్ గాంధీ అనే టీచర్ క్రౌడ్‌ఫండింగ్‌కు సంబంధించి సలహా ఇచ్చారు. ఉష కుటుంబ నేపథ్యం, రోబోటిక్స్ పట్ల ఆమెకు ఉన్న ఆసక్తి, అంతర్జాతీయ పోటీలో పాల్గొనాలనే ఆమె కల, ఆర్థిక ఇబ్బందులు...మొదలైన వాటి గురించి వీడియో చేయాల్సిందిగా సలహా ఇచ్చారు. ఈ వీడియోకు మంచి స్పందన వచ్చింది' అంటుంది మాయా కామత్. ఉష విజయం ఒక సంతోషం అయితే ఆమె గురువు మాయా కామత్ 'చాంపియన్స్ చేంజ్ మేకర్' అవార్డ్ అందుకోవడం మరో సంతోషం.

---

హెల్త్ టిప్స్



మొక్కజొన్న కంకి ఒలిచేటప్పుడు వచ్చే సిల్క్ దారాల్లాంటి కార్న్ సిల్క్‌ను వృథాగా పడేస్తారు. కానీ అవి కిడ్నీ రాళ్లను బయటకు పంపడంలో సమర్థవంతంగా పని చేస్తాయి. వాటిని నీటిలో ఉడికించి చల్లారాక వడగట్టి తాగాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీల్లో కొత్తగా రాళ్లు ఏర్పడవు. ఇది మూత్ర విసర్జన సాఫీగా జరిగేలా చూస్తుంది. కిడ్నీ స్టోన్స్ వల్ల వచ్చే నొప్పిని తగ్గించడంలో కార్న్ హెయిర్ ఉపయోగపడుతుంది.

**నోటి పూత నివారణకు...**

కొన్ని రకాల యాంటీ బయాటిక్స్ వాడటం, కొన్ని రకాల వ్యాధులతో బాధపడటం వల్ల నోటిలో పుళ్లు ఏర్పడుతుంటాయి. కొందరికి ఊరికినే కూడా అప్పుడప్పుడు నోటిపూత వస్తుంటుంది. ఇలాంటప్పుడు ఏమైనా తాగినా, తిన్నా చాలా బాధగా ఉంటుంది. మౌత్ అల్సర్స్ నుంచి ఉపశమనం పొందడానికి తేనె చక్కటి మార్గం. నోట్లో కణజాలాలు చిట్లిపోవడం వలన ఈ సమస్య ఏర్పడుతుంది కాబట్టి.. తేనెను పూయడం వలన కొత్త కణజాలాలు తిరిగి ఏర్పడడానికి ఇది దోహదం చేస్తుంది. తేనెలో పసుపు కలిపి పేస్ట్ లా చేసుకుని రాసినప్పుడు కూడా చక్కటి ఉపశమనం లభిస్తుంది.



● కొబ్బరి నీళ్లను తరచూ తాగడం, కొబ్బరి నూనెను పూయడం, అలానే ఎండు కొబ్బరిని తినడం వల్ల కూడా నోటిపూత తగ్గుతుంది. ఎందుకంటే కొబ్బరి శరీరంలో వేడిని తగ్గిస్తుంది. ఫలితం గా నోటిపూత త్వరగా మానిపోతుంది.



● పాలపదార్థాలైన నెయ్యి, మజ్జిగ వంటి పదార్థాలు కూడా నోటిపూత నుంచి ఉపశమనం కల్పిస్తాయి. ఎక్కడైతే నోటిపూత గాయాలున్నాయో అక్కడ నేయి రాయడం, రోజుకు రెండుమూడుసార్లు గ్లాసు మజ్జిగ తాగడం వల్ల ఎంతో ఉపశమనం గా ఉంటుంది.

● తులసి ఆకులు కూడా నోటిపూతకు మంచి ఔషధం. రోజుకు నాలుగైదు సార్లు తులసాకులు నమలడం వల్ల నోటిపూత తొందరగా తగ్గిపోతుంది.





● చిన్న ఐస్ ముక్కతో పుండు ఉన్న చోట మర్దనా చేయడం, లవంగం నమలడం కూడా నోటిపూతను తగ్గిస్తాయి.

# ఆరోగ్య లాభాల ఖర్జూరాలు

నిగనిగ మెరిసిపోతూ.. ఖర్జూరాలు చూడటానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. రుచికి కూడా బాగుంటాయి. అందుకే అందరూ వీటిని అందరూ ఇష్టపడతారు. ఖర్జూరంలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఆయుర్వేదంలో వీటిని ఔషధాల తయారీలోనూ ఉపయోగిస్తారు. రోజూ కొద్ది మొత్తంలో ఖర్జూరం పండ్లు తింటే.. ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఖర్జూరం తింటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో తెలుసుకుందాం..

ఖర్జూరాల వల్ల కలిగే ప్రయోజనాలను పొందాలంటే... కనీసం ఒక వారం లేదా పదిరోజులపాటు క్రమం తప్పకుండా నాలుగయిదు తినాలి. డయాబెటిస్ ఉన్న వారు మాత్రం వైద్యుల సలహా మేరకు మాత్రమే వీటిని తీసుకోవాలి.

**గుండెకు బలం...** ఖర్జూరాలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఖర్జూరంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ధమని కణాల నుంచి కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడతాయి. ఖర్జూరం తినటం వల్ల చెడ్డ కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండెపోటు, హైపర్‌టెన్షన్, స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ఖర్జూలంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది హార్ట్ బీట్, బీపీని నార్మల్‌గా ఉంచుతుంది.

**కండరాలు బలంగా ఉంటాయి...** ఖర్జూరంలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలు బలంగా ఉండటానికి సహాయపడుతుంది. ఖర్జూరంలో ఉండే. పొటాషియం, ఫాస్పరస్, సెలీనియం, కాపర్, మాంగనీస్ వంటివి ఎముకలు గుల్లబారటం, కీళ్ల అరగటం వంటి ఎముకల సమస్యలు రాకుండా రక్షిస్తాయి.

**సంతానోత్పత్తి సామర్థ్యం ..** మగవారిలో సంతానోత్పత్తి సామర్థ్యం పెంచడానికి ఖర్జూరాలు సహాయపడతాయి. ఖర్జూరం తింటే స్పెర్మ్ నాణ్యత పెరుగుతుంది.

**మెరుగైన జ్ఞాపకశక్తి...** ఖర్జూరాల్లో ఉండే విటమిన్ 'బి6' వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది. మెదడును ఒత్తిడి, వాపు నుంచి రక్షించవచ్చు. ఖర్జూరాలను రోజూ తింటే.. నాడీ వ్యవస్థను ప్రభావితం చేసే.. న్యూరో డీ జెనరేటివ్ వ్యాధి నుంచి దూరంగా ఉండొచ్చు. ఖర్జూరం తింటే జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది.

ఖర్జూరంలో ఉండే ఫైబర్ కడుపులో మంచి బ్యాక్టీరియాను ప్రోత్సహించడానికి పని చేస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను అడ్డుకుంటాయి. పెద్దపేగు, ప్రోస్టేట్, రొమ్ము, ఎండోమెట్రియల్, ఊపిరితిత్తులు, క్లోమ క్యాన్సర్ల నుంచి రక్షణ లభిస్తుంది.

**జీర్ణ సమస్యలు దూరం...** ఖర్జూరంలో ఉండే ఫైబర్ వల్ల జీర్ణకోశ వ్యవస్థ సక్రమంగా పనిచేసి, మలబద్ధకం దరి చేరదు.





# ఓ అరగంట నడక చాలు... రోజంతా ఉల్లాసమే!

మనకు తెలిసిన విషయమే కదా అని తేలిగ్గా తీసిపారేయద్దు. అలాగే బద్ధకించవద్దు. క్రమం తప్పకుండా రోజూ ఓ అరగంట పాటు నడవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. స్లిమ్‌గా ఉండవచ్చు. డయాబెటిస్, బీపీ వంటి వాటికి దూరంగా ఉండచ్చు.అన్నింటికీ మించి రోజంతా ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉండచ్చు. అలాగని ఎప్పుడు పడితే అప్పుడు నడవడం కాదు... మన నడక ఎలా ఉండాలి... ఎంత దూరం నడవాలి? ఏ సమయంలో నడవాలి... వంటి ప్రాథమిక విషయాలు తెలుసుకుందాం...

క్రమం తప్పకుండా నడవడం శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. సాధారణంగా, శారీరక వ్యాయామాలు, కార్యకలాపాలు ఆందోళన, నిరాశ, ఒత్తిడి, ఇతర సమస్యలను దూరం చేయడంలో సహాయపడతాయని చెబుతారు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో 30 నిమిషాల పాటు చేసే మార్నింగ్ వాక్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.

వ్యాయామాలన్నింటిలోనూ అతి తేలికపాటి వ్యాయామం ఏదంటే నడకే అని చెప్పొచ్చు.

> ఖాళీ కడుపుతో 30 నిమిషాల మార్నింగ్ వాక్ అనే నియమాన్ని అలవాటుగా చేసుకోవటం వల్ల రోజంతా శక్తిని పొందుతారు. ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటారు. వార్థక్య లక్షణాలు తొందరగా దరిచేరకుండా ఉంటాయి. దీనిని తేలిగ్గా తీసేయకుండా దిన చర్యలో చేర్చడం ద్వారా ఎన్నో ప్రయోజనాలను సులభంగా పొందవచ్చు.

బరువును నియంత్రించడంలో, కేలరీలను కరిగించడంలో వాకింగ్‌ను మించిన మందే లేదు. క్రమబద్ధమైన నడక వార్థక్య ఛాయలను నివారిస్తుంది. అయితే ఆ నడక ఎలా ఉండాలి... ఎప్పుడు చేయాలో చూద్దాం...

**శక్తిని పెంచుతుంది**

మార్నింగ్ వాక్ ఎప్పుడూ కూడా ఖాళీ కడుపుతోనే చేయాలి. అలా ఖాళీ కడుపుతో చేసే మార్నింగ్ వాక్ శక్తి స్థాయిని పెంచుతుంది. శరీరం, మనస్సు సాంత్వన పొంది, కణజాలాలు శక్తిని పొందేలా చేస్తుంది. వాకింగ్ వంటి సాధారణ శారీరక శ్రమ శక్తి స్థాయిలను పెంచడానికి గొప్ప మార్గం. ఇది అలసట తగ్గించి,, ఉత్సాహాన్ని పెంచడంలో సహాయపడుతుంది.

**గుండెకు బలాన్నిస్తుంది**

రోజూ ఉదయాన్నే అరగంటపాడు చురుగ్గా నడవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఈ సాధారణ వ్యాయామం గుండె ఆరోగ్యాన్ని, రక్తపోటును తగ్గిస్తుంది. ప్రతి రోజూ ఉదయం వ్యాయామం చేయడం వల్ల గుండె జబ్బుల ముప్పును ముందుగానే తగ్గించుకోవచ్చు.

**జీర్ణవ్యవస్థను ఉత్తేజ పరుస్తుంది**

జీర్ణక్రియను ఉత్తేజపరిచేందుకు ఖాళీ కడుపుతో ఉదయాన్నే నడవడం మంచిది. ఈ అభ్యాసం మీ ఉదర కండరాల సహజ సంకోచాన్ని ప్రోత్సహిస్తుంది.

**మానసిక బలం**

రోజూ నడవడం వల్ల మెరుగైన ఆత్మగౌరవం, మెరుగైన మానసిక స్థితి, ఆందోళన సమస్యలతో సహా మీ మానసిక ఆరోగ్యానికి వాకింగ్ గొప్ప ప్రయోజనాలను కలిగిస్తుంది. శారీరక శ్రమ మీ శరీరం మానసిక స్థితి ఆత్మగౌరవాన్ని మెరుగుపరిచే ఎండార్ఫిన్‌లను విడుదల చేయడంలో సహాయపడుతుంది.

చక్కటి నిద్ర: తెల్లవారుజామున వెలువడే సూర్యరశ్మి సహజంగా మీ సిర్కాడియన్ రిథమ్‌ను ఏర్పాటు చేయడంలో సహాయపడుతుంది. ఇది మీ నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. మీ దినచర్యకు 30 నిమిషాల మార్నింగ్ వాక్ అలవాటుతో మీ మెదడు కార్యకలాపాలు పెరుగుతాయి. శారీరక శ్రమ మెదడుకు రక్త సరఫరాను పెంచుతుంది. పనితీరు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సమస్య పరిష్కార నైపుణ్యాలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వాకింగ్ వంటి మితమైన వ్యాయామం, కాలక్రమేణా జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. అందుకే వాయిదా వేయకుండా నడుద్దాం. నడకను పడక ఎక్కనివ్వకుండా చూద్దాం.



రాత్రిపూట మంచి నిద్రలో ఉన్నప్పుడు హఠాత్తుగా మెలకువ వస్తుంది. ఏ బాత్‌రూమ్‌కో వెళ్లాల్సి వచ్చి కాలు కింద పెడదామని చూస్తే అడుగు ముందుకు పడదు. పిక్కలు, కండరాలు పట్టేసినట్లుంటుంది. చాలామందికి ఇదొక బాధాకరమైన అనుభవం. అంతేనా.. మండుటెండలో చెమట పట్టేలా కష్టపడుతున్నప్పుడు ఉన్నట్లుండి తొడ కండరాలు పట్టేసి విపరీతమైన బాధతో కుంటుతూ నడవాల్సి వస్తుంతది. ఒక్కోసారి మంచి చలికాలంలో వేళ్లు కొంకర్లు పోయినట్లుగా అయిపోయి ఎంత ప్రయత్నించినా అవి అలాగే బిగుసుకుపోయి బాగా నొప్పితో పళ్ల బిగువున బాధను అణిచి పెట్టుకోవాల్సి వస్తుంది. ఇలాంటి అనుభవాల్లో ఏదో ఒకటి ఎప్పుడో ఒకప్పుడు ఎదురయ్యే ఉంటుంది. దీనినే కండరాలు పట్టియ్యడం లేదా మజిల్ క్రాంప్స్ అంటారు. దీనికి కారణాలు, నివారణోపాయాలను తెలుసుకుందాం.

## కండరాలు పట్టేస్తున్నాయా..? నివారణ సులువే!

మనం శారీరక శ్రమ చేసినప్పుడు చెమటతో పాటు ఉప్పు రూపంలో సోడియమ్ ను కూడా చాలా వరకూ కోల్పోతాం. సోడియమ్ తగ్గడం వల్ల శరీరంలోని కండరాలు...ముఖ్యంగా పిక్క, తొడ, భుజం కండరాలు పట్టేసినట్లుగా నొప్పికి గురవుతాయి. అందుకే చాలామందికి ఎండాకాలంలో తరచూ ఈ సమస్య ఎదురవుతుంది. వేసవికాలంలో ఆటగాళ్లు చాలామంది ఈ సమస్యకు గురవుతుంటారు. ఇంకా కొందరిలో విరేచనాలు, వాంతులు ఎక్కువగా అయినప్పుడు కూడా సోడియమ్‌ను కోల్పోతారు. అలాంటివారిలో కూడా ఒళ్లు నొప్పులు రావడం, నీరసపడిపోవడం జరుగుతుంది.

**కారణాలు...**

మహిళల్లో చాలామంది కుటుంబ సభ్యులకు తినిపించడంలోనే ఎక్కువ శ్రద్ధ తీసుకుంటూ, తాము తినడానికి రెండో ప్రాధాన్యత ఇస్తుండటం వల్ల వారికి తగిన క్యాల్షియం, ఇతర పోషకాలూ సరిగా అందక ఈ పరిస్థితి ఎదురవుతుంది.

ఇంకా...

**థైరాయిడ్...** మన శరీరంలోని థైరాయిడ్ గ్రంథి పనితీరు తగ్గడం వల్ల వచ్చే వ్యాధిని హైపోథైరాయిడిజమ్ అంటారు. హైపోథైరాయిడ్ ఉన్నవారికి మజిల్ క్రాంప్స్ ఎక్కువగా వస్తుంది. ఇది ఏ వయస్సు వారికైనా రావచ్చు. పిల్లల్లో ఈ సమస్య ఉంటే ఎక్కువ దూరం పరుగెత్తలేరు. మహిళలకైతే రాత్రి సమయంలో పిక్కలు నొప్పిపెడుతుంటాయి. మగవారు కూడా ఎక్కువ దూరం నడవలేరు.

**శరీరం ద్రవాలు కోల్పోవడం...** సాధారణంగా శరీరంలోని నీటిని కోల్పోవడం వల్ల కండరాలు అకస్మాత్తుగా బిగుసుకుపోతాయి. వాంతులు, విరేచనాల వల్ల కూడా ఇలా జరగవచ్చు. ఎండలో ఎక్కువగా తిరగడం, శారీరక శ్రమ వల్ల కూడా ఇలా కావచ్చు.

ఇంకా మానసిక ఒత్తిడి, ఆందోళన, పని ఒత్తిడి, టైట్ షెడ్యూల్స్, తీవ్రమైన ఒత్తిడికి లోనైనప్పుడు మజిల్ క్రాంప్ సమస్య అధికంగా ఉంటుంది.

**నివారణ**

- వేసవిలో వచ్చే మజిల్ క్రాంప్స్ నివారణకు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు శరీరం నుండి ద్రవాలను కోల్పోకుండా చూసుకోవాలి. ఒకవేళ ఎక్కువగా ద్రవాలను కోల్పోయే పరిస్థితి ఉంటే నిమ్మకాయ రసంలో ఉప్పు కలుపుకుని తాగడం లేదా కొబ్బరినీళ్లు తాగడం... ఈ రెండూ అందుబాటులో లేకపోతే కనీసం కాసిని మంచి నీరు తాగడం. తాజాపండ్లు తినడం మంచిది.
- క్యాల్షియమ్ లోపం వల్ల మజిల్ క్రాంప్స్ వస్తుంటే క్యాల్షియమ్ సప్లిమెంట్స్‌ను తీసుకోవాలి. దానికి మనం తినే ఆహారంలో పాలు, పాల ఉత్పాదనలు, ఆకుకూరలు వంటివి ఎక్కువగా తీసుకోవాలి
- చలి కారణంగా వచ్చే మజిల్ క్రాంప్స్‌ను నివారించడానికి ఉన్ని దుస్తులు ధరించాలి. చలికి ఎక్కువగా గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- పొగ తాగడం, మద్యం అలవాట్లను పూర్తిగా మానేయాలి
- ఒత్తిడి వల్ల కూడా మజిల్ క్రాంప్స్ వస్తాయి. కాబట్టి ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి
- హైపోథైరాయిడిజమ్ వల్ల వచ్చే మజిల్ క్రాంప్స్‌ను తగ్గించడానికి తగిన చికిత్స తీసుకోవాలి.

# సినిమా



శర్వానంద్

## జూన్‌లో మనమే

జూన్‌లో థియేటర్స్‌కు వస్తోంది 'మనమే' అని శర్వానంద్ అంటున్నారు. శర్వానంద్, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా, చైల్డ్ ఆర్టిస్టు విక్రమాదిత్య కీలక పాత్రలో నటించిన చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను జూన్ 7న విడుదల చేయనున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం వెల్లడించి, శర్వానంద్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ''ఈ సినిమాలో శర్వానంద్, కృతి డిఫరెంట్ రోల్స్‌లో కనిపిస్తారు. ప్రేక్షకులకు మంచి వినోదం అందించే చిత్రం ఇది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరకర్త.

## కెరీర్‌లో కొత్త దశలోకి వెళుతున్నాను

**- కాజల్ అగర్వాల్**



కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'సత్యభామ'. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. దర్శకుడు శశికిరణ్ తిక్క ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు సమర్పకుడిగా వ్యవహరించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం జూన్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''సత్యభామ' వంటి యాక్షన్ సినిమాతో నా కెరీర్‌లో ఓ కొత్త దశలోకి వెళుతున్నాను. ఈ సినిమాలో నేను చాలా ఫైట్స్ చేశాను. కొత్త ఎమోషన్స్‌ను ఎక్స్‌పీరియన్స్ చేశాను. శశిగారు కథ చెప్పినప్పుడు నచ్చింది. కథపై నమ్మకం కలిగింది. అయితే ఈ సినిమా గ్లింప్స్ విడుదలైన తర్వాత ఆ నమ్మకం రెట్టింపు అయ్యింది. శశిగారు లేకపోతే 'సత్యభామ' లేదు. కీరవాణి, చంద్రబోస్ గార్లకు థ్యాంక్స్. 'వెతుకు వెతుకు..' సాంగ్‌కు మంచి స్పందన వచ్చింది. అమర్ పాత్రలో నవీన్ చంద్ర బాగా యాక్ట్ చేశారు. టీమ్ అందరూ చాలా కష్టపడ్డారు. నన్ను స్టార్ హీరోయిన్‌ని చేసిన తెలుగు ప్రేక్షకుల ప్రేమ 'సత్యభామ' సినిమాపై కూడా ఉండాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''సినిమాల పట్ల కాజల్‌గారికి ఉన్న ప్యాషన్ మమ్మల్ని ఇన్‌స్పైర్ చేసింది. 'సత్యభామ'ను థియేటర్స్‌లో చూసి సక్సెస్ చేయండి'' అన్నారు నిర్మాతలు. ''దర్శకుడిగా నా తొలి చిత్రం ఇది. నా మొదటి హీరో (సినిమాలో కాజల్ లీడ్ రోల్ చేశారు కాబట్టి హీరో అని సంబోధించారు) కాజల్‌గారిని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను'' అన్నారు సుమన్ చిక్కాల. ''కాజల్‌గారు కథ విన్న వెంటనే షూటింగ్ ఎప్పట్నుంచి ప్లాన్ చేసుకుంటారనడంతో మేం సర్‌ప్రైజ్ అయ్యాం. ఎమోషనల్ పవర్‌ప్యాక్డ్ ఫిల్మ్ 'సత్యభామ'' అన్నారు శశికిరణ్ తిక్క. ''సత్యభామ' చాలా మంచి సబ్జెక్ట్. నా క్యారెక్టర్ కూడా బాగా నచ్చింది. మా చేతిలో ఓ సక్సెస్‌ఫుల్ సినిమా ఉంది'' అన్నారు నవీన్ చంద్ర. పాటల రచయిత రాంబాబు, ఎడిటర్ పవన్ పాల్గొన్నారు.


కాజోల్
ప్రభుదేవా

## కాంబినేషన్ కుదిరింది

'మిన్సార కనవు' ('మెరుపు కలలు' – 1997) చిత్రం తర్వాత కాజోల్, ప్రభుదేవా మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. ఇరవయ్యేడేళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాతో నిర్మాత చరణ్ తేజ్ ఉప్పలపాటి బాలీవుడ్‌కు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నసీరుద్దీన్ షా, సంయుక్తా మీనన్, జిషు సేన్ గుప్తా, ఆదిత్య సీల్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీ చిత్రీకరణ మొదలైంది. ''మా సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ మొదలైంది. త్వరలోనే టీజర్‌తో పాటు మరిన్ని వివరాలను వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. చరణ్ తేజ్‌కి మాత్రమే కాదు.. సంయుక్తాకు కూడా హిందీలో ఇది తొలి చిత్రం కావడం విశేషం.


ఆషిక

## సంక్రాంతికి మరోసారి...

''ఓ అద్భుతమైన సినిమాటిక్ జర్నీకి స్వాగతం'' అంటూ ఆషికా రంగనాథ్‌ను ఆహ్వానించింది 'విశ్వంభర' చిత్ర యూనిట్. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న చిత్రం 'విశ్వంభర'. ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తున్నారు. ఓ ముఖ్యమైన పాత్రకు ఆషికా రంగనాథ్‌ని తీసుకున్నారు. ఈ సంక్రాంతికి విడుదలైన 'నా సామి రంగ'లో నాగార్జున సరసన కథానాయికగా నటించారు ఆషిక. ఆ చిత్రంలో మాస్ క్యారెక్టర్‌లో ఆకట్టుకున్నారీ బ్యూటీ. ఆ పాత్రలో కనబర్చిన నటనే 'విశ్వంభర'లో నటించే అవకాశం దక్కేలా చేసిందని టాక్. ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీగా రూపొందుతున్న 'విశ్వంభర' వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న విడుదల కానుంది. ఇక ఈ సంక్రాంతికి 'నా సామి రంగ'తో వచ్చిన ఆషిక మరోసారి వచ్చే ఏడాది సంక్రాంతికి తెరపై కనిపించనున్నారు.

## రాజస్థాన్‌లో ఫైట్

హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ రాజస్థాన్‌లో ఫైట్ చేస్తున్నారు. అది కూడా పగటి పూట కాదు.. రాత్రి. పది రాత్రులు ఈ ఫైట్ జరుగుతుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా రూపొందుతున్న 'టైసన్ నాయుడు' చిత్రం కోసమే ఈ ఫైట్. సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ రాజస్థాన్‌లో జరుగుతోంది. దాదాపు పది రాత్రులు హీరో, విలన్లపై స్టంట్ మాస్టర్ స్టన్ శివ పర్యవేక్షణలో యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేసినట్లు చిత్రబృందం పేర్కొంది. అలాగే ఓ ఐదు రోజుల పాటు టాకీ షూట్ చేయనున్నారు. పోలీసాఫీసర్‌గా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కి సంగీతం: భీమ్స్, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్.


బెల్లంకొండ సాయి శ్రీనివాస్

## ఏది మంచి?


'యేవమ్' పోస్టర్

చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, భరత్ రాజ్, అషూ రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'యేవమ్'. ఏది మంచి.. ఏది చెడు..? అనేది క్యాప్షన్. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో ఎస్ఐ సౌమ్య పాత్రలో చాందినీ చౌదరి నటించారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేసి, ఈ సినిమా విజయాన్ని ఆకాంక్షించారు. 'ఐయామ్ యుగంధర్.. హారికను నేనే చంపాను..' అనే డైలాగ్ టీజర్‌లో ఉంది.

## అలకాపురి లోకంలో...


మంచు లక్ష్మి, రాహుల్, వేదిక

వేదిక, మంచు లక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'యక్షిణి'. తేజా మార్ని దర్శకత్వంలో శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మిస్తున్న ఈ వెబ్‌సిరీస్ జూన్ 14 నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ప్లాట్‌ఫామ్‌లో తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ వెబ్ సిరీస్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో వేదిక మాట్లాడుతూ– ''ఇందులోని క్యారెక్టర్స్‌లో డెప్త్, డిఫరెంట్ వేరియేషన్స్ ఉన్నాయి'' అన్నారు. ''నేను 'జ్వాల' పాత్రలో నటించాను'' అన్నారు మంచు లక్ష్మి. ''యక్షిణి' విజయం పట్ల నమ్మకంతో ఉన్నాం'' అన్నారు రాహుల్ విజయ్. ''అలకాపురి అనే లోకం నుంచి ఒక శాపం వల్ల భూమ్మీదకు వచ్చిన యక్షిణి వంద మందిని చంపితేగానీ శాప విముక్తి కాదు. ఆ వంద మందిని ఎలా చంపింది? వందో వ్యక్తి ఎవరు? అనేది ఈ సిరీస్ స్టోరీ'' అన్నారు తేజా మార్ని. ''యక్షిణి' సీజన్ 2 కోసం కూడా ప్లాన్ మొదలుపెట్టాం'' అన్నారు దేవినేని ప్రసాద్.

## మరో ముప్పైఏళ్లు ఎదురు చూడక్కర్లేదు!

**- దర్శకురాలు పాయల్ కపాడియా**


'కాన్స్'లో 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' టీమ్ సందడి

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కాన్స్ చిత్రోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. ఈ వేడుకల్లో ప్రధాన విభాగమైన పామ్ డి ఓర్‌లో భారతీయ ఫిల్మ్‌మేకర్ పాయల్ కపాడియా తెరకెక్కించిన 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రం పోటీలో ఉంది. దాదాపు ముప్పైఏళ్ల తర్వాత ఈ విభాగంలో ఓ భారతీయ చిత్రం పోటీలో నిలిచింది. షాజీ ఎన్. కరుణ్ దర్శకత్వం వహించిన మలయాళ చిత్రం 'స్వాహమ్' 1994 కాన్స్ చిత్రోత్సవాల్లో పోటీలో నిలిచింది. ఇన్నేళ్ల తర్వాత మరో భారతీయ చిత్రం ఎంపిక కావడం విశేషం. తాజాగా 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' కాన్స్‌లో ప్రదర్శితం కాగా, ఏడు నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. ఈ టీమ్ కాన్స్‌లో చేసిన సందడి హైలైట్‌గా నిలిచింది. ''ఇండియా నుంచి చాలా మంచి చిత్రాలు వస్తుంటాయి. బాలీవుడ్ మాత్రమే కాదు... దేశంలోని ప్రతి రాష్ట్రంలో అద్భుతమైన ఫిల్మ్‌మేకర్స్ ఉన్నారు. కాన్స్‌లోని ప్రధాన విభాగంలో పోటీ పడటానికి మరో ముప్పైఏళ్లు చూడక్కర్లేదని నాకనిపిస్తోంది'' అంటూ ఓ హాలీవుడ్ మీడియా సంస్థతో మాట్లాడారు పాయల్ కపాడియా. ఇక కని కస్రుతి, దివ్య ప్రభ, ఛాయా కదం లీడ్ రోల్స్‌లో నటించిన 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్'కు పాయల్ కపాడియా దర్శకత్వం వహించగా, థామస్ హకీమ్–జూలియన్ గ్రాఫ్ నిర్మించారు.

సాక్షి బిజినెస్
శనివారం
25-5-2024

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 8 | 75,410 |
| నిఫ్టీ ▽ | 11 | 22,957 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 16,936 | △ 200 |
| డోజోన్స్ | 39,138 | △ 73 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,318 | ▽ 22 |
| డాక్స్ | 18,693 | △ 2 |
| షాంఘై | 3,088 | ▽ 28 |
| నికాయ్ | 38,647 | ▽ 457 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** (రూ.లలో) — ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (24 క్యారెట్) | 70,640 ▽ | 950 |
| బంగారం (22 క్యారెట్) | 67,280 ▽ | 500 |
| వెండి (కిలో) | 96,500 ▽ | 500 |

**ఫారెక్స్ రేట్లు** (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 82.91 | 83.93 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 104.77 | 107.33 |
| € | యూరో | ఎస్‌బీఐ | 89.37 | 91.74 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 52.80 | 53.96 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 54.65 | 56.59 |
| S$ | సింగపూర్ డాలర్ | [illegible] | 59.54 | 64.19 |
| SAR | సౌదీ రియాల్ | [illegible] | 21.31 | 22.87 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | [illegible] | 21.79 | 23.57 |
| ¥ | చైనా యువాన్ | [illegible] | 10.38 | 12.45 |

## ఫ్లిప్‌కార్ట్‌లో గూగుల్‌కు మైనారిటీ వాటాలు

**రూ. 2,900 కోట్ల పెట్టుబడి**

**న్యూఢిల్లీ:** గూగుల్ తమ సంస్థలో మైనారిటీ వాటాలు కొనుగోలు చేయనున్నట్లు ఈ–కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. డీల్ వివరాలను నిర్దిష్టంగా వెల్లడించనప్పటికీ గూగుల్ 350 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 2,900 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు సమాచారం. ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుతం 1 బిలియన్ డాలర్ల నిధులను సమీకరిస్తోందని, అందులో భాగంగానే గూగుల్ కూడా ఇన్వెస్ట్ చేయనుందని సమాచారం. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్‌కు మాతృ సంస్థ, వాల్‌మార్ట్ నుంచి 600 మిలియన్ డాలర్లు లభించాయని వివరించాయి.

# మేడిన్ ఇండియా రేంజ్ రోవర్

● రేంజ్ రోవర్ స్పోర్ట్ సైతం తయారీ ● జాగ్వార్ ల్యాండ్ రోవర్ నిర్ణయం ● ప్రస్తుతం యూకే ప్లాంటులో ఉత్పత్తి




**ముంబై:** మేడిన్ ఇండియా రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ కార్లు కొద్ది రోజుల్లో భారత రోడ్లపై పరుగు తీయనున్నాయి. దేశీయంగా వీటి తయారీ చేపట్టాలని టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ నిర్ణయించింది. 54 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ మోడళ్లు యూకే వెలుపల ఒక దేశంలో తయారు కానుండడం ఇదే తొలిసారి. ప్రస్తుతం యూకేలోని సోలిహల్ వద్ద ఉన్న జాగ్వార్ ల్యాండ్ రోవర్ ప్లాంటులో తయారైన రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ కార్లు భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా 121 మార్కెట్లకు ఎగుమతి అవుతున్నాయి. దేశీయంగా తయారైతే ఈ రెండు మోడళ్ల ధర 18–22 శాతం తగ్గనుందని కంపెనీ వెల్లడించింది. రానున్న రోజుల్లో రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ మోడళ్ల అమ్మకాలు పెరుగుతాయని టాటా గ్రూప్ చైర్మన్ ఎస్.చంద్రశేఖరన్ ధీమా వ్యక్తం చేశారు. టాటా మోటార్స్‌కు చెందిన పుణే ప్లాంటులో ఇప్పటికే రేంజ్ రోవర్ వెలార్, రేంజ్ రోవర్ ఇవోక్, జాగ్వార్ ఎఫ్–పేస్, డిస్కవరీ స్పోర్ట్ అసెంబుల్ అవుతున్నాయి. 2023–24లో దేశవ్యాప్తంగా జేఎల్ఆర్ ఇండియా 4,436 యూనిట్లను విక్రయించింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది ఏకంగా 81 శాతం అధికం.

## ఎన్‌టీపీసీ లాభం దూకుడు

**న్యూఢిల్లీ:** విద్యుత్ రంగ ప్రభుత్వ దిగ్గజం ఎన్‌టీపీసీ మార్చి త్రైమాసిక కన్సాలిడేటెడ్ నికర లాభం 33 శాతం జంప్‌చేసి రూ. 6,490 కోట్లను అధిగమించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 3.25 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 44,745 కోట్ల నుంచి రూ. 48,817 కోట్లకు బలపడింది. ఇక పూర్తి ఏడాదికి ఎన్‌టీపీసీ నికర లాభం రూ. 17,121 కోట్ల నుంచి రూ. 21,332 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 1,71,976 కోట్ల నుంచి రూ. 1,81,166 కోట్లకు పుంజుకుంది. న్యూక్లియర్ ఇంధన బిజినెస్ నిర్వహణకు పూర్తి అనుబంధ సంస్థను ఏర్పాటు చేసేందుకు బోర్డు సూత్రప్రాయంగా అనుమతించింది.




బీఎస్‌ఈలో 0.7% ఎగసి రూ. 375 వద్ద ముగిసింది.

## అశోక్ లేలాండ్ స్పీడ్




**న్యూఢిల్లీ:** అశోక్ లేలాండ్ క్యూ4 కన్సాలిడేటెడ్ నికర లాభం 17 శాతం ఎగసి రూ. 934 కోట్లకు చేరింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 4.95 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,203 కోట్ల నుంచి రూ. 13,578 కోట్లకు బలపడింది. ఇక పూర్తి ఏడాదికి అశోక్ లేలాండ్ నికర లాభం రూ. 1,359 కోట్ల నుంచి రూ. 2,696 కోట్లకు జంప్ చేసింది. మొత్తం ఆదాయం రూ. 41,673 కోట్ల నుంచి రూ. 45,791 కోట్లకు పుంజుకుంది.

ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం నష్టంతో రూ. 211 వద్ద ముగిసింది.

## హిందాల్కో మెరుపులు

**న్యూఢిల్లీ:** అల్యూమినియం దిగ్గజం హిందాల్కో గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 32 శాతం జంప్‌చేసి రూ. 3,174 కోట్లను తాకింది. అల్యూమినియం, కాపర్ బిజినెస్ అమ్మకాలు, మెరుగైన మార్జిన్లు ఇందుకు దోహదపడ్డాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,411 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 56,209 కోట్ల నుంచి రూ. 56,356 కోట్లకు స్వల్పంగా బలపడింది. దీనిలో కాపర్ బిజినెస్ 20 శాతం ఎగసి రూ. 13,424 కోట్లకు చేరింది. కాగా.. గతేడాది అన్ని బిజినెస్ విభాగాల్లోనూ పటిష్ఠ ఫలితాలు సాధించినట్లు కంపెనీ ఎండీ సతీష్ పాయ్ పేర్కొన్నారు. విలువ జోడింపు ఉత్పత్తులు, మార్జిన్ల పెంపుపై వ్యూహాత్మక దృష్టికి ఇవి నిదర్శనాలని తెలియజేశారు. రూ. 5,195 కోట్ల రుణాలు తిరిగి చెల్లించిన తదుపరి సైతం పటిష్ఠ బ్యాలెన్స్‌షీట్, లిక్విడిటీని కలిగి ఉన్నట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో హిందాల్కో షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం నష్టంతో రూ. 673 వద్ద ముగిసింది.

● వారాంతాన సూచీలకు స్వల్ప నష్టాలు ● ఇంట్రాడేలో కొత్త రికార్డులు నమోదు ● తొలిసారి 23 వేల స్థాయిని తాకిన నిఫ్టీ

# జీవితకాల గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ

**ముంబై:** జీవితకాల గరిష్ఠ స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. తీవ్ర ఒడిదుడుకులతో ఒక దశలో సెన్సెక్స్ 218 పాయింట్లు ర్యాలీ చేసి 75,636 వద్ద, నిఫ్టీ 59 పాయింట్లు బలపడి 23,026 వద్ద కొత్త రికార్డులు నమోదు చేశాయి. సరికొత్త స్థాయిల వద్ద ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, ఫార్మా షేర్లలో షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. చివరికి సెన్సెక్స్ ఎనిమిది పాయింట్లు నష్టపోయి 75,410 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 11 పాయింట్లు కోల్పోయి 22,957 వద్ద నిలిచింది.



■ రూపాయి విలువ వరుసగా నాలుగోరోజూ ర్యాలీ చేసింది. డాలర్ మారకంలో 19 పైసలు బలపడి 83.10 వద్ద స్థిరపడింది.

ముఖ్యాంశాలు..

■ అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ షేరు సెన్సెక్స్–30 సూచీలోకి చేరనుంది. విప్రో షేరును ఈ జాబితా నుంచి వైదొలగనుంది.
■ అదానీ ఎంటర్‌ప్రైజెస్ హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడి పూర్వపు స్థాయిని అందుకుంది.
■ లిస్టింగ్‌లో రూల్కా ఎలక్ట్రానిక్స్ అదరగొట్టింది. ఎన్‌ఎస్‌ఈ ఎస్‌ఎంఈ సూచీలో ఇష్యూ ధర (రూ.235)తో పోలిస్తే 123% ప్రీమియంతో రూ.525 వద్ద లిస్టయ్యింది. చివరికి 118% లాభంతో రూ.499 వద్ద స్థిరపడింది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-5-2024

| | |
|---|---|
| విశాఖ | 550–00 |
| చిత్తూరు | 628–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 540–00 |
| విజయవాడ | 540–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 550–00 |
| వరంగల్ | 552–00 |
| రిటైల్ ధర | 6.10 |

## కుబేరులపై పన్నులతోనే అసమానతలకు చెక్

**అధ్యయన నివేదిక స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ:** భారత్‌లో తీవ్ర స్థాయిలో పెరిగిపోతున్న సంపదపరమైన అసమానతలను పరిష్కరించడానికి కుబేరులపై పన్నులు విధించాలని ఒక అధ్యయన నివేదిక సూచించింది. రూ. 10 కోట్లకు పైగా సంపద ఉన్న అత్యంత సంపన్నులపై 2 శాతం ట్యాక్స్, రూ. 10 కోట్లకు పైగా విలువ గల ఎస్టేట్‌లపై 33 శాతం మేర వారసత్వ పన్నులు విధించాలని పేర్కొంది. దీనితో స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) 2.73 శాతం విలువ చేసేంత ఆదాయం రాగలదని తెలిపింది. బీద, నిమ్న వర్గాలు, మధ్యతరగతి వర్గాలకు తోడ్పాటు అందించేలా తగిన విధానాలు కూడా ప్రవేశపెట్టాల్సి ఉంటుందని నివేదిక అభిప్రాయపడింది. ప్రముఖ ఆర్థికవేత్తలు థామస్ పికెటీ, నితిన్ కుమార్ భారతి, లూకాస్ చాన్సెల్ ఈ నివేదికను రూపొందించారు.

## కొత్త ఔషధాలకు టెక్నాలజీ దన్ను

**డాక్టర్ రెడ్డీస్ సీఈవో దీపక్ సాప్రా**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** టెక్నాలజీ తోడ్పాటుతో కొత్త ఔషధాలను వేగవంతంగా అందుబాటులోకి తెచ్చే అవకాశాలు ఉన్నాయని ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ సీఈవో (ఏపీఐ, సర్వీసెస్) దీపక్ సాప్రా తెలిపారు. ప్రస్తుతం ఒక ఔషధం మార్కెట్లోకి రావాలంటే సగటున 12 ఏళ్ల సమయం, దాదాపు 2 బిలియన్ డాలర్ల వ్యయం అవుతోందని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీని వినియోగించుకుంటే కొన్ని సందర్భాల్లో సుమారు 30 శాతం వరకు సమయం ఆదా కావడంతో పాటు తదనుగుణంగా వ్యయాలు కూడా తగ్గగలవని ఇంజనీరింగ్, తయారీ రంగాల్లో డిజిటల్ పరివర్తనపై శుక్రవారమిక్కడ జరిగిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా సాప్రా వివరించారు. ఔషధాల ఆవిష్కరణలో టెక్నాలజీ కీలక పాత్రను అంతర్జాతీయంగా నియంత్రణ సంస్థలు గుర్తిస్తున్నాయన్నారు.

## కోరమాండల్ ఇంటర్నేషనల్ కొత్త ఉత్పత్తులు

**పంటల రక్షణ లక్ష్యం**




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** అగ్రి–సొల్యూషన్స్ సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ కొత్తగా 10 ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. దిగుబడులు పెంచేందుకు, పంటల రక్షణకు ఇవి ఉపయోగపడతాయని సంస్థ తెలిపింది. కాండం తొలిచే పురుగులు మొదలైన వాటి నుంచి వరి పంటను కాపాడేందుకు ఉద్దేశించిన ప్రచండ్ తయారీ కోసం ఐఎస్‌కే జపాన్‌తో జట్టు కట్టినట్లు వివరించింది. దీనితో దిగుబడి నష్టాలు 70 శాతం వరకు తగ్గగలవని పేర్కొంది. ఒకే సంవత్సరంలో 10 ఉత్పత్తులను తాము ప్రవేశపెట్టడం ఇదే ప్రథమమని కంపెనీ ఈడీ రఘురాం దేవరకొండ తెలిపారు.

## ఆడియో, విజువల్ ఫార్మాట్లో పబ్లిక్ ఇష్యూ వివరాలు

**జూలై 1 నుంచి అమల్లోకి**




**న్యూఢిల్లీ:** పబ్లిక్ ఇష్యూల ఆఫర్ డాక్యుమెంట్లలో వెల్లడించే కీలక వివరాలను (డిస్‌క్లోజర్స్) కంపెనీలు ఇకపై ఆడియో, విజువల్ (ఏవీ) రూపంలో కూడా ఇవ్వాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిర్ణయించింది. జూలై 1 తర్వాత సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసే సంస్థలకు ఇది స్వచ్ఛందంగా ఉంటుంది. అక్టోబర్ 1 నుంచి ఇది తప్పనిసరవుతుందని ఒక సర్క్యులర్‌లో సెబీ పేర్కొంది. ఆఫర్‌కి సంబంధించిన కీలకాంశాలను ఇన్వెస్టర్లు సులభతరంగా అర్థం చేసుకునేందుకు ఈ విధానం తోడ్పడుతుందని తెలిపింది. ఏవీ ప్రాథమికంగా ఇంగ్లిష్, హిందీ భాషల్లో సుమారు 10 నిమిషాల వ్యవధితో ఉండాలి. ఇందులో రిస్కుపరమైన అంశాలు, పెట్టుబడి స్వరూపం, ఇష్యూ లక్ష్యాలు, ఇష్యూయర్ వ్యాపారం, ఆర్థిక సమాచారం, లిటిగేషన్లు మొదలైన వివరాలన్నీ వాస్తవికమైన వికంగా ఉండాలని పేర్కొంది.

---

**సాక్షి స్పోర్ట్స్**



## టైటిల్‌కు గెలుపు దూరంలో యూకీ బాంబ్రీ జోడీ...

భారత అగ్రశ్రేణి టెన్నిస్ క్రీడాకారుడు యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో మూడో ఏటీపీ డబుల్స్ టైటిల్‌కు విజయం దూరంలో ఉన్నాడు. పారిస్‌లో జరుగుతున్న ఓపెన్ పార్క్ ఏటీపీ–250 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 6–7 (5/7), 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను బోల్తా కొట్టించింది. ఒక గంటా 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ ద్వయం ఏడు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. నేడు జరిగే ఫైనల్లో హెలియోవారా (ఫిన్‌లాండ్)–హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్)లతో యూకీ–ఒలివెట్టి పోటీపడతారు. యూకీ ఈ ఏడాది ఒలివెట్టితో కలిసి మ్యూనిక్ ఓపెన్‌లో, గత ఏడాది లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)తో కలిసి మలోర్కా ఓపెన్‌లో డబుల్స్ టైటిల్స్ గెలిచాడు.

# సూపర్ సన్‌రైజర్స్

**ఐపీఎల్ ఫైనల్లో హైదరాబాద్**

● రెండో క్వాలిఫయర్‌లో ఘన విజయం
● 36 పరుగులతో రాజస్తాన్ చిత్తు
● క్లాసెన్ అర్ధ సెంచరీ, రాణించిన బౌలర్లు
● రేపు తుదిపోరులో కోల్‌కతాతో 'ఢీ'

సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ అసలు సత్తాను మరోసారి ప్రదర్శించింది. తొలి క్వాలిఫయర్‌లో పేలవ ఆటతో ఓటమి పాలైన జట్టు రెండో క్వాలిఫయర్‌కు వచ్చేసరికి అన్ని అస్త్రాలతో చెలరేగింది. ఫలితంగా ఆరేళ్ల తర్వాత ఐపీఎల్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. బ్యాటింగ్‌లో హెడ్, అభిషేక్, మార్క్‌రమ్ విఫలమైనా... క్లాసెన్, త్రిపాఠి ఆదుకోవడంతో హైదరాబాద్ మెరుగైన స్కోరు సాధించగలిగింది. ఆ తర్వాత బౌలర్లు చెలరేగి ప్రత్యర్థి బ్యాటర్లను పూర్తిగా కట్టిపడేశారు. బెంగళూరుతో ఎలిమినేటర్‌లో కూడా దాదాపు ఇదే స్కోరును తడబడుతూనే ఛేదించిన రాజస్తాన్ ఈసారి మాత్రం కుప్పకూలింది. చెపాక్ మైదానంలో ఇద్దరు లెఫ్టార్మ్ స్పిన్నర్లు షహబాజ్, అభిషేక్ శర్మ కలిసి 47 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టి రాయల్స్ కథను ముగించడంలో కీలక పాత్ర పోషించారు. ఇక తొలి క్వాలిఫయర్‌లో ఓటమికి ప్రతీకారం తీర్చుకునే సమయమూ వచ్చింది. రెండో టైటిల్ వేటలో ఆదివారం కోల్‌కతాతో సమరానికి సన్‌రైజర్స్ సిద్ధంగా ఉంది.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షహబాజ్ అహ్మద్

**చెన్నై:** ఐపీఎల్–17 ఫైనల్ సమరం కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనుంది. శుక్రవారం జరిగిన రెండో క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్ 36 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (34 బంతుల్లో 50; 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... రాహుల్ త్రిపాఠి (15 బంతుల్లో 37; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), ట్రవిస్ హెడ్ (28 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం రాజస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 139 పరుగులే చేయగలిగింది. ధ్రువ్ జురేల్ (35 బంతుల్లో 56 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), మినహా అంతా విఫలమయ్యారు.

**రాణించిన త్రిపాఠి...**

ఓపెనర్ అభిషేక్ (12) తొలి ఓవర్లోనే వెనుదిరగ్గా... హెడ్ తన శైలికి భిన్నంగా నెమ్మదిగా ఆడాడు. అయితే త్రిపాఠి దూకుడైన ఇన్నింగ్స్‌తో స్కోరును పరుగెత్తించాడు. అశ్విన్ ఓవర్లో వరుసగా 4, 4, 6 బాదిన అతను, బౌల్ట్ ఓవర్లోనూ వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి అదే జోరులో తర్వాతి బంతికి అవుటయ్యాడు. అదే ఓవర్లో మార్క్‌రమ్ (1) కూడా పెవిలియన్ చేరాడు. ఈ దశలో రాయల్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో హెడ్, క్లాసెన్ కూడా భారీ షాట్లు ఆడటంలో విఫలమయ్యారు. ఫలితంగా వరుసగా 29 బంతుల పాటు బౌండరీనే రాకపోగా, హెడ్ కూడా అవుటయ్యాడు. చహల్ వరుస బంతుల్లో నితీశ్ రెడ్డి (5), సమద్ (0)లను అవుట్ చేసి మరింత దెబ్బ తీశాడు. మరోవైపు 33 బంతుల్లో క్లాసెన్ అర్ధసెంచరీ పూర్తయింది. 18 ఓవర్లు ముగిశాక స్కోరు 163/6 కాగా క్లాసెన్ ఉండటంతో రైజర్స్ మరిన్ని పరుగులు ఆశించింది. అయితే 19వ ఓవర్ తొలి బంతికి క్లాసెన్ బౌల్డ్ కావడంతో ఆఖరి 11 బంతుల్లో 12 పరుగులే వచ్చాయి.



అభిషేక్ శర్మ సంబరం



క్లాసెన్

**టపటపా...**

ఛేదనలో రాయల్స్‌కు సరైన ఆరంభం లభించలేదు. టామ్ కోలర్ (10) ప్రభావం చూపలేకపోగా, 5 ఓవర్లలో 32 పరుగులే వచ్చాయి. అయితే భువనేశ్వర్ వేసిన ఆరో ఓవర్లో యశస్వి జైస్వాల్ సిక్స్, 3 ఫోర్లతో చెలరేగడంతో రాజస్తాన్ దారిలో పడినట్లు అనిపించింది. కానీ ఆ తర్వాత పరిస్థితి అంతా ఒక్కసారిగా మారిపోయింది. 13 పరుగుల వ్యవధిలో జట్టు 3 ప్రధాన వికెట్లు కోల్పోయింది. ముందుకొచ్చి షాట్లు ఆడే క్రమంలో యశస్వి, సామ్సన్ (10), పరాగ్ (6) వెనుదిరిగారు. అశ్విన్ (0) డకౌట్ కాగా, ఆశలు పెట్టుకున్న హెట్‌మైర్ (4) కూడా చేతులెత్తేశాడు. 39 బంతుల్లో 84 పరుగులు చేయాల్సిన స్థితిలో విండీస్ బ్యాటర్ల నుంచి రాజస్తాన్ అద్భుతం ఆశించింది. కానీ హెట్‌మైర్ (4), పావెల్ (6) విఫలం కావడంతో జట్టు గెలుపు ఆశలు కోల్పోయింది. మరోవైపు జురేల్ పోరాడినా అది ఏమాత్రం సరిపోలేదు.

**2** డెక్కన్ చార్జర్స్ జట్టు తర్వాత ఐపీఎల్ టోర్నీలో గత సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచి తర్వాతి సీజన్‌లో ఫైనల్‌కు చేరిన రెండో జట్టుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలిచింది. 2023లో సన్‌రైజర్స్ చివరి స్థానంలో నిలిచింది. 2008 తొలి సీజన్‌లో డెక్కన్ చార్జర్స్ పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో నిలిచి 2009లో అగ్రస్థానంలో నిలవడంతోపాటు విజేతగా కూడా అవతరించింది.

**3** ఐపీఎల్ టోర్నీలో సన్‌రైజర్స్ ఫైనల్‌కు చేరడం ఇది మూడోసారి. 2016లో తొలిసారి విజేత అయింది. 2018లో రన్నరప్‌గా నిలిచింది.

### స్కోరు వివరాలు

**సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్:** హెడ్ (సి) అశ్విన్ (బి) సందీప్ శర్మ 34; అభిషేక్ శర్మ (సి) కోలర్ (బి) బౌల్ట్ 12; త్రిపాఠి (సి) చహల్ (బి) బౌల్ట్ 37; మార్క్‌రమ్ (సి) చహల్ (బి) బౌల్ట్ 1; క్లాసెన్ (బి) సందీప్ 50; నితీశ్ రెడ్డి (సి) చహల్ (బి) అవేశ్ 5; సమద్ (బి) అవేశ్ 0; షహబాజ్ (సి) జురేల్ (బి) అవేశ్ 18; కమిన్స్ (నాటౌట్) 5; ఉనాద్కట్ (రనౌట్) 5; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 175.** వికెట్ల పతనం: 1–13, 2–55, 3–57, 4–99, 5–120, 6–120, 7–163, 8–170, 9–175. **బౌలింగ్:** బౌల్ట్ 4–0–45–3, అశ్విన్ 4–0–43–0, సందీప్ 4–0–25–2, అవేశ్ 4–0–27–3, చహల్ 4–0–34–0.

**రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) సమద్ (బి) షహబాజ్ 42; టామ్ కోలర్ (సి) త్రిపాఠి (బి) కమిన్స్ 10; సామ్సన్ (సి) మార్క్‌రమ్ (బి) అభిషేక్ 10; పరాగ్ (సి) అభిషేక్ (బి) షహబాజ్ 6; జురేల్ (నాటౌట్) 56; అశ్విన్ (సి) క్లాసెన్ (బి) షహబాజ్ 0; హెట్‌మైర్ (బి) అభిషేక్ 4; పావెల్ (సి) అభిషేక్ (బి) నటరాజన్ 6; బౌల్ట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 139. వికెట్ల పతనం:** 1–24, 2–65, 3–67, 4–79, 5–79, 6–92, 7–124. **బౌలింగ్:** భువనేశ్వర్ 3–0–33–0, కమిన్స్ 4–0–30–1, నటరాజన్ 3–0–13–1, ఉనాద్కట్ 1–0–5–0, షహబాజ్ 4–0–23–3, అభిషేక్ 4–0–24–2, మార్క్‌రమ్ 1–0–10–0.

## మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో జ్యోతి సురేఖ జోడీ




**యెచోన్ (దక్షిణ కొరియా):** ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ రెండో స్వర్ణంపై గురి పెట్టింది. ఇప్పటికే మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో ఫైనల్ చేరిన జ్యోతి సురేఖ... మిక్స్‌డ్ టీమ్ కేటగిరీలో ప్రియాంశ్‌తో కలిసి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ రెండు ఫైనల్స్ నేడు జరుగుతాయి. శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ సెమీఫైనల్లో జ్యోతి సురేఖ–ప్రియాంశ్ (భారత్) ద్వయం 158–157తో హాన్ సెంగ్యోన్–యాంగ్ జేవన్ (దక్షిణ కొరియా) జంటను ఓడించింది. నేడు జరిగే ఫైనల్లో ఒలివియా డీన్–సాయెర్ (అమెరికా)లతో జ్యోతి సురేఖ–ప్రియాంశ్ తలపడతారు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రపంచ మాజీ నంబర్‌వన్, భారత స్టార్ దీపిక కుమారి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో దీపిక 6–4తో ఎలిఫ్ బెరా గొకిర్ (టర్కీ)పై గెలిచింది.

## టాప్ సీడ్‌ను ఓడించి సెమీస్‌లో సింధు



**కౌలాలంపూర్:** ఆరు నెలల తర్వాత భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఓ అంతర్జాతీయ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరింది. మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో టైటిల్ దిశగా సింధు మరో అడుగు వేసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 55 నిమిషాల్లో 21–13, 14–21, 21–12తో ప్రపంచ ఆరో ర్యాంకర్, టాప్ సీడ్ హన్ యువె (చైనా)ను కంగుతినిపించింది. నేడు జరిగే సెమీఫైనల్లో థాయ్‌లాండ్‌కు చెందిన బుసానన్‌తో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 17–1తో బుసానన్‌పై ఆధిక్యంలో ఉంది. భారత రైజింగ్ స్టార్ అష్మిత పోరాటం క్వార్టర్స్‌లో ముగిసింది. అష్మిత 10–21, 15–21తో ఆరో సీడ్ జాంగ్ యి మన్ (చైనా) చేతిలో ఓడిపోయింది.



భారత అగ్రశ్రేణి బాక్సర్, వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ శుక్రవారం క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను కలిసింది. ఇటీవల ఎలోర్డా కప్‌లో స్వర్ణం సాధించిన నిఖత్‌ను అభినందించిన సచిన్... ఆమె పారిస్ ఒలింపిక్స్‌లో పతకం గెలవాలని ఆకాంక్షించారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్ కూడా చిత్రంలో ఉన్నారు.

## సచిన్ శుభారంభం



**బ్యాంకాక్:** ఒలింపిక్ వరల్డ్ క్వాలిఫయింగ్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ సచిన్ సివాచ్ శుభారంభం చేశాడు. శుక్రవారం జరిగిన 57 కేజీల విభాగం తొలి రౌండ్ బౌట్‌లో సచిన్ 5–0తో అలెక్స్ ముకుకా (న్యూజిలాండ్)పై గెలుపొందాడు. పారిస్ ఒలింపిక్స్‌కు ఇదే చివరి అర్హత టోర్నమెంట్. ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరుకున్న బాక్సర్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. భారత్ నుంచి పురుషుల విభాగంలో ఏడుగురు, మహిళల విభాగంలో ముగ్గురు బాక్సర్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నారు.

## భారత్ పరాజయం

**అంట్‌వెర్ప్ (బెల్జియం):** అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రో లీగ్‌లో భారత పురుషుల జట్టుకు 1–4తో ప్రపంచ మూడో ర్యాంకర్ బెల్జియం చేతిలో పరాజయం ఎదురైంది. ఈ మ్యాచ్‌లో రక్షణ పంక్తి వైఫల్యాలతో భారత్ మూల్యం చెల్లించుకుంది. అందివచ్చిన పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంలోనూ విఫలమైంది. భారత్ తరఫున నమోదైన ఏకైక గోల్‌ను అభిషేక్ (55వ ని.లో) ఆఖరి క్వార్టర్‌లో నమోదు చేశాడు. బెల్జియం బృందంలో హెండ్రిక్స్ అలెగ్జాండర్ (34వ, 60వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించగా, ఫెలిక్స్ (22వ ని.), చార్లియెర్ సెడ్రిక్ (49వ ని.) చెరో గోల్ చేశారు. నేడు భారత్ మళ్లీ బెల్జియంతోనే తలపడుతుంది.

# మహిళా ఎంపీలు 9 మందే!


సుచేతా కృపలానీ

మహిళలను లోక్‌సభకు పంపే విషయంలో ఢిల్లీ పేలవమైన రికార్డు మూటగట్టుకుంది. స్వాతంత్య్రానంతరం ఇప్పటిదాకా నగరం నుంచి ఎంపీలుగా ఎన్నికైన మహిళలు కేవలం తొమ్మిది మంది మాత్రమే! రాజధాని నుంచి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన తొలి మహిళగా ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధురాలు సుచేతా కృపలానీ నిలిచారు. ఆమె 1952లో తొలి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1957లో కూడా గెలిచారు.

## ఢిల్లీ పేలవ రికార్డు

1963లో ఆమె యూపీ సీఎం అయ్యారు. మళ్లీ తొమ్మిదేళ్లకు 1971లో సుభద్రా జోషీ, ముకుల్ బెనర్జీ ఢిల్లీ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. సుభద్ర లోక్‌సభ ఎంపీ అయిన తొలి పంజాబీ మహిళ కూడా. ఆమె 1962లో యూపీలోని బలరాంపూర్‌లో దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని ఓడించడం విశేషం. తర్వాత 1980లో సుందర్‌వతీ నావల్ ప్రభాకర్ చాందినీ చౌక్ లోక్‌సభ స్థానం నుంచి గెలిచారు. అనంతరం 1996, 1998 ఎన్నికల్లో మీరాకుమార్, సుష్మా స్వరాజ్ ఎంపీలయ్యారు. లోక్‌సభ తొలి మహిళా స్పీకర్‌గా మీరాకుమార్ నిలవగా, ఢిల్లీ నుంచి తొలి కాంగ్రెసేతర మహిళా ఎంపీగా సుష్మా స్వరాజ్ రికార్డులెక్కారు. 1999లో బీజేపీకి చెందిన అనితా ఆర్య కరోల్ బాగ్ నుంచి గెలుపొందారు. 2004, 2009ల్లో కాంగ్రెస్‌కు చెందిన కృష్ణ తీర్థ్ ఢిల్లీ నుంచి ఎంపీ అయ్యారు. 2014, 2019ల్లో మీనాక్షి లేఖి బీజేపీ నుంచి న్యూఢిల్లీ స్థానంలో నెగ్గారు.

### బీజేపీ నుంచి బరిలో ఇద్దరు


మీనాక్షి లేఖి

ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఢిల్లీ నుంచి లోక్‌సభ బరిలో దిగినా ఓటమి చవిచూశారు. ఈసారి బీజేపీ సుష్మా స్వరాజ్ కూతురు బాసురి (న్యూఢిల్లీ), కమల్‌జీత్ షెరావత్ (వెస్ట్ ఢిల్లీ) రూపంలో ఇద్దరు మహిళలకు ఢిల్లీలో టికెట్లిచ్చింది. కాంగ్రెస్ మాత్రం ఒక్క మహిళకు కూడా ఢిల్లీలో అవకాశమివ్వలేదు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

# బీజేడీకి సవాల్!

## బీజేపీ గట్టి పోటీ

## 6 స్థానాలకు నేడు పోలింగ్

ఒడిశాలో ఇప్పటిదాకా 9 లోక్‌సభ సీట్లకు, వాటి పరిధిలోని 63 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ పూర్తయింది. ఆరో విడతలో 6 లోక్‌సభ సీట్లకు శనివారం పోలింగ్ జరగనుంది. అధికార బిజూ జనతాదళ్, బీజేపీ హోరాహోరీగా తలపడుతుండగా కాంగ్రెస్ పూర్వ వైభవం కోసం శ్రమిస్తోంది. ఈ నేపథ్యంలో కీలక నియోజకవర్గాలపై ఫోకస్...

\- సాక్షి, నేషనల్ డెస్క్

### సంభాల్‌పూర్... తొలిసారి కాషాయ జెండా


ధర్మేంద్ర ప్రధాన్

2019లో ఇక్కడ తొలిసారి కాషాయ జెండా ఎగిరింది. బీజేపీ నేత నరేశ్ గంగదేవ్ కేవలం 9,162 ఓట్ల తేడాతో బీజేడీ అభ్యర్థి నళినీకాంత ప్రధాన్‌ను ఓడించారు. ఈసారి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో దిగారు. కాంగ్రెస్ నుంచి నాగేంద్ర ప్రధాన్, బీజేడీ నుంచి ప్రణబ్ ప్రకాశ్ దాస్ పోటీలో ఉన్నారు. త్రిముఖ పోరు ఉత్కంఠ రేపుతోంది.

### పూరి.. నువ్వా నేనా!


అరూప్ పట్నాయక్

సుందరమైన బీచ్‌లు, జగన్నాథుడి సన్నిధితో కళకళలాడే పూరిలో బీజేడీకి 2019లో బీజేపీ జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్ర చుక్కలు చూపించారు. చివరిదాకా గట్టి పోటీ ఇచ్చి కేవలం 11,714 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈసారి మళ్లీ సవాలు విసురుతున్నారు. ఇక బీజేడీ సిట్టింగ్ ఎంపీ పినాకీ మిశ్రాకు బదులు ముంబై మాజీ పోలీస్ కమిషనర్ అరూప్ పట్నాయక్‌ను బరిలోకి దించింది. కాంగ్రెస్ నుంచి జయనారాయణ్ పట్నాయక్ పోటీలో ఉన్నారు. ఆ పార్టీకి ఇక్కడ బలమైన ఓటు బ్యాంకుంది.

### భువనేశ్వర్... నవీన్‌కు సవాల్


అపరాజితా సారంగి

ఈ టెంపుల్ సిటీలో గత ఎన్నికల్లో తొలిసారి బీజేపీ గెలిచింది. బీజేడీ అభ్యర్థి, ముంబై మాజీ పోలీస్ కమిషనర్ అరూప్ పట్నాయక్‌ను బీజేపీ తరఫున మాజీ ఐఏఎస్ అపరాజితా సారంగి ఓడించారు. ఈసారీ ఆమే బరిలో ఉన్నారు. బీజేడీ నుంచి మన్మథ రౌత్రే, కాంగ్రెస్ నుంచి యాసిర్ నవాజ్ పోటీలో ఉన్నారు. దాంతో త్రిముఖ పోటీ రసవత్తరంగా మారింది. ఇండియా కూటమి భాగస్వామి సీపీఎం కూడా పోటీలో ఉండటం కొసమెరుపు!

### కటక్... బీజేడీ కంచుకోట


భర్తృహరి మహతాబ్

స్వాతంత్య్ర యోధుడు సుభాష్ చంద్ర బోస్ జన్మస్థలమిది, హొయలొలికించే మహానదీ తీరాన 900 ఏళ్ల కళింగ రాజధానిగా వెలిగింది. బీజేడీ దిగ్గజం భర్తృహరి మహతాబ్ 1998 నుంచి వరుసగా ఆరుసార్లు గెలిచారు. ఇటీవలే బీజేపీలో చేరి ఆ పార్టీ టికెట్‌పై బరిలోకి దిగారు. బీజేడీ నుంచి సంతృప్త్ మిశ్రా, కాంగ్రెస్ నుంచి సురేశ్ మహాపాత్ర రేసులో ఉన్నారు. కంచుకోటను కాపాడుకునేందుకు సీఎం నవీన్ పట్నాయక్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌కూ మంచి ఓటు బ్యాంకు ఉండటంతో త్రిముఖ పోరు ఉత్కంఠ రేపుతోంది.

### కియోంజర్.. పోటాపోటీ


ధనుర్జయ సిద్దు

ఈ ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం 2009 నుంచీ బీజేడీ గుప్పెట్లోనే ఉంది. 2019లో బీజేడీ నుంచి గెలిచిన చంద్రానీ ముర్ము యంగెస్ట్ ఎంపీగా రికార్డు సృష్టించారు. ఈసారి ధనుర్జయ సిద్దుకు బీజేడీ టికెటిచ్చింది. బీజేపీ నుంచి అనంత నాయక్, కాంగ్రెస్ నుంచి బినోద్ బిహారీ నాయక్ రేసులో ఉన్నారు. కియోంజర్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో 6 బీజేడీ చేతిలోనే ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.

# గురుగ్రాంలో ముక్కోణం

## బరిలో మంత్రి ఇందర్‌జీత్, నటుడు రాజ్ బబ్బర్

## గట్టి పోటీ ఇస్తున్న గాయకుడు రాహుల్ యాదవ్

**గురుగ్రాం. మిలీనియం సిటీ. దేశ రాజధానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరం. బహుళజాతి కంపెనీలకు నిలయం. శనివారం పోలింగ్ జరగనున్న ఈ లోక్‌సభ స్థానంలో బీజేపీ, కాంగ్రెస్, జేజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి రావు ఇందర్‌జీత్ సింగ్, కాంగ్రెస్ నుంచి నటుడు రాజ్ బబ్బర్, జేజేపీ నుంచి హర్యాన్వీ గాయకుడు రాహుల్ యాదవ్ హోరాహోరీ తలపడుతున్నారు...**

\- సాక్షి, నేషనల్ డెస్క్

మిలీనియం సిటీగా పేరొందిన గురుగ్రాంలో ఫార్చ్యూన్ 500 జాబితాలోని 250కి పైగా కంపెనీలున్నాయి. పెప్సికో, నెస్లే, ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ వంటి దిగ్గజ సంస్థల ప్రధాన కార్యాలయాలున్నాయి. ఇంతటి కీలక నగరంలో మౌలిక సదుపాయాల కొరత ప్రధాన సమస్య. వర్షాకాలంలో ఇది కొట్టొచ్చినట్టు కన్పిస్తుంటుంది. నీటి ఎద్దడి, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, ట్రాఫిక్ రద్దీ స్థానికులను ఆందోళనపరిచే అంశాల్లో కొన్ని మాత్రమే. గురుగ్రాం లోక్‌సభ స్థానంలో ఏకంగా 25.3 లక్షల మంది ఓటర్లున్నారు. ఓటర్లపరంగా హరియాణాలో ఇదే అతి పెద్ద లోక్‌సభ స్థానం. ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఓటర్ ఇన్ క్యూ యాప్, ఓటర్లకు పోలింగ్ ఆహ్వానాలు, బహుళ అంతస్తుల సొసైటీల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు వంటివి చేశారు.


• రావ్ ఇందర్‌జీత్ సింగ్

### ముక్కోణపు పోటీ...

కేంద్ర మంత్రి రావ్ ఇందర్‌జీత్ సింగ్ గురుగ్రాం నుంచి ఐదుసార్లు గెలిచారు. ఆయనకు గట్టి పోటీ ఇవ్వడంతో పాటు బీజేపీ పట్టణ ఓటు బ్యాంకును కొల్లగొట్టాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. అందుకే అహిర్వాల్‌కు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్‌ను పక్కన పెట్టి రాజ్ బబ్బర్‌కు టికెటిచ్చింది. ఈ స్థానంలో కాంగ్రెస్ యాదవేతర అభ్యర్థిని నిలబెట్టడం ఇదే మొదటిసారి. ఇది హరియాణా కాంగ్రెస్‌లో అసంతృప్తికి కారణమైంది. 2019లో ఓడిన అజయ్ సింగ్ యాదవ్ కూడా బబ్బర్ ఎంపికపై అసంతృప్తితో ఉన్నారు. యాదవ్ ఓట్లను రాబట్టుకునేందుకు జననాయక్ జనతా పార్టీ వ్యూహాత్మకంగా రాపర్ సింగర్ రాహుల్ యాదవ్ అలియాస్ ఫజిల్‌పురియాకు టికెటిచ్చింది.


• రాజ్ బబ్బర్

### విమర్శల హోరు...

బబ్బర్ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ ప్రకటించగానే ఆయనపై 'ఔట్ సైడర్' ప్రచారాన్ని బీజేపీ ముమ్మరం చేసింది. దీన్ని రాజ్ బబ్బర్ గట్టిగానే తిప్పికొడుతున్నారు. దేశ విభజన తరువాత తన కుటుంబం అంబాలాకు చేరుకుందని, గురుగ్రాం, ఫరీదాబాద్‌ల్లో తమ బంధువులున్నారని చెబుతున్నారు. 'మై బాహారీ నహీ హూ' అని ప్రతి సభలోనూ ప్రత్యేకంగా చెబుతున్నారు. హరియాణాకు భారీగా ఆదాయం సమకూరుస్తున్నా గురుగ్రాంలో మౌలిక సదుపాయాలే లేవంటూ బీజేపీపై దుమ్మెత్తిపోస్తున్నారు. కానీ నగరంలో జరిగిన అభివృద్ధంతా తన హయాంలో జరిగిందేనని ఇందర్‌జీత్ అంటున్నారు. ఆయన తరఫున కూతురు ఆర్తి సింగ్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇక రాజకీయాల్లో విప్లవాత్మక మార్పుకోసమే తాను పోటీ చేస్తున్నానని ఫజిల్‌పురియా చెబుతున్నారు. పక్కా లోకల్ పార్టీ అయిన జేజేపీకే ఓటేయాలన్న ఆయన అభ్యర్థనకు మంచి స్పందనే వస్తోంది.

# లోక్‌సభ బరిలో ప్యాడ్ ఉమన్

## ఝార్‌గ్రామ్ నుంచి పోటీ చేస్తున్న సోనామణి



బెంగాల్–జార్ఖండ్ సరిహద్దుల్లోని గిరిజన గ్రామాలు. అక్షరాస్యత అంతంతే. మహిళల రుతు సమస్యలపై చర్చ కూడా నిషిద్ధమే. దాన్ని బ్రేక్ చేశారామె. సమస్యపై మహిళలకు అవగాహన కల్పించడమే గాక శానిటరీ న్యాప్‌కిన్ల వాడకం నేర్పించారు. జార్ఖండ్–బెంగాల్ సరిహద్దుల్లో ప్యాడ్ ఉమన్‌గా పేరొందారు. పశ్చిమ బెంగాల్లో శనివారం పోలింగ్ జరగనున్న ఝార్‌గ్రామ్ లోక్‌సభ స్థానం నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆమే జార్ఖండ్ మట్టి బిడ్డ, బెంగాల్ కోడలు సోనామణి ముర్ము...

సోనామణి జార్ఖండ్‌లోని తూర్పు సింగ్‌భూమ్ జిల్లా కొడియాలో జన్మించారు. జంషెడ్‌పూర్‌లో సైకాలజీలో పీజీ చేశారు. నిరక్షరాస్యతకు అమాయకత్వం తోడవటంతో స్థానిక మహిళల్లో అనేక ఆరోగ్య సమస్యలు. టీనేజ్ అమ్మాయిలతో మొదలు పెట్టిన మహిళలందరికీ రుతుక్రమ సమస్యలపై అవగాహన కల్పించారు. పెళ్లికి ముందు స్థానిక పంచాయతీ ఎన్నికల్లో గెలిచి ప్రధాన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2016లో బెంగాల్‌లోని బంద్వాన్ నివాసి మనీష్ తుడును పెళ్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిగా విజయం సాధించారు. ఇప్పుడు ఏకంగా లోక్‌సభ బరిలో నిలిచారు.

**దీదీ, మోదీలతో విసిగిపోయారు..**

ఝార్‌గ్రామ్ ఒకప్పుడు సీపీఎం కంచుకోట. జంగల్‌మహల్‌లో మావోయిస్టుల హింస తరువాత తృణమూల్ అధికారంలోకి వచ్చింది. ఎర్రకోట పచ్చగా మారింది. సీపీఎం కార్యకర్తలు ఇళ్లు వీడాల్సి వచ్చింది. గత లోక్‌సభలో అక్కడ బీజేపీ గెలిచింది. ఈసారి మాత్రం లాల్ జెండా ఎగరడం ఖాయమంటున్నారు గిరిజన బిడ్డ సోనామణి. "దీదీ, మోదీ చిత్రహింసలతో జనం విసిగిపోయారు. అందుకే ఎర్రజెండాను కోరుతున్నారు. ఝార్‌గ్రామ్‌లో పేదరికం ఎక్కువ. రెండు పూటలా కడుపునిండా తిండి దొరకని స్థితి. ఉపాధి లేదు. ఉపాధి హామీ పనులూ లేవు. సాగుపైనే ఆధారపడే అటవీ ప్రాంతాల ప్రజలకు ఎరువులు, విత్తనాల ధరలు అందుబాటులో లేవు. పాఠశాలల పరిస్థితి అధ్వానం. చదువుకున్నవారికి ఉద్యోగాలు లేవు. ఈ పరిస్థితిని మారుస్తా" అంటూ ఇంటింటికీ ప్రచారం చేసి ఆకట్టుకున్నారామె.

\- సాక్షి, నేషనల్ డెస్క్

# అవగాహన లేకనే అనర్థం

## నేడు వరల్డ్ థైరాయిడ్ డే


- థైరాయిడ్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి
- ప్రతి ఏడాది పెరుగుతున్న థైరాయిడ్ బాధితులు
- అప్పుడే పుట్టిన బిడ్డకు వ్యాధి సోకుతోంది

ప్రత్తిపాడుకు చెందిన సురేష్, జానకి దంపతులకు పెళ్లయిన ఏడేళ్ల అనంతరం మగబిడ్డ జన్మించాడు. బిడ్డకు ఐదేళ్ల వయస్సు వచ్చినా లావు కావటం లేదని భావించిన సురేష్ దంపతులు వైద్యులను సంప్రదించారు. పరీక్షల అనంతరం బాలుడు థైరాయిడ్ వ్యాధికి గురైనట్లు వైద్యులు చెప్పటంతో ఖంగుతిన్నారు. లేకలేక పుట్టిన బిడ్డకు ఈ వ్యాధి ఎలా వచ్చిందో అర్థంగాక తలలు పట్టుకున్నారు.

పొన్నూరుకు చెందిన గాయత్రికి రెండేళ్ల కిందట పెళ్లయ్యింది. అనంతరం గర్భం ధరించటంతో బరువు పెరగసాగింది. కడుపులో బిడ్డ ఉండటం వల్ల, బిడ్డ కోసం అధికంగా పోషకాహారం తీసుకోవటం వల్ల బరువు పెరిగి ఉండవచ్చని భావించిన తల్లిదండ్రులు కాన్పు సమయంలో గుంటూరులోని సూపర్ స్పెషాలిటి వైద్యులను సంప్రదించగా థైరాయిడ్ వ్యాధికి గురైనట్లు రిపోర్టు రావటంతో గాబరా పడ్డారు.

గుంటూరు మెడికల్

ఇలా ప్రతి రోజూ ఎంతో మంది వైద్యం కోసం వస్తున్నారని థైరాయిడ్ గ్రంథిపై చాలా మందికి సరైన అవగాహన లేకపోవటంతో వ్యాధిని నియంత్రణలో పెట్టుకోలేక అవస్థలు పడుతున్నట్లు ఎండ్రోక్రైనాలజిస్టులు తెలిపారు. శనివారం వరల్డ్ థైరాయిడ్ డే సందర్భంగా ×సాక్షి\ అందిస్తున్న ప్రత్యేక కథనం.




### థైరాయిడ్ గ్రంథి చేసే పనులు

గొంతు ముందు భాగంలో శ్వాస నాళానికి ఇరుపక్కలా గులాబీ రంగులో ఇంచుమించు సీతాకోక చిలుక ఆకారంలో ఉండే గ్రంథిని థైరాయిడ్ గ్రంథి అంటారు .థైరాయిడ్ గ్రంథి మెదడులోని పిట్యూటరీ గ్రంథి స్రవించే థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్(టి.ఎస్.హెచ్)ద్వారా టి3, టి4 అనే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. టి4 అనగా థైరాక్సిన్. ఇది 20గ్రాముల బరువు ఉండి శరీరంలోని చాలా జీవక్రియలను నియంత్రిస్తుంది. శరీరీ పెరుగుదలను, ఎముకల పెరుగుదలను, శరీరపు ఉష్ణోగ్రతను, మానసిక వికాసాన్ని అదుపుచేస్తుంది. వివిధ కణజాలాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ హార్మోను ఉత్పత్తికి మన శరీరంలో తగినంత అయోడిన్ అవసరం. రోజుకి 150 మైక్రోగ్రాముల (గుండుసూది తలంత) అయోడిన్ శరీరానికి అవసరం. థైరాక్సిన్‌లో 65శాతం అయోడిన్ ఉంటుంది. అయోడిన్ పెరుగుదలకు, శక్తి రావటానికి తోడ్పడుతుంది.

### వ్యాధి నిర్ధారణ

రక్తంలో టి3, టి4 టీఎస్‌హెచ్ అనే హార్మోన్లు ఎంత ఉన్నాయో పరీక్షలు చేస్తారు. దీన్నే థైరాయిడ్ ప్రొఫైల్ అంటారు.

### మందులతో కట్టడి చేయవచ్చు



ఈ వ్యాధి అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని 90 ఏళ్ల వయస్సు వారికి వస్తుంది. మేనరిక వివాహాల వల్ల వ్యాధి రావచ్చు. మగవారి కన్నా ఆడవారిలో ఎక్కువగా థైరాయిడ్ గ్రంథి సమస్య వస్తోంది. ఆడవారిలో 80శాతం మందికి ఉంటే మగవారిలో 20శాతం మందికి వస్తుంది. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స చేయిస్తే పూర్తిగా నయమవుతోంది. ఒక్కొక్కరిలో ఒక్కోవిధంగా వ్యాధి లక్షణాలు ఉంటాయి. ఆహారంలో అయోడిన్ లోపం లేకుండా చూసుకోవటం వల్ల కొంత వరకు థైరాయిడ్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. జన్యుపరలోపాల వల్ల, తల్లికి ఉంటే బిడ్డకు, వంశ పారంపర్యంగా వ్యాధి వస్తుంది. అప్పుడే పుట్టిన బిడ్డకు థైరాయిడ్ ఉందో లేదో నిర్ధారణ పరీక్ష చేయించటం చాలా ఉత్తమం.

\- డాక్టర్ కె.సుబ్బారావు, ఎండ్రోకినాలజిస్టు, గుంటూరు.

### థైరాయిడ్ లోపం వల్ల..

ఈ వ్యాధి లక్షణాలు ఒక్కసారిగా కాక నిదానంగా కనబడతాయి. ఈ వ్యాధి వచ్చిన వారిలో ఉత్సాహం తగ్గి, అంతకు ముందులేని మందకొడితనం చోటు చేసుకుంటుంది. విపరీతమైన అలసట, నడవాలన్నా, పనిచేయాలన్నా ఓపిక ఉండదు. చర్మంలో తడి, నునుపు తనం తగ్గి, ఎండిపోయినట్లు ఉంటుంది. కండరాలు ఉబ్బుతాయి. దాని వల్ల ఒళ్లు ఉబ్బుగా కనిపిస్తుంది. ఒళ్లు ఉబ్బరం వల్ల ఉబ్బుకామెర్లుగా భ్రమపడే అవకాశం ఉంది. మలబద్ధకం, సెక్స్ సామర్థ్యం తగ్గిపోవడం, కండరాలు పట్టివేసినట్లు ఉండటం, చర్మం క్రింద కొవ్వు చేరి బరువు పెరుగుతారు. గొంతు బొంగురుగా మారటం, ముఖం గుండ్రంగా కనపడటం, మనిషి మందమతిగా మారతాడు. జీవక్రియ రేటు విపరీతంగా పెరిగి శరీరంలోని అన్ని శక్తి వనరులు ఖాళీ అవుతాయి. ఎముకల్లో క్యాల్షియం తక్కువై ఎముకలు పెలుసు బారతాయి. తలమీద వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి. ముఖ్యంగా కనుబొమ్మల వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి. పిల్లలో పెరుగుదల ఉండదు. పిచ్చితనం వస్తుంది. లావు అవ్వటం, బరువుపెరగటం, మత్తు, నిద్ర, ఒళ్లు నొప్పులు, మలబద్ధకం, స్త్రీలలో రుతుచక్రంలో మార్పులు రావటం, గర్భం రావటం ఆలస్యం అవ్వటం, తరచుగా గర్భస్రావాలు జరగటం తదితర లక్షణాలు ఉంటాయి.

# మంటెక్కిస్తున్న మిర్చి

రోజురోజుకూ పచ్చిమిర్చి ఘాటు పెరుగుతోంది. మార్కెట్లో వీటి ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. కోసి తినకుండానే మంటపుట్టిస్తోంది. వారం రోజులుగా విపరీతంగా పెరుగుతుండడంతో వినియోగదారులు ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో పచ్చిమిర్చి ధర రూ.120 పలుకుతోంది. ఇదే పరిస్థితి మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం స్థానికంగా పంట లభ్యం కాకపోవడంతోనే ధరలు భారీగా పెరుగుతున్నాయని వారు పేర్కొంటున్నారు. బోర్ల కింద సాగుచేసిన రైతులకు లాభాలే లాభాలు.



- మార్కెట్లో పచ్చిమిర్చి ధర కిలో రూ.120
- దిగుబడులు లేకపోవడంతో పెరుగుతున్న ధరలు
- వారం రోజుల్లో కిలో ధర రూ.80 నుంచి రూ.120కి చేరిక
- బెంగళూరు, కడప, కర్నూలు జిల్లాల నుంచి దిగుమతి
- బోర్ల కింద సాగుచేసిన రైతులకు లాభాలు
- ఎకరాకు 8 నుంచి 10 వేల కిలోల దిగుబడి

మార్కాపురం: వేసవి వచ్చిందంటే కూరగాయల ధరలు కొండెక్కుతాయి. అందులో ప్రధానంగా టమోటా, మిర్చితో పాటు ఆకుకూరల ధరలు కూడా ఆకాశాన్నంటుతాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. ప్రతి ఏడాది ఏప్రిల్ నెలాఖరు నుంచి జూన్ నెలాఖరు వరకూ మిర్చి ధరలు ఎగబాకుతూనే ఉంటాయి. రైతులకు పచ్చిమిర్చి లాభాలు కురిపిస్తుండగా, వినియోగదారులు కొనాలంటే భయపడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో మిర్చి సాగుచేస్తున్నారు. దీంతో స్థానికంగా పచ్చిమిర్చి అందుబాటులో లేకపోవడంతో కడప, బాపట్ల, కర్నూలు జిల్లాలతో పాటు బెంగళూరు నుంచి జిల్లాలోని వివిధ మార్కెట్లకు దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలో గిద్దలూరు, రాచర్ల, దర్శి, ఒంగోలు తదితర ప్రాంతాల్లో కొంతమంది రైతులు ఈ ఏడాది ఫిబ్రవరిలో బోర్ల కింద మిర్చి సాగుచేశారు. ముందుచూపుతో వారు చేపట్టిన సాగు నేడు అధిక ధరలతో లాభాల పంట పండిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో బాపట్ల జిల్లా మార్టూరు, అద్దంకి, పంగులూరుతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మిర్చి సాగు చేస్తారు. ఆగస్టు నుంచి జనవరి మధ్య మార్కెట్‌కు తెస్తారు. మిర్చి కిలో ధర రూ.25 నుంచి రూ.40 మధ్య ఉంటుంది. అయితే, వేసవి కావడంతో అన్ని పంటలతో పాటు కూరగాయలు, మిర్చి సాగు కూడా నిలిచిపోయింది. ఈ వేసవిలో ముందు జాగ్రత్తగా సాగు చేసిన రైతులకు మాత్రం ధర ఊహించని విధంగా ఉండటంతో మార్కెట్‌కు తీసుకొచ్చి లాభాలు ఆర్జిస్తున్నారు. బజ్జీ మిర్చి ప్రస్తుతం బెంగళూరు నుంచి మార్కాపురం మార్కెట్‌కు వస్తోంది. ఇక్కడి నుంచి దోర్నాల, శ్రీశైలం, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, కంభం తదితర కూరగాయల మార్కెట్లకు పంపుతారు. డిమాండ్‌కు సరిపడా మిర్చి మార్కెట్‌కు రాకపోవడంతో రోజురోజుకూ ధర పెరుగుతోంది. వారం రోజుల క్రితం కిలో మిర్చి రూ.80 ఉండగా, నాలుగు రోజుల క్రితం 100కు చేరి ప్రస్తుతం 120 రూపాయలు పలుకుతోంది. ఈ ధర ఇంకా పెరిగే అవకాశం ఉంది.

### సాగు ఖర్చు ఇలా...

వేసవిలో పచ్చిమిర్చికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. దీంతో కొంతమంది రైతులు ముందుచూపుతో వ్యవహరిస్తూ బోర్ల కింద మిర్చి సాగుచేస్తున్నారు. ఒక ఎకరా పచ్చి మిర్చి సాగుకు సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకూ ఖర్చు వస్తుంది. ఎకరాకు 8 నుంచి 10 వేల కిలోలు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చిమిర్చిని వ్యాపారులు కిలో రూ.70 వరకూ రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. అక్కడి నుంచి రవాణా ఖర్చులు, కూలీలు, తమ లాభం చూసుకుని కిలో రూ.100 నుంచి రూ.120 వరకూ విక్రయిస్తున్నారు.

### ఇతర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు: రమేష్, కూరగాయల వ్యాపారి

ప్రస్తుతం వేసవి కావడంతో మార్కాపురం ప్రాంతంలో మిర్చి సాగు లేకపోవడంతో గిద్దలూరు, పోరుమామిళ్ల, కడప, మైదుకూరు, కర్నూలు ప్రాంతాల నుంచి మిర్చి వస్తుంది. బజ్జీ మిర్చి బెంగళూరు నుంచి వస్తుంది. రవాణా ఖర్చులు, కూలీల చార్జీలు కలుపుకుంటే మాకు కిలో 95 రూపాయలు పడుతోంది. వేసవి కావడంతో కొన్ని కాయలు పాడైపోతున్నాయి. దీంతో 100 నుంచి 110, 120 మధ్య అమ్ముతున్నాం. వర్షాలు పడి మిర్చి సాగైతే ధర తగ్గుతుంది.

### మిర్చి, టమోటా సాగుతో లాభాలు : గోపీనాథ్, హార్టీకల్చర్ ఏడీ, ఒంగోలు

జనవరి, ఫిబ్రవరి నెలల్లో మిర్చి, టమోటా సాగుచేసుకుంటే వేసవిలో మంచి లాభాలు పొందవచ్చు. బోర్ల కింద నీటి సౌలభ్యం ఉంటే వీటిని సాగుచేసుకుంటే వేసవి సీజన్‌లో దిగుబడులు వస్తాయి. మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా కూరగాయలు ఉండవు. అందువలన రైతులు పండించిన కూరగాయలకు మంచి ధర వస్తుంది.

# తమ్ముడిని చంపేసిన రైల్వే టీసీ

- ఆస్తి పంపకాల విషయంలో తమ్ముడిపై ద్వేషం పెంచుకున్న అన్న
- గురువారం అర్ధరాత్రి అన్నదమ్ముల మధ్య ఘర్షణ
- అన్నకొట్టిన దెబ్బలు తాళలేక కన్నుమూసిన తమ్ముడు
- నిందితుడు సౌత్ కోస్టల్ రైల్వేలో టీసీ.. హతుడు పెయింటర్

సింగరాయకొండ: అన్నాదమ్ముల మధ్య ఆస్తి విషయంలో తలెత్తిన విభేదాలు హత్యకు దారితీశాయి. అన్న కొట్టిన దెబ్బలు తాళలేక తమ్ముడు చొప్పర శివశంకర్(37) మృతి చెందాడు. ఈ విషాద ఘటన శుక్రవారం తెల్లవారుజామున ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీ వెంకటేశ్వరకాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటేశ్వర కాలనీకి చెందిన చొప్పర శివకృష్ణ, శివశంకర్ అన్నదమ్ములు. వీరి తండ్రి జాలయ్య రైల్వేలో వాచ్‌మెన్‌గా పని చేస్తూ 2008లో వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ఈ క్రమంలో శివకృష్ణ సౌత్ కోస్టల్ రైల్వేలో టీసీగా ఎంపికవడంతో తమ్ముడికి పొలం, ఇంటి స్థలం ఇచ్చి బతుకుతెరువు చూపారు. అప్పటి నుంచి శివశంకర్‌పై ద్వేషం పెంచుకున్న శివకృష్ణ తరచూ గొడవపడుతుండేవాడు. ప్రస్తుతం శివకృష్ణ ఒంగోలులో నివసిస్తుండగా, శివశంకర్ తన తల్లిదండ్రులతో కలిసి మూలగుంటపాడులో జీవిస్తున్నాడు. శివశంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**అర్ధరాత్రి వేళ వివాదం**

కుమార్తెకు పుట్టు వెంట్రుకలు తీస్తున్న నేపథ్యంలో మూలగుంటపాడులో ఉంటున్న తండ్రి జాలయ్యను తీసుకెళ్లేందుకు శివకృష్ణ గురువారం అర్ధరాత్రి వచ్చాడు. ఈ సందర్భంగా శివకృష్ణ తన తండ్రి జాలయ్యను ఖర్చుల కోసం 5 వేల రూపాయలు అడగ్గా ఇద్దరి మధ్య వాగ్వాదం ప్రారంభమైంది. తండ్రిని పక్కకు తీసుకెళ్లేందుకు శివశంకర్ అడ్డురాగా.. అన్నాదమ్ముల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. శివకృష్ణ తన తమ్ముడి చాతీపై పిడిగుద్దులు గుద్దడంతో పాటు తలపై తీవ్ర గాయం చేశాడు. ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉన్న శివశంకర్ తానే స్వయంగా 108కు ఫోన్ చేసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నాడు. వైద్య సిబ్బంది మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు. ఒంగోలు వెళ్తుండగా మార్గమధ్యంలో శివశంకర్ కన్నుమూశాడు. ఈ ఘటనపై తండ్రి జాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శనివారం । 25 । మే । 2024




లింగాయత్ మహామఠ్ స్థాపకురాలు అక్క అన్నపూర్ణ తాయి గురువారం హైదరాబాద్‌లో పరమపదించారు. శుక్రవారం ఆమె పార్థివ దేహాన్ని బీదర్‌కు తీసుకువచ్చి అంత్యక్రియలకు తరలిస్తున్న దృశ్యం

# భక్తబృందాలపై మృత్యుపంజా

- తిరుమలకు వెళ్తుండగా వంతెన పైనుంచి బోల్తాపడిన కారు
- హావేరి జిల్లాలో ఘటన
- నలుగురు మృతి
- ధర్మస్థల వెళ్లి వస్తుండగా కారును ఢీకొన్న లారీ
- నలుగురు మృతి
- చిక్కమగళూరు జిల్లాలో ఘటన



బోల్తాపడిన కారు



రాణిబెన్నూరు బైపాస్ వద్ద వంతెన పైనుంచి పడి నుజ్జయిన కారు



కొట్టిగెహార వద్ద నుజ్జయిన ఓమినీ వాహనం

సాక్షి, బళ్లారి/ యశవంతపుర: దేవుడి కరుణాకటాక్షాల కోసం వెళ్తుంటే మృత్యువు ఎదురైంది. దేవుడిని దర్శించుకొని ప్రసాదాలు తీసుకొని తిరుగు ప్రయాణమైన భక్త బృందంపై మృత్యువు కసిగా కాటేసింది. రెండు రోడ్డు ప్రమాదాల్లో 8 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. హావేరి జిల్లా కేంద్రానికి చెందిన 10 మంది భక్తులు కారులో శుక్రవారం వేకువజామున తిరుమల తిరుపతికి బయల్దేరారు. రాణిబెన్నూరు హలగేరి బైపాస్ వద్దకు రాగానే అతి వేగం కారణంగా కారు అదుపు తప్పి వంతెనపైనుంచి రోడ్డుపైకి పడిపోయింది. వాహనం నుజ్జునుజ్జు కావడంతో సురేశ్ వీరప్ప జాడి(45), ఐశ్వర్య ఈరప్ప బార్కి(22), చేతన ప్రభురాజ సమగండి(7), పవిత్ర ప్రభురాజ సమగండి(28) అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నవీరప్ప జాడి, సావిత్రి జాడి, వికాశ హొన్నప్ప బార్కి, హొన్నొప్ప నీలప్ప బార్కి, ప్రభురాజ ఈరప్ప సమగండి, గీతా హొన్నప్ప బార్కిలు గాయపడ్డారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతులను, క్షతగాత్రులను బయటకు తీశారు. క్షతగాత్రులను దావణగెరె ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**మూడిగెరె వద్ద...**

చిక్కమగళూరు జిల్లా మూడిగెరెకి సమీపంలోని చార్మాడి ఘాట్ సమీపంలోని బణకల్, కొట్టిగేహర రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. చిత్రదుర్గ జిల్లా హొళల్కెరె తాలూకా చిక్కజాజూరు సమీపంలోని చెన్నపట్టణ గ్రామానికి చెందిన 9 మంది ఓమ్ని కారులో ధర్మస్థలం వెళ్లారు. స్వామివారిని దర్శించుకొని శుక్రవారం మధ్యాహ్నం తిరిగి వెళ్తుండగా మూడిగెరె సమీపంలో మూడిగెరె నుంచి కొట్టిగెహారకు వెళ్తున్న మెస్కాం లారీ ఎదురైంది. ఈక్రమంలో లారీ, కారు ఢీకొన్నాయి. అదే సమయంలో ఏడుమందితో ప్రయాణిస్తున్న ఆల్టో కారు వచ్చి ముందున్న కారును ఢీకొంది. ప్రమాదంలో ఓమ్ని కారులోని హంపయ్య(65), ప్రేమ(58), మంజయ్య(60), ప్రభాకర్(45) మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మూడిగెరె పోలీసులు వచ్చి క్షతగాత్రులను మంగళూరుకు తరలించారు. ఆల్టో కారులోని వారికి ఎలాంటి గాయాలు కాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.



మరణించిన చేతన్





రాణిబెన్నూరు వద్ద ప్రమాద స్థలంలో మృతదేహాలు

## న్యూస్‌రీల్

### తాగిన మైకంలో బ్యారేజీలోకి దూకి..



బ్యారేజీలోకి దూకుతున్న యువకుడు

దొడ్డబళ్లాపురం: మద్యం మత్తులో బ్యారేజీలోకి దూకిన యువకుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన కలబుర్గి జిల్లా కమలాపుర తాలూకా పటవాలో చోటుచేసుకుంది. మహమ్మద్ సాజిద్ దస్తగిర్ (25) మృతి చెందిన యువకుడు. మృతుడు స్నేహితులతో కలిసి మస్తాన్ ఖాద్రి దర్గాకు వెళ్లిన సమయంలో సమీపంలోని బ్యారేజీ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో స్నేహితులు అందరూ మద్యం తాగి ఉన్నారు. స్నేహితులతో పందెం వేసుకుని బ్యారేజీలో దూకిన దస్తగిర్ మద్యం మత్తులో ఈత కొట్టలేక నీటమునిగి మృతి చెందాడు. దస్తగిర్ నీటిలో దూకుతున్న దృశ్యాలను స్నేహితులు మొబైల్‌తో వీడియో తీశారు. కమలాపుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### కబినికి వరద నీరు

మైసూరు : కేరళ రాష్ట్రంలోని వైనాడులో కురుస్తున్న భారీ వర్షాలతో మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా బీచనహళ్లి వద్దగల కబిని జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. గురువారం 6473 క్యూసెక్కుల వరద నీరు చేరగా శుక్రవారం సైతం 6373 క్యూసెక్కుల నీరు చేరినట్లు అధికారులు తెలిపారు. గరిష్ట నీటి మట్టం 2284 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 2259.74 అడుగులకు చేరింది. 7.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గేట్లు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### రేవ్ పార్టీ కేసు, ఏఎస్‌ఐ సహా ముగ్గురు పోలీసులపై వేటు

బనశంకరి: ఐదు రోజుల క్రితం ఎలక్ట్రానిక్ సిటీ ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన రేవ్‌పార్టీకి సంబంధించి హెబ్బగోడి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐతో పాటు ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రేవ్‌పార్టీ పట్ల సమాచారం సేకరించడంలో విఫలమయ్యారనే ఆరోపణలతో హెబ్బగోడి ఏఎస్ఐ నారాయణస్వామి, కానిస్టేబుళ్లు గిరీశ్, దేవరాజులను శుక్రవారం గ్రామాంతర ఎస్పీ మల్లికార్జున బాలదండి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇదే సందర్భంగా డీఎస్పీ, సీఐలకు ఎస్పీ చార్జ్ మెమో ఇచ్చారు.

### ప్రజ్వల్‌కు విదేశాంగ శాఖ నోటీస్

బనశంకరి: పెన్‌డ్రైవ్ కేసు అనంతరం విదేశాల్లో తలదాచుకున్న ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు శుక్రవారం విదేశాంగశాఖ షోకాజ్ నోటీస్ జారీ చేసింది. మీ పాస్‌పోర్టును ఎందుకు రద్దు చేయరాదని ప్రశ్నిస్తూ త్వరలో సమాధానం ఇవ్వాలని సూచించింది. సిట్ లేఖ రాసిన నేపథ్యంలో పాస్‌పోర్టు రద్దు ప్రక్రియ ప్రారంభించిన విదేశాంగశాఖ మీపై కేసు నమోదైంది. కోర్టు కూడా అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. కేసు నమోదైన వెంటనే పాస్‌పోర్టుతో విదేశాలకు వెళ్లారు. విచారణ నుంచి తప్పించుకోవడానికి మీరు పాస్‌పోర్టు దుర్వినియోగానికి పాల్పడి విదేశాలకు పారిపోయారు. మీ పాస్‌పోర్టు ఎందుకు రద్దు చేయరాదని అడిగింది. దీనిపై వివరాలతో నిర్దిష్ట అవధిలో ఇవ్వాలని ఒకవేళ సమాచారం సంతృప్తికరంగా లేకపోతే పాస్‌పోర్టు రద్దు చేస్తామని విదేశాంగశాఖ నోటీస్‌లో హెచ్చరించింది.

## పసందైన పనస.. మామిడి మాధుర్యం

మైసూరు : మైసూరులోని కుప్పణ్ణ పార్క్‌లో ఉద్యానవన శాఖ, మైసూరు జెడ్పీ ఆధ్వర్యంలో మామిడి, పనస మేళాకు స్పందన లభించింది. ఈమేళాను శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ కేవీ రాజేంద్ర, జెడ్పీ సీఈఓ కే.ఎం. గాయత్రి ప్రారంభించారు. రామనగర, మండ్య, మైసూరు, చామరాజనగర జిల్లాల మామిడి, పనస రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొచ్చి ప్రదర్శనలో ఉంచారు. నగరవాసులు పెద్ద సంఖ్యలో హాజరై మామిడి, పనస పండ్లను కొనుగోలు చేశారు. ఈప్రదర్శన మూడు రోజులపాటు ఉంటుంది.



ఏమి తీపిదనం: మామిడిని కొంటున్న దృశ్యం



పనస కాయలను కొంటున్న దృశ్యం

## రాజధాని సమస్యలు పట్టవా ?

- 28న భారీ ఎత్తున ఆందోళనలు : బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర

శివాజీనగర: రాజధాని బెంగళూరులో సమస్యలు పేరుకుపోయాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ధ్వజమెత్తారు. శుక్రవారం మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయం జగన్నాథ భవన్‌లో బెంగళూరు సమస్యలపై చర్చల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బెంగళూరు నగరంలో సమస్యలకు పరిష్కారం కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి వార్డులో బీజేపీ పోరాటాన్ని చేపడుతోందని, అందులో భాగంగా ఈనెల 28న భారీ ఎత్తున ఆందోళన చేపట్టనున్నామని చెప్పారు. శుక్రవారం నగర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించామని, ఐటీ నగరిలో జరుగుతున్న అవ్యవస్థలపై చర్చించామన్నారు. కేవలం రెండు రోజుల వర్షానికే బెంగళూరులోని రోడ్లు వాహనాలు తిరగకుండా బ్లాక్ అయ్యాయి. నగరంలో అధిక పన్ను చెల్లించే ప్రజలున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత బెంగళూరు నగరాభివృద్ధికి ఒక్క రూపాయిని కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రోడ్లు అన్ని గుంతలమయంగా మారాయి. చెత్త తొలగింపు అస్తవ్యస్తంగా మారింది. బెంగళూరు నగర అభివృద్ధి గురించి ఎవరూ కూడా యోచించకపోవటం దురదృష్టకరమని విజయేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## దగ్గి ప్రాణాలతో బయటపడిన పసికందు

- బాగల్‌కోటె జిల్లా ఇలకల్ పట్టణంలో ఘటన

యశవంతపుర: తీవ్ర అనారోగ్యానికి గురైన 13 నెలల పసికందు మృతి చెందినట్లు భావించి కుటుంబ సభ్యులు కన్నీటి మధ్య అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా ఒక్కసారిగా బాలికలో చలనం వచ్చింది. ఈ ఘటన బాగలకోట జిల్లా ఇలకల్ పట్టణంలో జరిగింది. ద్యామణ్ణ, నీలమ్మ దంపతులకు 13 నెలల కుమార్తె ఉంది. ఊపిరి ఆడక ఇబ్బంది పడుతుండటంతో ఐదు రోజుల క్రితం బాగలకోటెలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అవయవాలు దెబ్బతిన్నాయని, పరిస్థితి విషమంగా ఉందని, చిన్నారి బతకటం కష్టమని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు పసికందును తీసుకొని వాహనంలో స్వగ్రామానికి బయల్దేరారు. మార్గం మధ్యలో శ్వాస లేకపోవడంతో చిన్నారి చనిపోయిందని భావించారు. బంధువులకు సమాచారం ఇచ్చారు. ఇంటికి వెళ్లి అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా పసికందు ఒక్కసారిగా గట్టిగా దగ్గింది. బాలికలో చలనం రావడంతో కుటుంబ సభ్యులు బాలికను చేతుల్లోకి తీసుకొని ఆనందంలో మునిగిపోయారు. అప్పటివరకు విషాదం కమ్ముకున్న ఆ ఇంటిలో ఒక్కసారిగా ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి.

### కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి జల సమాధి



మృతులు మాలతేష్, అభయ్(ఫైల్)

శివమొగ్గ : కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి ఇద్దరు ఫారంపాండ్‌లో పడి మృతి చెందారు. ఈ ఘటన శివమొగ్గ తాలూకా కుంసి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెన్నళ్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాలతేష్ (28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను అశోక్ అనే రైతుకు చెందిన పొలంలో దుక్కి దున్నేందుకు వెళ్లాడు. అతనితోపాటు గ్రామానికి చెందిన మహేష్‌కుమారుడు అభయ్ (16) కూడా మాలతేష్‌తో కలిసి వెళ్లాడు. దుక్కి పనులు పూర్తయిన తర్వాత సమీపంలోని ఫారంపాండ్‌లో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లారు. అభయ్ కాలుజారి నీటిలో పడిపోయాడు. రక్షించేందుకు మాలతేష్ కూడా నీటిలోకి దిగాడు. బయటకు రాలేక ఇద్దరూ నీటిలో మునిగి మృతి చెందారు. కుంసి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### ప్యాలెస్ పాలక మండలి కార్యాలయంపై లోకాయుక్త దాడి

- రూ.4.10 లక్షలు స్వాధీనం

మైసూరు : మైసూరు నగరంలో ఉన్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన అంబా విలాస్ ప్యాలెస్‌లో ఉన్న మైసూరు ప్యాలెస్ పరిపాలక మండలి కార్యాలయంపై లోకాయుక్త అధికారులు గురువారం రాత్రి దాడి చేశారు. ఎలాంటి దాఖలాలు లేని రూ.4.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రవేశం టికెట్, పార్కింగ్ ఫీజు వసూలులో అనేక అక్రమాలు జరిగినట్లు వాహనదారులు, పర్యాటకుల నుంచి ఫిర్యాదులు అందడంతో లోకాయుక్త ఎస్పీ సచిత్ ఆధ్వర్యంలో మైసూరు, చామరాజనగర, మండ్య, మడికేరి లోకాయుక్త డీఎస్పీలు, సిబ్బంది దాడులు నిర్వహించి సోదాలు చేశారు.

### జనావాసంలోకి అపురూప అతిథి



దొడ్డ పట్టణంలో కనిపించిన పెంగోలియన్

దొడ్డబళ్లాపురం: దొడ్డ పట్టణ శివారులోని ఫైర్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఉదయం అపురూప అతిథి దర్శనమిచ్చింది. సాధారణంగా ఎక్కడా అంతగా కనిపించని పెంగోలియన్ కనిపించడంతో అది ఏ జాతికి చెందినదో తెలీక స్థానికులు తికమకపడ్డారు. ఇది ఆఫ్రికాలో ఎక్కువగా నివసిస్తుంది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడకు తరలి వచ్చారు. అనంతరం పెంగోలియన్‌ను అధికారులు సురక్షితంగా అక్కడి నుంచి తరలించారు.

## ఖాతాలపై నకిలీ యాప్స్‌తో కన్ను

- అలాంటి యాప్స్ డౌన్‌లోడ్ చేస్తే అంతే సంగతి
- బ్యాంకు అకౌంట్ నుంచి నగదు గల్లంతే
- సైబర్ క్రైం మోసాల్లో రాష్ట్రం రెండో స్థానం
- మహానగరాల్లో బెంగళూరు మొదటి స్థానం
- జాగ్రత్తగా ఉండాలంటున్న సైబర్ నిపుణులు



బనశంకరి: సాంకేతికత రోజురోజుకు పెరుగుతోంది. అనేక అవసరాలను ఒకే ఒక స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇంటి నుంచే తీర్చుకుంటున్నాం. ఎక్కువగా బ్యాంకు సేవలకు, లావాదేవీలకు స్మార్ట్‌ఫోన్‌ను వినియోగించుకుంటున్నాం. ఇందు కోసం అనేక యాప్స్ అందుబాటులో ఉన్నాయి. ఇక్కడే సైబర్ కేటుగాళ్లు బ్యాంకు వినియోగదారులపై పంజా విసురుతున్నారు. నకిలీ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చేసి నగదు కొల్లగొడుతున్నారు.

కెనరా, ఐసీఐసీఐ ఇలా దేశంలోని ప్రముఖ బ్యాంకుల పేరుతో సైబర్ కేటుగాళ్లు వంచనకు పాల్పడుతున్నారు.అనుమానాస్పద యాప్స్‌ను మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవద్దని బ్యాంకులు, సైబర్‌క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ మోసపోతే తక్షణం సైబర్‌పోర్టల్ లేదా సైబర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సలహా ఇస్తున్నారు.

**సైబర్‌నేరాల్లో రాష్ట్రం నెంబర్-2**

ఎన్‌సీఆర్‌బీ వివరాల ప్రకారం 2023లో దేశంలోనే సైబర్‌నేరాలు 24 శాతం పెరిగాయి. సైబర్‌క్రైంలో కర్ణాటక రెండో స్థానంలో ఉంది. దేశంలోని మహానగరాలతో పోలిస్తే బెంగళూరు నగరం నెంబర్‌వన్ స్థానంలో నిలిచింది. పోలీసులు ఎంతజాగృతం చేసినప్పటికీ ప్రజలు సైబర్ వంచకుల వలలో పడి డబ్బు పోగొట్టుకుంటున్నారు. భారతీయ సైబర్ నేరాల సమన్వయకేంద్రం (ఐసీసీసీ) ఇచ్చిన సమాచారం ఆధారంగా 2021 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు దేశంలో రూ.10,300 కోట్లను సైబర్ నేరగాళ్లు లూటీచేశారు. ఇందులో సైబర్‌క్రైంకు గురైన తక్షణం ఫిర్యాదు చేసినప్పటికీ 10 శాతం నగదు మాత్రమే బ్యాంకు అకౌంట్లలో ఫ్రీజ్‌చేసి న్యాయ ప్రక్రియ ద్వారా బాధితులకు డబ్బు వెనక్కి ఇస్తున్నారు.

**1930కు ఫోన్ చేయండి**

సైబర్ నేరాలబారినపడితే తక్షణం నేషనల్ సైబర్‌క్రైం రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ) సహాయవాణి 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. ఫోన్ కాల్ ఉచితం కాగా స్థానిక భాషలో సమాచారం అందించాలి. తదనంతరం ఏంచేయాలనేదాని గురించి సహాయవాణి సిబ్బంది తెలియజేస్తారు.

యాప్ లింక్ పంపి స్మార్ట్‌ఫోన్‌ను హ్యాక్ చేసే సైబర్ వంచకులు మొబైల్ నెంబరు ఫార్వర్డ్ చేసి ఓటీపీ తెలుసుకొని అకౌంట్ నుంచి నగదు కాజేస్తారు. ఈ నేపథ్యంలో బ్యాంకు ఖాతాకు లింక్ అయిన ఫోన్ నెంబరు దేనికైనా ఫార్వర్డ్ చేశామా అని తెలుసుకోవడానికి #67#కు డయల్‌చేయాలి. ఫార్వర్డ్ అయినట్లయితే మీకు వచ్చే ఓటీపీలు సైబర్ వంచకులకు కచ్చితంగా వెళతాయి. ఫార్వర్డ్ అయితే తక్షణం #002# నెంబర్‌కు డయల్ చేస్తే ఏయే సేవలకు ఫార్వర్డ్ అయింది ఆ సర్వీస్‌లు డిసేబల్ కానున్నాయని సైబర్ పోలీసులు తెలిపారు.

**పోలీసుల సలహాలు**

- అనుమానాస్పద మొబైల్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోరాదు
- ఇన్‌స్టాల్ చేస్తే తక్షణం మొబైల్ ఇంటర్నెట్ ఆఫ్ చేయాలి
- మొబైల్ సెట్టింగ్స్‌లో యాప్ మేనేజ్‌మెంట్, యాప్స్ డౌన్‌లోడ్ పరిశీలించాలి
- గుర్తుతెలియని ఫైల్స్ ఉంటే తక్షణం డిలిట్‌చేయాలి.

#67# కు డయల్ చేసి మొబైల్ నెంబరును సురక్షితంగా ఉంచుకోవాలి.

**పాస్‌వర్డ్ భద్రంగా ఉండాలి**

బ్యాంకు ఖాతా హ్యాక్‌కు గురవ్వకుండా బలమైన పాస్‌వర్డ్ సెట్ చేసుకోవాలి

అనేక బ్యాంకు ఖాతాలు ఉంటే అన్నింటికీ ఒకే పాస్‌వర్డ్ వినియోగించవద్దు

ప్రతి మూడు నెలలకు ఒకసారి పాస్‌వర్డ్ మార్చాలి

**ఎలా వంచనకు పాల్పడతారంటే...**

- పేరుపొందిన బ్యాంకుల లోగో సృష్టించి బ్యాంకింగ్ యాప్స్ సృష్టిస్తారు
- కస్టమర్ సర్వీస్ పాయింట్ అనే నకిలీ ఏపీకే సృష్టిస్తారు
- వాట్సాప్, టెలిగ్రాం ద్వారా నకిలీ ఏపీకే ఫైల్ పంపిస్తారు
- మీ మొబైల్‌లో యాప్ ఇన్‌స్టాల్ చేస్తారు
- ఆధార్ కేవైసీ, పాన్‌కార్డు వివరాలు, నెంబర్ అప్‌డేట్‌చేస్తారు.
- మొబైల్‌లో యాప్ ఇన్‌స్టాల్ కాగానే అకౌంటు వివరాలు తీసుకుంటారు
- నేరుగా అకౌంట్‌లోని నగదు వంచకులు తమ అకౌంట్‌కు జమ చేసుకుంటారు.

### పెట్టుబడి పేరుతో పారిశ్రామికవేత్తకు రూ.1.88 కోట్ల టోకరా

బనశంకరి: తాము చెప్పిన కంపెనీలలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారు. తాజాగా ఓ పారిశ్రామిక వేత్త రూ.1.88 కోట్లు వంచనకు గురయ్యాడు. ఇతని ఫిర్యాదు మేరకు కేంద్ర సీఈఎన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శాంతినగరకు చెందిన 45 ఏళ్ల పారిశ్రామికవేత్త ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫేస్‌బుక్‌లో షేరు, ఈక్విటీల్లో పెట్టుబడి ప్రకటన చూశాడు. అనంతరం అందులో మొబైల్‌కు కాల్ చేయగా ఓ మహిళ ఫోన్ తీసి వాట్సాప్ కాల్‌లో మాట్లాడాలని సలహా ఇచ్చింది. ఆ పారిశ్రామికోత్తకు షేర్, ఈక్విటీల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. ఈమె మాటలను నమ్మిన పారిశ్రామికవేత్త వారు ఇచ్చిన వివిధ బ్యాంకు ఖాతాలకు దశల వారీగా రూ.1.88 కోట్ల నగదు జమ చేశాడు. పారిశ్రామికవేత్త లాభాల గురించి అడగ్గా మరింత పెట్టుబడి పెట్టాలని సూచించారు. దీంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## క్లుప్తంగా

### కుల రాజకీయాలను వీడాలి



జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: దేశంలో కులమత రాజకీయాలకు స్వస్తి పలకాలని సీనియర్ కవి వీర హనుమాన్ పేర్కొన్నారు. గురువారం కన్నడ భవనంలో బుద్ధ పౌర్ణిమ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బౌద్ధ మతం శాంతి, సామరస్యం, సమానత, సౌభ్రాతృత్వం వంటి వాటికి ప్రసిద్ధి గాంచిందన్నారు. కుల, మత, వర్గ, ప్రాంతీయ బేధాలను విడనాడాలన్నారు. దేశంలో శాంతి పరిఢవిల్లాలన్నారు. కార్యక్రమంలో రాజు, శ్రీనివాస్, ఆంజనేయ, ఈరణ్ణ, హేమరాజ్, ఉరుకుందప్ప, అబ్రహం, మారెప్ప, వెంకటేష్, లక్ష్మిరెడ్డి, సంతోష్‌లున్నారు.

### పార్టీ అభ్యర్థిని గెలిపించండి



మాట్లాడుతున్న ప్రహ్లాద్ జోషి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జూన్ 3న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి సూచించారు. ఆయన శుక్రవారం నగరంలో పార్టీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్ తరపున ఎన్నికల ప్రచారంలో పట్టభద్ర ఓటర్లను కలిసి అభ్యర్థించారు. 60 ఏళ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పేదలను పట్టించుకోలేదన్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతం అభివృద్ధికి మండలిని ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్‌ను పట్టభద్ర ఓటర్లు ఆశీర్వదించాలని కోరారు. ఈసందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, త్రివిక్రం జోషి తదితరులున్నారు.

### అక్రమ కట్టడాలను తొలగించండి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో అక్రమ కట్టడాలను తొలగించాలని జయ కర్ణాటక సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంఘం అధ్యక్షుడు శివకుమార్ యాదవ్ మాట్లాడారు. పలు ప్రాంతాల్లో స్థలాలను ఆక్రమించి నిర్మించుకున్న అంగళ్లను తొలగించడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

### అతిథి ఉపాధ్యాయులను కొనసాగించరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న తమను వచ్చే 2024–25వ విద్యా సంవత్సరంలో కొనసాగించాలని అతిథి ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాలూకా విద్యా శాఖాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంఘం అధ్యక్షుడు నరసింహులు మాట్లాడారు. గత 2023–24వ విద్యా సంవత్సరంలో అతిథి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించామని, తిరిగి ఆ పోస్టులను తమకు కేటాయించాలని కోరుతూ తాలూకా విద్యాశాఖాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, ప్రశాంత్, లక్ష్మి, భీమన్న, తిమ్మప్ప, రవి, మల్లికార్జునలున్నారు.

### వైభవంగా వేంకటేశ్వర రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న బసనగౌడ తదితరులు

రాయచూరు రూరల్: తాలూకాలోని దిన్నిలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ రథోత్సవం వైభవంగా ముగిసింది. గురువారం శాసన సభ్యుడు బసనగౌడ దద్దల్ ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవ వేడుక జరిపారు.

# జిల్లాస్పత్రిలో ఇష్టారాజ్యంగా పార్కింగ్

- అంబులెన్స్‌ల రాకపోకలకూ తప్పని ఇబ్బందులు
- ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్న వాహనదారులు



ఆస్పత్రి ప్రాంగణంలో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

కోలారు: నగరంలోని ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రిలో ద్విచక్రవాహదారులు తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా నిలుపుతుండడం వల్ల పార్కింగ్ స్థలంలో తీవ్ర అవ్యవస్థ నెలకొంది. ద్విచక్రవాహనాలే కాకుండా ఆటోలు, కార్లను కూడా ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. పార్కింగ్ అవ్యవస్థపై నగర ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఆస్పత్రికి ప్రతి నిత్యం నగరంతో పాటు జిల్లాలోని అన్ని తాలూకాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు, వారి సంబంధీకులు వస్తుంటారు. ఆస్పత్రి ప్రాంగణంలో పార్కింగ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల రోడ్డుపైనే అడ్డగోలుగా వాహనాలు పార్క్ చేస్తున్నారు. ఆస్పత్రి వద్ద విధులు నిర్వహిస్తున్న గృహరక్షక దళ సిబ్బంది ఎంత చెప్పినా వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. పాత కట్టడం నుంచి కొత్త కట్టడం వరకు ద్విచక్రవాహనాలను అస్తవ్యస్తంగా నిలుపుతున్నారు. దీని వల్ల అత్యవసర సమయాల్లో సంచరించే అంబులెన్స్‌లకు కూడా ఇబ్బంది కలుగుతోంది. వర్షం వచ్చిందంటే దుకాణాల ముందు బురద ఎక్కువై ఈ సమయంలో అక్కడ వాహనాలు నిలపలేక వాహనదారులు రోడ్డుపై వాహనాలు నిలిపి వెళుతున్నారు. దీని వల్ల పార్కింగ్ సమస్య మరింత తీవ్రం అవుతోంది. రోడ్డుపై నిలిపిన ద్విచక్రవాహన యజమానులను హోం గార్డులు పక్కకు తీయాలని చెబితే పైఅధికారులకు ఫోన్ చేయాలా? అంటూ బెదిరిస్తున్నారు. దీని వల్ల హోం గార్డులు అసహాయక స్థితిలో ఉంటూ ఏమీ చేయలేకపోతున్నారు. ఆస్పత్రి వద్ద హోం గార్డులను కాకుండా పోలీసులను నియమించాలని, అప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని నగర వాసులు అంటున్నారు.

**ఆస్పత్రి వెనుక పార్కింగ్‌కు స్థలావకాశం**

వాహనాలను నిలడానికి ఆస్పత్రి వెనుక భాగంలో స్థలం ఉన్నా అక్కడ ఎవరూ వాహనాలు నిలపడం లేదు. అక్కడ వాహనాలు నిలిపి వెనుక నుంచే ఆస్పత్రిలోకి రావడానికి అవకాశం ఉన్నా ఎవరూ అలా చేయడం లేదు. ఆస్పత్రి కాంపౌండు ముందు భాగంలో పార్కింగ్ చేయడానికి అవకాశం ఉన్నా అక్కడ నిలపకుండా నేరుగా ఆస్పత్రి ఆవరణ లోపలికి వచ్చి ఆస్పత్రి ముఖ ద్వారం వద్ద నిలుపుతున్నారు. ఎస్ఎన్ఆర్ ఆస్పత్రి వద్ద రోజురోజుకు తీవ్రం అవుతున్న పార్కింగ్ సమస్యపై సంబంధిత అధికారులు, పోలీసులు దృష్టి పెట్టి పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# మాట తప్పిన సర్కార్



మాట్లాడుతున్న బండెప్ప కాశంపూర్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ మాట తప్పిందని మాజీ మంత్రి బండెప్ప కాశంపూర్ ఆరోపించారు. శుక్రవారం బీదర్‌లో కళ్యాణ కర్ణాటక ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్సీ అమర్‌నాథ్ పాటిల్ తరపున ప్రచారంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తే పట్టభద్ర నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి 2023–24లో పాసైన వారికి మాత్రమేనంటూ మాట తప్పిందన్నారు. రైతులకు ఈ సర్కార్ చేసింది శూన్యమన్నారు. హాసన్ ఎంపీ ప్రజల్వ్ రేవణ్ణ పెన్‌డ్రైవ్ కేసును రాజకీయం చేస్తోందని వారు ఆరోపించారు. విదేశాల్లో ఉన్న ప్రజల్వ్ రేవణ్ణను అరెస్ట్ చేసి, పాస్‌పోర్ట్ రద్దు చేయాలని ప్రధానమంత్రికి రెండు సార్లు లేఖలు రాశారన్నారు. ఈ విషయంలో బీజేపీపై వృథా ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, భగవంత్ ఖూబా, ఎమ్మెల్సీలు రఘునాథ్ మల్కాపురే, రవి కుమార్, సిద్దు పాటిల్, శరణు సలగార్, నేతలు సోమనాథ్ పాటిల్, రమేష్, ఈశ్వర్, బాబు వాలిలున్నారు.

# కాంగ్రెస్‌కు ఏటీఎంలా కర్ణాటక సర్కార్

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపణ



కార్యక్రమంలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తదితరులు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కర్ణాటక ప్రభుత్వాన్ని ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు ఏటీఎంలా ఉపయోగించుకుంటున్నారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. ఆయన శుక్రవారం నగరంలో ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అమరనాథ్ పాటిల్ తరపున బీపీఎస్‌సీ పాఠశాల, వీరశైవ విద్యావర్ధక సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి, విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అంతర్గత విభేదాలతో పతనం అయితే తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాము రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఐదేళ్ల పాటు కొనసాగాలని కోరుకుంటున్నామన్నారు. లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బీ.శ్రీరాములు, నగర మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్ కుమార్ మోకా, మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, బీపీఎస్‌సీ కళాశాల యాజమాన్యం మహిపాల్, యశ్వంత్ భూపాల్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గుత్తిగనూరు విరుపాక్షిగౌడ, సీనియర్ న్యాయవాది పాటిల్ సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు తీర్చాలని విద్యార్థినుల ధర్నా



ఆందోళనలో పాల్గొన్న విద్యార్థినులు

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు పట్టణంలోని అంబేడ్కర్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఒత్తిడి చేస్తూ విద్యార్థినులు గురువారం అర్ధరాత్రి అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాకు ఉపక్రమించారు. విద్యార్థినులు చేపట్టిన ధర్నాకు నాయకత్వం వహించి ఎస్ఎఫ్ఐ నాయకుడు రమేష్ మాట్లాడారు. గత రెండు రోజుల నుంచి విద్యార్థినులకు సరిగా భోజనాలు అందించకుండా వార్డెన్ నాగరత్న నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. వంట పని చేసే వారికి ఆలస్యంగా వంట చేయమని ఆదేశాలు జారీ చేయడాన్ని ఖండించారు. మరుగుదొడ్లు లేవని, చదువుకోడానికి పుస్తకాలు కూడా లేవన్నారు. విద్యార్థినులు వార్డెన్‌కు సమస్యలను చెబితే తాలూకా అధికారికి ఫిర్యాదు చేస్తానని బెదిరిస్తున్నారన్నారు. ఉపవాసంతో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడంతో పోలీసులు వారిని చికిత్సకు ఆస్పత్రికి తరలించారు. విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెవిన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో బసమ్మ, నాగరత్న, సుష్మిత, సుమా, త్రివేణి, రత్న, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

### స్కిజోఫ్రీనియాపై అవగాహన అవసరం



వ్యాధిపై అవగాహన పత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు

బళ్లారిఅర్బన్: మానసిక వ్యాదుల్లో తీవ్రంగా వేధించే స్కీజోఫ్రీనియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ తగినంత అవగాహన, చైతన్యం కలిగి ఉండాలి తప్ప ఈ వ్యాధికి భయపడాల్సిన అవసరం లేదని జిల్లా న్యాయసేవ ప్రాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి రాజేష్ హొసమని తెలిపారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ స్కిజోఫ్రీనియా దినోత్సవం సందర్భంగా చేపట్టిన జాగృతి జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ వ్యాధి వచ్చిన రోగులకు కుటుంబ సభ్యుల సహకారంతో వైద్య చికిత్స అందిస్తే వ్యాధి నుంచి త్వరగానే కోలుకుంటారని ఆయన అన్నారు. డీహెచ్ఓ రమేష్ బాబు మాట్లాడుతూ సాధారణంగా 15 నుంచి 25 ఏళ్ల వయస్సు ఉన్న యువతలో ముఖ్యంగా గ్రామీణ పట్టణ, పేద, శ్రీమంత అన్న వర్గాల బేధం లేకుండా అందరికీ ఈ వ్యాధి రావచ్చన్నారు. సదరు వ్యక్తి మానసిక క్రియల్లో ఆలోచన, భావనలతో పాటు పంచేంద్రియాల ద్వారా తన చుట్టు ఉన్న పరిసరాలను అర్థం చేసుకోలేని స్థితిలో ఉంటారన్నారు. మాత్రలు, టీకాల రూపంలో ఔషధాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధి కనిపించిన కొన్ని వారాల్లోనే వైద్య చికిత్స పారంభిస్తే త్వరలోనే వ్యాధిని అదుపులోకి తీసుకురావచ్చన్నారు. ప్రతి జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ విభాగం మనో చైతన్య కార్యక్రమం ద్వారా ప్రతి మంగళవారం అన్ని తాలూకా కేంద్రాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి సదరు రోగుల్లో మనోధైర్యాన్ని నింపి చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్, జిల్లా సర్జన్ డాక్టర్ బసిరెడ్డి, సంబంధిత అధికారులు, విమ్స్ నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పిల్లలను విద్యావంతుల్ని చేయాలి

బళ్లారిఅర్బన్: పింజార్, నదాఫ్ సామాజిక వర్గానికి చెందిన పిల్లల విద్యాభ్యాసానికి అందరూ కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్రాధ్యక్షుడు జలీల్‌సాబ్ ఆ సంఘం పదాధికారులకు పిలుపునిచ్చారు. స్థానిక కన్నడ భవన్‌లో శుక్రవారం జరిగిన పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంఘాన్ని బలోపేతం చేయడానికి శ్రమించాలన్నారు. సమాజంలో వెనుకబడిన వారిని గుర్తించి వారి విద్యాభ్యాసానికి సహకారం అందించాలన్నారు. ఇటీవల స్కూల్ రికార్డుల్లో హిందీ పింజార, ముస్లిం పింజార అని నమోదు చేయిస్తున్నారు. అలా చేయకుండా పింజార అని మాత్రమే కులం ఉన్న కాలంలో నమోదు చేయాలని ఆయన సమాజ బాంధవులకు విజ్ఞప్తి చేశారు. మహిళా స్వావలంబన జీవితానికి అవసరమైన సహకారం అందించాలన్నారు. ఈ మేరకు త్వరలోనే మహిళా సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రముఖులు జీడీ నదాఫ్, ప్రధాన కార్యదర్శి రియాజ్ సలీం, ఫర్హాన్, షాబుద్దీన్, దాదా ఖలందర్, అల్లబాకాష్, మౌలాలి, మహిళా నేతలు అమీన, మౌలాబీ తదితరులు పాల్గొన్నారు.

### భారతీయ మాతృత్వ పరికల్పన అనంతం

హుబ్లీ: భారతీయ ఆధ్యాత్మిక చింతనలో మాతృత్వ పరికల్పన అనంతం అని ధార్వాడ సాఫల్య ప్రతిష్ఠాన సంచాలకురాలు మృనాళ్ జోషి తెలిపారు. అన్వేషణ కూటమి ద్వారా నగరంలోని సాధన కేరి చైత్ర మీటింగ్ హాల్‌లో చేపట్టిన భారతీయ సంస్కృతిలో మాతృత్వ కల్పన అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యక్తి, భక్తి, క్షేమం, సహనం, సంయమనం, సాత్వికత, నైతికత, విలువ, సహకరాల మూర్తే తల్లి. భారత దేశ పునాది కుటుంబ వ్యవస్థకు మూలాధారం. తల్లి ప్రాచీన కాలం నుంచి వచ్చిన ప్రస్థానం. ఇలాంటి సమృద్ధ మాతృత్వానికి కుటుంబ వ్యవస్థకు యావత్ ప్రపంచమే మనల్ని గమనిస్తుందన్నారు. చింతకులు డాక్టర్ శ్రీరామ్ భట్ మాట్లాడుతూ గ్రీక్ సంస్కృతిలో మాత్రమే కొంత మేర ఇలాంటి మాతృత్వపు పరికల్పన కనబడుతుందన్నారు. అన్వేషణ కూటమి అధ్యక్షులు నరసింహ పరాజపే, రాజీవ పాటిల్ కులకర్ణి, శ్రీనివాస వాడప్పి, ప్రొఫెసర్ దుష్యంత్ నాడగౌడ, డాక్టర్ అరవింద యాళగి, జీఆర్ భట్, హర్షడంబళ్, మాలతేష హుబ్లీ, అనంత సిద్దేశ్వర తదితరులు పాల్గొన్నారు.

### రాయ్‌బరేలిలో ముమ్మర ప్రచారం

హుబ్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్‌గాంధీ తరపున ముమ్మర ప్రచారం చేసినట్లు డాక్టర్ శరణప్ప కొటగి స్వయంగా ఓ ప్రకటనలో తెలిపారు. రాహుల్‌గాంధీ భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. గత వారం రాయబరేలీకి వెళ్లిన డాక్టర్ శరణప్ప బృందం ఆయా గ్రామాలు, పట్టణాల్లో ముమ్మరంగా ప్రచారం చేపట్టామన్నారు. రాహుల్‌కు అన్ని చోట్ల ప్రజాదరణ లభిస్తోందన్నారు. గతంలో గెలిచిన సోనియాగాంధీ సేవలను అక్కడి ప్రజలు గుర్తుంచుకున్నారన్నారు. ప్రచారంలో కాంగ్రెస్ ప్రముఖులు కల్నల్ రోహిత్, మల్లికార్జున, దినేష్ రావ్, కల్నల్ సుధీర్ పాల్గొన్నారు.

### గిరీష్ సావంత్‌కు 8 రోజుల సీఐడీ కస్టడీ


హుబ్లీ: అంజలి అంబిగేర హత్య కేసు నిందితుడు విశ్వనాథ్ అలియాస్ గిరీష్ సావంత్‌ను 8 రోజుల పాటు సీఐడీ కస్టడీకి అప్పగించాలని హుబ్లీ 1వ అదనపు సెషన్స్ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కాగా విచారణ సందర్భంగా తాను తప్పు చేశానని నిందితుడు గిరీష్ కన్నీరు పెట్టుకున్నట్లు తెలిసింది. కస్టడీకి తీసుకున్న సీఐడీ బృందం నిందితుడిని నగరంలోని అతిథిగృహంలో విచారించి పలు విషయాలపై కూపీలాగారు. మైసూరుకు తీసుకెళ్లి అక్కడ అతడు పని చేస్తున్న హోటల్, బార్ అండ్ రెస్టారెంట్, అలాగే హత్య చేశాక మైసూరుకు వెళ్లిన సంబంధిత స్థలాలను పరిశీలించడానికి నేడో రేపో నిందితుడిని మైసూరుకు తీసుకెళ్లనున్నట్లు తెలిసింది.

# అన్ని జిల్లాలకు ప్రాధాన్యత కల్పిస్తా



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

బళ్లారిటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని ఏడు జిల్లాలకు ఎలాంటి తారతమ్యం లేకుండా అన్ని జిల్లాలకు ప్రాధాన్యత కల్పించడమే తన లక్ష్యం అని పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ తిరుగుబాటు నేత, స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంతవరకు గెలిచిన ఎమ్మెల్సీలందరూ కలబుర్గి, బీదర్ జిల్లాలకే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తూ తమ నిధులను ఆ జిల్లాలకే కేటాయిస్తూ మిగిలిన జిల్లాలకు తీరని అన్యాయం చేశారన్నారు. బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర, యాదగిరి జిల్లాల నుంచి కూడా ఓట్లను పొంది 5 జిల్లాలను వంచించారన్నారు. అయితే తాను పట్టభద్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గత పదేళ్లుగా గుర్తించానని, వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. తనను గెలిపిస్తే విద్యారంగం అభివృద్ధికి పెద్ద పీట వేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో ఒక్కొక్క పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ఇక అతిథి ఉపన్యాసకులు, ఉపాధ్యాయుల సమస్యలను కూడా తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి న్యాయ పోరాటానికి అండగా నిలుస్తానన్నారు. కసాప అధ్యక్షులు నిష్టిరుద్రప్ప, ఆప్ జిల్లాధ్యక్షుడు జేవీ మంజునాథ, ప్రైవేట్ పాఠశాలల సమాఖ్య అధ్యక్షుడు మరిస్వామి రెడ్డి, కొర్లగుంది కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జలపాతం అందాలు తిలకిస్తున్న పర్యాటకులు

### ఆకట్టుకుంటున్న జలపాతం

రాయచూరు రూరల్: వర్షాకాలం ప్రారంభం కావడంతో పలు ప్రాంతాల్లో జలపాతాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఉత్తర కర్ణాటకలో వానలు కురుస్తుడడంతో జలరాశులు తొణికిసలాడుతున్నాయి. బాగల్‌కోట జిల్లా గుళేదగుడ్డ తాలూకాలోని కోటేకల్ జలపాతం తన అందాలతో అందరినీ ఆకట్టుకుంటోంది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జలపాతంలో జాలువారుతున్న నీటి సౌందర్యం పర్యాటకులకు కనువిందు చేస్తోంది.

# ఫ్యాషన్ స్టోరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రారంభిస్తున్న మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు తదితరులు



వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

బళ్లారి అర్బన్: నగరంలోని హోటల్ రాయల్‌ఫోర్టులో ఫ్యాషన్ స్టోరీ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు ప్రారంభించారు. అన్ని రకాల ఫ్యాషన్ జువెలరీ, డిజైనర్ శారీస్, కుర్తీస్, హోం డెకార్స్, యాక్సెసరీస్, డిస్కవర్ లేటెస్ట్ ట్రెండ్ బ్రాండ్స్, విజయలక్ష్మి సిక్స్ యార్డ్స్ సిల్క్స్, వైష్ణవి సిల్క్స్, ఫ్లాంబోయంట్, ఎథెరియల్ ఫ్యాషన్స్, సియా జ్యువెలరీ, హోం కంఫోర్ట్స్, సుద్ది చికన్ డిజైనర్స్, స్టుడియో చెరిస్ హోం డెకార్స్, నూరాని డ్రెస్, ఎథ్నిక్ లుక్, ఢిల్లీ మార్ట్, కశ్మీర్ శారీ హౌస్ తదితర జ్యువెలరీ ఆభరణాలు, చీరల ప్రదర్శనను ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు ప్రజల కోసం ఏర్పాటు చేసినట్లు బెంగళూరుకు చెందిన ఈవెంట్ మేనేజింగ్ డైరెక్టర్ రవి అరోరా పేర్కొన్నారు. ఫ్యాషన్ స్టోరీ ఆధ్వర్యంలో నగరంలో ఆరు నెలలకొకసారి ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా హోటల్ రాయల్ ఫోర్టులో ఇండియన్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ స్టోరీ వారు 30 మోస్ట్ బ్రాండెడ్ డిజైన్స్ గల జ్యువెలరీ, శారీస్ తదితరాలను ఏర్పాటు చేశారన్నారు. బెంగళూరు, కోల్‌కతా, పుణె, చండీఘర్, ముంబైలతో పాటు ఆంధ్రప్రదేశ్ తదితర వివిధ రాష్ట్రాల నుంచి అత్యాధునిక ఫ్యాషన్ జ్యువెలరీస్, మోస్ట్ బ్రాండెడ్ శారీస్ ఈ ప్రదర్శనలో ఉంటాయన్నారు. ఈ ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తేజేశ్వరి, శ్వేత, జోసెఫ్, రశ్మి, అభిషేక్, రఘు, దివేష్ తదితరులు పాల్గొన్నారు.

### అధికారిపై చర్యకు డిమాండ్



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో ఈనెల 14న జరిగిన భగీరథ జయంతిని ఆచరించని అధికారిపై చర్యలు చేపట్టాలని ఉప్పార సమాజం డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సమాజం అధ్యక్షుడు పాగుంటప్ప మాట్లాడారు. జెస్కాం కార్యాలయంలో భగీరథ జయంతిని ఆచరించకుండా నిర్లక్ష్యం వహించిన అధికారి బసప్పను సస్పెండ్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

### 15 ఏళ్ల తర్వాత నిండిన హులికెరె

- చెరువుకు గ్రామస్తుల గంగపూజ



గంగపూజ నిర్వహిస్తున్న గ్రామస్తులు

హొసపేటె: కూడ్లిగి తాలూకాలోని కానాహొసహళ్లి సమీపంలోని హులికెరె చెరువు 15 ఏళ్ల తర్వాత నిండింది. గ్రామస్తులు ప్రతి ఏటా హులికెరె చెరువులో నీరు వచ్చి చేరాలని వరుణుడికి ప్రత్యేక పూజలు చేశారు. కానీ ఇటీవల చుట్టు పక్కల గ్రామాల్లో కురిసిన వర్షానికి హులికెరె చెరువుకు నీరు రావడంతో గ్రామస్తుల్లో ఆనందం నిండింది. గ్రామస్తులు శుక్రవారం హులికెరె చెరువు వద్ద గంగ పూజలు నిర్వహించారు. పూజ సందర్భంగా వందలాది మంది మహిళలు కలశ, కుంభాలను తలపై పెట్టుకుని చెరువు వద్దకు మోసుకెళ్లారు.

### వ్యవసాయ పనులు షురూ

హొసపేటె: గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. గతవారం నుంచి రైతులు తమ పొలాల్లో విత్తనాలు వేసే పనులను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు బాగా కురవడంతో భూమిని సాగు చేసుకొని రైతులు ప్రస్తుతం నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. ఇంత కాలం ఖాళీగా ఉన్న పొలాల్లో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. విత్తనాలు విత్తేందుకు రైతులు విక్రయ కేంద్రాల ముందు బారులు తీరుతున్నారు. నాట్లు వేసేందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డు నుంచి భారీగా కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

### గుంజళ్లిలో మొసలికి బాలుడు బలి



బాలుడు విశ్వ(ఫైల్), ఆచూకీ కోసం నదిలో గాలిస్తున్న దృశ్యం, నది వద్ద గుమికూడిన గ్రామస్తులు, ఘటనను ఎస్ఐకి వివరిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: తాలూకాలోని గుంజళ్లి వద్ద మొసలికి ఓ బాలుడు బలైన ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం కృష్ణా నది వద్దకు గొర్రెలకు నీరు తాగించడానికి వెళ్లిన విశ్వ(12) అనే బాలుడిని మొసలి నోట కరుచుకుని లాక్కొని వెళ్లిపోయింది. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందగానే నది వద్దకు గ్రామీణ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు. బాలుడి మృతదేహం ఆచూకీ కోసం నదిలో గాలిస్తున్నట్లు ఎస్ఐ ప్రకాష్ డంబళ్ తెలిపారు.

### మహిళ అదృశ్యం

హుబ్లీ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ కనిపించకుండా పోయిందని స్థానిక కేశ్వాపుర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. తళవార వీధికి చెందిన సుమన అలియాస్ సల్మా(36) అనే మహిళ రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. ఈమె కన్నడ, హిందీ, తెలుగు భాషల్లో మాట్లాడగలదని, 5.2 అడుగుల ఎత్తు కలిగి దృఢమైన శరీరాకృతి కలిగి ఉంటుందని, ఈమె ఆచూకీ తెలిసిన వారు కేశ్వాపుర పోలీస్ స్టేషన్ లేదా 9480802026 నెంబర్‌కు తెలియజేయాలని పోలీసులు కోరారు.